ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 4-3-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 203 | రూ. 6-00 పేజీలు 16+20+32 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కమ్యూనిస్టుల కోటలో కమల పతాక



‘సూర్యాస్తమయం ఎరుపు రంగుతో నిండి ఉంటుంది. అదే సూర్యోదయం కాషాయ వర్ణంతో మెరుస్తుంది.. ఇది పశుబలం, బెదిరింపులపై ప్రజాస్వామ్య విజయం. ఈరోజు భయంపై శాంతి, అహింస గెలిచాయి. త్రిపురకు మంచి ప్రభుత్వాన్ని అందిస్తాం.

త్రిపురలో కాషాయం రెపరెప

భాజపా కూటమిదే నాగాలాండ్

ఏ పార్టీకి చిక్కని మేఘాలయ

- రెండు రాష్ట్రాల్లో ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్

అగర్తల/ షిల్లాంగ్/ కోహిమా

భాజపాకి ‘ఈశాన్యం’ మరోసారి కలిసొచ్చింది. ఈశాన్య భారత దేశంలో ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో అధికారంలో ఉన్న కమలనాథులు త్రిపురలో తిరుగులేని విజయాన్ని నమోదు చేశారు. నాగాలాండ్‌లో నేరుగా విజయం సాధించకపోయినా ప్రభుత్వంలో భాజపా భాగస్వామ్యం అనివార్యంగా మారింది. మేఘాలయాలో నువ్వా నేనా అన్నట్లు సాగిన సమరం చివరకు హంగ్ సర్కారు ఏర్పాటు దిశగా ఫలితాన్ని ఇచ్చింది. ఈ 3 రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. ప్రధాని నరేంద్రమోదీ హవా మరోసారి సానుకూల ఫలితాలను రాబట్టిందంటూ భాజపా శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ముఖ్యంగా (మిగతా 2లో)



శనివారం దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన సంబరాల్లో విజయ సంకేతం చూపుతున్న భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా

అపర చాణక్యుడు



అసాధ్యమనుకున్నా.. సుసాధ్యం చేశాడు

త్రిపురలో భాజపా విజయం వెనుక దేవధర్

ఎన్నికల ఫలితాలు, ప్రత్యేక కథనాలు 2, 12, 13, 14లలో

త్రిపుర

మొత్తం స్థానాలు: 60
ఎన్నికలు జరిగినవి: 59

	గెలిచిన స్థానాలు	ఓట్లశాతం
భాజపా	35	43.0%
ఐపీటీఎఫ్	8	7.5%
సీపీఎం	16	42.7%

మేఘాలయ

మొత్తం స్థానాలు: 60
ఎన్నికలు జరిగినవి: 59

	గెలిచిన స్థానాలు	ఓట్లశాతం
కాంగ్రెస్	21	28.5%
ఎన్‌డీపీ	19	20.6%
యూడీపీ	6	11.6%
పీడీఎఫ్	4	8.2%
భాజపా	2	9.6%
స్వతంత్రులు	3	10.8%
ఇతరులు	4	10.7%

నాగాలాండ్

మొత్తం స్థానాలు: 60
ఎన్నికలు జరిగినవి: 59
ఫలితాలు వెల్లడించినవి: 58

	గెలిచిన స్థానాలు	ఓట్లశాతం
ఎన్‌పీఎఫ్	27	39.1%
ఎన్‌డీపీపీ	16	25.5%
భాజపా	11	14.4%
ఎన్‌పీపీ	2	7.0%
జేడీ (యు)	1	4.6%
స్వతంత్రులు	1	4.3%



పెళ్లిళ్ల సందడి నేడే

- ఆదివారం ఒక్క రోజే వేల వివాహాలు
- ఒక్క తిరుమలలోనే 2000 పెళ్లిళ్లు... 14లో
- ఇతర ఆలయాల్లోనూ..
- కల్యాణమండపాలు కిటకిట..

మహా కల్యాణ వైభోగానికి రాష్ట్రం సిద్ధమైంది. పల్లె...పట్టణం...నగరం...మహానగరం అన్న తేడా లేకుండా వీధివీధినా పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 18 తర్వాత మూఢం వెళ్లిపోయినప్పటి నుంచి పెళ్లిళ్లు మొదలైనా ఆదివారం వేల వివాహాలు జరగబోతున్నాయి. మంచి ముహూర్తాల్లో ఇది ఒకటి కావడం...సెలవురోజు రావడంతో ఎక్కువ మంది వివాహ వేడుక నిర్వహించుకోవడానికి మొగ్గు చూపారు. ఒకే రోజు ఎక్కువ వివాహాలు ఉండటంతో జనజీవనంపై ప్రభావం పడటంతో పాటు. ఆ వేడుకలపై ఆర్థికభారమూ పడుతోంది.

మోదీ ఇస్తానని అంటే ఇచ్చి తీరాలి

ఏపీకి ప్రత్యేక హోదాపై కేసీఆర్ స్పష్టీకరణ

- కాంగ్రెస్, భాజపా దొందూదొందే
- ప్రత్యామ్నాయ కూటమి ఆవిర్భవించాలి
- అదే ప్రధాన కూటమి అవుతుంది
- తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు




‘ప్రత్యేక హోదాపై ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెదేపావాళ్లు, కేంద్రంలోని భాజపావాళ్లు స్పష్టత ఇవ్వరు. ఏమిటీ తమాషా? నేను కొట్టినట్లు చేస్తా...మీరు ఏడ్చినట్లు చేయండి అన్నట్లుగా ఉంది. ఇలాంటి రాజకీయాలను మార్చాలనే నేను చెప్పేది. ఇలాంటి దిక్కుమాలిన పరిస్థితులు ఉండవద్దు. ప్రజలకు ఏం చెప్పినా కుండబద్దలు కొట్టినట్లు చెప్పాలి. అమలు చేయాలి. మోదీ ప్రత్యేక హోదా ఇస్తాను అంటే ఇచ్చి తీరాలి. ఇచ్చే ఉద్దేశం లేకుంటే ఖచ్చితంగా చెప్పాలి. రోజూ అక్కడ ప్రజలు, పార్టీలు ఆవేదనపడడం ఎందుకు? ఏ దేశంలోనైనా ఇలాంటి సందిగ్ధత ఉందా. ఈ దేశంలో నాయకులు ప్రజలను వంచిస్తున్నారు.

ప్రత్యామ్నాయ కూటమిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించలేదు. అవసరమయితే ఆయనను కలుపుకొని వెళ్లడానికి సిద్ధమే. 14లో

కొలువు చిన్నదైనా కోట్లలో అవినీతి

సంజీవ్‌కుమార్ - వీఆర్వో



40 కోట్లు

నాగేశ్వరరావు - చైన్‌మన్



10 కోట్లు

వెంకటేశ్వరరావు - వీఆర్వో



10 కోట్లు

- అనిశా వలకు చిక్కిన మూడు అవినీతి చేపలు
- పట్టుబడ్డ ఇద్దరు వీఆర్వోలు, ఒక చైన్‌మన్
- బినామీ పేర్లతో లావాదేవీలు
- రూ.60 కోట్ల గుర్తింపు



సాగర తీరంలోని రుషికొండ ప్రాంతంలో ఆదిత్య హిల్స్ గృహనిర్మాణ సముదాయం ఇది. దీంతో పాటు మద్దిలపాలెంలో సృజన హౌసింగ్, రైల్వే న్యూ కాలనీలో మరో బహుళ అంతస్తుల భవంతి నిర్మాణం చేపట్టింది వీఆర్వో కాండ్రేగుల సంజీవ్‌కుమారేనని అనిశా డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ శనివారం రాత్రి వెల్లడించారు. ఈయన వెనుక చాలా మంది ఉన్నట్లు సమాచారం ఉందని, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. విశాఖ నగరంలోని సాయి ఆదిత్య అపార్టుమెంటులోనూ ఈయన వాటాలున్నట్లు చెప్పారు.

కొలువు చిన్నదైనా కోట్లకు పడగలెత్తిన ముగ్గురు ఉద్యోగులు ఒకేరోజు అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. వీరిలో ఒకరు ఏకంగా సెటిల్మెంట్ల కోసం ప్రైవేటు కార్యాలయాన్నే నిర్వహిస్తున్నారు. అవసరమైతే బెదిరించడానికి డమ్మీ తుపాకీ దగ్గర పెట్టుకున్నారు. బినామీల పేర్లతో ఎక్కడికక్కడ వ్యాపారాలు చేస్తున్నారు. పట్టుబడ్డ ముగ్గురు అవినీతి సిబ్బందిలో ఇద్దరు వీఆర్వోలు కాగా, ఒకరు చైన్‌మన్. శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా వరకు అనిశా అధికారులు 15 బృందాలుగా ఏర్పడి 21 చోట్ల ఏకకాలంలో శనివారం ఉదయం నుంచి సోదాలు నిర్వహించి ... ఈ ముగ్గురి అవినీతి బండారం బయటపెట్టారు. ఇద్దర్ని అరెస్టు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం వీరి ఆస్తులు రూ. 60 కోట్లపైనే ఉంటాయని గుర్తించారు. మార్కెట్ ఇటీవల అవినీతికి పాల్పడి పట్టుబడ్డ ఉన్నతాధికారులనే తలదన్నేలా వీరి వ్యవహారం ఉండడం అనిశా అధికారులనే ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఒక్కొక్కరి అక్రమాల తీరు, ఆస్తుల చిట్టా 2లో...

ఇదీ సంగతి!



తనకు ఇల్లు లేదు, బ్యాంకు బ్యాలెన్స్ లేదు. కారు లేదు, ఆదాయం లేదు- ప్రజలంతా అలాగే ఉండాలనుకున్నాడు.

రూ.74,542 కోట్లు

- కేంద్రం నుంచి ఏపీకి రావాల్సిన మొత్తమిది
- ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదు
- పోలవరం బాధ్యత కేంద్రానిదే
- నివేదికలో అభిప్రాయపడ్డ జనసేన నిజనిర్ధారణ కమిటీ
- 21న అవిశ్వాసం పెడితే ఉపయోగం ఉండదు
- పవన్ కల్యాణ్ వ్యాఖ్య



ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.74,542 కోట్లు రావాలని జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిజనిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) అభిప్రాయపడింది. ఇది రెవిన్యూ లోటు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వెనుబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి గణించినదగిన లెక్కల్లోని భాగమేనని పేర్కొంది. రాష్ట్రానికింకా రావల్సిన రూ.74,542 కోట్ల నిధుల్ని రానున్న బడ్జెట్లలో కేంద్రం కేటాయించాలని కోరింది. ఏపీకి ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టును కేంద్రప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, 10వ షెడ్యూల్‌లో ఉన్న సంస్థల్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కోరింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, మాజీ ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, జయప్రకాశ్ నారాయణ్‌లతోపాటు మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, తోట చంద్రశేఖర్ హైదరాబాద్‌లో సమావేశమై విభజన హామీలకు సంబంధించి 11 అంశాల అమలుపై సుదీర్ఘంగా చర్చించి నివేదిక (మిగతా 2లో)



విభజన అంశాలే ప్రధాన అజెండా!

- కేంద్రంపై విమర్శలు ఎక్కుపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం
- రేపటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు
- 29 అంశాలపై చర్చించాలని ప్రభుత్వం యోచన

3లో

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు వైకాపా దూరం



ఏనుగు దాడిలో ఐఎఫ్ఎస్ అధికారి బలి



మణికంఠన్ మృతదేహం వద్ద అటవీ అధికారులు, సిబ్బంది. అంతరచిత్రంలో మణికంఠన్.

చామరాజనగర, న్యూస్‌టుడే: కర్ణాటకలో ఏనుగు దాడి చేయడంతో ఓ అటవీ అధికారి బలైపోయారు. శనివారం కర్ణాటకలోని నాగరహొళె జాతీయ అభయారణ్యంలో తమిళనాడుకు చెందిన ఐఎఫ్ఎస్‌కు చెందిన మణికంఠన్ (45)... కార్చిచ్చును అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఫైర్ లైన్స్‌ను పరిశీలిస్తున్న సమయంలో ఏనుగు దాడిచేసింది. డి.బి.కుప్పె అటవీ విభాగం పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పొదల చాటు నుంచి ఏనుగు అమాంతం దాడిచేసినట్లు భావిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మణికంఠన్‌ను ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఆసుపత్రిలోనే ఆయనే మృతి చెందారు. మణికంఠన్ నాగరహొళె అభయారణ్యంలో టైగర్ రిజర్వు అధికారిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు బెంగళూరులో ఉంటున్నారు.

కొలువు చిన్నదైనా కోట్ల అవినీతి

వీఆర్ఓ సంజీవ్ స్వాహా పర్వం...

2008లో ప్రభుత్వ సేవల్లోకి చేరిన సంజీవ్‌కుమార్ విశాఖ నగర పరిధిలోని మద్దిలపాలెం క్లస్టర్-5, రామ్‌నగర్ క్లస్టర్‌లో 2015 వరకు సేవలందించారు. ప్రస్తుతం మల్కాపురం క్లస్టర్ వీఆర్వోగా ఉన్నారు. సీతమ్మధార పరిధిలోని పీఎన్‌టీ కాలనీలో నివాసం సహా అక్కయ్యపాలెం, మూలగడ, అనకాపల్లి, మునగపాక మండలంలోని చూచుకొండలలో అనిశా బృందాలు సోదాలు చేశాయి. నగరంలో అనధికార వ్యవహారాలకు ఓ ప్రైవేటు కార్యాలయం నడుపుతున్నట్లు గుర్తించాయి. దానికి తహసీల్దార్ కార్యాలయం ఆన్ గవర్నమెంట్ డ్యూటీ పేరుతో నామఫలకం పెట్టారు. డస్టర్ కారును వినియోగిస్తున్నారు. అనకాపల్లిలోని కొత్తూరులోని ఆయన నివాసంలో డమ్మీ తుపాకీని అధికారులు కనుగొన్నారు.

ఇదీ అక్రమాస్తుల చిట్టా..

- **పేరు:** కాండ్రేగుల సంజీవ్‌కుమార్
- **హోదా:** వీఆర్వో, మల్కాపురం క్లస్టర్, విశాఖపట్నం అర్బన్ మండలం
- **ఆదాయానికి మించిన ఆస్తులు:** రూ.3,77,12,001 (పుస్తక విలువ) (733.090 గ్రాముల బంగారం, రూ.6 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.6,440 నగదు, రూ.1,23,336 విలువైన స్థిర డిపాజిట్లు, ఐదు బ్యాంకుల్లో ఖాతాలు, విలువైన పత్రాలు)
- **బహిరంగ మార్కెట్‌లో విలువ:** సుమారుగా రూ.40 కోట్లుపైనే..
- కాండ్రేగుల సంజీవ్‌కుమార్ పేరుతో అనకాపల్లిలో 2,800 చదరపు అడుగుల జీ ప్లస్ 2 నివాసం ఉంది. హుండాయ్ సొనాటా ఎస్20 కారు, హోండా ద్విచక్రవాహనం.
- భార్య రమ్య పేరుతో 385 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ త్రీ అపార్టుమెంటు, ఖాళీ స్థలం. గాజువాకలోని చినగంట్యాడ దగ్గర జీ ప్లస్ 1 భవనం.
- కుమారుడు దినేష్‌కుమార్ పేరుతో అనకాపల్లిలో విజయ మెడికల్ సెంటర్, నర్సీపట్నం, ఎలమంచిలిలో దినేష్ మెడికల్ సెంటర్లు. పెదగంట్యాడ సమీపంలోని ఏపీ-ఐలాలో దినేష్ సిమెంటు పరిశ్రమ-ఐరన్, స్టీల్ పరిశ్రమ. ఆటోనగర్‌లో ఇటుకల పరిశ్రమ ఉంది.

బినామీ ఆస్తులు..

- దాసరి డేనియల్ పేరుతో విశాఖ నగరంలోని చినవాల్తేరులో 3,767.23 చదరపు గజాల ఖాళీ స్థలం. దీని పుస్తక విలువ రూ.1,18,69,000. ఇందులో సంజీవ్‌కుమార్ వాటా: రూ.59,34,500.
- విశాఖలోని చినగదిలి ప్రాంతంలో రూ.8,13,12,00 పుస్తక విలువున్న 1.60 ఎకరాల ఖాళీ స్థలం కొనుగోలుకు సంజీవ్‌కుమార్ రూ.20 లక్షలు అడ్వాన్సు ఇచ్చారు.
- విశాఖ నగరంలోని పరదేశిపాలెం వద్ద 3.31 ఎకరాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ విలువ రూ.2 కోట్లకు కొనుగోలు చేసేందుకు రూ.20 లక్షలు అడ్వాన్సు చెల్లించారు.
- మరో బినామీ వి.ఉమాశంకర్ పేరుతో ఎండాడ ప్రాంతంలో 1694 చదరపు గజాల స్థలం కొనుగోలుకు రూ.3 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు.
- బీశెట్టి గణేశ్వరరావు పేరుతో విశాఖ నగరంలోని వేపగుంట ప్రాంతంలో 13,897 చదరపు గజాల స్థలం అభివృద్ధికి తీసుకుని రూ.12 లక్షలు అడ్వాన్సు ఇచ్చారు. ఈ భూమిని రూ.1.07 కోట్ల రిజిస్ట్రేషన్ విలువకు కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.
- పిల్లి శ్రీనివాస్ పేరుతో నగరంలోని చంద్రవానిపాలెంలో 1.08 ఎకరాల ఖాళీ స్థలం కొనుగోలుకు రూ.2 లక్షల అడ్వాన్సు ఇచ్చినట్లు గుర్తించారు.
- సంజీవ్‌కుమార్ భార్య కరణం రమ్య, బంధువు దాడి శ్రీరామకృష్ణ పేర్లతో వడ్లపూడిలో 80 సెంట్ల ఖాళీ స్థలం. ఇందులో సంజీవ్‌కుమార్ వాటా రూ.1.50 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు. ఇక్కడే మరో 80 సెంట్ల స్థలం కొనుగోలుకు రూ.3 లక్షల అడ్వాన్సు ఇచ్చినట్లు గుర్తించారు.
- సంజీవ్‌కుమార్ స్నేహితుడు వై.భీమారావు పేరుతో మద్దిలపాలెంలో రూ.66.35 లక్షల విలువైన 1065 చదరపు గజాల స్థలం కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. మరో స్నేహితుడు టి.రమేష్‌కుమార్ పేరుతో మధురవాడలో 3.25 ఎకరాల భూమి కొనుగోలుకు రూ.2 లక్షల అడ్వాన్సు ఇచ్చారు. మరోస్నేహితుడు చౌదరి పేరుతో మధురవాడలో 5 ఎకరాల స్థలం కొనుగోలుకు రూ. 32.32 లక్షల అడ్వాన్సు ఇచ్చినట్లు గుర్తించారు.
- ఆదిత్య వర్ధన డెవలపర్స్ పేరుతో విజయనగరం జిల్లా కొత్తవలసలో 200 ఎకరాల భూమి కొనుగోలుకు రూ.43 లక్షల అడ్వాన్సు ఇచ్చినట్లు గుర్తించారు.

ఆసుపత్రిలో సంజీవ్‌కుమార్

సోదాలు జరుగుతున్న సమయంలో బినామీల గురించి అనిశా అధికారులు సంజీవ్‌కుమార్‌ను గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. సమాధానం చెప్పడానికి చాలా ఇబ్బంది పడ్డ ఆయన తను చాలా కష్టాల్లో ఉన్నానని చెబుతూ వచ్చారు. అకస్మాత్తుగా గుండె నొప్పి వస్తోందని చెప్పడంతో వెంటనే అనిశా అధికారులు ఆయన్ను నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అక్కడే ఉన్నారు.

ముని 'కోటి'...

1997లో జీవీఎంసీలో మజ్దూర్‌గా చేరిన ఈయన జోన్-2, 3,4లలో పనిచేశారు. ప్రస్తుతం జోన్-3 విద్యుత్తు విభాగంలో గతేడాది సెప్టెంబరు నుంచి పని చేస్తున్నారు. నాగేశ్వరరావుకు విశాఖ నగరంలోని హెచ్‌బీ కాలనీలో 3046 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 2 ఇల్లు ఉంది. ఓ ద్విచక్రవాహనం ఉంది.

- భార్య సూర్యప్రభ పేరుతో ఆనందపురం మండలం గంభీరంలో 320 చదరపు గజాల ఇంటి స్థలం, బజాజ్ పల్సర్ ఉన్నట్లు గుర్తించారు.
- కుమారుడు హిమశంకర్ పేరుతో హెచ్‌బీ కాలనీలో 1080 చదరపు అడుగుల జీ ప్లస్ 2 ఇల్లు ఉంది. మారుతి సిఫ్ట్ డిజైర్ వీడీఐ కారు, మరో కారు ఉన్నట్లు గుర్తించారు. కోడలు హిరణ్మయి పేరుతో వెస్పా వీఎస్ బీఎస్ఐఐఐ ద్విచక్ర వాహనం ఉన్నట్లు గుర్తించారు. హిరణ్మయి తల్లి ఆర్జి వెంకటలక్ష్మి పేరుతో టీవీఎస్ స్కూటీ ద్విచక్ర వాహనం ఉన్నట్లు గుర్తించారు.
- **పేరు:** మునికోటి నాగేశ్వరరావు
- **హోదా:** లైన్‌మన్, జోన్-3, జీవీఎంసీ
- **ఆదాయానికి మించిన ఆస్తులు:** రూ.1,31,66,000 (పుస్తక విలువ) (5555 గ్రాముల బంగారు ఆభరణాలు, వెయ్యి గ్రాముల వెండి, రూ. 3 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.5 లక్షల స్థిర డిపాజిట్లు, రూ.41 లక్షల బ్యాంకు నిల్వ, రూ.1.21 లక్షల నగదు, ఇతర పత్రాలు)
- **బహిరంగ మార్కెట్‌లో విలువ:** సుమారుగా రూ.10.50 కోట్లు

వీఆర్వో వెంకటేశ్ తీరిదీ...

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గాజువాకలోని నివాసంతోపాటు సీతమ్మధార, గోపాలపట్నం, ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి, నర్సీపట్నం మండలంలోని పెదబొడ్డేపల్లిలో అనిశా సోదాలు సాగాయి. వీఆర్వోగా 2008లో ప్రభుత్వ సేవల్లోకి వచ్చిన ఈయన ప్రస్తుతం మద్దిలపాలెం క్లస్టర్-5లో విధులు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరరావు పేరుతో మారుతి సిఫ్ట్ వాహనం ఉంది. కొడుకు చైతన్య, వెంకటేశ్వరావు అత్త ఎస్.సత్యవతి పేరుతో గాజువాక మండలం చినగదిలి గ్రామంలోని శ్రామిక్‌నగర్‌లో 290 చదరపు గజాల ఇంటి స్థలం. గాజువాకలో జి ప్లస్ 1 తరహాలో రెండు భవనాలు ఉన్నట్లు గుర్తించారు. అనిశా డీజీ ఆర్.పి.ఠాకూర్ ఆదేశాల మేరకు డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ బృందం ఈ తనిఖీలు చేసింది.

- **పేరు:** పొలిశెట్టి వెంకటేశ్వరరావు
- **హోదా:** వీఆర్వో, మద్దిలపాలెం క్లస్టర్, విశాఖపట్నం అర్బన్ మండలం
- **ఆదాయానికి మించిన ఆస్తులు:** రూ.1,11,25,000 (పుస్తక విలువ) (190 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.3.70 లక్షల నగదు, యాక్సిస్ బ్యాంకులో లాకరు)
- **బహిరంగ మార్కెట్‌లో విలువ:** సుమారుగా రూ.10 కోట్లుపైనే..

లాకరులో వెండి, బంగారం...

మద్దిలపాలెం క్లస్టర్ వీఆర్వో వెంకటేశ్వరావుకు చెందిన బ్యాంకు లాకరులో బంగారం, వెండిని అనిశా అధికారులు గుర్తించారు. ఎన్ఏడీ కూడలి ప్రాంతంలోని యాక్సిస్ బ్యాంకు లాకరులో 740 గ్రాముల బంగారం, కేజీ వెండి గుర్తించామని.. మరికొందరి బ్యాంకు లావాదేవీలపైనా ఆరా తీయాల్సి ఉందని అనిశా అధికారులు చెబుతున్నారు.

–ఈనాడు, విశాఖపట్నం

'కావేరి'పై స్టాలిన్‌తో తమిళనాడు సీఎం చర్చ

చెన్నై, న్యూస్‌టుడే: కావేరీ నదీజలాల వ్యవహారంపై తమిళనాడు శాసనసభ ప్రతిపక్షనేత స్టాలిన్‌తో ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి శనివారం చర్చలు జరిపారు. కర్ణాటక, తమిళనాడు మధ్య కావేరీ నదీజలాల పంపిణీ వివాదం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. గతంలో కావేరీ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు కన్నా ప్రస్తుతం 14.75 టీఎంసీలు తక్కువగా రాష్ట్రానికి కేటాయించడంతో తమిళనాడు రాజకీయ పక్షాలు అసంతృప్తితో ఉన్నాయి. ప్రధాని మోదీని నేరుగా కలిసి సుప్రీంకోర్టు తీర్పు మేరకు చర్యలు చేపట్టాలని కోరాలని ఫిబ్రవరి 22న జరిగిన అఖిలపక్ష సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఆ మేరకు ప్రధానిని కలిసేందుకు ముఖ్యమంత్రి సమయం కూడా కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శాసనసభ ప్రతిపక్షనేత స్టాలిన్‌తో ఫోన్‌లో మాట్లాడిన పళనిస్వామి.... శనివారం ఆయన్ను సచివాలయానికి ఆహ్వానించారు. ముఖ్యమంత్రితో భేటీ అనంతరం స్టాలిన్ విలేకర్లతో మాట్లాడుతూ... అఖిలపక్ష నేతలను కలిసే విషయమై ప్రధాని స్పందన కోసం సోమవారం వరకు నిరీక్షించాలని, అప్పటికీ ఆయన నుంచి సమాధానం రాకుంటే 8వ తేదీన శాసనసభను సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి తనకు హామీ ఇచ్చినట్టు చెప్పారు.

కేంద్రం తీరుకునిరసనగా నేడు 'మార్చ్ ఫర్ ఏపీ'

ఈనాడు డిజిటల్, అమరావతి: విభజన చట్టం అమలుపై కేంద్రం వ్యవహరిస్తోన్న తీరుకు నిరసనగా విజయవాడలో ఆదివారం 'మార్చ్ ఫర్ ఏపీ' ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీ ఫస్ట్ సొసైటీ స్పష్టం చేసింది. ప్రత్యేక హోదా, నిధుల కేటాయింపులో రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని.. దీనిపై సామాన్యుల తరఫున పోరాటానికి ఏపీ ఫస్ట్ సొసైటీ సిద్ధమైందని అధ్యక్షుడు బీజీఆర్ మండవ వివరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పటమట ఎన్టీఆర్ కూడలి నుంచి స్వరాజ్య మైదానం వరకూ జరగనున్న ఈ ర్యాలీలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు. శనివారం విజయవాడలో విలేకరుల సమావేశంలో సొసైటీ సభ్యులు మాట్లాడారు. ఏ రాజకీయ భావజాలానికి చెందిన వారైనా తమతో కలిసి రావచ్చన్నారు.

రూ.74,542 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించారు. నివేదికలోని అంశాల్ని పవన్‌కల్యాణ్, కమిటీ నేతలు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రధానమంత్రి మోదీకి కూడా నివేదికను పంపించనున్నట్లు కమిటీ ప్రకటించింది. నివేదికలోని అంశాలు..

- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటించారు. నాటి కేంద్ర మంత్రివర్గం కూడా ఆమోదించింది. కానీ 14వ ఆర్థిక సంఘం ప్రత్యేకహోదా అనేది రద్దు చేయాలని సిఫార్సు చేసినట్లు ఎన్డీయే ప్రభుత్వం తెలిపింది. కానీ ఆర్థిక సంఘం నివేదికలో ఎక్కడా లేదు. ప్రత్యేక హోదాకిక కాలం చెల్లిందని కేంద్రం చెపుతోంది కానీ ఇప్పటికీ 11 రాష్ట్రాలు ప్రత్యేక హోదాను కలిగి ఉన్నాయి.
- రానున్న ఐదేళ్ల పాటు ఏపీ ఆదాయ లోటుతో కొనసాగనుంది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలోని 95 శాతం ఆస్తులన్నీ హైదరాబాద్‌లో ఉన్నందున తెలంగాణ రాష్ట్రానికే వెళ్లాయి. పంపకానికి చాలా కాలం పడుతుంది. ఏపీకి నష్టం జరిగినందున ప్రత్యేక హోదా హామీని అమలుచేయాలి.
- కేంద్ర ఆర్థిక మంత్రి సూచన మేరకు ప్రత్యేక ప్యాకేజీ కింద సాయం తీసుకోవడానికి ఏపీ అంగీకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.16,447 కోట్లను ఇస్తామని తెలిపారు. కానీ ఇప్పటి వరకూ ఏమీ చెల్లించలేదు.
- అకౌంటెంట్ జనరల్ అంచనాల ప్రకారం రాష్ట్రానికి 2014-15లో ఆదాయ లోటు రూ.16,078 కోట్లు ఉంది. కానీ కేంద్రం ఈ లోటు కొత్త పథకాల వల్ల వచ్చిందని, నికరంగా రూ.4117.89 కోట్లు లోటు మాత్రమే ఉందని, అందులో రూ.3979.50 కోట్లు మాత్రమే ఇచ్చింది.
- మొత్తం 11 జాతీయస్థాయి సంస్థలు ఇస్తామని చెప్పిన కేంద్రం 9 మంజూరుచేసింది. విశాఖ, విజయవాడలకు మెట్రో ప్రాజెక్టులివ్వాలి.

హోదా ఇస్తేనే వందశాతం న్యాయం: పవన్

ప్రత్యేకహోదాకు ఏదీ సరిపోదని.. రాష్ట్రానికి వంద శాతం న్యాయం హోదా ద్వారానే సాధ్యమవుతుందని పవన్‌కల్యాణ్ అన్నారు. ''హోదాపై కొండంత ఆశచూపిన కేంద్రం ప్యాకేజీ ప్రకటించింది. పాచిపోయిన లడ్డూలైనా తీసుకుంటామని తెదేపా నేతలన్నారు. ఇప్పుడా పాచిపోయిన లడ్డూల్నీ నేటికీ ఇవ్వలేదు. రాంవిలాస్ పాశ్వాన్ అడిగితే బీహార్‌లో హాజిపూర్‌లో రైల్వేజోన్ ఏర్పాటు చేశారు. ఏపీకి ఎందుకివ్వరు? ఏపీలో అనుకూలత (వయబుల్) లేదని కేంద్రం అంటోంది. అంతా అనుకూలంగా ఉంటుందనే రాష్ట్రాన్ని విభజించారా?'' అని ప్రశ్నించారు. ''ఏపీ సీఎం చంద్రబాబు ఒకసారి హోదా కావాలని, మరోసారి ప్యాకేజీ సరిపోతుందని, ఇప్పుడు మళ్లీ హోదా అంటూ గందరగోళ ప్రకటనలు చేస్తున్నారు. పోలవరం నిర్మాణ బాధ్యతల్ని రాష్ట్రప్రభుత్వం తీసుకోకుండా ఉండాల్సింది. ప్రాజెక్టు పూర్తికాకపోతే నింద రాష్ట్రప్రభుత్వంపైనే పడుతుంది. ఏపీకి ఇంత అన్యాయం జరుగుతుంటే రాష్ట్రప్రభుత్వం నాలుగేళ్లుగా ఎందుకు మౌనంగా ఉంది? కేంద్రాన్ని అడగడానికి రాష్ట్రప్రభుత్వానికి భయమెందుకు? కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్నవి ఎన్డీయే ప్రభుత్వాలే. చేయని తప్పునకు ప్రజలు నష్టపోతున్నారు. కడుపుమంటతో, ఆక్రోశంతో ఉన్నాం. ఎవరూ రాజకీయ డ్రామాలు ఆడొద్దు. గతంలో కాంగ్రెస్ మాదిరి ఇప్పుడు కూడా కేంద్రం తప్పుచేస్తే ప్రజలు రోడ్లమీదకు వస్తారు. పార్లమెంటులో ఇచ్చిన మాట మరిస్తే ప్రజల్ని పాలించే అర్హతను ప్రభుత్వాలు కోల్పోతాయి.'' అని వ్యాఖ్యానించారు. ఏపీకి విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని.. అయితే 21వ తేదీన అవిశ్వాసం పెడితే ఆశించిన ప్రయోజనం ఉండదని, 5వ తేదీన పెడితే అవిశ్వాసంపై చర్చకు సమయం ఉంటుందని పవన్‌కల్యాణ్ అన్నారు. ''కేంద్రంపై వైకాపా అవిశ్వాసం పెడితే తెదేపా మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. వైకాపా చిత్తశుద్ధితో అవిశ్వాసం పెట్టాలి. దీంతో ప్రభుత్వం పడిపోతుందని కాదని, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చ జరిగేందుకు అవకాశం ఉంటుంది'' అని పవన్ అభిప్రాయపడ్డారు. జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ...''కేంద్ర ప్రభుత్వం ఆ 74,542 కోట్లు ఇచ్చినా అది ప్రత్యేకహోదాకు సమానం కాదు. వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలి. ఏడు జిల్లాలకు ఇంకా రూ.22,250 కోట్లురావాలి. మౌలికసదుపాయాలతో రాజధాని నిర్మాణం చేసే బాధ్యత కేంద్రానిదే'' అని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, చిత్రంలో లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

ఏపీకి రావాల్సిన నిధులు (రూ.కోట్లలో) (జేఎఫ్‌సీ నివేదిక ప్రకారం)

అంశం	ఎంత రావాలి	వచ్చింది+ ఇస్తామన్నది	ఇంకా రావాల్సింది
కేంద్ర ప్రాయోజిత పథకాలు	16,447	0	16,447
రెవిన్యూలోటు	14,333	4,118	10,225
వెనుకబడిన ప్రాంతాలకు	24,350	2,100	22,250
పన్నులరాబడి లోటు	3,820	0	3,820
విశాఖ-చెన్నై కారిడార్	6,000	0	6,000
కాకినాడ పెట్రో కాంప్లెక్స్	5,000	0	5,000
జాతీయ ప్రాధాన్య సంస్థలు	11,673	853	10,800

మూలనపడ్డ కాంగ్రెస్!

ఏడు రాష్ట్రాల్లో ఉనికి కోల్పోతున్న పార్టీ

ఈశాన్య భారత దేశంలోని ఏడు రాష్ట్రాలు (సెవెన్ సిస్టర్స్) ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉండేవి. తాజాగా అక్కడ భాజపా, దాని మిత్రపక్షాలు ప్రాబల్యం పెరుగుతుండటంతో కాంగ్రెస్ ఇక్కడ ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. త్రిపురలో పాతికేళ్ల కిందటే అధికారాన్ని కోల్పోయిన ఆ పార్టీ ఇప్పుడు ఏకంగా తుడిచిపెట్టుకుపోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దశాబ్దాల పాటు ఈ రాష్ట్రాలను కాంగ్రెస్సే పాలించింది. ప్రాంతీయ పార్టీల రాకతో ఆ పార్టీ గుత్తాధిపత్యానికి గండిపడింది. మిజోరం వంటి రాష్ట్రాల్లో అడపాదడపా అధికారాన్ని సాధిస్తోంది. నాగాలాండ్‌లో దశాబ్దం కిందటి నుంచే కాంగ్రెస్ ప్రభ మసకబారడం మొదలైంది. మిజోరంలో మాత్రమే ఇప్పుడు ఆ పార్టీ అధికారంలో ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ఈ రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికారాన్ని కోల్పోవచ్చని విశ్లేషణలు చెబుతున్నాయి. భాజపా నేతృత్వంలోని ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి (నెడా)లో భాగంగా ఉన్న మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), భాజపాలు ఇక్కడ విజయం సాధించడం ఖాయమని పేర్కొంటున్నాయి. ఈ రెండు పార్టీలూ అక్కడ విడివిడిగా పోటీ చేసినప్పటికీ ఎన్నికల అనంతరం జట్టు కడతాయని విశ్లేషిస్తున్నాయి.

–ఈనాడు ప్రత్యేక విభాగం

కమల పతాక

(మొదటి పేజీ తరువాయి)

కమ్యూనిస్టుల కంచుకోటలాంటి త్రిపురలో అపూర్వరీతిలో విజయం లభించిన తీరు వారి హర్షాతిరేకానికి కారణమయింది. అక్కడ రెండున్నర దశాబ్దాలుగా అధికారంలో ఉన్న సీపీఎం నేతృత్వ కూటమిని, ప్రజల ముఖ్యమంత్రిగా పేరుగాంచిన మాణిక్ సర్కారును ఓటర్లు ఇంటిబాట పట్టించారు. కనీసం ఒక కౌన్సిలర్ కూడా ఇంతవరకు లేని భాజపాకు ఒకేసారి ఆ రాష్ట్ర పగ్గాలు అప్పగించారు. మూడు ఈశాన్య రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. మూడు రాష్ట్రాల్లోనూ 60 చొప్పున శాసనసభ స్థానాలున్నా వివిధ కారణాల వల్ల ఒక్కోచోట 59 స్థానాలకే ఎన్నికలు జరిగాయి. ఈ ఫలితాలు 'శూన్యం నుంచి శిఖరానికి' తీసుకువెళ్లాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

త్రిపురలో కుప్పకూలిన వామపక్ష కోట

త్రిపురలో భాజపా తమ భాగస్వామి ఐ.పి.ఎఫ్.టి.తో కలిసి మూడింట రెండొంతులకు పైగా ఆధిక్యాన్ని సాధించింది. బెంగాలీ, గిరిజన ఓటర్లను గంపగుత్తగా సాధించగలగడంతో కమలం సునాయాసంగా విజయతీరాన్ని చేరింది. అయిదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 2% కంటే తక్కువ ఓట్లు దక్కించుకున్న కమలనాథులు ఈసారి చరిత్ర తిరగరాశారు. 60కి గానూ ఎన్నికలు జరిగిన 59 స్థానాల్లో ఏకంగా 43 భాజపా కూటమికి దక్కాయి. విజయానికి అవసరమైన స్థానాలకంటే ఎక్కువగా 35 స్థానాలను భాజపా సొంతంగా దక్కించుకున్నా అక్కడ సంకీర్ణ ప్రభుత్వమే కొలువుదీరనుందని భాజపా దళపతి అమిత్‌షా దిల్లీలో స్పష్టం చేశారు.

నాగాలాండ్‌లో కమలానికి సంకీర్ణ ఆహ్వానం

నాగాలాండ్‌లో భాజపా-ఎన్‌డీపీపీ కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించలేకపోయింది. అయితే హంగ్ అసెంబ్లీలో భాజపా భాగస్వామ్యం అనివార్యంగా మారింది. ప్రభుత్వ ఏర్పాటులో పాలు పంచుకోవాల్సిందిగా భాజపా కూటమిని అధికార ఎన్‌పీఎఫ్ నేత, ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్ ఆహ్వానించారు. ఎన్‌పీపీ, జేడీ(యు), ఒక స్వతంత్ర సభ్యుడుతో కలిసి భాజపా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ఎన్‌పీఎఫ్ మాత్రం వెంటనే ఈ రకమైన ఆహ్వానాన్ని పంపింది.

మేఘాలయాలో చీలిన తీర్పు

మేఘాలయాలో ఓటరు తీర్పు చీలిపోయింది. అధికార కాంగ్రెస్ పార్టీ 21 స్థానాలతో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినా, సాధారణ ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఇంకా 9 మంది శాసనసభ్యులు అవసరం. క్రైస్తవుల ఆధిక్యం ఎక్కువగా ఉన్న మేఘాలయాలో భాజపాకి కేవలం రెండు సీట్లే దక్కినా, ఆ పార్టీ భాగస్వామిగా ఉన్న నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) మాత్రం 19 చోట్ల నెగ్గింది. చిన్న పార్టీల తరఫున నెగ్గిన 13 మంది, మరో ఇద్దరు స్వతంత్రులు ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారారు. అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్‌నే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలనీ, గవర్నర్ ఎప్పుడు కోరినా బలాన్ని నిరూపించుకుంటామనీ కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ చెప్పారు. త్రిపుర, నాగాలాండ్‌లలో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది.



ఎన్డీయే పాలనలోకి 20 రాష్ట్రాలు

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో.. దేశ రాజకీయ చిత్రపటం కాషాయ వర్ణం పులుముకుంది. ఎన్నడూ లేని విధంగా.. అత్యధిక రాష్ట్రాలు భాజపా నియంత్రణలోకి వచ్చేశాయి. 29 రాష్ట్రాల్లో ఏకంగా 20 ఎన్డీయే పాలనలోకి చేరినట్లే. కాంగ్రెస్‌కు సైతం గతంలో ఎప్పుడూ ఇది సాధ్యం కాలేదు. ఇందిరా గాంధీ హయాంలో ఒకప్పుడు 18 రాష్ట్రాలను కాంగ్రెస్ పాలించింది. ఇప్పుడు నరేంద్ర మోదీ నాయకత్వంలో కమలం పార్టీ అంతకుమించిన ఆధిపత్యాన్ని సాధించింది. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాలు కేవలం ఐదే. మరో రెండు రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి ఆ పార్టీ ప్రభుత్వంలో ఉంది. అయితే మోదీ అధికారం చేపట్టింది మొదలు.. రాష్ట్రాల్లో భాజపా హవా మొదలైంది. ఒక్కో చోట వరుసగా ఆ పార్టీ పాగా వేస్తూ వచ్చింది. తాజాగా మూడు ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే జోరును కొనసాగించింది. త్రిపురలో వామపక్ష కంచుకోటను బద్దలుకొట్టి అధికారం చేజిక్కించుకుంది. నాగాలాండ్‌లోనూ కమలం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇటు మేఘాలయలో ఫలితాలు హంగ్ అయ్యాయి. ఇక్కడ భాజపా రెండు సీట్లే సాధించింది. అయితే కాంగ్రెస్‌కు అధికారాన్ని దూరం చేసేందుకు.. ఇక్కడ ప్రతిపక్షాలతో భాజపా కలవొచ్చు. మేఘాలయ కూడా చేజారితే.. దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సంఖ్య ముచ్చటగా మూడుకు చేరుతుంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

గ్రహం అనుగ్రహం

4–3–2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
తదియ: తె. 3-16 తదుపరి చవితి
హస్త నక్షత్రం: రా. 10-20 తదుపరి చిత్త
అమృత ఘడియలు: సా. 4-22 నుంచి 5-57 వరకు
వర్జ్యం: ఉ. 6-49 నుంచి 8-24 వరకు
దుర్ముహూర్తం: సా. 4-29 నుంచి 5-16 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-21; సూర్యాస్తమయం: సా.6-03

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.5	21.2
సూర్యాపేట	38.0	24.0
శ్రీకాకుళం	38.0	20.0
హన్మకొండ	38.0	19.5
మెదక్	38.0	16.4
మహబూబ్‌నగర్	37.5	20.1
రాజమహేంద్రవరం	37.5	20.0
గుంటూరు	37.5	19.0
రామగుండం	37.2	20.2
కరీంనగర్	37.0	21.0
హైదరాబాద్	36.9	20.6
విశాఖపట్నం	36.8	22.0
తిరుపతి	36.8	17.1
విజయవాడ	36.7	19.6
నిజామాబాద్	36.0	23.0
ఖమ్మం	36.0	22.0
నెల్లూరు	36.0	20.0
ఒంగోలు	35.9	21.7
అనంతపురం	35.9	18.9
నరసాపురం	34.1	23.5
కడప	34.0	21.0
తాడేపల్లిగూడెం	33.5	21.5

బడ్జెట్ సమావేశాలకు వైకాపా దూరం

- ప్రజాప్రతినిధులు, ముఖ్యులతో జగన్ సమావేశం

ఈనాడు డిజిటల్ – ఒంగోలు న్యూస్‌టుడే



వైకాపా ప్రజాప్రతినిధుల దిల్లీ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న జగన్

ప్రత్యేక హోదా కోసం మన పార్లమెంటు సభ్యులు తీసుకునే నిర్ణయానికి శాసనసభ్యులు సంఘీభావం ప్రకటించాలని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. శనివారం ప్రకాశం జిల్లా తాళ్లూరులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో సమావేశమైన జగన్ భవిష్యత్తు కార్యాచరణ, శాసనసభ బడ్జెట్ సమావేశాలు, ప్రత్యేకహోదాపై పోరాటం, రాజ్యసభ ఎన్నిక తదితర అంశాలపై చర్చించారు. పార్టీ మారిన 22 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంతో పాటు మంత్రులను పదవుల నుంచి తొలగించే దాకా బడ్జెట్ సమావేశాలకు హాజరుకాకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీల రాజీనామాల విషయమై జగన్ చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ప్రత్యేకహోదా కోసం పార్టీ ఎంపీలకు సంఘీభావమంటే.. వారు రాజీనామా చేస్తే మీరు కూడా అదే బాటలో నడవాలని అంతర్లీనంగా ఇచ్చిన సంకేతాలేనని పార్టీ నేతలు కొందరు పేర్కొంటున్నారు.

చంద్రబాబు ప్రతి కదలిక నాకు తెలుసు

చంద్రబాబు ప్రతి కదలిక తనకు తెలుసని ఈ సమావేశంలో జగన్ వ్యాఖ్యానించారు. 'మిమ్మల్ని ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని నాకు తెలుసు. ప్రలోభాలను తిరస్కరించి మీరు చిత్తశుద్ధితో నిలబడ్డారు. మీపై మరింత గౌరవం పెరిగిందని...' పేర్కొన్నారు. వైకాపాకు 44 మంది ఎమ్మెల్యేలున్నా.. రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం కాకుండా చేయాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. 'బడ్జెట్ సమావేశాలకు మనం హాజరుకాకపోతే ఆ అంశం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తుంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతున్న తీరు, రాజ్యాంగ ఉల్లంఘనల విషయం అందరికీ తెలుస్తుందని..' వివరించారు. రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవం కాకుంటే ఆ ఒక్కరోజు మాత్రం ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాపై పోరాటంలో భాగంగా ఈనెల 5న దిల్లీలో ధర్నా, 20 వరకు పార్లమెంటు లోపల, బయట ఎంపీల ఆందోళన చేస్తారని చెప్పారు. స్పందన లేకుంటే మార్చి 21న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని ప్రకటించారు. తెదేపాకు చెందిన 20 మంది ఎంపీలు అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేలా పవన్ కల్యాణ్ చూడాలని కోరారు. ఏప్రిల్ 6న స్పీకర్ ఫార్మెట్లో తమ పార్టీకి చెందిన అయిదుగురు ఎంపీలు రాజీనామాలు చేస్తారని వెల్లడించారు. 'కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పుకోవడం తెదేపా మొదటి అస్త్రం కావాలి... ఆఖరి అస్త్రంగా చంద్రబాబు చెబుతున్నారంటే ఆయన వైఖరి ఏమిటో తెలుస్తోందని...' విమర్శించారు. ఈ సమావేశం అనంతరం ఈ నెల 5న దిల్లీలోని సంసద్ మార్గ్‌లో ధర్నాకు వెళ్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకుల వాహన శ్రేణికి జగన్మోహన్‌రెడ్డి జెండా ఊపారు.

కేంద్రంతో చంద్రబాబు మ్యాచ్ ఫిక్సింగ్: జగన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ పరిధిలోని తాళ్లూరు మండల కేంద్రంలో శనివారం సాయంత్రం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సాగర్ కుడికాలువకు 140టీఎంసీల కేటాయింపున్నా నీరు రాలేదనీ, చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఏనాడూ వరిపంట సాగు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



వైకాపా తరపున రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీలు, ఎమ్మెల్యేలకు జగన్ పరిచయం చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ బలాల ఆధారంగా తెదేపాకు రెండు, వైకాపాకు ఒక సీటు దక్కుతుందని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విలేకరులతో అన్నారు. ఈ ఎన్నికల్లో నీతిమాలిన పనులు చేయడం తగదన్నారు. చంద్రబాబు ఏమైనా విన్యాసాలు చేస్తే ఆయన కొంప కొల్లేరవుతుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సీట్ల పెంపు అవకాశమే లేదని స్పష్టమైందని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో ఇప్పుడు అంతర్మథనం ప్రారంభమైందని వివరించారు.



కేరళ సీఎం పినరయి విజయన్‌ను పరామర్శిస్తున్న కమల్‌హాసన్

చెన్నై అపోలో ఆస్పత్రిలో కేరళ సీఎం

- ఎంఎన్‌ఎం అధినేత కమల్ భేటీ

ఈనాడు డిజిటల్, చెన్నై: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెన్నైలోని గ్రీవెన్స్ రోడ్డులో ఉన్న అపోలో ఆస్పత్రికి శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. తొలుత ఆయన శరీరంలో రక్తశాతం తగ్గడంతో ఆస్పత్రిలో చేరారని ప్రచారం సాగింది. అనంతరం ఆయన భార్య కమలా విజయన్ ఆస్పత్రిలో చేరారని, ఆమెను చూడటానికి వచ్చారని వార్తలు వెలువడ్డాయి. ఆయన సాధారణ పరీక్షల్లో భాగంగానే ఆస్పత్రిలో చేరారని, ప్రత్యేక బృందం పరీక్షలు నిర్వహించిందని తెలిసింది. అనంతరం కేరళ భవన్‌కు సీఎం చేరుకున్నారు. విషయం తెలిసిన మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధినేత, నటుడు కమల్‌హాసన్ పినరయి విజయన్‌ను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

విమానయాన రంగంలో విదేశీ పెట్టుబడులకు ప్రత్యేక బిల్లు: అశోక్‌గజపతిరాజు

విజయనగరం, న్యూస్‌టుడే: విమానయానరంగ సేవలు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు తెలిపారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడుల కోసం త్వరలో పార్లమెంటులో ప్రత్యేక బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. శనివారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విదేశీ సంస్థల పెట్టుబడులపై ఈ నెల 8న హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కోసం దాదాపు స్థల సేకరణ పూర్తి చేశామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలుస్తుందని తెలిపారు. ప్రత్యేక హోదా సున్నితమైన అంశమని, దీన్ని జఠిలంచేయడం సరికాదన్నారు. అన్యాయం చేసిన వారే ఇప్పుడు ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం ప్రకటించిన విధంగా ప్రత్యేక ప్యాకేజీకి తగిన నిధులు వస్తాయని తెలిపారు. చట్టంలో పొందుపరిచినవి అమలు చేయడానికి తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూచనలతో కేంద్రంతో సంప్రదింపులు చేస్తామన్నారు.

పోలవరం బాధ్యత కేంద్రానికే అప్పగించాలి

సీఎం చంద్రబాబుకు కేవీపీ లేఖ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రారావు ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ఖజానా నుంచి చేసిన వ్యయాన్ని పైసాతో సహా కేంద్రం నుంచి రాబట్టాలని, ఇతర మరికొన్ని అంశాలను పేర్కొంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన పదిపేజీల లేఖను రాశారు. భాజపా, తెదేపా నడుమ విధానపరమైన బేధాభిప్రాయాలు లేవని, కేవలం గుత్తేదార్ల విషయంలో మాత్రమే పొరపొచ్చాలు వచ్చాయని శనివారం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కేంద్రం నుంచి ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవడం ద్వారా గుత్తేదార్ల నుంచి ప్రభుత్వ పెద్దలు ఇష్టానుసారంగా కమీషన్లు తీసుకోవడంతో రాష్ట్ర ప్రజలపై రూ.6వేల కోట్ల అదనపు భారం పడిందన్నారు. తెదేపా గెలుపునకు ఉపయోగపడిన పవన్‌కళ్యాణ్ ప్రశ్నించడంతో పోలవరం వివరాలు ఆన్‌లైన్‌కు ఎక్కించారన్నారు. ప్రజాగ్రహాన్ని గ్రహించే చంద్రబాబు మరోమారు ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నట్లు డ్రామాలు మొదలుపెట్టారన్నారు.

డిసెంబరుకల్లా పోలవరం గేట్లు సిద్ధం

- జలవనరుల దినోత్సవ సభలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



జ్యోతి వెలిగించి జలవనరుల దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దేవినేని ఉమా

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టుకు 48 గేట్లను అమర్చనున్నట్టు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెల్లడించారు. పోలవరం పనులను సకాలంలో పూర్తి చేయడానికి, రాష్ట్ర నిధులను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 23, తాను 53 సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించామని, ఒక సంకల్పం కోసం, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. విజయవాడలోని నీటిపారుదల శాఖ ఆవరణలో ప్రఖ్యాత ఇంజినీరు కుడితిపూడి శ్రీరామకృష్ణయ్య 92వ జయంతిని పురస్కరించుకుని, 16వ జలదినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు 55శాతం పూర్తిచేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు దిల్లీలో కూర్చొని.. పోలవరంపై ఏదో జరిగిపోయిందంటూ లేఖలు రాస్తున్నారని దుయ్యబట్టారు.

ఇంజినీర్లకు గౌరవం

రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణానికి దివంగత ఎన్టీఆర్ కారకులైతే, ఆయన కలలను ప్రఖ్యాత ఇంజినీరు శ్రీరామకృష్ణయ్య సాకారం చేశారని మంత్రి ఉమా పేర్కొన్నారు. నేడు ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ అవార్డును ఇవ్వాలని సీఎం చంద్రబాబు సిఫార్సు చేశారని.. ఇంజినీర్లకు గుర్తింపు, గౌరవాన్ని తెదేపా ప్రభుత్వం ఇస్తుందని మంత్రి వివరించారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ కరవు ప్రాంతాల్లోనూ సంపద సృష్టించేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, మంత్రి ఉమా జలవనరుల శాఖకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారని పేర్కొన్నారు. జలవనరుల ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ జలసంరక్షణ కోసం రూ.10,867కోట్లు ఖర్చు చేసి, 68.43కోట్ల క్యూబిక్ మీటర్ల పూడిక తీసి, 32 టీఎంసీల భూగర్భ జలాలను నిల్వ చేయగలిగామన్నారు. ఈఎన్‌సీలు ఎం.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్‌లు, సాగునీటి సంఘాల సారథులు గుత్తా శివరామకృష్ణయ్య, భుజంగరావు, పుల్లయ్యచౌదరి, మురళీకృష్ణ, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లో రాయితీ కందిపప్పు

విశాఖలో ప్రారంభించిన మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో తక్కువ ధరకు నిత్యావసర సరకులు అందిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన రాయితీ కందిపప్పు అమ్మకాల్ని శనివారం విశాఖ నక్కవానిపాలెంలోని చౌకదుకాణాల్లో మంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో కోటి 42 లక్షల కార్డుదారులున్నారని, వారందరికీ ప్రతి నెల అందించే బియ్యం, చక్కెరతోపాటు కిలో రూ. 40 ధరకే కందిపప్పును అందించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. మినపప్పు, పెసరప్పు, ఎండు మిర్చిని కూడా రాయితీపై అందించాలంటే ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడుతుందనే పరిశీలించి నివేదిక ఇస్తామని, వాటిని కూడా భవిష్యత్‌లో ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి అలోచన చేస్తారని తెలిపారు. సరకుల్లో నాణ్యత లేకపోతే 1100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. 200 అన్న క్యాంటీన్లు, 6,500 చంద్రన్న విలేజ్ మాల్స్‌ను అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 10 జిల్లాల్లో రిలయన్స్, 3 జిల్లాల్లో ఫ్యూచర్ సంస్థలతో కలిపి చంద్రన్న విలేజ్ మాల్స్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. సినిమా థియేటర్లలో ప్యాక్ చేసిన తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.1.10 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

- చెన్నై నుంచి రాజమహేంద్రవరంనకు రవాణా
- అదుపులో ఇద్దరు వ్యక్తులు

తెనాలి, న్యూస్‌టుడే: ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.10 కోట్ల విలువైన 3.5 కేజీల బంగారాన్ని తెనాలి రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా తెనాలి జీఆర్‌పీ స్టేషన్‌లో ఎస్పీ కె.వి.మోహన్‌రావు శనివారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని రెండు నగల దుకాణాల్లో అదే ప్రాంతానికి చెందిన అంజిబాబు, ప్రభాకరరావు గుమస్తాలుగా పని చేస్తున్నారు. చెన్నై వెళ్లి బంగారం తీసుకురావాలని తమ యజమానులు చెప్పడంతో ఇరువురు విడివిడిగా శుక్రవారం చెన్నై చేరుకున్నారు. అక్కడ రైల్వే స్టేషన్ వద్ద వీరికి ఇద్దరు వ్యక్తులు బంగారం బిస్కెట్లు ఉన్న సంచులు ఇచ్చి వెళ్లిపోయారు. తిరుగుప్రయాణంలో వారు శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో తెనాలి చేరుకోగానే.. ముందస్తు సమాచారం మేరకు బోగీలను తనిఖీ చేసి అంజిబాబు వద్ద 2.5 కేజీల బంగారం, ప్రభాకరరావు వద్ద 1 కిలో బంగారం గుర్తించారు. వాటికి సంబంధించి ధ్రువపత్రాలు, బిల్లులు లేకపోవడంతో బంగారం స్వాధీనం చేసుకొని.. వారివురిని అదుపులోకి తీసుకున్నారు. బంగారాన్ని పట్టుకోవటంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై వెంకటయ్యను ఎస్పీ అభినందించారు.

విభజన అంశాలే ప్రధాన అజెండా..!

- కేంద్రంపై విమర్శలు ఎక్కుపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం
- రేపటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు
- 29 అంశాలపై చర్చించాలని ప్రభుత్వం యోచన

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మొదలవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం వైకాపా ఈసారీ బహిష్కరణ బాటనే ఎంచుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు మాత్రమే హాజరవుతామని స్పష్టం చేసింది. మిత్రపక్షాలైన తెదేపా, భాజపాలే శీతాకాల సమావేశాల్లో మాదిరిగా ఈసారీ సభలో ఉంటాయి. సభలో వాతావరణం మాత్రం అప్పటిలా ఉండకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతున్న నేపథ్యంలో రెండు పార్టీల మధ్య ఎంత వరకు సుహృద్భావ సంబంధాలు కొనసాగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. విభజన చట్టంలోని అంశాలు, హామీల అమల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని శాసనసభ వేదికగా గట్టిగా చాటి చెప్పాలని ప్రభుత్వం భావిస్తోంది. సభలో చర్చకు చేపట్టేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన అంశాల్లో ఐదు అవే ఉన్నాయి. భాజపా రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిన నేపథ్యంలో.. వారికి సమాధానంగా రాయలసీమ అభివృద్ధి గురించి ప్రధానంగా చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశాలు చర్చకు వచ్చినప్పుడు భాజపా ఎలా వ్యవహరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేంద్ర ప్రభుత్వంపై తెదేపా విమర్శలు ఎక్కుపెడితే ... భాజపా కూడా దానికి దీటుగా బదులిచ్చేందుకు ప్రయత్నిస్తుంది. కేవలం భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాత్రమే మాట్లాడతారా? ఆ పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రులూ స్పందిస్తారా? అన్నది వేచిచూడాలి. అలాంటి పరిస్థితే వస్తే భాజపానే ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉంది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో సభలోనే వివరించాలని ఇప్పటికే నిర్ణయించింది. తెదేపా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలయ్యాయన్న అంశంపైనా దృష్టి సారించింది. కేంద్రం ఇచ్చిన హామీల్ని అమలు చేయలేదని తెదేపా సభ్యులు దాడికి దిగితే... భాజపా ఈ అంశాల్ని ప్రస్తావించే అవకాశం ఉంది.

ప్రాథమికంగా 18 పనిదినాల్లో సమావేశాలు

శాసనసభ, శాసనమండలిలో చర్చించేందుకు తెదేపా శాసనసభాపక్షం మొత్తం 29 అంశాల్ని ఎంపిక చేసింది. వీటిలో ఎన్ని అంశాలు చర్చకు చేపట్టేదీ శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయిస్తారు. బడ్జెట్ సమావేశాల్ని 18 పనిదినాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ నెల 5 నుంచి 29 వరకు సమావేశాలు జరుగుతాయి. బీఏసీలో తుది నిర్ణయం జరుగుతుంది. సోమవారం ఉదయం 8.15కి రాష్ట్ర మంత్రిమండలి సమావేశమై గవర్నర్ ప్రసంగానికి ఆమోదముద్ర వేస్తుంది. ఉదయం 9.28 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం జరుగుతుంది. మండలి సభ్యుడు గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతికి శాసనసభ, శాసనమండలిలో మంగళవారం సంతాపం తెలుపుతారు. అనంతరం ఆ రోజుకి శాసనమండలిని వాయిదా వేస్తారు. శాసనసభలో మంగళ, బుధవారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ నెల 8న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రవేశపెడతారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవులు ఉంటాయి. సోమవారం నుంచి మళ్లీ సమావేశాలు మొదలవుతాయి.

కేంద్రానికి తగిలేలా...!

శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సహకారం, విభజన చట్టంలోని అంశాలు, హామీల అమలు, ప్రత్యేక హోదా వల్ల ఒనగూరే ప్రయోజనాలు వంటివి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెప్పిన జాతీయ విద్యా సంస్థలు ఏ పరిస్థితిలో ఉన్నాయి? 2014 నుంచీ కేంద్రం అందజేసిన ఆర్థిక ప్రయోజనాలపైనా చర్చించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చ జరుగుతుంది. సభలో చర్చించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన 29 అంశాల్లో... విశాఖలో నిర్వహించిన మూడు భాగస్వామ్య సదస్సుల్లో వచ్చిన పెట్టుబడులు, రాయలసీమలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐదో విడత జన్మభూమిలో వచ్చిన అర్జీల పరిష్కారం, రాజధాని అమరావతి అభివృద్ధి, రాష్ట్రంలో కరవు మండలాలు, రాయలసీమలో పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పురోగతి, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం, రియల్‌టైం గవర్నెన్స్‌ల వంటివి ఉన్నాయి.

అసెంబ్లీ పవిత్రమైన వేదిక: స్పీకర్

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలని వైకాపాకు చెందిన కొందరు నేతలకు తాను సూచించానని స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు. శనివారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ..' అసెంబ్లీ పవిత్రమైన వేదిక. ఇక్కడ మాట్లాడిన దానికి విలువ ఎక్కువ. ప్రజా సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి అవకాశం ఉంటుంది. దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పాను. సమావేశాలకు రావాలా! వద్దా!! అన్నది వారి ఇష్టం..." అని ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ గల్లా జయ్‌దేవ్, పక్కన మద్దాళిగిరి, పాస్టర్ అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తదితరులు

సందడిగా గుడారాల పండగ

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రజలందరూ ఏసు చూపిన ప్రేమ, శాంతి, సహనం అలవర్చుకోవాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కోరారు. రెండేళ్లుగా మినిస్ట్రీస్‌తో బంధం ఏర్పడిందని, తాను అమెరికాలో చదువుకున్నపుడు క్రీస్తు సిద్ధాంతాలు తెలుసుకున్నానని చెప్పారు. గుంటూరు నగరం అమరావతి రోడ్డు గోరంట్లలో హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న గుడారాల పండగ కూటాలను శనివారం ఉదయం పాస్టర్ జాన్ క్రీస్తు ప్రార్థనతో ప్రారంభించారు. పాస్టర్ అనిల్, పాస్టర్ రాజు దైవ వాక్య సందేశాలను విశ్వాసులకు పంచారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. క్రీస్తు చూపిన ప్రేమబాటలో ప్రతిఒక్కరూ నడవాలని అన్నారు. క్రీస్తు ద్వారా పునీతుడైన బ్రదర్ ఏసన్న ఉభయ తెలుగు రాష్ట్రలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో వందలాది దైవమందిరాలు నిర్మించి, లక్షలాది విశ్వాసకులను ప్రభువు మార్గంలో నడిచేలా ఆశీర్వదించారని తెలిపారు. తెదేపా గుంటూరు తూర్పు నియోజకవర్గం బాధ్యుడు మద్దాళిగిరిదర్, రాయపాటి రంగబాబు తదితరులున్నారు.

భాగస్వామి చేతి స్పర్శతో మహిళల్లో బాధ మాయం!

వాషింగ్టన్: జీవిత భాగస్వామి చేతి స్పర్శతో మహిళల్లో నొప్పి, బాధ తగ్గుముఖం పడతాయని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. అమెరికాలోని కొలరడో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతోకూడిన బృందం తాజా అధ్యయనంలో భాగంగా 20 జంటలను ఎంచుకుంది. జంటల్లోని మహిళలంతా వేడి నీరు ప్రవహిస్తున్న గొట్టాలను పట్టుకునేలా శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు. అనంతరం వారి భాగస్వాములను పక్కనే ఉంచి భిన్న పరిస్థితుల్లో మహిళల నొప్పి స్థాయిలను తెలుసుకున్నారు. భాగస్వామి చేతిని పట్టుకొని ఉన్నప్పుడు.. వేడి నీటి గొట్టం కారణంగా కలిగే నొప్పి మహిళల్లో సగానికి తగ్గుతున్నట్లు గుర్తించారు. భాగస్వామి పక్కనే ఉన్నప్పటికీ చేతి స్పర్శ లేకపోతే ఈ ప్రభావమేమీ కనిపించడం లేదని స్పష్టం చేశారు. నొప్పిని సులువుగా భరించడానికి తోడ్పడే రసాయనాలు భాగస్వామి స్పర్శతో మెదడులో విడుదలవుతున్నట్లు తాము గుర్తించామని తెలిపారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ ఎన్వీ రమణకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేస్తున్న తితిదే ఈవో అనిల్‌కుమార్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, అరుణ్‌మిశ్రా, కేంద్ర సహాయ మంత్రి సుజనా చౌదరి, ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమరనాథగౌడ పాల్గొన్నారు. ప్రముఖులకు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు. మంత్రి సుజనాచౌదరి కుమార్తె వివాహం అయిన సందర్భంగా నూతన వధూవరులతో కలిసి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమరనాథగౌడ దంపతులు తదితరులు

ఖాతాలో నిధులు జమయితేనే రిజిస్ట్రేషన్ దస్తావేజుల విడుదల

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి చెల్లించే డిమాండ్ డ్రాఫ్ట్(డీడీ)ల విలువ మొత్తం ప్రభుత్వ ఖాతాలో జమయ్యే దాకా రిజిస్ట్రేషన్ దస్తావేజులను విడుదల చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల గుంటూరు జిల్లా రేపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే డీడీని 33 దస్తావేజుల కోసం పునర్ వినియోగించిన అక్రమం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయాన్ని తీసుకుంది. దీని వల్ల డీడీల పునర్ వినియోగంతో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ఈ తరహా కుంభకోణాలు ఎక్కడైనా జరిగాయా అన్న కోణంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రెవెన్యూ శాఖ ప్రత్యేక పరిశీలన నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ ఎక్కడా దుర్వినియోగం అయినట్లు వెల్లడి కాలేదు.

ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్లలో ట్రక్కు టమారం!

- సాఫ్ట్‌వేర్ మారినా తిరుగుడు మామూలే..
- రైతు రథం నమోదులో తీవ్ర జాప్యం
- ఇబ్బంది పడుతున్న రైతులు

ఈనాడు, అమరావతి: రైతు రథం ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్లో జాప్యం వీడటం లేదు. మోటారు ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదని ప్రభుత్వం చెబుతున్నా.. ఇక్కడ మాత్రం వాటికి వెళ్లకుండా పని జరిగే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఈ ఏడాది 12వేలకు పైగా ట్రాక్టర్లు రైతు రథం కింద పంపిణీ చేస్తున్నారు. పథకంలో భాగంగా ట్రాక్టర్ మంజూరైన రైతు రాయితీ మినహాయించి మిగిలిన సొమ్మును చెల్లించి ట్రాక్టర్ తీసుకెళ్లాలి. ఇదే సమయంలో రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేయాలని రవాణాశాఖ ఆదేశించింది. ఇప్పటిదాకా ఇస్తున్న తాత్కాలిక రిజిస్ట్రేషన్ సమయంలో శాశ్వత నమోదు పూర్తి చేసి నంబరు ఇవ్వాలని స్పష్టం చేసింది. సాఫ్ట్‌వేర్ మార్పు పేరుతో వారం రోజుల నుంచి టీఆర్ మంజూరు నిలిపేశారు. సోమవారం నుంచి సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తెచ్చినా దాని గురించి రైతులకు తెలియకపోవడంతో రోజుకు ఒకటి రెండు ట్రాక్టర్లతోనే సరిపెడుతున్నారు.

రవాణా కార్యాలయానికి వెళ్లాల్సిందేనా..: ట్రాక్టర్ కొనుగోలు చేసిన షోరూంలో శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రైతులు మళ్లీ రవాణాశాఖ కార్యాలయం తలుపు తట్టాల్సి వస్తోంది. అక్కడ గతంలో జరిగే తతంగమే జరుగుతోంది. ట్రాక్టర్‌తో పాటే దానికి అనుబంధంగా ట్రక్కు(ట్రాలీ) కూడా అవసరం. దీన్ని మరోచోట తయారు చేయిస్తారు. అక్కడ రిజిస్ట్రేషన్ చేసే సౌకర్యం లేదు. దీంతో రైతులు ట్రాక్టర్ పత్రాలతోపాటు ట్రక్కు కొనుగోలు పత్రాలు కూడా తీసుకుని రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ రెండింటి పత్రాలు చూపి చలానా చెల్లించాలి. తర్వాత మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వచ్చి ట్రాక్టరు, ట్రక్కు చూపి రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోవాలి. అంటే. . కార్యాలయాలకు వెళ్లకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలనే రవాణాశాఖ లక్ష్యం నెరవేరడం లేదు. రైతులకు తిరుగుడు తప్పడం లేదు. ఇక చెప్పేదేముంది.. శాశ్వత సంఖ్య తీసుకోవడంలో జాప్యం మామూలే.

క్యాన్సర్ కణాలే జీవ సూచికలు!

బెంగళూరు: క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో ఔషధాల పనితీరును తెలుసుకునేందుకు. . వారి రక్త ప్రవాహంలోని కొన్ని ప్రత్యేక కణాలు దోహదపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సాధారణంగా క్యాన్సర్ కణాలు శరీరంలో ఓ అవయవం నుంచి మరో అవయవానికి 'మెటాస్టాసిస్(రోగకణ వ్యాప్తి)' అనే విధానంలో చేరుకుంటాయి. ఇందుకు రక్తం, శోషరసాలను మాధ్యమంగా ఉపయోగించుకుంటాయి. ఇలా వేరే అవయవాన్ని చేరుకునేందుకు ప్రవాహ వ్యవస్థల్లోకి చేరిన క్యాన్సర్ కణాలను 'సర్క్యులేటింగ్ ట్యూమర్ సెల్ (సీటీసీ)'లుగా పిలుస్తారు. ఇతర అవయవాల్లోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అవి కొంత కాలం తర్వాత మరణిస్తాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో ఔషధాలు ఎంతమేరకు ప్రభావవంతంగా పని చేస్తున్నాయో తెలుసుకునేందుకు ఈ సీటీసీలు దోహదపడతాయని శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు. వాటిని జీవ సూచికలుగా ఉపయోగించుకుంటూ చికిత్సలో మార్పులు చేయవచ్చునని వివరించారు.

ఈనాడు

భాజపా విజయ దుందుభి

'ఈ శూన్యం తొలగాలి... భాజపా సారథ్యంలో ఈశాన్యం వెలగాలి'- అన్న కమలనాథుల దశాబ్దాల కల ఫలించిన రోజిది. ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లలో పాలన పగ్గాలు చేపట్టిన భాజపా- తాజాగా ఎన్నికలు జరిగిన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లోనూ అక్షరాలా విజయ దుందుభి మోగించింది. 2013నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు రాష్ట్రాల్లోని మొత్తం 180 స్థానాలకుగాను భాజపా గెలవగలిగింది కేవలం ఒక్కటి. అలాంటిదిప్పుడు పాతికేళ్లుగా అగర్తలా అధికారపీఠంపై పాతుకుపోయిన వామపక్ష కూటమి సర్కారును పెకలించి దాదాపు నాలుగింట మూడొంతుల మెజారిటీతో భాజపా కూటమి కాషాయ జెండా ఎగరేయడం పరమాద్భుత పరిణామం. నాగాలాండ్‌లోనూ మిత్రపక్షమైన యునైటెడ్ నాగా డెమొక్రటిక్ పార్టీ (యూఎన్‌డీపీ) దన్నుతో సాధారణ మెజారిటీ సాధించి అధికారానికి నిచ్చెన వేసిన తీరు స్ఫూర్తిమంతం. 1972లో రాష్ట్ర ప్రతిపత్తి పొందిన మేఘాలయ నాటి తొలి ఎన్నికల్లో తప్ప ఎన్నడూ ఏ ఒక్క పార్టీకీ విస్పష్ట మెజారిటీ కట్టబెట్టిన దాఖలాల్లేవు. గత ఎన్నికల్లో 23 సీట్లలో గెలిచిన కాంగ్రెస్- మేఘాలయ యునైటెడ్ అలయెన్స్ పెట్టి, చిన్నా చితకా పార్టీల మద్దతు రాబట్టి అయిదేళ్లు బండి నెట్టుకొచ్చినా, ఈసారి హస్తం పార్టీకి మరో రెండు స్థానాలు కోసుకుపోయాయి. ఈ నేపథ్యంలో కొత్త సమీకరణలతో భాజపా భాగస్వామిగా మరో సంకీర్ణం రేపక్కడ కొలువుతీరినా ఆశ్చర్యం లేదు! రాష్ట్రం చిన్నదా పెద్దదా అన్నది కాదు- విజయం సాధించడమే లక్ష్యంగా, సమగ్ర వికాసమే వాగ్దానంగా, పరాయితనం కనిపించకుండా స్థానిక పార్టీలకు పెద్దవాటా కట్టబెట్టి, సైద్ధాంతికంగా పట్టువిడుపులతో సరైన భాగస్వామ్యాలకు అంటుకట్టి భాజపా సాగిస్తున్న అప్రతిహత జైత్రయాత్ర ఈశాన్యంలోనూ కొత్తపుంతలు తొక్కింది. 'అరుణ'కాంతులతో అస్తమించే సూర్యుడు కాషాయ వర్ణంతో ఉదయిస్తాడంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్య- త్రిపురలో విజయం కమలనాథులకు ఎంత ప్రత్యేకమో విపులీకరిస్తోంది!

యాభయ్యేళ్ల క్రితం రాష్ట్రప్రతిపత్తి పొందిన త్రిపురలో తొలి పదేళ్లూ కాంగ్రెసుదే అధికారం. 1977లో వామపక్ష కూటమి దెబ్బకు దిమ్మతిరిగిన కాంగ్రెస్ 17.7 శాతం ఓట్లు సాధించి కూడా ఏ ఒక్క సీటూ దక్కించుకోలేక నాడు బిక్కమొగమేసింది. తదాదిగా పదేళ్లపాటు నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రిత్వంలో అధికారం నెరపిన వామపక్ష కూటమికి 1988లో కాంగ్రెస్ చేతిలోనే భంగపాటు ఎదురైంది. 1993లో తిరిగి పుంజుకొన్న వామపక్ష కూటమికి దరిమిలా ఎదురన్నదే లేకపోయింది. 33-36 మధ్య ఓట్ల శాతంతో 10-13 నడుమ సీట్లు సాధిస్తూ వచ్చిన కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానానికే అతుక్కుపోయింది. గతంలో జరిగిన పది అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏ ఒక్కసారీ ఒక్క సీటూ గెలవలేకపోయిన భాజపా- ఈసారి గురిచూసి ఏనుగు కుంభస్థలాన్నే కొట్టింది. పదిహేనేళ్లుగా కేవలం ఒకటిన్నర శాతం ఓట్లకే పరిమితం అవుతూ వచ్చిన కమలం పార్టీ ఈసారి ఏకాయెకి 43 శాతం ఓట్లతో చరిత్ర సృష్టించింది. గిరిజనుల్లో పట్టును కోల్పోయే పార్టీ మట్టికరవక తప్పదన్న రాజకీయ గణితాన్ని పూర్తిగా ఆకళించుకొన్న భాజపా- ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో పొత్తు కుదుర్చుకోవడం ద్వారా స్థానిక గిరిజనం దన్ను సంపాదించగలిగింది. రెండు దశాబ్దాలుగా మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిత్వం వహిస్తున్న రాష్ట్రంలో 'చలో పల్టాయ్'(మార్పు తీసుకొద్దాం పదండి) అంటూ నినదించిన భాజపాకు త్రిపుర జనవాహిని అక్షరాలా బ్రహ్మరథం పట్టింది. 'ఓట్లు తగ్గవచ్చేమో గాని మెజారిటీకి ఢోకా ఉండబో'దన్న వామపక్ష కూటమి- కమలకూటమి దెబ్బకు ఓట్లలో భారీగా కోతపడకపోయినా, సీట్లపరంగా 1972నాటి స్థాయికి తిరోగమించింది!

ఉత్తర దక్షిణ ధ్రువాలుగా మోహరించిన భిన్న సైద్ధాంతిక శక్తులైన కుడి (భాజపా), ఎడమ (లెఫ్ట్)ల మొట్టమొదటి ముఖాముఖి పోరుగా త్రిపుర సమరాంగణం జాతీయస్థాయిలో ఆసక్తి రేకెత్తించింది. అవినీతి మకిలంటని ముఖ్యమంత్రిగా, అత్యంత నిరాడంబరుడిగా మాణిక్ సర్కారుకు ఉన్న మంచిపేరు- వామపక్ష కూటమి కంచుకోట బదాబదలు కాకుండా రక్షించలేకపోయింది. సమవాదం, సమాజవాదమే జనస్వామ్య వేదమంటూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా వామపక్షాలు ఎదిగొచ్చిన రోజుల్లో పశ్చిమ్ బంగ, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో వాటికి అపూర్వ ఆదరణ లభించింది. కమ్యూనిస్టు కూటమిని దశాబ్దాలుగా శిరసున మోసినా, ఆదర్శం ఆచరణకొచ్చి సగటుమనిషి జీవనంలో గుణాత్మక మార్పు పొడగట్టకపోయేసరికి 2011లో పశ్చిమ్ బంగ బ్యాలెట్ పెట్టెల్లో నిశ్శబ్ద విప్లవం ప్రభవించింది. తదుపరి ఏడేళ్లకు త్రిపురలోనూ అదే పునరావృతమైంది. అద్భుత మేధోసంపత్తికి చిరునామాగా విరాజిల్లే పశ్చిమ్ బంగ మూడున్నర దశాబ్దాల వామపక్ష కూటమి పాలనలో ఎందుకు గణనీయంగా పురోగమించలేకపోయింది? వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైన త్రిపురను తీసుకొన్నా- పెరుగుతున్న పేదరికం, తక్కువగా తలసరి ఆదాయం, అరకొర మౌలిక వసతులు, అటవీ ఖనిజ సంపదను సరైన రీతిలో వినియోగించుకోలేకపోవడం, పారిశ్రామిక ప్రగతిలో మందగమనం, ఉరుముతున్న నిరుద్యోగం వంటి సమస్యలెన్నో దశాబ్దాలుగా వెంటాడుతున్నాయి. సంపద సృష్టిస్తేనే కదా దాని పంపిణీ సాధ్యపడేది? కాలానుగుణంగా సిద్ధాంతాల్ని మార్చుకొని ప్రజల ఆకాంక్షలకు దీటుగా స్వయం సంస్కరణకు సిద్ధపడకపోబట్టే- వామపక్ష కూటమి ఇలా దారుణ పరాజయాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అభివృద్ధికి పచ్చజెండా ఊపాలంటే, 'ఎర్ర జెండా'ల్ని తొలగించాలన్న ప్రధాని మోదీ మాట మన్నించిన తీరుగా వెలువడిన త్రిపుర ఫలితం- భావి రాజకీయాల్ని ప్రభావితం చేయనుంది!



పీవీ రావు

నగరీకరణకు నిలువెత్తు వ్యూహం

నగరాలు నాగరికతకు జీవనాడులుగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పల్లెల నుంచి నగరాలకు వలస వెళుతున్న ప్రజల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే కిక్కిరిసిన జనాభాతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగరాలకు పోటెత్తుతున్న వలసలు తలనొప్పిగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా విఖ్యాత మౌలిక రంగ నిర్మాణ సంస్థలన్నీ నగర జీవనానికి మెరుగులద్దడం ఎలా అన్న అంశంపైనే కసరత్తు చేస్తున్నాయి. ప్రభుత్వాల బడ్జెట్ పరిమితులను దృష్టిలో ఉంచుకొని, వినూత్న పరిష్కారాలతో ముందుకొస్తున్నాయి. నగరాల విస్తరణలో రవాణా సంక్లిష్టతలు, విద్యుత్తు అవసరాలు, శాంతిభద్రతల పరిరక్షణ, భారీ భవంతులు, ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, సామాజిక సేవలు, నీటివసతి, వ్యర్థాల నిర్వహణ వంటివి పరిగణనలోకి తీసుకోవాల్సిన కీలకాంశాలు. కనిష్ఠ వ్యయంతో, గరిష్ఠ ప్రయోజనదాయకంగా మౌలిక వసతులను ఆవిష్కరించే క్రమంలో అంతర్జాతీయ నిర్మాణ సంస్థలన్నీ నగరాలతో ముడివడిన వివిధ అంశాలను లోతుగా విశ్లేషిస్తున్నాయి. ఆధునిక సవాళ్లకు దీటుగా నగరాలను నవీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఎంత సత్వరం కొలిక్కి వస్తే- అంత త్వరగా నగర భారతానికి ఊరట దక్కుతుంది! పల్లెలనుంచి బారులుకడుతున్న వలసలు అంతకంతకూ పెరుగుతాయని, 2050నాటికి మొత్తం ప్రపంచ జనాభాలో 70శాతం నగరాల్లోనే కుదురుకుంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు మనదేశం ఎట్టి పరిస్థితుల్లోనూ మినహాయింపు కాదు. కాబట్టి పర్యావరణ పరిరక్షణ, ఇంధన అవసరాలపట్ల పూర్తి స్పృహతో కొత్త తరం నగరాల నిర్మాణం నేటి చారిత్రక అవసరం!



జపాన్‌లోని 'గేట్ టవర్ బిల్డింగ్' మధ్యలో రహదారి మార్గం

ఆర్థిక అనివార్యతలను దృష్టిలో ఉంచుకొని, నిర్మాణాత్మక పర్యావరణ విధానాలకు పెద్దపీటవేస్తూ, సరళమైన రవాణా వ్యవస్థలకు రూపుదిద్దుతూ కొత్త తరం నగరాల నిర్మాణం జరగాలి. తమను తాము కొత్త సవాళ్లకు, అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోగల పరిణతి చెందిన ప్రజానీకం భవిష్యత్ నగరాలకు ప్రాణశక్తిగా నిలుస్తుంది. ప్రగతి పథంలో నిటారుగా పైకెగిసి ఒక్కసారిగా కుప్పకూలిపోతే అది సుస్థిరాభివృద్ధి అనిపించుకోదు. భూగోళం పదికాలాలు పచ్చగా ఉండాలంటే పర్యావరణ హితకర సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు పడాలి. నగరాల మధ్య పోటీ కూడా ఆ కోణంలో ఉండాలి. నగరాలకు కొత్తరూపు ఇవ్వడం అంత తేలికైన వ్యవహారం కాదు. ప్రభుత్వ ఖజానాకు ఎన్నో పరిమితులుంటాయి. విస్తరణ క్రమంలో సాంకేతికంగానూ ఎన్నో సమస్యలు తలెత్తవచ్చు. రాజకీయ సంక్లిష్టతల గురించి ఇక చెప్పనే అక్కర్లేదు!

వ్యవసాయ భూములకు ఎసరు

దేశంలో గడచిన కొంతకాలంగా తలపెట్టిన భారీ మౌలిక రంగ ప్రాజెక్టులన్నో భూసేకరణ సమస్యల కారణంగా నిలిచిపోయాయి. భూ పరిహారం విషయంలో లెక్కలేనన్ని వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టులకోసం వ్యవసాయ భూములను సమీకరించడంపై అనేక రకాల అభ్యంతరాలున్నాయి. వీటన్నింటివల్ల ప్రాజెక్టుల పరిపూర్తి అన్నది ఎప్పటికీ తేలని అంశంగా మిగిలిపోతోంది. మరోవంక పచ్చని పంటపొలాలను ప్రాజెక్టుల పేరిట సమీకరిస్తూ పోతే అనేక దుష్ప్రభావాలు తలెత్తి, ఆహార భద్రత ప్రమాదంలో పడవచ్చు కూడా! జనాభా పెరుగుతోంది, భూ వనరులు తరుగుతున్నాయి. ఈ పరిస్థితి అభివృద్ధి ప్రాజెక్టులు నెత్తికెత్తుకునేందుకు ప్రభుత్వాలకు అడ్డంకిగా మారింది. భారీ నిర్మాణాలు, భవనాలకోసం చెట్లను ఎక్కడికక్కడ అడ్డంగా నరికేయడమూ సరికాదు. ఎందుకంటే భవంతులను ఎక్కడైనా, ఎలాగైనా కట్టుకోవచ్చుగాని- మొక్కలను మాత్రం భూమ్మీదే నాటాల్సి ఉంటుంది! అటుచూస్తే పర్యావరణం..ఇటుచూస్తే అభివృద్ధి! మరేం చేయాలి? మేధకు పదును పెట్టి, వినూత్న ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సిన సందర్భమిది. సాగులో లేని బీడు భూములను మాత్రమే అభివృద్ధి ప్రాజెక్టులకోసం వినియోగించాలి. అత్యాధునిక నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మౌలిక సౌకర్యాలను విస్తరించాలి. వందల ఎకరాల్లో విస్తరించే ప్రాజెక్టులపై ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం అనవసరమైన మోజు పెంచుకున్నాయి. ఇంతటి భారీ వ్యవస్థలను నిర్వహించడం చాలా కష్టం. కొత్త తరం నగరాలకు ఈ నమూనా సరికాదు. చిన్న చిన్న విస్తీర్ణాల్లో విస్తరించే ప్రాజెక్టులవల్ల ఎన్నో సానుకూలతలున్నాయి. కొత్త తరం నగరాల ప్రణాళికల రూపకల్పన, అమలు, నిర్వహణకు చిన్న ప్రాజెక్టులే సౌలభ్యంగా ఉంటాయి. దేశవ్యాప్తంగా వేల కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. ఈ రహదారులను ఉపయోగించుకుంటూ వాటి మీదుగా భవనాలను నిర్మిస్తే డబ్బు, సమయం రెండూ కలిసి వస్తాయి. జాతీయ రహదారులను కేంద్రంగా చేసుకొని మౌలిక సౌకర్యాలు విస్తరిస్తే ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ముఖ్యంగా భూ సేకరణ సమస్యలనుంచి బయటపడవచ్చు. తద్వారా వ్యాపార, వాణిజ్య ప్రాజెక్టుల పేరిట పచ్చని పొలాలు హరించుకుపోకుండా అడ్డుకుని ఆహార భద్రతను సాకారం చేయడానికి వీలవుతుంది. హైవేలపై నిర్మాణాలవల్ల రవాణా సౌకర్యం సులభంగా అందుబాటులోకి వస్తుంది. ప్రయాణ సమయం చాలావరకు తగ్గుతుంది. తద్వారా చమురు ఖర్చుకు కోత పడుతుంది. మరీ ముఖ్యంగా బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రస్తుత నగరాల్లో వాహనాల సంఖ్య లెక్కకు మిక్కిలిగా పెరుగుతోంది. ఈ వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించడం ప్రభుత్వాలకు, ప్రైవేటు సంస్థలకు తలకుమించిన భారంగా మారుతోంది. కాబట్టి, వివిధ అంతస్తుల్లో నిర్మించే స్వయంచాలిత పార్కింగ్ సదుపాయాలు నగరాలకు వరంగా మారతాయి. జాతీయ రహదారులపై ఈ బహుళ అంతస్తుల పార్కింగ్ నిర్మాణాలు చేపట్టాలి. సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలు, మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య భవనాలు, వైద్యశాలలు వంటివి ఈ సదుపాయాలను వినియోగించుకోవచ్చు. నగరాలపై వాహన భారం తగ్గుతుంది. ఆకర్షణీయ నగరాలు (స్మార్ట్ సిటీస్), తక్కువ భూభాగంలో శివార్లలో 'శాటిలైట్ సిటీస్' వంటివాటిని భవిష్యత్తు నగరాలకు ప్రాతిపదికలుగా పరిగణిస్తున్నారు. బహుళ అంతస్తుల స్వయంచాలిత పార్కింగ్ సౌకర్యాలు ఉంటే తప్ప కొత్త తరం నగరాలు విజయవంతం కావు. జాతీయ రహదారులపై పార్కింగ్ వ్యవస్థల నిర్మాణం సులభం. అనుమతులకూ కష్టపడనవసరం లేదు. నిధుల కేటాయింపునకు సంబంధించి చకచకా నిర్ణయాలు వెలువరించడానికి ఆస్కారముంటుంది. ఈ తరహా పార్కింగ్ సదుపాయాలవల్ల కొత్త కొత్త ప్రాంతాల్లో ప్రజాసముదాయం ఒకచోట చేరడానికి, జాతీయ రహదారి వెంబడి కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపునకు ఆస్కారం ఏర్పడుతుంది. స్వర్ణ చతుర్భుజి పేరిట మాజీ ప్రధాని వాజ్‌పేయీ జమానాలో జాతీయ రహదారుల విస్తరణకు అద్భుతమైన కార్యక్రమం అమలు చేశారు. ఉత్తర, దక్షిణ; తూర్పు, పశ్చిమ జాతీయ రహదారులను మెరుగ్గా అనుసంధానించేందుకు వాజ్‌పేయీ జమానాలో విశేషమైన కృషి జరిగింది. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా వంటి కీలక మెట్రో నగరాలను కలిపే జాతీయ రహదారులను నాలుగు వరసల బాటలుగా అభివృద్ధిపరచారు. వీటితోపాటు దేశంలోని మరికొన్ని జాతీయ రహదారులనూ నాలుగు నుంచి ఆరు వరసల బాటలుగా తీర్చిదిద్దారు. దేశంలో రవాణా సదుపాయాలను నాణ్యంగా విస్తరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం ఆనాడే గుర్తించింది అనడానికి తార్కాణాలివి.



- వలసలు తెచ్చే సమస్యలకు పరిష్కారం
- ప్రణాళికలకు కొత్త రూపురేఖలు
- పరిమిత విస్తీర్ణంలో సకల సౌకర్యాలు
- భూమి కొరతకు ప్రత్యామ్నాయ మార్గం
- బహుళార్థ సాధకాలుగా రహదారులు
- వ్యవసాయ భూముల పరిరక్షణకు అవకాశం

జపాన్ ఆదర్శం

అభివృద్ధి పథంలో జాతీయ రహదారులను కలుపుతూ రవాణా అనుసంధానం చాలా కీలకం. పరిమిత వనరులతో అపరిమిత ప్రయోజనాలు పొందే విషయంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు జపాన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడి ఒసాకా నగరంలోని ఫుకుషిమ-కు ప్రాంతంలో నిర్మించిన 16 అంతస్తుల 'గేట్ టవర్ బిల్డింగ్' ఇంజినీరింగ్ అద్భుతానికి తార్కాణంగా నిలుస్తోంది. ఆ భవనంలోని అయిదు, ఏడు అంతస్తుల నుంచి జాతీయ రహదారి వెళ్లే ఏర్పాటు ఉండటం విశేషం. ఈ భవనంలోని నాలుగు, ఎనిమిది అంతస్తుల్లో తప్ప మిగిలిన అన్ని చోట్లా 'ఎలివేటర్' నిలిపే సౌకర్యం ఉంది. జాతీయ రహదారి ప్రభావం భవనంపై బొత్తిగా లేకుండా సాంకేతికపరంగా గట్టి ఏర్పాట్లు చేశారు. వాహనాల రొద, కుదుపుల ప్రభావం పడకుండా భవనానికి, జాతీయ రహదారికి మధ్య సురక్షిత కవచం ఏర్పాటు చేశారు. భవనంపైన హెలీప్యాడ్ సౌకర్యం కూడా కల్పించారు. జాతీయ రహదారుల గుండా ఎత్తయిన బహుళ అంతస్తుల భవంతుల నిర్మాణానికి అనువుగా జపాన్ ప్రభుత్వం ఇటీవల భవన నిర్మాణ చట్టంలో పాక్షిక సవరణలు తీసుకువచ్చింది. అమెరికా (న్యూయార్క్, ఇల్లినాయిస్, టెక్సాస్), యునైటెడ్ కింగ్‌డమ్, ఇటలీ వంటి దేశాల్లోనూ ప్రభుత్వ కార్యాలయ భవనాలు, వాణిజ్య విభాగాలు, పార్కింగ్ సదుపాయాలను జాతీయ రహదారులపై నిర్మిస్తున్నారు. జాతీయ రహదారులపై నిర్మాణాలు అటుఇటుగా హైదరాబాద్, దిల్లీ, బెంగళూరు, చెన్నైలలోని మెట్రో రైల్వేస్టేషన్లను తలపిస్తాయి! ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అత్యాధునిక మౌలిక సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నాయి. అమరావతిని అత్యాధునిక రాజధాని నగరంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ సర్కారు భావిస్తోంది. పరిమిత వనరులతో అపరిమిత ప్రయోజనాలు సాధించే దిశగా చంద్రబాబు సర్కారు ప్రణాళికలు రచించాలి. మరోవంక జిల్లాల్లో కలెక్టర్ ఆఫీసు అన్ని ప్రభుత్వ కార్యాలయాలనూ ఒకే సముదాయంలో ఏర్పాటు చేసే దిశగా కేసీఆర్ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ భారీ ప్రభుత్వ సముదాయాలకు వచ్చే వాహనాలను నిలిపేందుకు బహుళ అంతస్తుల స్వయంచాలిత పార్కింగ్ భవనాలను నిర్మించవచ్చు. అందుకోసం ఆయా కార్యాలయ సముదాయాలకు దగ్గర్లోని జాతీయ రహదారులను ఎంపిక చేసుకోవచ్చు!

నిజాయతీకి ఇదీ నజరానా!

నీతికి నిలువెత్తు రూపుగా మెలిగే నిజాయతీపరులైన అధికారులకు, మాయదారి నేతాగణాల భ్రష్ట రాజకీయానికి చుక్కెదురు. స్వభావరీత్యా వాళ్లు తలవంచరు, స్వార్థమే అజెండాగా వీళ్లు దేనికీ వెనకాడరు. పర్యవసానంగా, నిష్ఠగా విధ్యుక్తధర్మం నిర్వర్తించేవారికి అహేతుక దండన పర్వాలు నయాభారతంలో ఆనవాయితీగా చోటుచేసుకుంటున్నాయి. అందులో తాజా ప్రహసనం ఎవరినైనా విస్మయపరచక మానదు. మీరే పరికించండి...

ఆయన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి. నిజాయతీకి, ముక్కుసూటి వ్యవహార సరళికి మారు పేరు. నామధేయం ప్రదీప్ కాస్నీ. హరియాణా పాలన సంస్కరణల విభాగ కార్యదర్శిగా 2014 జులైలో ఆ రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాల్ని తూర్పారపట్టినప్పుడు ప్రదీప్ కాస్నీ పేరు దేశమంతా మార్మోగింది. నాలుగు రోజుల క్రితం పదవీ విరమణ చేయడానికి ముందు 34 ఏళ్ల సర్వీసులో 71సార్లు బదిలీ కావడం ఆయనకు దఖలుపడిన అసాధారణ ప్రత్యేకత. గత ఆగస్టులో చివరిసారి ప్రదీప్ బదిలీ అయింది హరియాణా భూ వినియోగ మండలికి. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించడానికి వెళ్తే అక్కడ సిబ్బంది లేరు, ఫైళ్లు లేవు. అసలు సంగతేమిటని విచారించి ప్రయోజనం లేక సమాచార హక్కు చట్టం కింద అర్జీ పెడితే వెల్లడైనదేమిటంటే- ఆ కార్యాలయం ఏనాడో 2008లోనే మూతపడిందని. ఉనికే లేని బోర్డుకు అధికారిగా ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన ఫిర్యాదు రేపు ఎనిమిదో తేదీన కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఎదుట విచారణకు రానుంది. ఆరు నెలలుగా జీతభత్యాలకూ నోచుకోని ప్రదీప్, విధుల నుంచి వైదొలగిన తరవాతా తన పోరాటం కొనసాగిస్తానంటున్నా- ఏ మేరకు న్యాయం దక్కుతుందో ఎవరూ చెప్పలేని దుస్థితి నెలకొంది.

హరియాణా పదో ముఖ్యమంత్రిగా 2014 అక్టోబరులో అధికార బాధ్యతలు స్వీకరించిన మనోహర్ లాల్ ఖట్టర్- పాలనలో పారదర్శకతకు, అవినీతిపై పోరాటానికే పెద్దపీట వేస్తామని సెలవిచ్చారు. కుర్చీ ఎక్కిన దరిమిలా బాణీ మారిపోయింది. ఖట్టర్ ఏలుబడిలోనే ప్రదీప్ కాస్నీకి డజనుకు పైగా బదిలీలు వచ్చిపడ్డాయి. ఒక్క 2016 సెప్టెంబరులోనే మూడుసార్లు! రెండేళ్ల గడువు ముగియకుండా ఏ అధికారినీ ఉన్నచోటునుంచి కదపబోమన్న ముఖ్యమంత్రే సుమారు మూడేళ్లలో సగటున ప్రతి మూడు నెలలకోసారి ప్రదీప్‌ని బదిలీ బంతాట ఆడుతూ ఇక్కడికీ అక్కడికీ తిప్పడంలో లోగుట్టు అందరికీ తెలిసిన కథే. ఇన్నేళ్లలో ఏ ప్రభుత్వమూ ఫలానా కారణంతో ఇంకోచోటుకు పంపిస్తున్నట్లు చెప్పనేలేదంటున్న ఆయన మాటల్లోనే- 'ఏ సర్కారో మంత్రో ఒక ఫైలుపై ఎలా స్పందించాలో సూచిస్తే నాలాంటివాళ్లు భిన్నంగా స్పందిస్తారు... ఆ సాయంత్రానికే బదిలీ ఉత్తర్వులు వచ్చేస్తాయి'! అసలు ఐఏఎస్ అధికారుల బదిలీ పరిశ్రమకు, హరియాణాకు ఏదో అవినాభావ సంబంధం ఉంది. తమ ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో నలభైసార్లకు పైగా బదిలీ అయినవారి జాబితా రాయబోతే, అందులో ఎక్కువమార్లు హరియాణా అధికారుల పేర్లే చోటుచేసుకుంటాయి. అశోక్ ఖేమ్కా, కేశ్నీ ఆనంద్ అరోరా, తిర్లోక్ చంద్ గుప్తా, రూప్‌రామ్ జోవెల్, రామీందర్ సింగ్ గుజ్రాల్, సంజయ్ కొఠారీ, రాజ్ రూప్ ఫులియా ప్రభృతులు ఆ కోవకే చెందుతారు.

లోగడ అడ్డగోలు లైసెన్సుల సంతర్పణ మాటున సోనియాజీ అల్లుడి భూ లావాదేవీల్లో కోట్లకు కోట్లు చేతులు మారాయని హరియాణా ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టిన ధీరుడు ఖేమ్కా. హుడా జమానాలో ఏకాయెకి మూడున్నర లక్షల కోట్ల రూపాయల మేర అవకతవకలు పెచ్చరిల్లాయని, వాటిపై లోతుగా విచారణ జరిపించాలని పట్టుపట్టిన ఐఏఎస్ అధికారి ఖేమ్కాకు నజరానాగా నాటి హరియాణా సర్కారు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆయనను విత్తనాభివృద్ధి సంస్థకు బదిలీ చేయగా, అక్కడా అవినీతి ఒప్పందం చీడను పసిగట్టి నేరుగా కేదస తలుపు తట్టిన ఖేమ్కాను సైతం తరచూ బదిలీలు వెన్నాడాయి.



పుణ్యభూమి

యూపీఎస్సీ ద్వారా ప్రతిష్ఠాత్మక సివిల్ విభాగాలకు ఎంపికై కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తిచేసినవారిపై ఆమధ్య ఒక అధ్యయనం చేపట్టారు. వారిలో 68 శాతం అధికారులు కుదురుగా ఒకచోట పనిచేసిన సగటు కాలం ఏడాదిన్నర, అంతకు లోపేనంటున్న గణాంకాలు- విచ్చలవిడి బదిలీల వైపరీత్యాన్ని కళ్లకు కట్టేవే. హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కి చెందిన వినీత్ చౌదరి ముప్పై ఒక్కేళ్ల సర్వీసులో 52 బదిలీలు చూశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విన్‌స్టన్ మార్క్ సైమన్ పరియత్, కుసుమ్‌జిత్ సిద్ధు తదితరులు ఇంచుమించు అయిదు పదుల బదిలీలతో రికార్డులకెక్కారు. నిబంధనల్ని తుంగలో తొక్కి పాలక శ్రేణులు ఈ స్థాయిలో యథేచ్ఛగా చలాయించుకోవడం ద్వారా అవినీతికి నిర్లజ్జగా రక్షరేకులు కడుతున్నాయి!

జాతి ప్రయోజనాల పరిరక్షణే ఏకైక దీక్షగా సివిల్ సర్వీస్ అధికారులు చట్టానికి తప్ప మరి దేనికీ ఎవరికీ అణిగిమణిగి ఉండనక్కర్లేదని ఎందరో రాష్ట్రపతులు, ప్రధానులు ఉద్బోధించారు. నిజాయతీ, నిష్పాక్షికత, ప్రతిభలకు దేశీయ సివిల్ సర్వీసులు నెలవులై వర్ధిల్లాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటివారు ప్రగాఢంగా అభిలషించారు. ఏరికోరి నిబద్ధతగల ఉద్యోగిస్వామ్యాన్ని కొలువుతీర్చాలని సంకల్పించిన ఇందిర ఏలుబడి, బతకనేర్చిన బ్యూరాక్రసీకి స్వయంగా ఓనమాలు దిద్దించింది. లొంగిరానివారిని, వంగి సలాములు కొట్టనివారిని బదిలీలతో వేధించే మహామంత్రోపదేశానికి నాడు అలా పుణ్యం కట్టుకున్న దరిమిలా- తరతమ భేదాలతో దేశం నలుమూలలా రుజాగ్రస్త లక్షణాలు వేగంగా ప్రబలాయి. నిజాయతీ, నిబద్ధతలతో విధులు చక్కబెట్టాల్సిన ఏ పదవికీ అర్హుడు కాదని గతంలో షా కమిషన్ సూటిగా అభిశంసించిన 1969 బ్యాచ్ ఐఏఎస్ అధికారి నవీన్ చావ్లాను యూపీఏ సర్కారు ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా ప్రతిష్ఠించేంతగా ప్రమాణాల పతనం పెచ్చరిల్లింది. అలా అధినాయకులకు పాదాక్రాంతులై పబ్బం గడుపుకోవడం చేతకాని నిబద్ధ ఐఏఎస్‌ల వీపున బదిలీల కొరడా మాటిమాటికి ఛెళ్లుమంటోంది!



ప్రదీప్ కాస్నీ | అశోక్ ఖేమ్కా | అన్షు ప్రకాశ్

మొన్నీమధ్య కేరళలో అనుపమ అనే యువ ఐఏఎస్ అధికారిపై- చెరువును ఆక్రమించి రిసార్ట్ నిర్మించిన అమాత్యుడొకరి భూదాహాన్ని రుజువులతో నిరూపించిన పనితనానికి ప్రతిఫలంగా, బదిలీ వేటుపడింది. పుష్కరం క్రితం బిహార్‌లోని సివాన్, గోపాల్‌గంజ్ జిల్లా మేజిస్ట్రేట్లుగా అనిల్, పాఠక్‌ల ద్వయం నేర-రాజకీయ భుజబలులపై ఛర్నాకోలా ఝుళిపించి పురస్కారంగా బదిలీలు పొందారు. ఇటువంటి ఉదంతాలు లెక్కకు మిక్కిలి.

తమలో కొంతమంది బేషరతుగా తోడ్పాటు అందిస్తున్నందువల్లే రాజకీయ అవినీతి పెచ్చరిల్లుతోందని 2010లోనే సివిల్ సర్వీస్ అధికారుల సర్వే నిగ్గుతేల్చినా- గాడి తప్పినవాళ్లు ప్రత్యేక వెసులుబాట్లతో సంతృప్తి చెందుతుండటం ఆగలేదు. అదే లోకువగా ప్రతి అధికారినీ చెప్పుకింద తేలులా తొక్కిపట్టే కళాప్రావీణ్య ప్రదర్శన ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతోంది. దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షుప్రకాశ్‌పై 'ఆప్' ఎమ్మెల్యేలు ఇటీవల భౌతిక దాడికి పాల్పడిన దరిమిలా- తిట్టం కొట్టం అంటేనే బడ్జెట్ సమావేశాల ఖరారుకు హాజరవుతానంటూ ఆయన ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు రాసిన లేఖ నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతుంది!

మంచిచేసే అధికారులకు జనం గుండెల్లో గుడి కడతారనేందుకు సగాయం (తమిళనాడు), చంద్రకళ (యూపీ), ఎస్సార్ శంకరన్ (ఆంధ్రప్రదేశ్), రజనీ శేఖరీ సిబల్ (హరియాణా) తదితరులు సాధించుకున్న విశేష గుర్తింపు, పొందిన అవ్యాజ ఆదరాభిమానాలే రుజువులు. సివిల్ సర్వీస్ అధికారులు నిర్భయంగా పనిచేయాలంటూ కేంద్ర హోం మంత్రి పది రోజుల క్రితం పిలుపిచ్చారు. వాస్తవంలో, నిజాయతీగా నిర్భీకతతో పనిచేయగల వాతావరణ పరికల్పనకై ఏమేమి చర్యలు చేపట్టాల్సి ఉందో గుదిగుచ్చిన హోతా కమిటీ సిఫార్సులపై సాలీళ్లు గూళ్లు కడుతున్నాయి.

టునీసియాలో 'జాస్మిన్ విప్లవం,' పశ్చిమాసియాలో ఉత్తరాఫ్రికాలో అరబ్ జాగృతికి కర్త కర్మ క్రియ అక్కడ వెల్లువెత్తిన జనాగ్రహమే. ఇక్కడా ఈ దశలో నిజాయతీపరులైన అధికారులకు బాసటగా నిలవాల్సిందీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేలా పాలకశ్రేణిపై ఒత్తిళ్లు పెంచాల్సిందీ ప్రజానీకమే. పౌరుల నైతిక తోడ్పాటు- పాలనలో నిష్పాక్షికతను నిలబెట్టడానికి, అవినీతిని కొరత వేయడానికి జీవ ఇంధనమవుతుంది. ఏ అధికారిని తొలగించి మరెవరిని అక్కడ నియమించినా నిబంధనల అనుసారం వైఖరిలో మార్పుండదని నిర్ధారణ అయితే బదిలీలు, వేధింపుల ఆయుధం ఏనాడో తుప్పుపట్టిపోయేది. అలా కాకపోవడానికి కారణాలేమిటో ఐఏఎస్ అధికారులూ ఆత్మశోధన చేసుకోవాలి. ఏమంటారు?

– బాలు

వివాహ వేడుక

'మనిషి జీవితం భగవంతుడిచ్చిన వరం' అనేందుకు దాంపత్య వ్యవస్థ ఓ ఉదాహరణ. పెళ్లిచూపులతో పరిచయం, నిశ్చయ తాంబూలాలు ఇచ్చిపుచ్చుకోవడం, శుభలేఖలు పంచడం... వీటన్నింటితో వేడుకకు సమాయత్తం కావడం మరువలేని ఘట్టం.

దాంపత్య జీవనం సృష్టి ధర్మం. విచక్షణ గల ప్రాణిగా మనిషి సంస్కారవంతమైన జీవితం గడపాలి. అదే కర్తవ్యంగా భావించి అందులోనే సుఖం, శాంతి పొందాలి. అందుకే వివాహాన్ని 'సంస్కారం' అంటారు.

జీవరాశులే ప్రకృతి గతికి ప్రధానం. ఈ ప్రక్రియ నిరాఘాటంగా కొనసాగడానికి ప్రకృతే దోహదపడుతుంది. మనోధర్మాలతో స్త్రీ, పురుషుల మధ్య కలిగే పరస్పర ఆకర్షణకు మూలం ప్రకృతి. ఇదే మార్గాన్ని పరమార్థ సాధనకు ఉపయోగించుకుంటుంది కల్యాణం. సంతతి పొందడానికి సంస్కారబద్ధమైన ఏర్పాటు గృహస్థాశ్రమమే! నాలుగు ఆశ్రమ ధర్మాల్లోనూ ఇదే అత్యంత ఉత్తమమని పెద్దల మాట. దీని పవిత్రతను కాపాడటానికే దంపతులకు నియమాలు ఏర్పాటయ్యాయి. కన్యను స్వీకరించిన వరుడు- ధర్మార్థ కామ మోక్షాల్లో ఆమెనే అనుసరిస్తానంటాడు. నియమాల్ని అతిక్రమించనని, సత్కర్మాచరణ సాగిస్తానని ప్రమాణం చేస్తాడు.

వధూవరులు ఒకరి తలపై మరొకరు జీలకర్ర, బెల్లం పెట్టుకుంటారు. 'నా జీవనానికి హేతువైన ఈ మాంగల్యాన్ని ధరింపజేస్తున్నాను. నిండు నూరేళ్లూ సుమంగళిగా జీవించు' అంటూ మెడలో తాళి కడతాడు. ఒకరి తలపై మరొకరు ఒద్దికగా తలంబ్రాలు పోసుకుని, కంకణాలు కట్టించుకుని, బ్రహ్మముడి వేయించుకుంటారు. పాణిగ్రహణం తరవాత ఉభయులూ సహవాసులై అగ్నిచుట్టూ ఏడడుగులు నడుస్తారు. అరుంధతీ నక్షత్ర దర్శనంతో పెళ్ళి క్రతువు పూర్తవుతుంది. ఆ జంట అర్ధనారీశ్వరుల్లా ఏకరూపం పొందుతారు.

ఇద్దరూ వ్రతాలు నిర్వహిస్తారు. అనంతర కాలంలో- శిశువును ఉయ్యాలలో వేయడం, నామకరణం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలన్నింటినీ బంధుమిత్రుల సమక్షంలో కనువిందుగా నిర్వర్తిస్తారు. పిల్లలు పెరిగి ప్రయోజకులయ్యాక, సహస్ర చంద్రోదయం వంటి ఉత్సవాల్ని మనవలు, మనవరాళ్ల నడుమ ముచ్చటగా చేసుకుంటారు.



అంతర్వాణి

ఏ వయసుకు తగ్గట్లు ఆ వేడుక ఉంటుంది. అది జీవన మధురిమను పెంచుతుంది. దంపతులకు అపరిమిత ఆనందం కలిగిస్తుంది. అదే ఆహ్లాదాన్ని కుటుంబసభ్యులందరికీ పంచుతుంది. షష్టిపూర్తి వంటివి ఎన్నో అనిర్వచనీయ అనుభూతుల్ని ప్రసాదిస్తాయి. సంతృప్తి, సంతోషం- రెండింటినీ అవి ద్విగుణీకృతం చేస్తాయి. దాంపత్య జీవితాన్ని ఎంతో అర్థవంతంగా మలుస్తాయి.

పెళ్లంటే ఒకప్పుడు అయిదు రోజుల వేడుక. అన్ని రోజులూ పెళ్లివారిల్లు మామిడి తోరణాలు, పందిళ్లు, బంధువుల విందులు వినోదాలతో కళకళలాడుతుండేది. రోజులు, పరిస్థితులు చాలావరకు మారిపోయాయి. జీవన విధానంలో అనేక మార్పుచేర్పులు చోటు చేసుకుంటున్నాయి. జీవితంలో అతి వేగం వివాహ వేడుకను సైతం యాంత్రికంగా మారుస్తోంది. ఇంటికి ఒక్కరు అన్నట్లు ఆ ముహూర్త సమయానికి వెళ్లడం, అంతే వేగంగా తిరిగి ఇంటిముఖం పట్టడం పరిపాటి అవుతోంది. పెళ్లిపందిరి వద్ద పట్టుమని పది నిమిషాలైనా గడిపే పరిస్థితి చాలాచోట్ల లేదు.

ఊరంతా ఒక కుటుంబమై సీతారాములు లేదా శివపార్వతుల కల్యాణ వేడుకల్ని ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా చేస్తుంటారు. ఒళ్లంతా కళ్లు చేసుకొని తనివితీరా చూస్తుంటారు. అదీ పెళ్లి కళ అంటే!

బంధుమిత్రుల ఇళ్లలో పెళ్లికి వెళ్లినవారు అక్కడ అందరినీ పలకరించడం, పదిమందితోనూ కలివిడిగా ఉండటమే మనసుకు పత్రహరితం అద్దుతుంది.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఇళ్లకు లబ్ధిదారులేరీ?

- ఎంపికలో జాప్యంతో పనులపై ప్రభావం
- బ్యాంకుల నుంచి రుణాలకు అడ్డంకి
- పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ ఇళ్ల పరిస్థితి

ఈనాడు - అమరావతి

ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై), ఎన్టీఆర్ నగర్ పేరుతో పట్టణ ప్రాంత పేదల కోసం భారీగా ఇళ్లు నిర్మిస్తున్నా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మూడు విడతలుగా కేంద్రం కేటాయించిన 4.81 లక్షల ఇళ్లలో 4.60 లక్షల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిలో 3 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు 98 పట్టణాల్లో ప్రారంభమయ్యాయి. 1.30 లక్షల మంది లబ్ధిదారులను అధికారులు ఇప్పటివరకూ ఖరారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. అత్యధిక జిల్లాల్లో రాజకీయ జోక్యంతో లబ్ధిదారుల జాబితాల ఖరారుపై కమిషనర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో అనర్హులని తేలిన కుటుంబాల



పేర్లను జిల్లా కమిటీ ఆమోదానికి పెట్టాలని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో కొందరు ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరగడంతో కమిషనర్లు లబ్ధిదారుల జాబితాలు ఖరారు చేయలేకపోతున్నారు. శ్రీకాకుళం,. విజయనగరం, కడప, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లోగల కొన్ని పురపాలక సంఘాల్లో మూడు కేటగిరీల్లో నిర్మిస్తున్న ఇళ్లలో ఏ కేటగిరీ ఇంటిని ఎంపిక చేసుకోవాలో లబ్ధిదారులు తేల్చుకోపోవడంతో ఎంపిక కొలిక్కి రావడం లేదు.

లబ్ధిదారుల ఎంపికలో జాప్యంతో బ్యాంకుల నుంచి రుణాలు నిలిచిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల

పీఎంఏవై, ఎన్టీఆర్ నగర్‌లో వివిధ కేటగిరీల్లో నిర్మిస్తున్న ఇళ్ల విస్తీర్ణం, యూనిట్ విలువ, లబ్ధిదారుల వాటా...

కేటగిరీ (చదరపు అడుగుల్లో)	ఇంటి విలువ (రూ.లక్షల్లో)	లబ్ధిదారుల వాటా
300	6.50	2.65
365	7.50	3.65
430	8.50	4.65

సాయంతోపాటు ఎంపిక చేసుకున్న ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ బ్యాంకు రుణం తీసుకోవాలి. ఇందుకోసం సమ్మతించిన కుటుంబాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం నుంచి పురపాలక సంఘాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముందు కొచ్చిన వారందరి తరపున ఇంటి నిర్మాణ స్థలంపై హామీతో రుణాలిచ్చేందుకు నాలుగైదు జాతీయ బ్యాంకులు ముందుకొచ్చాయి. కానీ 3.65 లక్షల మంది లబ్ధిదారుల ఎంపిక నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

నటి శ్రీదేవి అస్థికలు రామేశ్వరంలోని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తమిళనాడుకు తీసుకొచ్చారని సమాచారం. అస్తికలను భర్త బోనీకపూర్ శుక్రవారం చెన్నై తీసుకొచ్చారని తెలిసింది. శనివారం రామేశ్వరానికి బయలుదేరి వెళ్లారని సమాచారం. అక్కడి సముద్రంలో నిమజ్జనం చేసినట్టు తెలిసింది.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

రాజకీయేతర ఐకాస డిమాండు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని ఏపీ రాజకీయేతర ఐకాస కేంద్రాన్ని డిమాండు చేసింది. శనివారమిక్కడ ఏపీ రాజకీయేతర ఐకాస, ప్రత్యేకహోదా సాధన సమితి (దిల్లీ), నవ్యాంధ్ర విద్యార్థిఐకాస, ఏపీ నిరుద్యోగ పోరాటసమితి, ఏపీ భవన్ ఉద్యోగులు సంయుక్తంగా శనివారమిక్కడ ఏపీ భవన్‌లో ఆందోళన నిర్వహించారు. రాజకీయేతర ఐకాస ప్రధాన కార్యదర్శి మెండు చక్రపాణి, అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు, ప్రత్యేకహోదా సాధన సమితి (దిల్లీ) కన్వీనర్ బాలకోటేశ్వర్‌రావు, కోకన్వీనర్ లింగరాజు, సుప్రీంకోర్టు న్యాయవాది గల్లా సతీశ్ తదితరులు మాట్లాడారు. విభజన బిల్లు హామీల మేరకు రాష్ట్రానికి 10 సంవత్సరాలు ప్రత్యేకహోదా, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేకప్యాకేజీ, రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయాలి: గిడుగు రుద్రరాజు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోసం జాతీయ స్థాయిలో పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ఏపీ పీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు అన్నారు. శనివారమిక్కడ మీడియాతో మాట్లాడారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండు చేస్తూ ఈ నెల 5న ప్రధానమంత్రి మోదీ, ఏపీ సీఎం చంద్రబాబులపై పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. 6, 7 తేదీల్లో ఆత్మగౌరవ దీక్ష చేపడతామన్నారు. మార్చి 8న వందలాది మంది కాంగ్రెస్ నేతలతో పార్లమెంటు ముట్టడి చేపడతామన్నారు. 9న ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఏపీ ప్రజలను మోసం చేసిన భాజపా, తెదేపాల గుర్తింపు రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మన్యంలో మరో 'చావురాయి'!

- గత ఏడాది తరహాలో మృత్యునాదం
- నెల వ్యవధిలో ఒకే పంచాయతీ పరిధిలో 8 మంది మృతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలో మరోసారి మృత్యు ఘంటికలు మోగాయి. మారుమూల కానివాడ పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో విషజ్వరాల బారినపడి నెల వ్యవధిలోనే ఎనిమిది మంది మృత్యుఒడికి చేరారు. రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి ఓ వ్యక్తి సమాచారం ఇచ్చే వరకు ఈ విషయం బాహ్య ప్రపంచానికి తెలియలేదు. ఈ ప్రాంతంలో ఇటీవల ఫైబర్‌గ్రిడ్ సేవలు అందుబాటులోకి రావడంతో అక్కడి ల్యాండ్‌ఫోన్ నుంచి గ్రామస్థుడొకరు ఎమ్మెల్యేతో మాట్లాడి.. పరిస్థితి తీవ్రతను వివరించారు. ఈ క్రమంలో ఆమె శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. జ్వరాలతో బాధపడుతూ సరైన వైద్యం అందక ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు గ్రామస్థులు చెప్పారు. మృతుల్లో ఊట్లబంద గ్రామానికి చెందిన పల్లాల పండురెడ్డి(50), గున్నమ్మ(40), తెల్లమ్మ (30), కొమ్మిరెడ్డి (70), చిన్నమ్మి (70), పెద్దమళ్ల గ్రామానికి చెందిన కురసారెడ్డి (40), పాప (2), గొప్పులతోటమామిడి గ్రామానికి చెందిన సందుల కామేశ్వరరెడ్డి (30) ఉన్నారు. ఎమ్మెల్యే పర్యటన విషయం తెలుసుకున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది స్పందించి



వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ఆయా గ్రామాల్లోకి వెళ్లి బాధితుల వివరాలు సేకరించారు. వారికి వైద్య సేవలు అందజేశారు. ఎనిమిది మందిని రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

గత ఏడాది మేలో ఇలాగే..

వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతంలోని చాపరాయిలో గత ఏడాది మే నెలలో సుమారు 17మంది గిరిజనులు విషజ్వరాలతో బాధపడుతూ మృతి చెందారు. దీంతో ఆ గ్రామం 'చావురాయి'గా వార్తల్లోకి ఎక్కింది. అప్పట్లోనూ గిరిజనులు మృతిచెందిన విషయం చాలా ఆలస్యంగా బయటకు తెలియడం గమనార్హం.

దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

- భాజపా శాసనసభాపక్ష సమావేశంలో అభిప్రాయపడిన ప్రజాప్రతినిధులు
- కేంద్రం చేసిన అన్ని రకాల సహాయాన్ని శాసనసభలో ప్రస్తావించాలని తీర్మానం

ఈనాడు - విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం సాధ్యమైనన్ని ఎక్కువగా నిధులు కేటాయిస్తున్నా.. వివిధ పథకాల అమల్లో ప్రాధాన్యమిస్తున్నా.. ప్రాజెక్టుల మంజూరు చేస్తున్నా.. ఏమీ చేయలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని తిప్పికొట్టేలా శాసనసభలో మాట్లాడాలని భాజపా ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. శనివారం విశాఖలోని ఓ హోటల్లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఎంపీ హరిబాబు అధ్యక్షతన భాజపా శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. దిల్లీ నుంచి భాజపా అఖిలభారత సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి సతీశ్‌జీ, ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి రవీంద్రరాజు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ఏపీకి కేంద్రం చేసిన అన్ని రకాల సహాయాన్ని ప్రస్తావించాలని తీర్మానించారు. పునర్విభజన చట్టం ప్రకారం పదేళ్లలో మంజూరు చేయాల్సిన ప్రాజెక్టుల్లో మూడు మినహా మిగిలినవాటిని మూడున్నరేళ్లలోనే మంజూరు చేసిన విషయాన్ని . . ఏఏ ప్రాజెక్టుకు ఎప్పుడెప్పుడు ఎంతెంత నిధులు కేటాయించారన్న వివరాలను ప్రస్తావించాలని నిర్ణయించారు.



విశాఖలో భాజపా శాసనసభాపక్ష సమావేశానికి హాజరైన ఆపార్టీ ప్రజాప్రతినిధులు

- ఇటీవల విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోనుగానీ, పేరునుగానీ ఎక్కడా ప్రదర్శించలేదని, ప్రస్తావించనూలేదని ఇది తమకు చాలా బాధ కలిగించిందని కొందరు ప్రస్తావించారు.
- భాజపా ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న సహాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నామని ఈ పరిస్థితి మారాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.
- భాగస్వామ్య సదస్సులో ఐ.ఐ.పి., ఐ.ఐ.ఎఫ్.టి. సంస్థల శంకుస్థాపన కార్యక్రమాలు జరిగినప్పటికీ ఆ కార్యక్రమానికి రావాలని రాష్ట్రప్రభుత్వం తరపున విశాఖ ఎంపీ హరిబాబుకు ఆహ్వానం అందలేదని కొందరు పేర్కొన్నారు. ఎంపీ హరిబాబు చొరవతోనే ఆ రెండు సంస్థలూ ఏపీకి మంజూరయ్యాయని.. కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు ఆహ్వానం మేరకు భాగస్వామ్య సదస్సుకు వచ్చినప్పటికీ వేదికపైకి కూడా పిలవలేదని వాపోయారు.
- ప్రత్యేక హోదా కొన్ని రాష్ట్రాలకు కొనసాగిస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని.. ఆ విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.
- శాసనసభ, శాసన మండలిలో హుందాగా వ్యవహరిస్తూనే భాజపా ఏపీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని సతీశ్‌జీ, రవీంద్రరాజు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు కేంద్రం ఏమి చేసింది.. చేయలేనిది ఏమిటి? ఏమి చేయనుందన్న వివరాల్ని అర్థమయ్యేలా వివరించాలని సూచించినట్లు భాజపా ఏపీ అధ్యక్షుడు హరిబాబు 'ఈనాడు'కు వెల్లడించారు.

మానవహక్కుల పరిరక్షణ ఇప్పటికీ ఓ సవాలే

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: 'మానవ హక్కుల పరిరక్షణ ఇప్పటికీ ఒక సవాలుగానే ఉంది.. రక్షణ అనేది సుదూర స్వప్నంగానే మిగిలిపోతోంది.. వీటిని పరిరక్షించడానికి, విశ్వవ్యాప్తంగా గౌరవించడానికి అందరూ కృషి చేయాలి. . తీర్మానాన్ని ఆమోదించి 65 ఏళ్లయింది.. మానవహక్కులు అనేవి కల్పన కాకూడదు.. నిజం కావాలి.. వాటిని గౌరవించేలా చేయడం మన కర్తవ్యం...' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయవిభాగం ఆధ్వర్యంలో 'మానవహక్కులు: దృక్కోణం-ప్రాథమ్యాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సు శనివారం వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వీటి ప్రాముఖ్యతపై ఒక్కరోజు చర్చించి వదిలేయడం కాదని, నిరంతర ప్రకియలా సాగాలన్నారు. 'ప్రజలను సంరక్షిస్తూ, పరువు ప్రతిష్ఠలతో జీవితాన్ని గడిపేలా తర్ఫీదు ఇవ్వడాన్ని మానవహక్కు విద్యగా పరిగణిస్తారని..' ఐక్యరాజ్యసమితి 7వ సెక్రటరీ జనరల్ కోఫీ అన్నన్ చెప్పిన మాటలకు తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. మానవహక్కులు, చట్టానికి సంబంధించిన నిబంధనలను కాపాడటంలో భారత న్యాయస్థానం అత్యంత మెచ్చుకోదగ్గ పాత్రను పోషించిందనడంలో సందేహం లేదన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ. పక్కన వీసీ దుర్గాభవాని

86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా అధికరణం 21ఏను చేర్చినట్లు తెలిపారు. ఈ అధికరణం ప్రకారం 14ఏళ్లలోపు పిల్లలందరికీ విద్య ప్రాథమిక హక్కుగా చేశారన్నారు. ఇలా న్యాయవ్యవస్థ మానవహక్కులను అమలు చేయడంలో ఎన్నో కొత్త మార్గాలను, ప్రామాణికాలను సూచించిందని చెప్పారు. చట్టం ముందు స్త్రీ, పురుషులు సమానమైనా.. చాలా మంది సమన్యాయాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. సమన్యాయం అనేది కలగా కాకుండా యథార్థం చేసుకోవడానికి అందరూ ప్రయత్నించాలని చెప్పారు. వీసీ దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

2019 ఆగస్టుకు విశాఖ పరిశ్రమలకు గ్యాస్

ఏపీజీడీసీ డైరెక్టర్ కోయ ప్రవీణ్ వెల్లడి

ఈనాడు, కాకినాడ: విశాఖపట్నం, పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల అవసరాలకు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి గ్యాస్ సరఫరా చేసే విధంగా పైపులైను నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీజీడీసీ) చర్యలు చేపట్టింది. ఉత్తరాంధ్రలో ఇప్పటి వరకు గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం లేదు. ఈ ప్రాంతానికి వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పైపులైను ద్వారా గ్యాస్ సరఫరాను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో శరవేగంగా పనులు చేస్తున్నామని ఏపీజీడీసీ డైరెక్టర్ డాక్టర్ కోయ ప్రవీణ్ 'ఈనాడు'కు తెలిపారు. ఏపీజీడీసీ, ఏపీజీఐసీ, గెయిల్ సంయుక్త భాగస్వామ్యంతో పైపులైను ద్వారా గ్యాస్ సరఫరాకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీజీడీసీ, గెయిల్ సంయుక్తంగా ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయి. కాకినాడ నుంచి విశాఖ, అక్కడి నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఏపీజీడీసీ ఆధ్వర్యంలో కాకినాడ-శ్రీకాకుళం గ్యాస్ పైపులైనును నిర్మించనున్నారు. 300 కిలోమీటర్ల పైపులైను నిర్మాణాన్ని 2014 జులై 16 నుంచి 36 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేసుకున్నా ఆచరణలో జాప్యం జరిగింది. దీంతో మెగా ఇంజినీరింగ్ సంస్థ ద్వారా కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు పైపులైను పనులు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు.

తొలి దశలో విశాఖ పరిశ్రమలకు..

తొలి దశలో కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు రూ.520 కోట్ల వ్యయంతో 178 కిలోమీటర్ల పైపులైను ఏర్పాటుచేయనున్నారు. ఇందులో 91 కిలోమీటర్ల వరకు పైపులైను నిర్మాణానికి సంబంధించి టెండర్లు పిలిచారు. యలమంచిలి మండలం పులపర్తి వరకు ఈ పనులు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి పనులు ఏప్రిల్‌లో మొదలవుతాయని ఏపీజీడీసీ డైరెక్టర్ తెలిపారు. విశాఖపట్నం చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక అవసరాలకు తగిన గ్యాస్ సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. 2019 ఆగస్టు నాటికి విశాఖపట్నంకు, డిసెంబరు నాటికి శ్రీకాకుళం జిల్లాకు గ్యాస్ సరఫరా చేసేలా సన్నాహాలు చేస్తున్నామని డైరెక్టర్ పేర్కొన్నారు.



దాడిలో గాయపడిన వృద్ధుడు

వృద్ధుడిపై ఉన్మాది దాడి

కోవూరు, న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో ఉన్మాది శనివారం మళ్లీ దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి పట్టణంలో పలువురు మహిళలపై దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. శనివారం తెల్లవారుజామున ఓ వృద్ధుడిపై దాడి చేశాడన్న విషయం తెలియడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయం అరుగుపై గాయాలతో పడి ఉన్న గుర్తుతెలియని వృద్ధుడ్ని (70) స్థానికులు, ఆలయ ఉద్యోగి ఉదయం చూసి 108 వాహనానికి సమాచారం అందించారు. అతన్ని నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉన్మాదిని పట్టుకునేందుకు కోవూరు సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పది బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు

ఆర్.సి.ఏ./28/2018 తేది. 01.03.2018

ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

ఫారం నెం.VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ క్రింద 14వరీచ్ మేజర్ ఆఫ్ ఐ ఛార్ ఆఫ్ ఐయమ్‌సి కాలువ నిర్మాణంలోని భాగముగా తర్లుపాడు మండలము నాగెళ్ళముడుపు గ్రామములోని కాలువ పోవుచున్నందున శ్రీయుత స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1)న నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పై పేర్కొనిన చట్టంలోని సెక్షన్ 3(a) మరియు రూల్2(బి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఎల్ అండ్ ఎల్ యూనిట్, మార్కాపురం వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) అధికారివారి ముందస్తు అనుమతి లేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15ననుసరించి భూసేకరణపై ఏమైన అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) అధికారి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ప్రకాశం మండలము: తర్లుపాడు గ్రామము: నాగెళ్ళముడుపు

క్రమ సంఖ్య	సర్వే నెం.	పూర్తి విస్తీర్ణం ఎ.సెం.	తరహా/ భూస్థితి	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామి పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు ఉ	తూ	ద	ప	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1.	18/1	1.76	సర్కారు పుంజ	0.53	దూళ్ళ అప్పలక్ష్మి భర్త అప్పలయ్య దూళ్ళ వెంకటయ్య తండ్రి వెంకటయ్య దూళ్ళ పెద్దవెంకటయ్య తండ్రి వెంకటయ్య	దూళ్ళ అప్పలక్ష్మి భర్త అప్పలయ్య దూళ్ళ వెంకటయ్య తండ్రి వెంకటయ్య దూళ్ళ పెద్దవెంకటయ్య తండ్రి వెంకటయ్య	17	20	18/ 2,3	V.No.8 1 Manja Pata	మిరప
2.	18/2	1.68	సర్కారు పుంజ	0.06	దొండపాటి గురవమ్మ భర్త అప్పలయ్య	దొండపాటి గురవమ్మ భర్త అప్పలయ్య	18/1	20	18/3	18/1	బీడు
3.	23/1	5.52	సర్కారు పుంజ	0.45	మేకల వెంగళరెడ్డి తండ్రి రామిరెడ్డి	మేకల వెంగళరెడ్డి తండ్రి రామిరెడ్డి	21	26	23/2	21 22	మిరప
4.	23/2	5.00	సర్కారు పుంజ	0.50	తాడి అక్కమ్మ భర్త వెంకటరెడ్డి	తాడి అక్కమ్మ భర్త వెంకటరెడ్డి	23/1	26	24	22	మిరప
5.	121/1	3.81	సర్కారు పుంజ	1.04	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య	124	122	121/ 2,3,6	118	మిరప
6.	121/4	0.67	సర్కారు పుంజ	0.28	దీవెళ్ళ గంగరాజు తండ్రి పెదబంగారయ్య	దీవెళ్ళ గంగరాజు తండ్రి పెదబంగారయ్య	121/ 2,3	122	121/ 5	121/5	బీడు
7.	121/5	1.78	సర్కారు పుంజ	0.40	యకమాల చెన్నమ్మ భర్త జాన్	యకమాల చెన్నమ్మ భర్త జాన్	121/ 2,4	122	121/ 7	121/8	బీడు
8.	121/7	1.14	సర్కారు పుంజ	0.26	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య	121/ 5	121/ 8	122	121/6	బీడు
9.	121/8	0.18	సర్కారు పుంజ	0.17	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య యకమాల చెన్నమ్మ భర్త జాన్	కందుల ప్రభావతి భర్త యేసు కందుల నవమ్మ భర్త కాశయ్య యకమాల చెన్నమ్మ భర్త జాన్	121/ 5	122	121/ 7	122	బావి
10.	134/4	7.80	ఇనాం పుంజ	1.28	శ్రీ రామలింగేశ్వరస్వామి వారు	శ్రీ రామలింగేశ్వరస్వామి వారు	134/ 1,2,3	136	135	122	బీడు
11	191/1	0.28	సర్కారు పుంజ	0.14	గంగిశెట్టి ఆదిలక్ష్మమ్మ భర్త రామయ్య	గంగిశెట్టి ఆదిలక్ష్మమ్మ భర్త రామయ్య	135	191 /2,3	191/ 5	191/ 6	బీడు
12	191/3	0.32	సర్కారు పుంజ	0.02	దీవెళ్ళ గంగరాజు తండ్రి పెద బంగారయ్య దీవెళ్ళ వెంకటేశ్వర్లు తండ్రి పెద్ద బంగారయ్య	దీవెళ్ళ గంగరాజు తండ్రి పెద బంగారయ్య దీవెళ్ళ వెంకటేశ్వర్లు తండ్రి పెద్ద బంగారయ్య	135	190	191/ 2,4	-	బీడు
13	191/5	1.70	సర్కారు పుంజ	0.58	పల్లాల చిన్నమస్తాన్‌బీ	పల్లాల చిన్నమస్తాన్‌బీ	191/ 1,2,3,4	190	191/ 7,11	V.No.8 8 Partap Uram	మిరప
14	191/6	0.06	సర్కారు పుంజ	0.03	తడికమళ్ళ అనంతలక్ష్మమ్మ భర్త బాలకోటయ్య గంగిశెట్టి రామయ్య తండ్రి పేరయ్య	తడికమళ్ళ అనంతలక్ష్మమ్మ భర్త బాలకోటయ్య గంగిశెట్టి రామయ్య తండ్రి పేరయ్య	191/ 5	190	191/ 7	191/ 7	బావి
15.	191/7	4.20	సర్కారు పుంజ	1.04	బత్తుల పెద్ద వెంకయ్య తండ్రి లక్ష్మయ్య దీవెళ్ళ చిన్న బంగారయ్య తండ్రి గంగయ్య జడ సుబ్బమ్మ భర్త చిన్న వెంకయ్య	బత్తుల పెద్ద వెంకయ్య తండ్రి లక్ష్మయ్య దీవెళ్ళ చిన్న బంగారయ్య తండ్రి గంగయ్య జడ సుబ్బమ్మ భర్త చిన్న వెంకయ్య	196 /5,6	189, 190	191/ 8	191/ 11,12	మిరప
మొత్తం	విస్తీర్ణము			6.78							

సం/- నాగలక్ష్మి.S. I.A.S

ప్రత్యేక కలెక్టరు(భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాలు ఎంపికలో మీ ఆత్మీయ బంధువు



వధువు కావలెను

Kapu 30 6' B.E (Bits) MNC 28L PA ★ 28 6' M.S Ford 100K ★ 25 5'7" B.E (Bits) MNC 19LPA ★ 30 5'11" MD MCH ★ 28 5'11" MS 140 K ★ 27 6' MBA (IIM) ★ 9989019945 (A)

కాపు 2 వ పెళ్ళి విడోవర్, 54 సంగలు H: 5'7", C.Govt (ONGC) P.M.1 లక్ష. పిల్లలు ఇద్దరు (పిల్లలు లేని హిందు కులం, వధువు కావలెను). డైరెక్ట్ ★ నో బ్రోకర్స్. కొట్టు త్రినాధరావు, విద్యా నగర్, ఏలూరు. ప॥గో॥జిల్లా. వాట్సప్ ✆ 94910 68035 (M)

ఆర్యవైశ్య/ 49Y/లేటు మ్యారేజ్/ఫెయిర్/ 5.6' B.Com. స్వగోత్రం అయనకుల, మేనగోత్రం: మిధునకుల నక్షత్రం. శదబిష. డై. ✆ 98853 90717 (M)

నియోగి బ్రాహ్మణ 31 సం॥ 5'9" ఎత్తు, బ్యాంకు ఆఫీసరు, Rs. 75,000/- నెల ఆదాయం. డైవర్సీ వరునకు అందమైన వధువు కావలెను. Ph: 9398503718, 9490189728 (A)

ముదిరాజ్, 28Y, 5'10", MSc, JE in Railway 60,000/- pm వెల్‌సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. ✆ 8142220475 (A)

విశ్వబ్రాహ్మణ గోల్డ్‌స్మిత్ USA లో ఉద్యోగం చేస్తున్న 30 సం॥ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. సంప్ర॥ 94916 28286 (F).

Kapu Handsome 27 5'11" MS Deloitte $ 160K 10 Cr. ★ 26 5'10" BE, MBA, IIM Bank 18L ★ 28, 5'9" MBBS MD Rich. ✆ 9989766111. (A)

పద్మశాలి/ M.Tech/ C. Govt. డిప్యూటి మేనేజర్ (రైల్వే)/ 12 Lakhs PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298. (A)

మున్నూరు కాపు/ B.Tech/ C. Govt. మేనేజర్ (SBI)/ 75000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885050879. (A)

రెడ్డి/ B.Tech, MBA/ Govt. గ్రూప్-I ఆఫీసర్, AEO (TAG)/ 82000/- PM/ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014. (A)

కుమ్మరి/ M.Tech NIT/ C. Govt. ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్/ 80000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854. (A)

విశ్వబ్రాహ్మణ/ B.Tech, MBA/ C. Govt. Asst. మేనేజర్ (రిజర్వ్ బ్యాంక్)/ 68000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt. A.E (BPCL)/ 70,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

రజక/ B.Tech/ C.Govt. JTO (BSNL)/ 70,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

కాపు/ M.Tech/ C.Govt. A.E (HPCL)/ 80,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 8886512010 (A)

మాదిగ/ ఏకైక కుమారుడు/ B.Tech/ C.Govt. ఇంజనీర్ (రైల్వే)/ 70,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9642459724 (A)

రెడ్డి/ 28/ 5'7"/ ఫెయిర్/ B.Tech/ SWE/ 6 Lakhs P.A/ 6 కోట్ల ఆస్తి మంచి మనసున్న వరునికి మనసున్న వధువు కావలెను. అర్జెంట్ ✆ 9703551199/ 7396558669 (A)

బ్రాహ్మణ్/ లేట్ మ్యారేజ్/ కట్నప్రసక్తి లేని/ 43/ 6'/ Fr/ 6 వేల నియోగులు/ శాఖపట్టింపు లేదు/ M.Tech/ వర్కింగ్/ Hyd/ 60,000/-PM/ వరునికి వధువు కావలెను. అర్జెంట్ ✆ 8374883874 (A)

రజక: M.Tech/ C.Govt. Asst. ఇంజనీర్ / IOCL/ 65,000/- PM. 5'11" ఎత్తు, 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

పద్మశాలి: B.Tech/ C.Govt. ఇన్‌స్పెక్టర్ / కస్టమ్స్ Dept/ 60,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

బెస్త, గంగపుత్ర B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ / BHEL/ 62,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

గౌడ: M.Tech/ C.Govt Sr. టెక్నీషియన్ /ISRO/ 65,000/- P.M, 5'11" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007918 (A)

బ్రాహ్మణ/ 26/ BE MBA (IIM) Govt 10L/ ★ 31 B.Tech MBA /Wkg Blore/ 18L/ ★ 28/ 5'11"/ B.Tech MS (US) $ 1 Lakh ★ 27/ MD/ ★ 9494096081 (A)

కాపు/ 49/ 5'7'/ Govt. Job/ 2వ పెళ్ళి/ OC/ BC, పిల్లలు లేని అందమైన వధువు కావలెను. Direct Cont: 9100632686. (A)

Kamma 28/ 6'/ IIM/ MBA/ 15 L. P.A ★ 30/ 5'11"/ IIT, B.Tech/ M.S/ 25L P.A. ★ 32/ 5'10" B.Tech/ 14L P.A. ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

బ్రాహ్మిణ్ 43 సం॥ M.Tech, Ph.D H 5'.7" fair జీతం 13 లక్షలు Per Anam పెళ్లి కాని అమ్మాయి ఇంటర్, BA, B.Com చదివిన అమ్మాయి కావలెను. ఉద్యోగం అవసరంలేదు. శాఖ పట్టింపులేదు. Ph: 7032182853. (C)

కమ్మ 1987/ 5'10", B.Tech/ MS/ 100 K/ H1, 20 Cr. ఆస్తి Share గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618226996 (A)

SC మాదిగ హిందూ 28/6'0", BE/ SWE/ ఇన్ఫోసిస్/ 80,000/- PM, వెల్‌సెటిల్డ్, హ్యాండ్‌సమ్ వరునికి తగిన వధువు కావలెను. Ph: 8712865419 (A)

పద్మశాలి/ వైజాగ్/ 31/5'.7"/ IIT Kharagpur/ Manager Bangalore, Salary: 32.5 Lakhs. Contact: ✆ 8884842699 (D)/ 8978954849 (D). (C)

రెడ్డి 1990/ 5'10"/ BBA/ MBA/ Newzeland/ Rich ★ 1990/ 5'10"/ B.Tech/ 8L. PA/ Hyd/ 10 Cr. Ph: 9505551788/ 8885559579 (A)

రెడ్డి 1988/ 5'11"/ B.Tech/ MBA/ 140 K ★ 1987/ 5'11", B.Tech/ MS/ US/ 100K, Rich. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో Ph: 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1986/ 5'11"/ MBBS/ MS (Ortho 2nd Year) ★ 1989/ 5'7", MBBS/ MD/ General (Own Hospital) Ph: 9505551788/ 8885559579 (A)

కాపు – రెండో పెళ్లి ★ 36/ 5'9"/ M.టెక్ / 2L PM/ ★ 38/6'/ B.టెక్ (IIT), MBA (IIM)/ USA/ ★ 39/ 5'6"/ MCA/ IBM/ 2L PM ★ డాక్టర్ బొమ్మ దేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కమ్మ – రెండో పెళ్లి ★ 38/ 6'/ MBBS/ MD/ USA సిటిజెన్ ★ 34/ 5'9"/ MBBS, MS (ఆర్థో) / 10 కోట్లు ★ 32/ 6'/ M.టెక్ / విప్రో / 2L PM/ 5 కోట్లు ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

విలువ ఇచ్చిపుచ్చుకుంటేనే వికాసం

ఈ ప్రపంచంలో భార్యను మించిన మంచి నేస్తం మరొకరు ఉండరంటారు తత్వవేత్త, కళారాధకుడు డాక్టర్ సంజీవదేవ్.

అప్పటి వరకు ముఖ పరిచయం కూడా లేని, స్వేచ్ఛగా, ఏ బాధ్యతలు లేకుండా విహరించే ఇద్దరు వ్యక్తులు పెళ్లి అనే బంధంతో ఒక్కటవ్వడం, ఒక కుటుంబాన్ని వృద్ధి చేసుకోవడం, దాని సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడటం, ఆ పిల్లలకు రెక్కలొచ్చి దూరంగా ఎగిరెళ్లిపోయినా, ఆ జంట కడ దాకా కలసి జీవన ప్రయాణం సాగించడం నిజంగా అద్భుతం అనిపించక మానదు. పెళ్లంటే కేవలం మూడు ముళ్లు, ఏడడుగులు, తలంబ్రాలు, బాజా భజంత్రీల తంతు మాత్రమే కాదు. తాళికట్టే వాడికి ఆ బంధాన్ని జీవితకాల అనుబంధంగా నిలుపుకోవాలన్న సంకల్పం ఉండాలి. ఏడడుగులు నడిచే ఆమెకి చివరి దాకా భర్తతో కలసి పయనం సాగించాలన్న తలంపు కలగాలి. ఎంత ఉత్సాహంగా ఒకరి మీద ఒకరు తలంబ్రాలు పోసుకున్నారో, అంతే ఉత్సాహంగా జీవన యానాన్ని సాగించాలన్న పట్టుదల ఇద్దరిలో రావాలి. బాజా భజంత్రీలు ఇద్దరిలో కొత్త బాధ్యతల స్వీకరణకు మేల్కొలుపు కావాలి. అప్పుడే పెళ్లి అనే బంధానికి అర్థం.. పరమార్థం. ఇది సాధించాలంటే ఇద్దరి మధ్యా ప్రేమతోపాటు స్నేహం బలపడాలి. ఏదైనా ఆమెతో/అతనితో చర్చించాలన్న భావన కలగాలి. అది కలిగేలా ఇద్దరి నడుమ నమ్మకం, గౌరవ పెరగాలి.



మీకు తెలుసా?

ప్రఖ్యాత రచయిత్రి దివంగత మాలతీ చందూర్ బహుముఖ ప్రతిభ గురించి మనందరికీ తెలుసు. ఆధ్యాత్మికం, సాంస్కృతికం, సాహిత్యం, చరిత్ర, న్యాయం.. ఇలా ఆమెకు అవగాహన లేని అంశం అంటూ లేదు. అయితే ఆమె సర్వతోముఖాభివృద్ధి వెనుక భర్త చందూర్ కృషి ఎంతో ఉంది. చిన్నవయసులోనే తన జీవితంలోకి వచ్చిన ఆమెను ఆయన అనుక్షణం వెంట ఉండి ప్రోత్సహించారు. భర్త ప్రోత్సాహం ఉంటే స్త్రీలు ఆకాశాన్ని అందుకోగలరన్నదానికి ఆమె జీవితమే మంచి ఉదాహరణ.

వింటే తప్పేంటి?

పెళ్లయిన నాటి నుంచే భార్యను అదుపాజ్ఞల్లో పెట్టుకోవాలన్న గట్టి తలంపు చాలా మంది భర్తల్లో మొదలవుతుంది. నిజానికి మన సమాజం ఇలాంటి అర్థంపర్థం లేని ఆలోచనలని పెంచి పోషిస్తూ ఉంటుంది. పెళ్లాం చెబితే వినేదేంటి? అలాచేస్తే లోకం 'పెళ్లాంచాటు భర్త' అంటుంది అని చాలా మంది అనుకుంటారు. భర్త గురించి పూర్తి అవగాహన కలిగి, పైగా అతని సంక్షేమమే తన క్షేమం అనుకునే భార్య మాటలు వినడంలో తప్పేంటి? కొందరు భర్తలు చులకనగా 'నీకేం తెలియదు ఊరుకో' అంటూ చీటికి మాటికి భార్యల్ని గద్దిస్తుంటారు. కానీ అసలు విషయం ఏంటంటే.. ఈ ప్రపంచంలో ఒక మనిషి అభివృద్ధిని, క్షేమాన్ని మనస్ఫూర్తిగా కాంక్షించేది అతని కుటుంబమే. అందులోనూ ముఖ్యంగా భార్యే. ఎందుకంటే భర్తకు ఏదన్నా జరిగితే ఎక్కువగా నష్టపోయేది ఆమే.

అందరికీ అన్ని విషయాలు తెలియాలని లేదు. ముఖ్యంగా మీ పని వాతావరణం, ఆర్థిక లావాదేవీలు లాంటి వాటి గురించి భార్యకు అవగాహన ఉండకపోవచ్చు. కానీ చెబితే చక్కగా అర్థం చేసుకుంటారు కదా! అంచేత అన్నింటి గురించి ఆమెకు అర్థమయ్యేలా చెప్పండి. ఇద్దరూ పంచుకోండి. చర్చించుకోండి. ఓ మంచి నిర్ణయం తీసుకోండి. ఒక్కోసారి ఆమె ఇచ్చే సలహాలు మీకు అంత ఫలవంతంగా అనిపించకపోవచ్చు. అప్పుడు 'అలా కాదు.. ఇలా చేద్దాం' అని దాని గురించి వివరించండి. ఆమెలో వివేకం మరింత పెరుగుతుంది. మీ స్నేహితులు కూడా మీకు మంచి సలహాలనే ఇవ్వొచ్చు. కానీ మీ అభివృద్ధికి సంబంధించి వాళ్ల పరిధి, బాధ్యత కొంత వరకే. కానీ భార్యకు అలా కాదు. అందుకే ముందు నమ్మివచ్చిన అర్ధాంగిని మనిషిగా గుర్తించండి. ఆమె అభిప్రాయాలు, సలహాలకు విలువ ఇవ్వండి. అప్పుడు మీ అభివృద్ధికి ఆమే చోదక శక్తి అవుతుంది.

- శాలిని గుడిపాటి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

SC మాల /30/ 6'/ MBBS/ MS (GS) ★ 29/ 5'9"/ B.టెక్ / MS/ H1 వీసా ★ 30/ 5'10"/ B.టెక్ / SBI ఆఫీసర్ ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

విశ్వ బ్రాహ్మణ: 29/ 5'9"/ B.టెక్, MS/ H1 వీసా ★ 30/ 5'8"/ MBBS, MD (P) ★ 27/5'10"/ B.టెక్ /ట్రాన్స్‌కో ఇంజనీర్ ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

బ్రాహ్మణ, కాపు పేరెంట్స్ 43 ఏళ్ళ వరుడు డైవర్సీ 1.5 కోట్లు ఆస్తి గుంటూరులో వ్యాపారం నెలకు 30 వేలు సంపాదన. వధువు కా॥ను. క్యాస్ట్ నోబార్, డైరెక్ట్ కాంటాక్ట్. ఫోన్: 9966466550, 9951778128. (A)

శిష్టకరణం – లేట్‌మ్యారేజ్ 38/5.4/ B.Com / బిజినెస్ వెల్‌సెటిల్డ్ వెజిటేరియన్ వరునికి FC/BC డిగ్రీ వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్ కాంటాక్ట్ ✆ 9849627019 (O).

BRAHMIN, MADHWA VADHULASA, 39 yrs, 5'.5", Late Marriage, 15,000 PM, 2 Crs. Property. Seeks Brahmin Girl. ✆ 91779 60482. (G)

రెడ్డి (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10"/ B.Tech M.S U.S.A/ SWE/ Infosys 5L PM 15 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246333320 (A)

కాపు 27 5'9" B.Tech SWE MNC 14 Lakhs P.A. వెల్‌సెటిల్డ్ వరుడికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. 9618483383 (A)

SC హిందూమాల (కట్న ప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ WIPRO 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

ముదిరాజ్ (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ IBM 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246555529 (A)

వైశ్యా, కట్నప్రసక్తి లేదు. 5'10", 30 సం॥ సొంత బిజినెస్, 80k P/M. Well Setild గల వరుడుకి వధువు కావలెను. (డైరెక్ట్) Ph: 8885066616/ 8555849510 (A)

SC మాల కట్నప్రసక్తి లేదు. 29/5'11"/ B.Tech, MBA, ESI (C.Govt జాబ్) 70వేలు PM, అందమైన వరుడికి తగిన అందమైన వధువు కావలెను. ✆ 9908200117 (A)

కమ్మ B.Com/30/59 Pvt Job Own House, OC/BC వధువు కావలెను. No Dowry Direct Contact ✆ 9959964865 (A)

Reddy: 37/5'6 1/2" V.Fair B.Tech (S.Eng)" 11L Above (P.A) Seeks Educated Good Looking Girl with Horoscofepre. Andra ✆ 9573361270 (A)

ప్రైవేటు టీచర్ 30 అంగవైకల్యం కల అందమైన అబ్బాయికి అమ్మాయి కావలెను. (అర్జంట్) Contact: 9985511791 Direct No Brokers (E)

కమ్మ ప్రత్యేకం, 2వ పెళ్ళి, B.Tech, MBA, MS 27 & 39 అందమైన వరులకు వధువు కావలెను. సంప్ర: శారద ✆ 9849413031 (A)

తెలుగు ముస్లీమ్ 47, 5'8" ఓన్ బిజినెస్, 2వ పెళ్ళి కొరకు కుల, మత, ధన ప్రసక్తిలేని, డైవర్స్, విడో, చిన్న పిల్లలున్న వారికి OK. W: 7981286967/ 8522972445 (A)

కమ్మ/ 62/ 5'5"/ MBA రిటైర్డ్ ఆఫీసర్, హైద్రాబాద్ ఒంటరికి ఏ బాధరబందీలేని ఒంటరి 50 to 60 సం॥ల మధ్య FC/ BC యువతి కావలెను. ✆ 9618510985 (A)

Christian RCM Mala Doctor MD Pharmacology 6'1", 31yrs Fair/ 16 Lacs PA Looking for Suitable Match: 9398612458 (A)

కాపు 1987 5'10" M.Tech MBA US Based Company 1,80,000/- PM వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 9959919675 (A)

క్రిస్టియన్ 1988 5'11" M.Tech (MS in US) SWE in Hyd 1,60,000/- P.M వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 7075825246 (A)

కమ్మ: 27Y/ 5'9"/ B.Tech (IIT)/ S/W in Hyd 1.5 Lakh P/M/ 10 Crore property వున్న వరునికి తగిన వధువు కావలెను. 83097 63574 (D)

కాపు/బలిజ: 27Y/ 5'8"/ M.Tech (ECE) S/W in TCS, Hyd/ 16 Lakhs P/A/ 3 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 94419 90408 (D)

కమ్మ 51 సం॥ 6 HT గ్రూప్-1 ఆఫీసర్ (RDO) విడో పిల్లలులేరు 37 ఎకరాలు పొలం సొంతి ఇల్లు కల్గి ఉన్నత కుటుంబానికి చెందిన వరుడుకి వధువు కావలెను. 7287968361 (E)

కమ్మ, 29, 5'10", Fair, B.Tech, CAP Gemini, B'lore, 12 Lakhs, 5 Cro. విజయవాడ వరునికి వధువు కావలెను. 92999 92602 (D)

పద్మశాలి: 29Y/ 5'8"/ B.Tech (CSE)/ S/W in IBM, 15 Lakhs P/A/ well settled property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93938 63645 (D)

Kamma/ M.Tech, IIT/ 5'.10"/ 26/ 12 L PA/ 15 Cr ★ B.Tech, BITS, MBA, IIM/ 6'/ 26/ 36L PA/ 5 CR ★ B.Tech/ IIT/ 6'/ 29/ 24L PA/ 60 Cr. తుమ్మల సుజాత ✆ 81217 95786 (B).

Kamma/ B.Tech, IIT/5'.10"/ 26/ 260K/ 20 Cr ★ B.Tech, BITS, MS/ 5'.11"/ 27/ 120K/ 10Cr ★ BE MS/ 5'.10"/24/185K/ 10Cr. తుమ్మల సుజాత ✆ 98482 17771, 0866-2433788 (B).

Kamma/ Second Marriages/ B.Tech, MBA BITS/ 6'/28/40L PA/ 10Cr ★ M.Tech, IIT/ 5'.9"/ 29/ 15L PA/ 10Cr ★ MD, DM/ 5'.8"/30 Cr. తుమ్మల సుజాత ✆ 99632 32758 (B).

ప్రమాదంలో ఎడమచేయి కోల్పోయిన/ డైవర్సీ/ అడ్వకేట్/ 45 సం॥/ నియోగి/ హైదరాబాద్/ 5'2"/ V.ఫెయిర్/ రిచ్ ఫ్యామిలీ/ బ్రాహ్మణుల నుండి మాత్రమే వధువు కావలెను. ✆ 040-24145307/ 9908053555 (A)

6000 నియోగి, బ్రాహ్మణ 29 సం॥ Graduate 5'7" Fair ఆస్తికల, ఉద్యోగం చేయుచున్న వరునకు 10th/ Inter/ డిగ్రీ చేసిన వధువు కావలెను. శాఖా పట్టింపులేదు. ✆ 9866936665 (A)

కాపు: 29 / 5'10"/ B.Tech IIT S/W/E విప్రో Hyd నెలకు 1 లక్ష జీతం గల మంచి ఆస్తి వున్న వరుడికి తగిన వధువు కావలెను. (అర్జెంట్) ✆ 8978799956 (A)

రెడ్డి: 29 / 5'10"/ B.Tech IIT S/W/E విప్రో Hyd నెలకు 1 లక్ష జీతం గల 10కోట్ల ఆస్తి వున్న ఏకైక వరుడికి తగిన వధువు కావలెను. (అర్జెంట్) ✆ 9059098156 (A)

USA కమ్మ 36Y, 6', Fair MS (CSE) $12,000 P/M 3.5Cr H1B వీసా వరుడికి ఇండియా / USA కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574 (B).

Brahmin Vaidiki Bharadwajasa 35/5'11", Director Startup Co., (Earlier India Manager for MNC), worked with reputed Corporates as Manager 24 Lacs P.A., seeks suitable Brahmin Bride subsect Nobar. Ph: 9443345788. (A)

పద్మశాలి 5'10" 28 సం॥ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు 1 లక్ష జీతం కల వెల్‌సెటిల్డ్ అబ్బాయికి, గుణవంతురాలైన అందమైన వధువు కావలెను. 8096448338, 9885710478. (A)

C.N.B. 34/ 5'.10 B.Tech, Industrialist/ Business, above 200 Cr Prop, V.Fair, seeks fair & Good Family background. ✆ 8341791071. (C)

CNB/ రెండవ పెళ్ళి/ M.కాపు/ 35 Yrs/ M.Tech-SWE, 5'7", H1B వీసా, 1.5L P/M వరునకు పిల్లలు లేని అందమైన వధువు కావలెను. ✆ 9866277196, ranand9536@gmail.com (A)

★ ★ ★

సేఫ్టీఆఫీసర్, 6L P/A ఓన్ ఫైర్ & సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్ M.Tech, MBA 34 Y. 6'H లేట్ మ్యారేజ్ కన్వర్ట్ క్రిస్టియన్ అందమైన వరునికి క్రిస్టియన్ వధువు కావలెను. MBBS, BDS, Bank, Govt నోబ్రోకర్స్. ✆ 9394637166 (వాట్సప్) (C)

25Y, 5'.6", M.Tech VIT University Doing Fulltime Ph.D Only Child to Parents Caste No Bar. Wanted Educated Bride No Expectations from Bride. Contact: 92909 81610 or Send biodata to rajendranath.u@gmail.com (B).

★ ★ ★

MA, B.Ed 48 సం॥ గవర్నమెంట్ టీచర్ కన్వర్టెడ్, కుల పట్టింపు లేదు. హైట్ 5.9 ఉన్న వరుడికి వధువు కావలెను. ✆ 70133 56822. (J)

కమ్మ/ డైవర్స్/ 33/ 6' బి.టెక్ SWE ఆస్ట్రేలియా 85K తగిన ఫ్రెష్/ డైవర్సీ వధువు కావలెను. అబ్రాడ్/ ఇండియా. కమ్మ ఓన్లీ. నోబ్రోకర్స్. ✆ 90328 72252. డైరెక్ట్ (B)

రెడ్డి 32Y 5.6 (oc) 40 లక్షలు ఆస్తి, నెలకు జీతం : 28,000/- గల వరునికి అందమైన వధువు కావలెను. ఆస్తి పట్టింపు లేదు. నో బ్రోకర్స్ . ✆ 99666 91963. (J)

కమ్మ వయస్సు 32 ఎత్తు "6" ఇంటర్, 2 కోట్లు ఆస్తి గల యువకునకు అందమైన వధువు కావలెను. సం॥ ✆ 95023 83336 (I)

కాపు 34/5'6" PG సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు లక్ష జీతం, కోటి ఆస్థి గల వరుడుకు మొదటి/రెండవ వివాహ వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. డైరెక్ట్ 9491576523 (A)



వరుడు కావలెను

Kapu 22 5'5" B.E MNC ★ 24 5'2" MS MNC 120K ★ 25 5'6" MBBS MS (GS) ★ 24 5'4" CA MNC 15L PA ★ 27 5'4" B.E MBA (IIM) 12 LPA ★ 24 5'5" BE MNC ★ 8790017711 (A)

ఆర్యవైశ్య /24/5'3"/ 12లక్షలు & 29/ 5'2"/ 19 లక్షలు / రెండో పెళ్ళి /33/ 5'3"/ 60 లక్షలు & 43/ 5'2"/ Govt/ 80లక్షలు / జి.సుప్రజా గుప్తా "మా సేవ" ✆ 9493163996 (A)

రెండో పెళ్ళి / కులపట్టింపు లేదు / 53/ 5'3"/ Govt/ 68 వేలు / ఒక కోటి & 43/5'2"/ Govt/ 50 వేలు / ఒక కోటి & 36/ 5'4"/ 40 లక్షలు / "మా సేవ" ✆ 9291503949 (A)

బ్రాహ్మణ ఇల్లరికం 37 సం॥ ఉన్న భారద్వాజ, మఖ - కాని 5'3" పై ఎత్తున్న HYD లో చిన్న ఉద్యోగము చేస్తున్న ఆంధ్ర యువకుడు కావలెను. ✆ 9291451322 (A)

USA MS SWE 120K, Goud డైవర్సీ, 32, 5'3", Hyd వధువుకు Only USలో ఉండే వరుడు కావలెను. OC BC. 9246523454 (A)

మాల: MBBS, MS (Gynic)/ 5'4/ 27Y/ V.Fair/ 5 Cr/ 1 లక్ష జీతంతో డాక్టర్‌గా జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్)గా సంప్రదించండి. ✆ 81214 94810, 92484 94810. (B)

కులపట్టింపులేదు, రెండవ సంబంధం 28Y, 5'4", B.Ed, Govt Teacher, 60,000/- pm, (2 Cr ప్రాపర్టీ, ఏకైక పుత్రిక) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. ✆ 8142220817 (A)

Kapu Beautiful 24, 5'5" MS H1 $ 95K 10 Cr ★ 23 5'6" BE MBA TCS 50K ★ 24 5'4" M.Tech MNC 20 Cr. ✆ 9989766111 (A)

క్రిస్టియన్ మాల/ 25/ 5'5"/ M.Tech/ SWE/ Hyd/ 1 Lakh. PM చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9948136776 (A)

కమ్మ/ 26/ 5'5"/ MBBS, PG/ గైనకాలజిస్ట్/ ఏకైక కుమార్తె/ 25 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8500864134 (A)

బ్రాహ్మణ/ 27/ 5'4"/ వెరిఫెయిర్/ MBA, HR/ Pvt. జాబ్/ 20,000/- PM/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను ✆ 9030056547/ 9676812525 (A)

గౌడ/ M.Sc/ C.Govt క్వాలిటి ఇన్స్‌పెక్టర్ (FCI)/ 28,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9052296834 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

మాల/ ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt బ్యాంక్ P.O (బ్యాంక్ ఆఫ్ బరోడా)/ 35,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

బెస్త/ B.Tech/ Govt. Jr. Asst. (ఇరిగేషన్ Dept)/ 25,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

రెడ్డి/ B.Tech/ C.Govt అకౌంటెంట్/ (EPF)/ 25,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9985395014 (A)

మాల/ B.Tech/ C.Govt. Jr. ఇంజనీర్ (రైల్వే)/ 50,000/- PM. 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9703794175 (A)

గౌడ/ B.Tech (IIT)/ C.Govt ఇంజనీర్ (BHEL)/ 45,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703978131 (A)

బ్రాహ్మణ/ 23/ 5'4"/ 9th ★ 25/ 5'3"/ చదువు లేదు ★ 27/ 5'4"/ 7th. వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK ✆ 7674078296/ 8106446865 (A)

గౌడ/ CNB/ డైవర్సీ/ 40/ 5'3"/ MBBS/ డాక్టర్/ 1 లక్ష. PM/ 3 కోట్ల ఆస్తి/ పిల్లలు లేని వధువుకు మంచి మనసున్న వరుడు కావలెను. 1st/ 2nd. OK. అర్జెంట్ ✆ 9849324378/ 9052793439 (A)

యాదవ: B.Tech/ C.Govt. P.O/ కెనరాబ్యాంక్ / 50,000/- PM, 5'5" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

వడ్డెర: CA/ చార్టర్డ్ అకౌంటెంట్ / 50,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

బ్రాహ్మణ/ 26/ 5'4"/ BA/ ★ 23 B.Tech/ SWE 3.5 L/ ★ 27/ 5'4"/ MBA Wipro 4L/ ★ 25/ B.Tech MS (US) ★ 29/ MSC/ WKG ★ 24/ MBBS/ ★ 8555024711 (A)

Yadava, 26/5'3", MBA/ Deloitte/ Hyd/ 9440831748 ★ 24/5'3", M.Sc/ Guntur, 9440759945 ★ 26/ 5'6", B.Tech, Infosys, Kurnool, 9441735157 (A)

రెడ్డి/ 1993/ 5'5 1/2"/ MS/ US/ 90K/ V.Fair/ 20 Cr ★ 1991/ 5'4"/ BE/ MS/ US/ Fair/ H1B/ 3 Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1993/ 5'3"/ PG/ Nutrition/ V.Fair ★ 1991/ 5'3"/ B.Tech/ Wipro/ 18L. PA/ Hyd. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో. 9505551788/ 8885559579 (A)

రెడ్డి 1995/ 5'6"/ B.Tech/ MBA/ Genpact/ Fair ★ 1994/ 5'5"/ B.Tech/ MS/ US/ Fair. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో Ph: 8885559579/ 9505551788 (A)

SC మాదిగ / 25/5'4"/ BDS/ SBI ఆఫీసర్ ★ 25/ 5'5"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/5'4"/ MBBS, MD (P) సంప్ర॥ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కాపు / 25/ 5'6"/ B.టెక్ / RBI ఆఫీసర్ ★ 24/5'4"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/ 5'5"/ MBBS MS (గై) ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కమ్మ ఓన్లీ డాటర్ 25 5'4" Fr B.Tech SWE Infotech 35,000/- PM సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన వధువుకు వరుడు కావలెను. 9866158793 (A)

గౌడ 24/ 5'5" B.Tech/ SWE/HCL 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246964555 (A)

కమ్మ: V.V.Urgent/ B.E, M.S/ 5'4"/ 25Y 50 కోట్ల ఆస్తి కలిగి అమెరికాలో జాబ్ చేస్తున్న వధువుకై సంప్రదించండి. ✆ 9246392890 (A)

SC హిందూమాదిగ 24/ 5'5" B.Tech/ SWE/ HCL 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 9246151501 (A)

రెండోపెళ్ళి/ కులపట్టింపులేదు/ ఆస్తి ప్రసక్తిలేదు/ వయస్సు ప్రమేయం లేదు/ 23/ 5'3"/ అందమైన వధువుకు 1వ లేదా 2వ వరుడు SMS చెయ్యండి: 9949595523 (వాట్సప్‌లో ఫోటో పంపి, ఫోటో పొందండి) (A)

రెడ్డి వెరీఫెయిర్ 23/ 5'4" B.Tech (CSE) SWE 40,000/- PM 10Cr ప్రాపర్టీగల అందమైన వధువుకు ఇండియా/ అబ్రాడ్ వరుడు కావలెను. 8019864386 (A)

కాపు/ కులపట్టింపులేదు (2nd మ్యారేజ్) 26/ 5'5"/ B.Tech/ SWE/ TCS 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246171703 (A)

రెడ్డి/ లేట్‌మ్యారేజ్/ 28/ 5'3"/ RTO ఆఫీస్ 16 కోట్ల ప్రాపర్టి గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ✆ 9121598208 (A)

రెడ్డి/ లేట్‌మ్యారేజ్/ 30Y/ 5'5"/ బ్యాంక్ ఎంప్లాయి 16 కోట్ల ప్రాపర్టి గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ✆ 8790788977 (A)

కుల పట్టింపులేదు/ యాదవ్/ 5'5"/ 25Y/ 1st మ్యాచ్/ MBA/ Pvt జాబ్ 35,000/- (PM) ఫెయిర్, ప్రాపర్టీస్ ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 8897587959 (A)

వైశ్య 23 5'6" B.Tech NII SWE అమెజాన్ 35,000 P/M అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు అందమైన వరుడు కావలెను. ✆ 9533855373 (A)

కమ్మ 23 5'6" B.Tech SWE TCS 35,000 P/M వెల్ సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. అర్జెంటు ✆ 8125777297 (A)

రెడ్డి, లేట్ మ్యారేజ్, 35, 5'5" Pvt. జాబ్ 30K, రెంట్స్ 20K, 2 Cr. ఆస్తి గల ఒంటరి వధువుకు, వరుడు కావలెను. (CNB) 9951619273/ 9666376030. (A)

SC, SWE 1L, PM వధువుకి తగిన వరుడు కావలెను. Any డిగ్రీ (All SC Mathes ఉన్నాయి) 8121107338/ 9494731201. (A)

యాదవ్ 50 Cr. MBBS MD స్కిన్ & DGO, 27, 5'4" వధువుకి డాక్టర్స్, B.Tech, M.Tech SWE వెల్‌సెటిల్డ్, బిజినెస్ వరుడు కావలెను. 9393939962. (A)

రెడ్డి, విడో, 35, 5'5", Pvt. జాబ్ 30K, రెంట్స్ 20K, 3 Cr. ఆస్తి గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపు లేదు. 9966871719/ 9505437430.

కాపు, 26, 5'5", B.Com (అందమైన వధువుకి వరుడు కావలెను. (బిజినెస్ or జాబ్) కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 8186953229. (A)

వైశ్య/ 25Y/ 5'3"/ V.F./ B.Tech/ SWE/ 25KPM/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9059158811. (A)

కమ్మ/ 43/ విడో/ 5'4"/ పోస్ట్ ఆఫీస్ సూపర్‌డెంట్/ 2 LPM/ సొంత ఇల్లు & తోటలు 14 Cr ప్రాపర్టీ వెల్ సెటిల్డ్ గల భర్తను కోల్పోయిన వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. ✆ 9951479981 (A)

కాపు, 26, 5'5" B.Com అందమైన, వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. (బిజినెస్ or జాబ్) OK. ✆ 8978691424/ 040 48542181 (A)

బ్రాహ్మిణ్ 1985 5'4" B.Com (Comp) Pvt జాబ్ 20,000/- PM వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. 1వ, 2వ లేటు సంబంధాలకై సంప్రదించండి. ✆ 9959301091 (A)

బ్రాహ్మిణ్ డైవర్సీ 1982 5'4" Qly: డిగ్రీ Pvt జాబ్ 10,000/- PM అందమైన వధువుకు వరుడు కావలెను. 1వ, 2వ లేటు సంబంధాలకై ✆ 7386443656 (A)

బ్రాహ్మిణ్ 1979 5'4" Qly: ఇంటర్ వధువుకు వరుడు కావలెను. 1వ, 2వ, లేటు సంబంధాలకు సంప్రదించండి. ✆ 9959295508 (A)

బ్రాహ్మిణ్ 1986 5'5" Qly: B.Com Pvt జాబ్ 15000/- PM వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ✆ 8897453091 (A)

కాపు 56 సం॥ 5.3 HT VRS రిటైర్డ్ MRO విడో పిల్లలులేరు సొంత ఇల్లు 36 ఎకరాలు పొలం కలిగిన వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. 7287968361 (E)

రెడ్డి: 25Y/ 5'5"/ V.Fair/ B.Tech (ECE)/ S/W in Banglur, 5 Lakhs P/A, 4 Crore above ఉన్న అమ్మాయికి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

కాపు: 25 Y/ 5'6"/ Fair/ B.Tech (ECE) S/W in Banglur, 6 Lakhs P/A/ 2 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93909 14215 (D)

క్షత్రియ/ రాజులు: 24Y/ 5'5"/ Fair/ B.Tech (EIE) S/W in Accenture/ 4 Lakhs P/A/ 5 Cro.property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97042 77499 (D)

కమ్మ: 24Y/ 5'4"/ Fair/ B.Tech (ECE)/ S/W in TCS/ 4 Lakhs P/A/ 4 Cr. above property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97045 66499 (D)

రెడ్డి, డైవర్సీ, 35, 5'6" సొంత బిజినెస్ 1 LPM, రెంట్స్ 60k, 4 Cr ఆస్తి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. 8522011967/ 8522000858 (A)

రెడ్డి, 27, 5'6", V.Fair, MBBS, MD, 10 Crores property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 93966 55166 (D)

కాపు, 26, 5'6", V.Fair, B.Tech, MBA, SWE, MNC, Blore, 8 Lakhs 5 కోట్ల ఆస్థి ఉన్న వధువుకు వరుడు కావలెను. 81061 68806 (D)

కమ్మ 51 సం॥ 5.3 HT ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ విడో పిల్లలు లేరు సొంత ఇల్లు 28 ఎకరాలు పొలం కల్గి యాక్సిడెంట్‌లో భర్తను కోల్పోయిన మహిళకు వరుడు కావలెను. 7287968361. (E)

Rich Boys from Reddy's Only. India/ Abroad SWE/ Doctors/ Lawyers/ Business/ Govt Emp./ Pvt Emp. Contact: P.Supriyareddy. ✆ 040-23544820, 23545762. email id: palletisupriyareddy@gmail.com (A)

Kamma/B.Tech/ 5'.5"/ 23/ IBM/ 5 Cr ★ B.Tech/ 5'.5"/ 22/ Wipro/ 3 Cr ★ B.Tech/ 5'.4"/ 24/ CTS/ 5 Cr ★ M.Tech/ 5'.7"/ 26/ AE Govt. / 5 Cr. తుమ్మల సుజాత ✆ 98482 17771 (B).

Kamma/ BE MS/ 5'.7"/ 23/ 140/ 4 Cr ★ BE MS/ 5'.6"/ 23/ 110K/ 5Cr ★ BE MS/ 5'.5"/ 24 / 150K/ 15 Cr ★ BE MS/ 5'.8"/ 24/INTEL/ 95K/ 4 Cr ★ తుమ్మల సుజాత ✆ 81217 95786 (B).

Kamma/ Second Marriages/ BE MS/ 5'.7"/ 26/ 70K/ 5 Cr ★ BE MS/ 5'.5"/ 28/ 100K/ 15 Cr ★ B.Tech/ 5'.7"/ 26/ 150 Cr. ★ తుమ్మల సుజాత ✆ 99632 32758, 0866-2431721 (B).

కమ్మ/ విడో 27Y, B.Tech/ 15 కోట్ల స్థిరాస్తి/ యాక్సిడెంట్‌లో ఫ్యామిలీని కోల్పోయిన అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి/ కుల ప్రసక్తిలేదు) Whatsapp: 8121016556 (A)

కమ్మ / 24Y/ 5'.6"/ Fair B.Tech 9.5 L P/A 8 Cr ★ కమ్మ 30Y, 5'.4", MCA 3L P/A 4 ఎ॥పొలం తగిన వరుడు కావలెను. ✆ 73863 38574 (B).

Yadava 35/ 5'6" B.Tech Mechanical Group-2 Engr. Gazzeted Officer seeks 1st Marriage Groom CNB Direct 8106228901. (A)

కమ్మ/ 24Y/ 5'.5"/ ఫెయిర్/ B.Com/ Pvt జాబ్/ వెల్‌సెటిల్డ్ మేనత్త ఆదరణలో పెరిగిన, తల్లిదండ్రులు లేని వధువుకు సాంప్రదాయం గల వరుడు కావలెను. ✆ 7396744728. (C)

★ ★ ★

CNB, రెండవ పెళ్ళి, 35, 5'4" SWEకు తగిన వరుడు కావలెను. సంప్ర॥ 9177391463, 9293947197 (నో బ్రోకర్స్) (A)

కమ్మ/ నెల్లూరు/ ఏకైక కుమార్తె, B.Tech/ ECE/ S.W.in Hyd Six Lakh P.A/ 7 C.R Property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 94405 87667 (J)

హిందూ మాల, 23y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్‌గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డాక్టర్ జాబ్/ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న వరుడు కావలెను. డైరెక్ట్ ✆ 96761 55194 (I)

కాపు/లేట్‌మ్యారేజ్ 31/5'.5" డిగ్రీ 10 కోట్ల ఆస్తిగల అందమైన వధువుకి కుల, ధన ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు. Cell: 7674996028. (C)

అందమైన ఆస్తి కలిగిన వధువుకు ద్వితీయ, Govt/ Pvt/ Well Settled వరుడు కావలెను. (Rtd వారు కూడా) సంప్ర. Cont: 88868 01597. (G)

★ ★ ★

విజయవాడ రెడ్డి 25Y 5'.5" B.Tech SWE in TCS 40,000/- P/M. 50 లక్షల ప్రాపర్టి గల వధువుకి SWE రెడ్డి వరుడు కావలెను. నో బ్రోకర్స్ ✆ 97017 58555 (B).

కమ్మ 24/ 5'.5"/B.Tech, MBA V-Fair 11 కోట్లు ప్రాపర్టి గల వధువుకి Any SWE/ వెల్ సెటిల్డ్ బిజినెస్ వారు. డైరెక్ట్‌గా సం॥ సెల్ ✆ 78429 45655 (B).

కాపు డైవర్సి 27/ B.Tech, 5'.4", V.Fair SWE 15 లక్షలు P/A. 2 కోట్లు ప్రాపర్టి మొదటి / రెండవవారు. డైరెక్ట్‌గా సం॥ ✆ 91821 34995 (B).



వివాహ వేదిక

విశ్వబ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ బ్రహ్మముడి, గుంటూరు, కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725. (I)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.com లో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 97016 59125.(I)

ప్రవీణ మ్యారేజి లింక్స్ కేవలం 10 రోజులలో అన్ని కులముల వారికి 1st, 2nd లేటు మ్యాచ్‌లకు గ్యారెంటీ మ్యాచ్ చూపించబడును. ✆ 91337 21197, 90595 94402. (Whatsup) (B).

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/ MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ/2వ/ విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059. (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రిస్టియన్ వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com. Hyd: 9440831748, Gunt:✆ 9440759945, VSP: 9441735157 (A)

Whatsapp your Photo & Biodata To 9347262769. We Will send the Suitable Matches. www. pellisandadi.com. ESTD: 1991. (A)

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ॥కు ఫ్రీ., పు॥ సర్వీస్ చార్జ్. ✆ 7893688248 (A)

కుల పట్టింపు లేని వారికి 2వ, లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM - 5PM పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధువరుల లిస్ట్ ఇవ్వబడును. కుదుర్చబడును. Hyd. 9440937900. (A)

Since1989 శ్రీకన్యవివాహవేదిక, Hyd. అన్ని కులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల భిక్షపతి. ✆ 27619998/ 9396617778. వాట్సప్ - 9347009998 (A)

ఓన్లీ కమ్మ చౌదరి: కమ్మ కన్వర్టెడ్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హై రిచ్‌ర్స్, బిజినెస్ మెన్స్ & All 1వ/ 2వ/ విడో, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 91210-10959 (A)

ఓన్లీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్: OC&BCలు మాత్రమే. డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్ & All 1వ/ 2వ/ విడో. దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 99593-05599 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, MCH, DM, BDS, BDS & డా॥కి మాత్రమే. 1వ/ 2వ/ లేటు దేశ/విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ✆ 9963632698 (A)

కాపు, మున్నూరుకాపు, రెడ్డి, కమ్మ, All క్యాస్ట్స్, B.Tech, MS, IIT, IIM బిజినెస్, Doct హై ప్రొఫైల్స్ ఫాస్ట్ సెటిల్‌మెంట్. 9346344474. 2nd మ్యారేజెస్: 7702346670. శ్రీ ప్రియదర్శిని మ్యాట్రిమోని. (A)

సుజాత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాలవారికి మొదటి, రెండవ, డైవర్సి, విడో సంబంధాలు కుదుర్చబడును. వివరాలకు సంప్ర॥ 9642364646/ 9052364646 (A)

అన్ని కులస్థులవారికి మరియు NRIలకి తగిన పెళ్లి సంబంధములు చూపబడును. అధిక వివరములకు సంప్రదించగలరు. R2G Matrimony, ✆ 91334 91337, 9133 77 78 79. (G)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, భట్రాజులు, MBBS, MD, B.Tech, MS, Govt. హైరేంజ్ జాబ్స్, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st, 2nd అబ్బాయిలు, అమ్మాయిలు సంప్ర: M.ధనలక్ష్మి ✆ 8374514056 (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls, India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from All Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040- 23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

కృష్ణవేణి మ్యారేజ్‌లింక్స్ SWE, NRI's, డాక్టర్స్, బిజినెస్ Pvt/ Govt. జాబ్స్ & మిడిల్, హై లెవల్ సంబంధములు అన్ని కులాల వారికి కుదుర్చబడును. ✆ 95055 78732 (B).

శ్రీరస్తు: శుభమస్తు వివాహ వేదిక. బ్రాహ్మణ, వీరశైవలింగాయత్, వైశ్య, రెడ్డి, చౌదరి, కాపు, గౌడ, ముదిరాజ్, పద్మశాలి& అన్ని కులాలకు సంబంధాలు చూపబడును. Ph: (W) 9908812706, Hyd. Email:ssmb2705@gmail.com (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

సెకండ్ మ్యారేజీలకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్‌బ్యూరో, అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ✆ 9885144375 (A)

Kiran Chowdary Matrimony, Kamma India & Abroad Rich Matches. All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Busi ✆ 9866741795. kra.any@gmail.com (A)

రెడ్డి, కాపు, NRI లోకల్, బిజినెస్, డాక్టర్స్ సంబంధాలకై సంప్రదించగలరు. కె.సూర్యనారాయణ శాస్త్రి. srinivasamatrimony99@gmail.com 9550706655 (A)

JIO వివాహవేదిక 30 వేలు Profilesతో 300 మంది Assistanceతో అన్ని కులాల వారికి ✆ 8885410555 / 8555800692 (A)

★ ★ ★


కాపు సాఫ్ట్‌వేర్, డాక్టర్లు, USA సంబంధాలు కోటి నుంచి 100 కోట్లు వరకు, 1వ, 2వ సంబంధములకై. ✆ 99598 97599. (B)

ఇన్నేళ్ల సినీ సంగీత ప్రయాణాన్ని 'కట్టె కొట్టె తెచ్చె'లా మూడు ముక్కల్లో చెప్పమంటే..?

కె.విశ్వనాథ్ గారి సినిమాలకు సంబంధించి ఓ సెంటిమెంట్ ఉందండి. ఆయన 'ఎస్' అనే పేరుతో చేసిన సినిమాలన్నీ బాగా ఆడాయి. 'శంకరాభరణం', 'సాగర సంగమం', 'స్వాతిముత్యం'.. ఇలా. ఆయన అనుకుని అలా టైటిళ్లు పెట్టారో, లేదంటే యాదృచ్ఛికంగా జరిగిపోయాయో తెలీదు గానీ... ఇప్పుడు నేను ఆలోచిస్తుంటే నా కెరీర్ అంతా 'రా' అనే అక్షరంతో ముడిపడి ఉన్నట్టు అనిపిస్తోంది. మొదటి 'రా'.. రామోజీరావుగారు. 'మనసు మమత'తో నాకు తొలి అవకాశం ఇచ్చారాయన. నా పనితనం నచ్చి 'ఇక మీదట ఉషాకిరణ్ మూవీస్ చిత్రాలన్నింటికీ మీరే పని చేయాలి' అని బాగా ప్రోత్సహించారు. ఆయన అన్నట్టే 'పీపుల్స్ ఎన్‌కౌంటర్', 'అమ్మ', 'అశ్విని' .. ఇలా వరుసగా సినిమాలు చేశాను. ఆ తరవాతి 'రా'.. రాంగోపాల్ వర్మ. ఆయన 'క్షణం క్షణం'తో బ్రేక్ ఇవ్వబట్టి నాకంటూ ఓ గుర్తింపు సంపాదించుకోగలిగాను. 'శివ'లాంటి గొప్ప సినిమా తరవాత వర్మ క్రేజ్ హిమాలయాల్ని తాకింది. ఇళయరాజా అంతటివాడిని కాదని నాలాంటి ఓ కొత్త కుర్రాడికి అవకాశం ఇవ్వడంతో పరిశ్రమ అంతా 'ఈ కీరవాణి ఎవరు' అని ఆరా తీశారు. 'క్షణం క్షణం' విడుదల కావడానికి యేడాదిన్నర పట్టింది. ఈలోగా నాకు చాలా అవకాశాలొచ్చాయి.. కేవలం వర్మ సినిమాకి సంగీతం అందించాననే కారణంతో. 'క్షణం క్షణం' ఫ్లాప్ అయినా.. ఆ సినిమా నాకో బూస్ట్ తీసుకొచ్చింది. దాంతో చిత్రసీమలో స్థిరపడిపోయా. మూడో 'రా'.. రాఘవేంద్రరావు గారు. ఆయనతో వరుసగా 27 సినిమాలు చేశా. అందులో అన్నీ మ్యూజికల్ హిట్లే. ఇరవై సినిమాలు బాక్సాఫీసు దగ్గర బాగా ఆడాయి. ఆయన తరవాత 'రా'జమౌళి శకం ప్రారంభమైంది. 'స్టూడెంట్ నెం.1' నుంచి 'బాహుబలి' వరకూ మా ప్రయాణం కొనసాగుతోంది. అయిదో రా కూడా ఉంది. అదే 'రాగాలు'. వేటూరి 'రాగాలు అనంతాలు నీవై రూపాలు' అన్నారు. ఇప్పటి వరకూ పదిహేనువందల పాటలు కంపోజ్ చేస్తే 'కీరవాణి' రాగంలో కనీసం రెండు పాటలు కూడా సంతృప్తికరంగా ఇవ్వలేకపోయా. ఇళయరాజా అయితే కీరవాణి రాగంలో కొన్ని వందలు చేశారు. నేను మాత్రం చాలా తక్కువ రాగాలకు పరిమితమైపోయా. ఓసారి శ్రీనివాస్ అనే మృదంగిస్టు నన్ను పక్కకు పిలిచి 'మీరెందుకు హంసానంది, హిందోళంకి మాత్రమే పరిమితమైపోయారు.. ఇంకేం లేవా? చేతకావా' అని మొహం మీదే అడిగేశాడు. ఆరోజున గట్టిగా అనిపించిందేంటంటే.. రాగాల్ని పరిశోధిస్తూ.. కొత్త ప్రయత్నాలు చేయాలి. ఇదే నా కొత్త సిద్ధాంతం. పాతవి వదిలేస్తూ.. కొత్త వాటిని ప్రయత్నించాలి. రాగాల్లో సారాన్ని కాచి వడబోసి, నేర్చుకుని.. వాటిని శ్రోతలకు అందించాలి. ఇదే నా శేష జీవితం తాలుకూ.. పరమార్థం అనుకుంటున్నా.

మా అబ్బాయిల్ని కూలికి పంపా

ఎగిరిపోతే ఎంత బాగుంటుందీ...
అంటూ పాటకు రెక్కలు కట్టి ఎగరేసిన కీరవాణి
భళిభళిరా భళీ... సాహోరే బాహుబలి...
అంటూ ధీరత్వానికి రాగం కట్టారు.
జామురాతిరి.. జాబిలమ్మా జోలపాడనా...
అని ప్రకృతిని జోకొట్టిన క్రీమ్...
తెలుసా మనసా.. అంటూ హృదయాలను మీటారు.
దొర ఏందిరా... వాడి పీకుడేందిరో...
విప్లవ శంఖారావం ఊదిన ఎం.ఎం.
చేతులు మారి.. రాతలు మార్చే కాగితమోయ్...రూపాయ్
అని జీవిత సత్యాన్ని బోధించారు.
ఆయన జీవితంలోని పదనిసలను 'హాయ్'తో పంచుకున్నారు. తొలి పారితోషికం, పిల్లలను పెంచిన తీరు, ప్రస్తుత సంగీతం... ఇలా అనేక విషయాలు చెప్పారు.



❑ నాన్ ఫిల్మీ ప్రయత్నాల్లో మీకు బాగా నచ్చిన.. అంశం ఏమిటి?

సినిమా పాటలకు ఎంత పేరొస్తుందో.. కొన్ని కొన్నిసార్లు సినిమాలకు సంబంధం లేని వేరే విషయాలకూ అంతే పేరొస్తుంది. ఆ మధ్య సరదాగా 'షేక్ హ్యాండ్'మీద గీత రచయిత చైతన్య ప్రసాద్‌తో ఓ పద్యం రాయించా. దాన్ని నేనే ఆలపించా. యూ ట్యూబ్‌లో పెడితే... అమోఘమైన స్పందన వచ్చింది. ఓసారి చినజీయర్ స్వామిని కలుసుకోవడానికి వెళ్లినప్పుడు 'ఏదీ.. ఆ షేక్ హ్యాండ్ పద్యం పాడండి' అన్నారు. ఆయనే అలా అన్నారంటే ఆ పద్యం ఏ స్థాయిలో విజయవంతం అయ్యిందో ఊహించండి.

❑ ఆధ్యాత్మిక సినిమాలకు సంగీతం అంటే మీరే గుర్తొస్తుంటారు. మరి దేవుడి పట్ల మీ అభిప్రాయం?

దేవుడి పట్ల నమ్మకం ఉన్నవాడినే నేను. మనల్ని మించిన ఓ అద్భుతమైన శక్తి ఉంది. దాని అధీనంలోనే మనమంతా ఉన్నాం. 'దేవుడు ఉన్నాడు' అని నమ్మినవాళ్లందరినీ నేను గౌరవిస్తా. కొంతమంది 'దేవుడు ఉన్నాడో లేడో తెలీదు..' అని మధ్యస్తంగా ఉంటారు. వాళ్లన్నా నాకు అభిమానమే. ఇంకొంతమంది 'దేవుడు లేడు' అంటుంటారు. వాళ్లు నాస్తికులు. వాళ్లంటే నాకు గౌరవం లేదు.

❑ దేవుడి దర్శనానికి టికెట్లు, స్పెషల్, వీఐపీ దర్శనాలు.. వీటి మాటేంటి? దేవుడ్ని చూడ్డానికీ డబ్బులు కట్టాలా?

ప్రహ్లాదుడు అడిగితే.. నరసింహస్వామి స్తంభంలో దర్శనమిచ్చాడు. దేవుడు అనేవాడు ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాడనుకుంటే గుడికి వెళ్లక్కర్లేదు. మనం చూస్తున్న ప్రతి వస్తువులోనూ దేవుడు ఉన్నాడు. అయితే గుడికి వెళ్లే వాళ్ల నమ్మకాలు ప్రబలంగా ఉన్నప్పుడు, ఎక్కువమంది గుళ్లోనే దేవుడు ఉన్నాడని నమ్ముతున్నప్పుడు, గుళ్లముందు క్యూలు పెరిగిపోతున్నప్పుడు టికెట్ పెట్టక తప్పదేమో. సినిమాలనే తీసుకోండి. నేల, బెంచి, రిజర్వ్ ఇలా కొన్ని తరగతులున్నాయి. ఎవరి హోదాని బట్టి, స్థాయిని బట్టి టికెట్ కొనుక్కుంటారు. కానీ అందరూ చూసే సినిమా మాత్రం ఒక్కటే. అలా.. ఎవరు ఏ టికెట్ తీసుకున్నా దేవుడి ముందే మోకరిల్లాలి.

'మనసు మమత'కు రూ.25 వేలు ఇచ్చారు. నిజానికి ముందు అనుకున్నది ఇరవై వేలే. అట్లూరి రామారావుగారు 'పాతిక తీసుకోండి' అన్నారు. అడిగినదానికంటే ఎక్కువ పారితోషకం తీసుకున్న చిత్రం అదొక్కటే. మాది ఉమ్మడి కుటుంబం.. ఇంట్లో పాతిక ముప్ఫైమంది ఉండేవారు. ఆ డబ్బులు వాళ్ల కోసమే ఖర్చు చేశా.



❑ దేవుడి పేరుతో ప్రజలను మభ్య పెడుతున్న నకిలీ స్వామీజీల మాటేంటి?

'నేను ఎంబీబీఎస్ పాసయ్యా...' అని దొంగ సర్టిఫికెట్లు పెట్టుకుని ఒకడు వైద్యం చేస్తున్నాడనుకోండి. వాడి వల్ల ఎంబీబీఎస్ అనే చదువుని, నిజమైన డాక్టర్లనీ చిన్నచూపు చూస్తామా? లేదే. ఈ దొంగ స్వాములూ అంతే. అక్కడ ఎంబీబీఎస్‌లో దోషం లేనట్టే.. ఇక్కడ దేవుడిలోనూ దోషం లేదు. అన్ని రంగాల్లోనూ మోసగాళ్లు ఉన్నారు. స్వామీజీల్లోనూ అంతే.

❑ చాలా చాలా సింపుల్‌గా కనిపిస్తుంటారు. మీ జీవన విధానం ఇంతే సాధారణమా?

నా చుట్టూ అంగరక్షకులు లేరని నేను 'సింపుల్' అనుకుంటున్నారేమో (నవ్వుతూ). సింప్లిసిటీకి నాకు నిర్వచనం తెలీదు. బహుశా అది డిగ్నిటీ ఆఫ్ లేబర్ నుంచి వస్తుందనుకుంటా. రిక్షా లాగేవాడు, ట్రాఫిక్‌పోలీస్, రోడ్లు ఊడ్చేవాడు.. ఇలా ఎవరి పనులు వాళ్లు చేస్తుంటారు. వయసుకీ, విజ్ఞతకీ గౌరవం ఇవ్వాలి. చేసే పనిని బట్టి గౌరవాల్లో తేడా చూపించకూడదు.

❑ ఈ ఫిలాసఫీనే మీ పిల్లలకూ చెబుతుంటారా?

మా ఇద్దరబ్బాయిల్నీ ఓ సారి నగర శివార్లలో ఉన్న అట్టపెట్టెలు తయారు చేసే ఫ్యాక్టరీకి తీసుకెళ్లి కూలిపని చేయించా. రోజంతా కష్టపడితే రూ.50 ఇచ్చారు. హోటల్‌కి వెళ్లి టీ ఆర్డర్ చేస్తే 100 ఇవ్వాలి. 'మరి కడుపు నిండాలంటే ఇంకెంత కష్టపడాలో ఆలోచించండి' అని చెప్పా. డబ్బు విలువ తెలుసుకోవడమే కాదు, శ్రమను గౌరవించడం పిల్లలకు తెలియాలి. అదృష్టవశాత్తూ నా పిల్లలు ఆ దారిలోనే ఉన్నారు. మా అబ్బాయి శ్రీసింహా.. దర్శకుడు సుకుమార్ దగ్గర సహాయకుడిగా పనిచేయడానికి మూడు నెలలు ఆఫీసు చుట్టూ తిరిగాడు. ఏ ఒక్కరోజూ 'నేను కీరవాణిగారి అబ్బాయిని' అని చెప్పుకోలేదు. నేనూ సిఫార్సు చేయలేదు. ఒకవేళ నేను అడిగి ఉంటే. తొలి రోజే తనకు ఆ అవకాశం దక్కేది. ఎలాగోలా.. తన ప్రతిభతో ఆ అవకాశం దక్కించుకున్నాడు. ఇదంతా నా భార్య శ్రీవల్లి పెంపకం వల్ల అనుకుంటా.

❑ ఇంట్లో పెత్తనం అంతా మీ శ్రీమతిదేనా?

75 శాతం అనుకోండి. పిల్లలపై ఎప్పుడూ మా ఇష్టాల్ని రుద్దలేదు. వాళ్లకు ఏది ఇష్టమో అది అందివ్వాలని తాపత్రయపడ్డాం.

❑ మీ శ్రీమతికి అంకితం ఇవ్వగలిగే పాట ఏదైనా ఉందా?

నరేష్ నటించిన 'హలో డార్లింగ్' చిత్రంలో 'బెదిరితే భయపడుతుంది వెనుకనే లోకం. తరిమితే పరుగెడుతుంది తెలుసుకో నైజము' అనే పాట ఉంది. సీతారామశాస్త్రి రాసిన ఈ గీతాన్ని బాలు పాడారు. ఈ పాటంటే మా ఆవిడకు చాలా ఇష్టం. తన నైజం ఇలానే ఉంటుంది.

❑ మీకు ఇష్టమైన వాయిద్యం ఏమిటి? నేర్చుకోవాలనుకొని నేర్చుకోలేక పోయిన కళలేమైనా ఉన్నాయా?

పియానో అంటే చాలా ఇష్టం. ప్లే చేయడం వచ్చు. పని ఉన్నా లేకున్నా.. పియానో కనిపిస్తే కాసేపయినా కూర్చుంటా. దాన్ని కొని ఇంట్లో పెట్టుకోలేను. మాది చాలా చిన్న ఇల్లు. పియానో పట్టేంత స్థలం లేదు. అక్కినేని వెంకట్ గారి భార్య జ్యోత్స్న 'మన తాహతుకు తగినట్టు ఇల్లు ఉండాలి.. ఇంటికి తగ్గట్టుగా వస్తువులు ఉండాలి' అని చెబుతుంటారు. ఆ మాట నామీద చాలా ప్రభావం చూపిస్తుంటుంది.

❑ ఇన్ని సినిమాలు చేశారు, అయినా సరే పియానో పట్టేంత ఇల్లు సంపాదించుకోలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది..

కుప్పాల బుల్లిస్వామి నాయుడు అని మా లెక్కల మాస్టారు ఉండేవారండి. ఆయన్ని చూసి లెక్కలతో పాటు చాలా విషయాలు నేర్చుకున్నా. మా తాతగారు జమిందారు. ఆ రోజుల్లో డబ్బుల్ని ఎగజిమ్మేవారు. మా వంతు వచ్చేసరికి మొత్తం ఖాళీ అయ్యింది. మా చిన్నాన్న విజయేంద్ర ప్రసాద్ గారికి లెక్కలు చెప్పడానికి మా తాతయ్య బుల్లిస్వామి నాయుడుగారికి కబురంపారు. 'ఇంటికొచ్చి ట్యూషన్ చెప్పి వెళ్లండ'ని. అయితే మాస్టారు మాత్రం 'నాకంత సమయం లేదు. కావాలంటే మా ఇంటికొచ్చి నేర్చుకుని వెళ్లండి' అని సమాధానం ఇచ్చారు. దాంతో మా తాతయ్యకి కోపం వచ్చి 'నీ జీతం ఎంత' అని అడిగారు. 'నా భార్యా బిడ్డల్ని పోషించుకోగలిగినంత' అని దానికి తగ్గట్టుగానే బదులిచ్చారు మాస్టారు. ఇంతకంటే జీవితానికి సరిపడా పాఠం ఏముంటుందండీ..? నేను కావల్సినంత సంపాదించుకున్నా. ఇల్లు, కారు.. ఉన్నాయి. దానికి మించి ఆశ పడడం ఎందుకు? ఏడు గోతాల కథ మీకు తెలుసు కదా.. ఏడో గోతం ఎప్పటికీ నిండదు. అందుకే అలాంటి దురాశలకు పోవడం నాకు ఇష్టం లేదు.

❑ జీవితంలో డబ్బుల కోసం పనిచేసిన సందర్భాలే లేవా?

ఇన్నాళ్లూ చేసింది డబ్బుల కోసమే. ఇక మీదట డబ్బుల కోసం పనిచేయను. కథ అన్ని రకాలుగా నచ్చితేనే సంగీతం అందిస్తా.

❑ మరి ఈ మధ్య 'జువ్వ' అనే సినిమాకి పనిచేశారు కదా?

2015లో ఒప్పుకొన్న సినిమా అది. 'బాహుబలి 2' ప్రీ రిలీజ్ ఫంక్షన్ తరవాత నేను కఠినమైన నిర్ణయం తీసుకున్నా. ఇప్పుడు చేస్తున్న సినిమాలన్నీ ఆ నిర్ణయానికి లోబడి ఒప్పుకున్నవే.

❑ మీకేమైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకొంటారు?

చిన్నప్పుడు దెయ్యాల కలలు వస్తే.. వెంటనే నిద్రలోంచి లేచి నాన్నగారి పక్కలో పడుకునేవాడ్ని. ఇప్పుడు నాన్నగారికి వయసూపోయింది. శారీరకంగా బలహీనంగా ఉన్నారు. సమస్య వస్తే గనుక ఆయనకే చెబుతా.

- మహమ్మద్ అన్వర్, ఫొటోలు: జయకృష్ణ

❑ ఫలానా సినిమా నుంచి బిట్టు తీసుకోండి అని దర్శకుడు చెబితే.. సంగీత దర్శకుడు అంగీకరించాల్సిందేనా?

'నో' చెప్పే స్థితిలో ఇప్పుడు ఉన్నా. దర్శకుడు చెప్పిన ప్రతి మాట శిరసావహించే స్థితిలోనే ఇప్పటి వరకూ పనిచేశా. ఇక మీదట ఒప్పుకొనే ప్రసక్తే లేదు.

❑ 'బాహుబలి 2' థీమ్ మ్యూజిక్ 'కీలుగుర్రం'లోని ఓ సన్నివేశానికి ఇచ్చిన నేపథ్య సంగీతంతో దగ్గర పోలిక ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై మీ అభిప్రాయం?

'కీలుగుర్రం' సినిమా నేనసలు చూల్లేదు. అనుకోకుండా.. ఆ ఛాయలు నా సంగీతంలో కనిపించినందుకు సంతోషిస్తున్నాను. ఒక్కోసారి దర్శకుడి సూచన మేరకు కొన్ని కొన్ని పాటల్ని అనుకరించాల్సి వస్తుంటుంది.

❑ మిమ్మల్ని బాగా కలచివేసిన పరాజయం ఏమిటి?

నేను అప్పట్లో చాలా సన్నగా ఉండేవాడ్ని. బాలు, ఎస్.జానకి లాంటి వాళ్లని చూసి... లావుగా ఉన్నవాళ్ల మాటలే జనం వింటారు, వాళ్ల గొంతుకకే విలువ ఎక్కువ అని భ్రమపడేవాడ్ని. అందుకే అడ్డదిడ్డంగా లావెక్కిపోయా. లావు ఎన్నిరకాల అనర్థమో.. ఇప్పుడు గ్రహించా. ఎంత ప్రయత్నించినా తగ్గలేకపోతున్నా. ఇంతకు మించిన పరాజయం నా జీవితంలో లేదు.

❑ ఈ లావుతో ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొన్నారా?

అదృష్టవశాత్తూ నాకు బీపీ లేదు. షుగర్ లేదు. ఎంత పని అయినా ఒత్తిడి అనుకోను. దానికి కారణం ఉంది. నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. వంశీ పసలపూడి కథలు, డి.వెంకట్రామయ్య కథలు విరివిగా చదువుతా. పొద్దుటే శ్రీధర్ గారి కార్టూన్లు నవ్విస్తాయి. తెనాలి రామలింగడు అంటే చాలా ఇష్టం. ఆయన హాస్య కథల్లాంటి జీవితం ఇష్టం. ఎదుటివాళ్లు మనల్ని ఎవరైనా వెటకారం చేసినా.. దానిలోని ఎంజాయ్ చేస్తా. ఎప్పుడూ నవ్వుతూ, నవ్వుల్ని కోరుకుంటూ ఉంటా కాబట్టి... ఆరోగ్యంగా ఉంటా.

1 రాజమౌళి..? రాఘవేంద్రరావు..?

రాఘవేంద్రరావు, రాజమౌళి.. వీళ్లిద్దరిలోనూ ఉమ్మడిగా కనిపించే లక్షణం ఒకటుంది. అదేంటంటే... ఇద్దరూ అలవాటైన వ్యక్తులతో పనిచేయడానికి ఇష్టపడతారు. బ్యాచ్‌లను మార్చడం వీళ్లకు అలవాటు లేదు. ఇద్దరిలోనూ ఓ విషయంలో వైరుధ్యం కనిపిస్తుంది. రాఘవేంద్రరావు ప్రయోగాలు చేయడానికి ఆలోచిస్తారు. కొత్తవాళ్లకు అంతగా ఛాన్స్ దొరకదు. రాజమౌళి అలా కాదు.. కొత్త ప్రయోగాలు చేయడానికి వెనుకాడడు. రాజమౌళి విత్తనం చేయగలడు. దాన్ని మొక్కగా పెంచగలడు. రాఘవేంద్రరావు మొక్కని తన పెరట్లో పెంచుకొని దాన్ని మహావృక్షంగా మార్చడంలో నేర్పరి.

2 ఇప్పటి పాటకు సాహిత్యంతో పనిలేదు

అన్ని భాషల్లోనూ పాటలు వింటుంటా. దాదాపుగా అన్ని చోట్లా ఒకే ట్రెండ్ నడుస్తోంది. భాష మారుతోంది గానీ, ఆ సంగీతం ఒకేలా వినిపిస్తోంది. ప్రపంచం మొత్తం ఇంటర్నెట్ ద్వారా అనుసంధానమై పోవడం వల్ల అన్ని చోట్లా పాటలు ఒకేలా ఉన్నాయి. తెలుగులో రాయగలిగే సత్తా ఉన్న గీత కారులు చాలామంది ఉన్నారు. కానీ వాళ్లతో ప్రస్తుతానికి పనిలేదు. ఇప్పటి పాటకు సాహిత్యంతో పనిలేదు. ఇప్పటి గాయకుల్ని చూడండి. డ్యాన్స్ చేస్తూ పాటలు పాడుతున్నారు. వాళ్లందరినీ కూర్చుని పాట పాడమనాలి. అప్పుడే పాడుతున్న పాటపై, అందులోని సాహిత్యంపై దృష్టి ఉంటుందేమో అనిపిస్తోంది. యోగి వేమన కూడా చెట్టు కింద కూర్చునే మంచి విషయాలు చెప్పాడు కదా..

3 అలా ఉండలేకపోతున్నానని బాధ

జగపతి బాబు సోదరుడు రాంప్రసాద్‌ని చూసి కాస్త అసూయ పడ్డాను. ఆయనకు వాల్డన్ అనే బుక్ స్టోర్ ఉంది. ఆయన దినచర్య ఓ పద్ధతి ప్రకారం సాగిపోతుంటుంది. ప్రతీ రోజూ ఒకే సమయానికి నిద్ర లేస్తారు. అల్పాహారం, భోజనం, మధ్యాహ్నం విశ్రాంతి, రాత్రి భోజనం, పడుకోవడం.. ఇలా ప్రతీదీ ఓ సమయం ప్రకారం జరిగిపోతుంటాయి. ఎవరైనా పెళ్లిళ్లకూ, వేడుకలకూ పిలిస్తే.. సున్నితంగానే 'నేను రాను' అనేస్తారు. అలా నేను ఉండలేకపోతున్నానే అని బాధపడుతుంటా. శాంతా బయోటిక్ వర ప్రసాద్‌ని చూసినా ఇలాంటి భావనే కలుగుతుంది. పెళ్లిళ్లకూ, విందులకూ వెళ్తారు. ఎంత బతిమాలినా భోజనం చేయరు. 'నేను ఇంటికెళ్లే తింటానబ్బాయ్' అంటారు. అట్లా నేనూ అనుంటే బాగుంటుంది కదా అనిపిస్తుంటుంది.



4 స్పందన లేకపోతే కళ్లుతిరిగి పడిపోతా

చిన్న వయసులో అద్భుతమైన ప్రతిభా పాటవాల్ని ప్రదర్శిస్తున్నవాళ్లని చూసి చాలామంది ఆశ్చర్యపోతుంటారు. దివ్యాంగులు డ్యాన్స్ చేస్తున్నా కళ్లార్పకుండా చూస్తుంటారు. నాకైతే అవేం ఆశ్చర్యం అనిపించవు. ఎందుకంటే దేవుడిచ్చిన విద్య అది. కానీ పెళ్లిళ్లలో పాటలు పాడేవాళ్లని చూస్తే నాకు బోలెడంత ఆశ్చర్యం వేస్తుంటుంది. వాళ్లేమో గొంతు చీల్చుకుని పాడేస్తుంటారు. కానీ.. ఆ పాటల్ని ఎవ్వరూ వినరు. పాటయ్యాక ఏ ఒక్కరూ క్లాప్స్ కొట్టరు. ఎందుకు పాడుతున్నారో, ఎవరి కోసం పాడుతున్నారో ఆ పాడేవాళ్లకీ తెలీదు. ఆ కళాకారుడికి ఎంత అవమానంగా ఉంటుంది. ఆ అవమానాన్ని దిగమింగుకుని వాళ్లెలా పాటలు పాడుతున్నారు? గుండెని రాయి చేసుకున్నారా? అనిపిస్తుంది. నేనైతే అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేను. నా పాటకి స్పందన లేని వాతావరణం నాకు ఎదురైతే కళ్లు తిరిగి పడిపోతా.

5 కొరత ఉంటేనే భద్రంగా దాస్తాం

1982లో అనుకుంటా. మద్రాస్‌లో నీటి కరవు వచ్చింది. గ్లాసు నీళ్లతో మొహం కడుక్కునేవాళ్లం. కాలకృత్యాలకూ పొదుపే. స్నానం అస్సలు చేసేవాళ్లం కాదు. కొన్ని రోజులకు నీటి సమస్య తీరింది. కావల్సినంత నీరు దొరికింది. ఓ వైపు మొహం కడుక్కుంటుంటే. మరో వైపు నీళ్లు ధారాళంగా పోతుండేవి. మనిషి నైజమే అంత. తేరగా దొరికే ఏ వస్తువుకైనా విలువ ఉండదు. కొరత వస్తే.. భద్రంగా దాచుకుంటాం. ఇప్పుడు ఇంటర్నెట్ కూడా అంతే. 3జీ, 4జీ కాలం వచ్చేసింది. ఇంటర్నెట్ కావల్సినంత స్పీడులో పరిగెడుతోంది. ఆ స్పీడుకి కళ్లాలు వేసి చూడండి. ఒక్కో ఫొటో డౌన్‌లోడ్ అవ్వడానికి పది నిమిషాలు పడుతుందని చెప్పండి.. తప్పకుండా విలువైన, అవసరమైన సమాచారం తెలుసుకోవడానికి మాత్రమే నెట్ వాడతారు. ఇప్పుడు అంతా ఫ్రీనే కదా. అందుకే ఏది కావాలనుకుంటే అది చూస్తున్నారు. ఎంత అగాధంలో దిగిపోవాలో అంతకు దిగిపోతున్నారు.

ఈనాడు సినిమా



రకుల్‌ప్రీత్ సింగ్

'సవ్యసాచి' ఎప్పుడంటే..?



నాగ చైతన్య

నాగ చైతన్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'సవ్యసాచి'. చందూ మొండేటి దర్శకుడు. వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ నిర్మాతలు. నిధి అగర్వాల్ కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో అమెరికాలో మరో షెడ్యూల్ జరగబోతోంది. దాంతో చిత్రీకరణ పూర్తవుతుంది. ఈనెల 18న ఫస్ట్ లుక్ విడుదల చేస్తారు. జూన్ 14న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. మాధవన్, భూమిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. "సాంకేతికంగా ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న చిత్రమిది. మా బృందం మొత్తానికి ప్రత్యేక చిత్రంగా మిగిలిపోతుంది. ప్రస్తుతం నాగచైతన్య, భూమిక తదితరులపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నామ"న్నారు నిర్మాతలు. సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి

కరుణామయుడు... రైతు



ఆర్.నారాయణమూర్తి

సామాజిక.. ఇతివృత్తాలతో చిత్రాలను తెరకెక్కించే ఆర్.నారాయణమూర్తి ఈసారి గిట్టుబాటు ధర దొరకని కారణంగా ఆత్మహత్యలకి పాల్పడుతోన్న రైతుల వ్యథతో 'అన్నదాతా సుఖీభవ' చిత్రాన్ని తనే నటిస్తూ స్వీయదర్శకత్వంలో నిర్మించారు. ఇది స్నేహచిత్ర పతాకంపై ఆయన తెరకెక్కిస్తున్న 30వ చిత్రం. విడుదలకి సిద్ధమైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఆర్.నారాయణమూర్తి విలేకర్లతో మాట్లాడారు. "రైతే రాజు అన్నది ఒకప్పటి మాట. ఇప్పటిది కాదు. ఈనాడు పరిస్థితిని చూస్తుంటే రైతు బికారి అనిపిస్తోంది. వాస్తవానికి పొద్దు తనని తాకకముందే శిలువలా నాగల్ని మోసుకువెళ్లే కరుణామయుడు.. రైతు. ఇదే మా సినిమా నినాదం. అసలు రైతే అన్నదాత. కానీ ఆ అన్నదాత సుఖంగా లేడు. ఆత్మహత్య చేసుకుంటున్నాడు. 1995 నుంచి ఇప్పటిదాకా మూడున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పదేళ్ల కిందట డా॥ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారంగా ఏ ప్రభుత్వాలూ రైతులకి గిట్టుబాటు ధరల్ని అందించేలా కృషి చేయలేదు. నిరాటంకంగా రైతు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. నిజానికి ఈవేళ రైతు సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందినవాడు. ఈనాడున్న పరిస్థితుల రీత్యా కొందరు వ్యవసాయం దండగ అనుకుంటున్నారు. ఈ మాటలో నిజం లేదు. వ్యవసాయం దండగ కాదు పండగ అని మా చిత్రం ద్వారా రుజువు చేసే ప్రయత్నంలో భాగమే ఈ సినిమా. ఇందులో ఎనిమిది పాటలున్నాయి. ప్రజాకవులు రాశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాట అమోఘం. గద్దర్, వందేమాతరం శ్రీనివాస్‌తోపాటు యువగాయకుడు పవన్ చరణ్ పాడిన రెండు పాటలు ఆకట్టుకుంటాయి. మరో మూడు రోజుల్లో సెన్సారును పూర్తిచేసుకుని త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం"అన్నారు.



అతిలోక సుందరి శ్రీదేవి మరణం అభిమానులకే కాదు ఆమెను అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులకు మరింత తీరని లోటు. భర్త బోనీ కపూర్, పిల్లలు జాన్వీకపూర్, ఖుషి కపూర్‌ను అయితే తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. శనివారం జాన్వీ 21వ పుట్టిన రోజు. 20 ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి పుట్టిన రోజు జరుపుకున్న జాన్వీకి ఈ ఏడాది ఆ వేడుక చేయడానికి అమ్మ లేదు. తన తల్లి ఆత్మకు శాంతి కలిగేలా ప్రార్థించమంటూ అభిమానుల్ని కోరింది జాన్వి.

శ్రీదేవితో జాన్వి ↑

పుట్టినరోజు వేళ జాన్వి భావోద్వేగ లేఖ

అమ్మా.... నువ్వు గర్వపడేలా పనిచేస్తా!

"నా పుట్టినరోజున మీ అందరినీ కోరేది ఏంటంటే అమ్మానాన్నలను ప్రేమించండి. మీ ప్రేమను వాళ్లతో పంచుకోండి. ఎందుకంటే మీ పుట్టుకకు కారణం వాళ్లే. అమ్మ అభిమానులారా..మీరు అమ్మపై చూపించిన ప్రేమను ఎప్పటికీ అలాగే కొనసాగించాలని కోరుకుంటున్నాను. అమ్మ జీవితంలో అత్యంత విలువైంది నాన్నతో పంచుకొన్న ప్రేమ. వాళ్ల ప్రేమ అమరమైంది. నేను, ఖుషీ అమ్మనే కోల్పోయాం. నాన్న తన ప్రాణాన్నే కోల్పోయారు. నటి...తల్లి...భార్య... వీటన్నింటిని మించిన వ్యక్తి అమ్మ. ఆమెకు ప్రేమను ఇవ్వడం..తీసుకోవడమే తెలుసు. చికాకు, ఆందోళన, అసూయ ఇవేవీ ఆమెకు తెలియవు. తెలిసిందల్లా ప్రేమ ఒక్కటే. మనం కూడా అలానే ఉందాం. అదే ఆమెకు సంతోషాన్ని కలిగిస్తుంది" అంటూ తన మనసులోని మాటను చెప్పింది జాన్వి. ఇదే సమయంలో తల్లికి భావోద్వేగంతో ఓ లేఖ కూడా రాసింది జాన్వి. ఆ లేఖతో పాటు తల్లితో అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ కొన్ని ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకొంది.

"నా హృదయానికి తగిలిన గాయంతో ఎలా జీవించాలో నేను నేర్చుకోవాలి. జీవితమంతా శూన్యంగా అనిపిస్తున్న సమయంలోనూ నీ ప్రేమను ఆస్వాదిస్తున్నాను. బాధ, విషాదం నుంచి మమ్మల్ని నువ్వే కాపాడుతున్నట్టుగా ఉంది. కళ్లు మూసిన ప్రతిసారీ మంచి జ్ఞాపకాలే గుర్తుకొస్తున్నాయంటే కారణం నువ్వే. సాధ్యమైనంత ఎక్కువరోజులు నువ్వు మాతో ఉండటం మా అదృష్టం. నువ్వు మంచి దానివి, పవిత్రమైన వ్యక్తివి. ప్రేమ మూర్తివి. అందుకేనేమో ఆ దేవుడు నిన్ను తీసుకెళ్లిపోయాడు. 'నువ్వు ఎప్పుడూ చాలా సంతోషంగా ఉంటావు' అని నా స్నేహితులు అంటుండేవారు. దానికి కారణం నువ్వేనని ఇప్పుడు అర్థమవుతోంది. నన్ను ఎవరు ఏమన్నా పట్టించుకోలేదు. నాకేదీ పెద్ద సమస్యగా అనిపించలేదు. ఏ రోజూ నిస్తేజంగా లేదు. ఎందుకంటే అప్పుడు నువ్వు నాతో ఉన్నావు. నేను ఎప్పుడూ ఎవరి మీద ఆధారపడలేదు. ఎందుకంటే నాకు కావాల్సిన ఒకే ఒక వ్యక్తివి నువ్వు.. నువ్వు నా ఆత్మలో భాగం... నువ్వు నా ప్రాణ స్నేహితురాలివి. మా కోసం నీ జీవితాన్నే ఇచ్చావు. ఇప్పుడు నీ కోసం నేనూ ఆ పనిచేస్తా. నువ్వు గర్వపడేలా చేస్తా. నిన్ను చూసి నేను ఎంత గర్వపడ్డానో... నన్ను చూసి నువ్వు గర్వపడే రోజు కోసమే పనిచేస్తాను. ప్రతి ఉదయం ఇదే ఆలోచనతో నిద్రలేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నువ్వు నాలో...ఖుషీలో...నాన్నలో నిండి ఉన్నావు. నీ ప్రభావం మాపై బలమైన ముద్ర వేసింది. మేం బతకడానికి అది చాలు...కానీ నువ్వు లేని లోటుని పూరించడానికి మాత్రం చాలదు.. ఐ లవ్ యు మై ఎవ్రీ థింగ్' అంటూ లేఖను ముగించింది జాన్వి.

కథలొక్కటే చాలవు...

మాట్లాడటమే కాదు... నాకొచ్చే ఆలోచనలూ తెలుగులోనే అని చెబుతుంటుంది రకుల్‌ప్రీత్ సింగ్. అందుకే తెలుగు చిత్రసీమలో ఆమెని ఓ తెలుగమ్మాయిగానే చూస్తుంటారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో చిత్రాలు చేస్తున్నప్పటికీ ఆమె దృష్టి మొత్తం దక్షిణాదిపైనే ఉంది. భాషపై పట్టు పెంచుకోవడం, కథల ఎంపిక విధానం, మీ అందం... వీటిలో మీ కెరీర్‌పై ఎక్కువగా ప్రభావం చూపించిన విషయమేంటి? అని అడిగితే.. "మూడూ... కాకపోతే ఒకొక్కటి ఒక్కో స్థాయిలో ప్రభావం చూపించాయి" అని సమాధానమిస్తోంది రకుల్. "కొత్త సంస్కృతి, సంప్రదాయాల్ని సులభంగా అర్థం చేసుకొంటాను, వెంటనే అలవాటుపడిపోతా. దక్షిణాదిలో నేను కథానాయికగా స్థిరపడటానికి ప్రధాన కారణం అదే. తొలి అడుగుల్లోనే భాషపై పట్టు పెంచుకొన్నా. ఇక ఆ తర్వాత నా అందం. కథానాయికలకి అందమే కదా కీలకం. అది మా అమ్మానాన్నల నుంచి వచ్చింది. కథల ఎంపిక విధానం, నటన అనేది నా సొంత ప్రతిభకి సంబంధించిన విషయాలు. మంచి కథలొక్కటే చాలవు... మంచి కలయికల్నీ దృష్టిలో ఉంచుకొని సినిమాల్ని ఎంపిక చేసుకోవాలి. పాత్రల్లో వందశాతం ఒదిగిపోయేందుకు ప్రయత్నించాలి. అవన్నీ నేను చేశాను కాబట్టి ఇంత దూరం ప్రయాణించా. ఇక్కడ ఎవరి విజయం వెనకైనా సరే, పలు విషయాలు సమ్మిళితమై ఉంటాయి" అని చెప్పింది రకుల్.



నితిన్

గొడవైంది... గురువారం సారీ అంది.. శుక్రవారం

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణచైతన్య దర్శకుడు. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సుధాకర్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రంలోని 'ఫస్టులుక్కు.. సోమవారం, మాట కలిపే.. మంగళవారం, బుజ్జిగుంది... బుధవారం, గొడవైంది... గురువారం, సారీ అంది.. శుక్రవారం" అంటూ వారాలతో సాగే ఓ గమ్మత్తైన పాటని విడుదల చేశారు. తమన్ బాణీ కట్టిన ఈ పాటని కేథరనాథ్ రచించారు. నాకాష్ అజీజ్ పాడారు. ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్ తదితరులు నటిస్తున్నారు. సమర్పణ: నిఖితారెడ్డి

ఇంట్లోనే విడుదల!



అమృత అయ్యర్, సాయిరోనక్, ఛరిష్మాపై క్లాప్‌నిస్తున్న శ్రీకాంత్

ప్రపంచంలోనే తొలిసారి హోమ్ థియేటర్ ద్వారా విడుదలవనున్న సినిమా మాదే అన్నారు వీరశంకర్. ఆయన నిర్మిస్తున్న చిత్రం 'అలా నేను ఇలా నువ్వు'. వి.ఎన్.ఆదిత్య దర్శకుడు. రాజ్‌కందుకూరి సమర్పిస్తున్నారు. సాయిరోనక్, అమృత అయ్యర్, ఛరిష్మా శ్రీకర్, శ్రీప్రియ ప్రధాన పాత్రధారులు. శనివారం హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు శ్రీకాంత్ క్లాప్‌నిచ్చారు. 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో నిర్మాత వీరశంకర్ మాట్లాడుతూ "1986- 1994 మధ్య జరిగే కథ ఇది. భిన్న సంప్రదాయాల మధ్య పెరిగిన యువతీయువకులు భిన్నాభిరుచులకి ఆకర్షితులవుతారు. చివరికి వారు ఆ అభిరుచుల వల్ల ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నారనే ప్రధానాంశంతో తెరకెక్కిస్తున్నాం. ఉన్నత ప్రమాణాలు, సాంకేతిక విలువలతో పెద్ద పెద్ద సెట్స్ వేసి అందర్నీ ఆకట్టుకునేలా చిత్రాన్ని తెరకెక్కిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో పూర్తిచేస్తాం. ఇది హెచ్‌టీఓ క్లబ్ ద్వారా ప్రపంచంలోని హోమ్ థియేటర్స్‌లో విడుదలవుతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమ, యాక్షన్ అంశాలతో కుటుంబ అనుబంధాలకి ప్రాధాన్యతనిస్తూ వినోదాత్మకంగా తీర్చిదిద్దుతాం. మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం" అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "ప్రతిఒక్కరూ ఇంట్లో కూర్చుని చూడాలనే ఉద్దేశంతో రూపొందుతున్న ఈ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అన్నారు. రాజ్‌కందుకూరి మాట్లాడుతూ "ఇంతవరకూ ఎవరూ చేయని కొత్తప్రయత్నాన్ని వీరశంకర్ చేస్తున్నందున ఆయనకి తోడుగా నిలిచాను. ఇది ప్రేక్షకుల్ని ఆహ్లాదపరిచే సరికొత్త కాన్సెప్ట్" అన్నారు. "ఇప్పుడు వినోదరంగంలో పలు సాంకేతికమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ మార్పులకి అనుగుణంగా రూపొందుతున్న చిత్రమిది. మా హెచ్‌టీఓ క్లబ్‌లో సభ్యులైన వాళ్లంతా ఈ సినిమాని చూడొచ్చు. ఈ వినోదం అందరికీ అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో కొత్తగా సభ్యులయ్యేవారికి రాయితీ కూడా ఇస్తున్నాం" అన్నారు క్లబ్ డైరెక్టర్ తేళ్ల వరప్రసాద్. ఈ సమావేశంలో ప్రసాద్, రేలంగి నరసింహారావు, కాశీవిశ్వనాథ్, దేవిప్రసాద్, సంకల్ప్, ఏడిద శ్రీరామ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సంతోష్ శానమోని, సంగీతం: నిహాల్, పాటలు: వనమాలి.

ఎప్పుడేం జరుగునో...



నాగ అన్వేష్

నాగ అన్వేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఏ నిమిషానికి ఏమి జరుగునో..' శ్రీకృష్ణ గొర్లె దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేష్, సిహెచ్.వి.నాగేశ్వరరావు నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో పూజాకార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇది సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో నడిచే చిత్రం. ఎటు వెళ్లాలో తెలియక ఏదో కొత్త ప్రదేశం చేరుకున్న యువకుల జీవితాల్లో ఏ నిమిషంలో ఏం జరుగుతుందనే ఆసక్తికర కథాంశంతో తెరకెక్కిస్తున్నామ"న్నారు. నిర్మాతల్లో ఒకరైన లండన్ గణేష్ మాట్లాడుతూ "శ్రీకృష్ణ చెప్పిన కథ నచ్చడంతో మిత్రుడితో కలిసి ఈ చిత్రాన్ని తీస్తున్నాను. ఓ వారంలో చిత్రీకరణని మొదలెడతాం. మూడు షెడ్యూల్స్‌లో పూర్తిచేస్తామ"న్నారు. నాగ అన్వేష్ మాట్లాడుతూ "సినిమా చూస్తోన్న ప్రేక్షకుడికి ఆద్యంతం ఆసక్తి కలిగించే కథాకథనాలతో సాగుతుంద"న్నారు.

ఆ ఇద్దరూ... అప్పటి ముచ్చట!



ఎన్టీఆర్



ఏఎన్నార్

ఏయన్నార్ వయసులో ఎన్టీఆర్ కన్నా సుమారు 16 నెలలు చిన్న, కానీ సినిమా రంగంలో మాత్రం సుమారు 5 సంవత్సరాల 10 నెలల సీనియర్. 1949లో ఎన్టీఆర్ పరిశ్రమలోకి ప్రవేశించే సమయానికే ఏయన్నార్ బిజీ స్టార్. అప్పటికే 'పల్నాటి యుద్ధం', 'బాలరాజు', 'కీలుగుర్రం', 'లైలా మజ్ను' లాంటి సూపర్ డూపర్ హిట్స్‌తో ఏయన్నార్ టాప్‌లో ఉన్నారు. నాగయ్య, చదలవాడ నారాయణరావు లాంటి సీనియర్ హీరోల కన్నా ఏయన్నార్ లేతగా, గ్లామరస్‌గా కనిపించడంతో నిర్మాతలందరూ ఆయన కోసమే ఎగబడే వారు. పౌరాణికాలు, జానపదాలు ఎక్కువగా వెలువడే ఆ రోజుల్లో అన్ని పాత్రలు ఏయన్నార్‌నే వరించాయి. దాంతో ఆయన అన్ని షిఫ్ట్‌లోను పనిచేయాల్సి వచ్చింది. ఓ దశలో కనీసం నిద్ర కూడా కరవైపోయింది. అప్పుడు ఏయన్నార్‌కి తన ఈడు వాడైన ఎన్టీఆర్ వచ్చాడని తెలిసింది. ఆ రోజుల్లో గొప్పగా భావించే బీయే డిగ్రీ పాసై పరిశ్రమకు వచ్చిన ఎన్టీఆర్‌ని చూడగానే ఆయన పర్సనాలిటీ ఏయన్నార్‌ని ఆకర్షించింది. హమ్మయ్య నా వర్క్ లోడ్ తగ్గించేవాడు వచ్చాడని ఏయన్నార్ అనుకున్నారు. త్వరలోనే ఆ ఇద్దరూ మిత్రులయ్యారు. కానీ పుల్లలు పెట్టేవాళ్లు ఊరుకొంటారా? ఇక ఏయన్నార్ పని సరి - అంటూ ఆ రోజుల్లోనే దుష్ప్రచారం మొదలుపెట్టారు. ఏయన్నార్, ఎన్టీఆర్‌లు అది పట్టించుకోలేదు. ఇద్దరూ కలిసి బ్యాడ్మింటన్ ఆడేవారు. అలా ఆడుతున్నప్పుడే ఎన్టీఆర్‌కి 'పాతాళభైరవి'లో అవకాశం వచ్చింది. ఆ సమయానికి జానపద హీరోగా ఏయన్నార్‌కి మంచి ఫాలోయింగ్ ఉండటంతో ఆయన్ని హీరోగా పెట్టి 'పాతాళభైరవి' తీయాలని విజయా వారు అనుకొన్నారట. కానీ దర్శకుడు కె.వి రెడ్డి మాత్రం "వెయిట్ అండ్ సీ" అనేవారట. ఓరోజు ఏయన్నార్, ఎన్టీఆర్‌లు కలిసి బ్యాడ్మింటన్ ఆడుతుండగా కె.వి రెడ్డి చూశారట. ఎన్టీఆర్ కసిగా షాట్స్ కొడుతున్న తీరు, ఆయన బాడీ లాంగ్వేజ్ కె.వి రెడ్డికి నచ్చాయి. వెంటనే 'పాతాళభైరవి'లో ఎన్టీఆర్‌కి అవకాశం ఇచ్చి ఆయన జీవితాన్ని మలుపు తిప్పారు. ఇక ఏయన్నార్- ఎన్టీఆర్‌ల చిత్రానుబంధానికి వస్తే... ఆ ఇద్దరూ కలిసి 'పల్లెటూరి పిల్ల', 'సంసారం', 'రేచుక్క' (ఇందులో ఏయన్నార్‌ది అతిథి పాత్ర), 'పరివర్తన', 'మిస్సమ్మ', 'తెనాలి రామకృష్ణ', 'చరణదాసి', 'మాయాబజార్', 'భూకైలాస్', 'గుండమ్మ కథ', 'శ్రీ కృష్ణార్జున యుద్ధం', 'భక్త రామదాసు' (ఇద్దరూ అతిథి పాత్రలు వేశారు), 'చాణక్య చంద్రగుప్త', 'రామకృష్ణులు', 'సత్యం శివం' చిత్రాల్లో నటించారు.

కొలిక్కిరాని చర్చలు

తెలుగు రాష్ట్రాల్లో సినిమాల ప్రదర్శనల నిలిపివేత కొనసాగుతోంది. శనివారం కొన్ని మల్టీప్లెక్స్ థియేటర్లలో హిందీ, ఇంగ్లిష్ సినిమాలు మాత్రమే ప్రదర్శితమయ్యాయి. తెలుగు సినిమాలు ఎక్కడా ప్రదర్శితం కాలేదు. వర్చువల్ ప్రింట్ ఫీజు (వి.పి.ఎఫ్) విషయంలో డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకీ, చిత్ర పరిశ్రమకీ మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో మార్చి 2 నుంచి ప్రదర్శనల నిలిపివేత కొనసాగుతోంది. శనివారం కూడా క్యూబ్, యు.ఎఫ్.ఓ డిజిటల్ కంపెనీ ప్రతినిధులకీ, దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీకీ మధ్య మరో దఫా చర్చలు జరిగినప్పటికీ ఫలితాలు రాలేదు. హిందీ, ఇంగ్లిష్ చిత్రాల ప్రదర్శనల్ని కూడా నిలిపివేయాలని మల్టీప్లెక్స్ థియేటర్ల యాజమాన్యాలతో పరిశ్రమ వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నాయి.

షారుఖ్ మేనేజర్ కత్రిన!

షారుఖ్ ఖాన్ సెట్లో ఉంటే ఆ సరదాయే వేరు అని తోటినటులు చెబుతుంటారు. ఎదుటివాళ్లు తనతో కలిసిపోతే షారుఖ్ మరింతగా హుషారు చేస్తారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'జీరో' సినిమా సెట్లోనూ అంతే సందడి కనిపిస్తుంది. ఆ చిత్రంలో నటిస్తున్న అందాల భామ కత్రినాకైఫ్‌ను తన మీడియా మేనేజర్ అనేస్తున్నాడు షారుఖ్. ఆయన నిద్రపోతుంటే..ఆయన వంక చెయ్యి చూపిస్తుంది కత్రినా..మధ్యలో దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ కూడా ఉన్నాడు. ఈ ఫొటోను ట్వీట్ చేశాడు షారుఖ్. "ఈ కంపెనీ చాలా ఆసక్తిగా ఉంటుంది. కళ్లు కూడా తెరవాలి అనిపించడం లేదు. ఉదయాన్నే షూటింగ్ కోసం నిద్రలేపుతున్నారు. (పిక్ కర్టసీ కత్రినా కైఫ్, మై మీడియా మేనేజర్)" అంటూ ట్వీటాడు. మేనేజర్‌గా నిజంగానే తన బాధ్యతను నెరవేర్చేస్తుంది కత్రినా. క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో అనుష్కశర్మ మరో కీలకపాత్రధారి.





"ఇంకెప్పుడూ అబద్ధం చెప్పను నాన్నా, నన్ను కొట్టొద్దు..." అంటూ ప్రాధేయపడుతున్న ఆ పదేళ్ల పిల్లాడిపై తండ్రికి కనికరం కలగలేదు. మంచంపైకి ఎత్తి విసిరేశాడు. అయినా అతని కోపం తీరలేదు. ఓ మూలకు వెళ్లి భయంగా చూస్తున్న ఆ అబ్బాయిని మళ్లీ ఎత్తి కింద వేసి, కాళ్లతో తొక్కి, తన్నాడు. ఏడ్చే ఓపిక లేక ఆ పిల్లాడు సొమ్మసిల్లిపడిపోయాడు. ఇదంతా ఆ అబ్బాయి తల్లే.. ఫోన్‌లో రికార్డు చేసింది. ఆ ఫోను రిపేరుకొచ్చి దుకాణంలో ఇవ్వడం... తరువాత అది వైరల్ కావడం వేరే విషయం అనుకోండి... స్కూల్లో టీచర్లు కొడితే పిల్లలొచ్చి అమ్మానాన్నలకు చెబుతారు. మరి అమ్మానాన్నలే కొడితే... అదీ వెనుకాముందూ ఆలోచించకుండా గాయలయ్యేట్లు చేయిచేసుకుంటే... వాళ్ల భవిష్యత్తు ఏమిటీ... ఆలోచనా విధానం ఎలా ఉంటుందీ... చాలా మారిపోతుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసా.

చిట్టి చిలకమ్మా... అమ్మ కొట్టొద్దు!

పిల్లల్ని స్కూల్లో లేదా ఇంట్లో కొట్టడం చట్టరీత్యా నేరం అని ప్రకటించిన మొదటిదేశం స్వీడన్. ఈ చట్టాన్ని 1979లో తీసుకొచ్చింది. అక్కడ 1960 వరకూ ప్రతి పదిమంది పసిపిల్లల్లో తొమ్మిది మందిని ఇంట్లో తల్లిదండ్రులు కొట్టేవారట. క్రమంగా తల్లిదండ్రుల్లో మార్పు వచ్చి.. కొట్టడం తగ్గించేశారు. చివరకు చట్టమే అందుబాటులోకి వచ్చింది.

పిల్లలు చేసే చిన్నచిన్న పొరపాట్లు కూడా భరించలేక కోపాన్ని అదుపుచేసుకోలేక, పసిపిల్లల్ని తీవ్రంగా కొట్టే తల్లిదండ్రులు మన చుట్టూనే ఉంటారు. పేరుకి అది క్రమశిక్షణలో పెట్టడం అనుకుంటారు కానీ... కాదు. ఇతర దేశాల్లో అయితే పిల్లల్ని కొట్టే తల్లిదండ్రులు ఊచలు లెక్కపెట్టాల్సిందే. ఇటీవల పక్క తడుపుతున్నారనీ ఐదారేళ్ల అబ్బాయిని తలకిందులుగా వేలాడదీసి, కూతుర్ని ఒంటిరెక్కతో పైకెత్తి క్రర్రతో చితకబాదాడో తండ్రి. లేలేత మనసులపై చెడుప్రభావాన్ని కలగజేసే ఈ సంఘటనలు వారిని భవిష్యత్తంతా పీడకలల్లా వెంటాడుతూనే ఉంటాయి. కేవలం అల్లరి, చిలిపి పనులనేకాదు, చదువు విషయంలోనూ అంతే కఠినంగా ఉండేవారూ లేకపోలేదు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంలలో అడపాదడపా ఇలాంటి వీడియోలు కనిపిస్తూనే ఉంటాయి. తాజాగా కాలిఫోర్నియాలో తమ ముగ్గురుపిల్లల్ని ఓ మురికివాడలో ఉండమని చెప్పినందుకు ఆ తల్లిదండ్రులకు ఏడాది పాటు శిక్ష విధించారట.



పోల్చి చూస్తారు...

బంధువుల్లో, తరగతిలో, తోటివారితో తమ పిల్లలను పోల్చి బాధపెడుతుంటారు కొందరు తల్లిదండ్రులు. అలాగే 'అక్కా, అన్నయ్య చూడు ఎంత బాగా చదువుతున్నారో' అంటూ తోడబుట్టినవాళ్లతో పోల్చి కొట్టడం మరో కారణం. తాము అనుకున్నట్టు చదవకపోయినా దాన్నో అవమానంగా భావించే తల్లిదండ్రులు చేతులూ, బెల్టూ, బెత్తానికి పని చెబుతారు. చదవకపోతే, భవిష్యత్తులో తీవ్ర కష్టాలకు గురవుతారనే ఆలోచన కూడా మరో కారణం. దీంతో ఆశాభంగానికి గురై, క్రమశిక్షణ పేరుతో పిల్లలపై చేయి చేసుకుంటారు.

ఎందుకు గుర్తించరో...

కొన్నిసార్లు పిల్లల కోణం నుంచి ఆలోచించరు పెద్దవాళ్లు. వాళ్లకు ఐక్యూ తక్కువగా ఉండొచ్చు. ఏదయినా అనారోగ్యం అయ్యుండొచ్చు. ఇంటి వాతావరణం, తోటి స్నేహితుల ప్రభావం, హైపర్ యాక్టివిటీ డిజార్డర్ వల్ల ఏకాగ్రత లోపించడం, దేన్నీ త్వరగా నేర్చుకోలేకపోవడం, తోటివారితో కలవలేకపోవడం, ఆత్మన్యూనతా, ఒత్తిడి... ఇలా పిల్లల్లోనూ ఎన్నో సమస్యలు ఉంటాయి. వాటిని గుర్తించకుండా చెప్పినట్లు ఎందుకు వినడంలేదంటూ కొట్టడం ఎంతవరకూ సమంజసం చెప్పండి...!

పరిష్కారం లేకపోలేదు...

చిన్నారుల్ని కొట్టేముందు.... ఒక్కక్షణం వాళ్ల కోణంలోకి ఆలోచించడం మంచిదని చెబుతారు మానసిక నిపుణురాలు డాక్టర్ గౌరీదేవి. వారిలో మార్పు తేవాలంటే... కొట్టడం ఒక్కటే పరిష్కారం కాదు. ఇంకేవిధంగానైనా మార్పు తేగలమా అని ఆలోచించగలగాలి.

- కొట్టేముందు ఒక్కక్షణం ఆగడం మంచిది. వాళ్లలో లోపం ఎక్కడుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం మన బాధ్యత.
- వ్యక్తిగత క్రమశిక్షణ లోపించిందా... సామ దానభేదం తరువాతే దండన అనే పద్ధతిని పాటించాలి. మాటలతో మార్చేందుకు ప్రయత్నించాలి. చిన్న తేడా కనిపించినా బహుమతి ఇచ్చి అభినందించాలి. అవసరాన్ని బట్టే బెదిరించాలి. చదువుకైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరం అయితే ఉపాధ్యాయులతో మాట్లాడాలి.
- పిల్లలకు ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలి. వాళ్ల వల్ల పొరపాటు జరిగినా మీరున్నారనే ధైర్యాన్ని కల్పించాలి. భయాన్ని పోగొట్టి.. విషయం ఏదయినా మీతో చెప్పుకొనే స్వేచ్ఛ కల్పించాలి.
- పిల్లల్లో లోపాలు సహజమే. వాటిని లోపాలుగా చూసి, దండించకుండా ఎలా అధిగమించాలో చెప్పగలగాలి. పొరపాట్లు చేస్తే గనుక దానివల్ల కలిగే నష్టాన్ని వివరించాలి.
- చిన్నారుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరిదిద్దే ప్రయత్నం చేయాలి. కారణం ఏదయినా మార్పు తెచ్చేలా చూడాలి తప్ప కొట్టడం మాత్రం పరిష్కారం కానే కాదని అర్థం చేసుకోవాలి.

చిన్నచిన్న కారణాలే...

భారతదేశంలో ప్రతీ ముగ్గురు చిన్నారుల్లో ఒకరు ఇలా అమ్మానాన్నల చేతుల్లోనే దెబ్బలు తింటున్నారని జాతీయ మహిళా శిశుసంక్షేమ శాఖ చేసిన ఓ అధ్యయనం తేల్చింది. దానికి కారణాలేంటని పరిశీలిస్తే... అబద్ధం చెప్పడం, తోటిపిల్లలతో పోల్చినప్పుడు ఒకటి అరా మార్కులు తక్కువగా రావడం, చేతిరాత సరిగ్గా లేకపోవడం, యూనిఫాం పై ఇంకు మరకలూ, వాళ్లకు సంబంధించిన వస్తువులు అంటే పెన్సిల్, రబ్బరులాంటివి తరగతి గదిలో పోగొట్టుకోవడం, చెప్పినమాట వినకపోవడం, వద్దని చెప్పినా సైకిల్ తొక్కడం, మెతుకులు కిందపడేయకుండా తినలేకపోవడం.. ఇలా చిన్నచిన్న విషయాలకే అమ్మానాన్నల చేతుల్లో చిత్రహింసలు అనుభవిస్తున్నారని ఈ అధ్యయనం తేల్చింది.

క్రమంగా లెక్కచేయరు...

కొందరు పిల్లలకు అన్నం కిందపడకుండా తినడం రాకపోవచ్చు. చేతిరాత అందంగా ఉండకపోవచ్చు. అయితే కావాలని పిల్లలు ఇలా చేస్తున్నారనీ, ఎలాగైనా వారిని దారికి తేవాలనే ఉద్దేశంతో నాలుగు దెబ్బలు వేస్తుంటారు. కానీ అది మనసులపై తీవ్ర ఒత్తిడికి దారి తీస్తుంది. అదే కొనసాగితే అమ్మానాన్నల్ని లెక్కచేయడం మానేస్తారు. వాళ్ల మాట ఎందుకు వినాలనే స్థితికి చేరుకుని ఎదిరించడం మొదలుపెడతారు. అమ్మానాన్నలు ఏదైతే మంచిది కాదు అని చెబుతారో దాన్నే చేయాలనుకుంటారు. చెడు స్నేహాలకు, అలవాట్లకు దగ్గరవుతారు. బాల్యం తాలూకు ఆనందాన్ని ఆస్వాదించలేని స్థితికి చేరుకుంటారు. చదువుపట్ల ఆసక్తి తగ్గిపోతుందట. ధైర్యాన్నీ కోల్పోతారు. తోడబుట్టినవారిపై హింసాత్మక చర్యలకు పాల్పడటానికి వెనుకాడరు. చెప్పాలంటే కొట్టడం పెరిగేకొద్దీ సమాజానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదనే స్థితిలోకి వెళ్లిపోతారు.

నాన్న ఆటోవాలా... కూతురు కాబోయే న్యాయమూర్తి!



తండ్రి ఆటోనడిపి సంపాదించిన డబ్బే ఆ కుటుంబానికి ఆదాయం. పైగా నలుగురు పిల్లలు. అలా అని ఆ తండ్రి పిల్లల్ని చదివించకుండా వదిలేయలేదు. తిండికోసం కష్టమైనా సరే సంపాదనంతా పిల్లల చదువులకే పెట్టారు. అదే వాళ్ల భవిష్యత్తును మారుస్తుందని ఆయన నమ్మకం. ఆ నమ్మకం నిజమేనని ఆయన మూడో సంతానమైన పూనమ్ టోడి నిరూపించింది. బుధవారం రోజున ఉత్తరాఖండ్‌లో విడుదలైన ప్రావిన్షియల్ సివిల్ సర్వీసెస్ (జుడీషియల్)-2016 ఫలితాలలో ఆమె రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

పూనమ్ తండ్రి అశోక్ టోడి ఆటో నడుపుతూ రోజుకు నాలుగొందల నుంచి ఐదొందల రూపాయలు సంపాదిస్తే... ఆరుగురి పొట్ట నిండాలి. పైగా ఇద్దరమ్మాయిలూ, ఇద్దరబ్బాయిలు. కానీ వాళ్లని చదివించడంలో మాత్రం ఆయన ఎలాంటి వివక్ష చూపలేదు. 'మొదట్లో నాకు చిన్న కిరాణా కొట్టు ఉండేది. దాంతో వచ్చే ఆదాయం సరిపోయేది కాదు. అందుకే డెహ్రాడున్‌కు వచ్చి ఆటో నడపడం మొదలెట్టాను. వాళ్ల లక్ష్యాలకు డబ్బు అడ్డు రాకుండా పెంచాలనుకున్నాను. నాకున్న కల ఈ రోజు నా కూతురు నిజం చేసింది' అంటారు పూనమ్ తండ్రి. పూనమ్ ఇంటర్ తర్వాత బీకామ్‌లో చేరింది. కానీ ఆమెకు న్యాయవృత్తి మీద ఆసక్తి ఉండడంతో డిగ్రీ తర్వాత ఎల్‌ఎల్‌బి ఎంచుకుంది. వెంటనే సివిల్స్ జ్యుడీషియల్ పరీక్షలకు సన్నద్ధం అవ్వడం ప్రారంభించింది. రెండు సార్లు పరీక్ష రాసినా ఇంటర్వ్యూలో చుక్కెదురయ్యింది. అయినా పట్టువదలకుండా 2016 లోనూ పరీక్ష రాసింది. ఈసారి ఊహించని రీతిలో మొదటి ర్యాంకు సంపాదించింది. 'చదువు పూర్తయ్యాక ఏదైనా ఉద్యోగంలో చేరితే మా కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండొచ్చనుకున్నా. కానీ మా నాన్న ఎప్పుడూ ఉద్యోగం చెయ్యమని నన్నడగలేదు. ఇంకా చదువుతానన్నా కూడా ఆయన అడ్డు చెప్పలేదు. కేవలం మా కుటుంబ సహకారంతోనే ఎమ్‌కామ్, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేయగలిగాను. రెండు సార్లు ఓడిపోయినా వాళ్లు నన్ను నిరుత్సాహ పరచలేదు. నువ్వు సాధించగలవంటూ నా వెన్ను తట్టారు. అదే నాకు ఈసారి విజయం తెచ్చిపెట్టింది. జడ్జికాబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని అంటుంది పూనమ్. 'ఈ హోలీ మాకు చల్లని కబురు తీసుకొచ్చింది. ప్రతి ఆడపిల్లలోనూ ఇలాంటి ప్రతిభే ఉంటుంది. వాళ్లకు ఊతమిస్తే తల్లిదండ్రులనే ఉన్నత స్థానాల్లో ఉంచుతారు' అంటారు పూనమ్ తల్లి లత.

శ్రీవారిని కలవబోతున్నా...

నాకు పెళ్లి కుదిరింది. నాతో మాట్లాడటానికి నాకు కాబోయే శ్రీవారు వస్తున్నారు. టీ తాగడానికి ఆయనతో బయటకు వెళ్లాలి. ఇలాంటప్పుడు నేను ఏ దుస్తులు వేసుకుంటే బాగుంటుందో తెలియడంలేదు.

– ఓ సోదరి

కాబోయే శ్రీవారిని కలిసి మాట్లాడటానికి వెళుతున్నారు. కాస్త ట్రెండీగా కనిపించాలనుకుంటే క్యాజువల్స్ అంటే జీన్స్ ఎంచుకుని చూడండి. దానిపై చొక్కా లేదా టాప్ వేసుకుంటే చాలు. అయితే కాస్తంత ఆకర్షణీయమైన వర్ణంలో ఎంచుకోవాలి. లేదా సాదా పూల డిజైను బాగుంటుంది. చేతులకూ, చెవులకు యాక్సెసరీలు చాలా సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి. ఇక వారి కుటుంబాన్ని గనుక కలవాల్సి వస్తే వర్క్ చేసిన చుడీదార్ అయితే అదిరిపోతుంది. అది కూడా ఆకట్టుకునేలా కాస్త ఆడంబరంగా ఉండేలా చూసుకోవాలి. చేతికి చిన్న వాచీ, ఇంకో చేతికి ఓ బ్రేస్‌లెట్ పెట్టుకుని జుట్టు వదిలేస్తే చాలు. బాగా సంప్రదాయంగా కనిపించాలనుకుంటే సన్నటి అంచు లేదా చాలా తక్కువ పనితనం ఉన్న షిఫానుచీరపై, హైనెక్ బ్లవుజు ఎంపిక బాగుంటుంది. మెడలో చిన్న పెండెంట్ ఉండే గొలుసు, చేతికి గాజులు నప్పుతాయి. చీరపై కూడా పెద్ద పెద్ద డిజైన్లు లేకుండా చూసుకోవాలి.

డియర్ వసుంధర



ధన్యాగుత్తా
ఫ్యాషన్ డిజైనర్

– మీ సందేహాలను, సమస్యల్ని vasufashion@eenadu.net కు పంపించగలరు.

రెప్పలపైనా కన్సీలర్

ముఖంలో చిన్నచిన్న మచ్చలు కనిపించకుండా ఉండేందుకు కన్సీలర్ వాడతాం కదా... అయితే దాన్ని మరికొన్ని విధాలుగానూ ఉపయోగించుకోవచ్చు. అదెలాగంటే...




- కళ్ల అడుగునా, ముక్కుకు రెండువైపులా, కింది పెదవి దగ్గర కూడా కొద్దిగా రాసుకుని చూడండి. ముఖంలో మొదలైన సన్నటి గీతలు కనిపించకుండా ఉంటాయి.
- పెదవులకు... మందమైన బ్రష్‌తో కాస్తంత కన్సీలర్ తీసుకుని పెదవుల చివర అవుట్ లైన్‌లా గీయాలి. ఆ తరువాత లిప్‌స్టిక్ వేసుకోవచ్చు. పెదవులు నిండుగా కనిపిస్తాయి.
- తీరైన కనుబొమల కోసం... మీ చర రంగు కంటే లేత రంగులో ఉన్న కన్సీలర్‌ను ఎంచుకోవాలి. దీనివల్ల కనుబొమలు తీరైన ఆకృతిలో, కొనదేలినట్లుగా కనిపిస్తాయి.
- కనురెప్పలపై ఐషాడో రాసుకునే ముందు... కొద్దిగా కన్సీలర్‌ని అద్దడం మరవకండి. దానివల్ల కనురెప్పలు మెరుస్తున్నట్లు కనిపిస్తాయి.
- నిద్రలేమి వల్ల కళ్లు ఉబ్బినట్లు అవుతాయి. ఇలాంటప్పుడు కన్సీలర్‌ను ఐ క్రీమ్‌తో కలిపి కళ్ల అడుగున రాసుకోవాలి. ఆ వాపు కనిపించకుండా ఉంటుంది.

దుపట్టాలే అలంకరణగా...



పెళ్లి వంటి పెద్ద వేడుకలే కాదు... పుట్టినరోజు, వివాహావార్షికోత్సవాలు..కిట్టీ పార్టీలు వంటి సందర్భాలు ప్రతి ఇంట్లోనూ తరచూ జరుగుతూనే ఉంటాయి. ఇలాంటప్పుడు అలంకరణ కూడా కాస్త భిన్నంగా ఉంటేనే కదా.. బాగుంటుంది. తక్కువ శ్రమతో అవసరానికి ఉపయోగపడేలా అలంకరణ ఎలా చేసుకోవచ్చో చూద్దాం.



- ఇంట్లో పాత జరీ, సాదా దుపట్టాలూ, చీరలు వాడి పక్కన పెట్టేసినవి ఉండే ఉంటాయి కదా! వాటిల్లో కాస్త కాంతిమంతమైన రంగులను ఎంచుకోండి. హాలులో వాటిని నచ్చిన ఆకృతిలో రెండు రంగుల్లో కానీ, ఒకే రంగు ఛాయల్లో కానీ అందంగా వేలాడదీయండి. దానికి తగ్గట్లే దివాన్, సోఫాల్లో ఉండే కుషన్లూ, బెడ్‌షీట్లనూ మార్చేస్తే సరిపోతుంది.
- సులువుగా, కళగా ఉండేలా చేయగల మరో అలంకరణ పామ్‌పామ్ బాల్స్. రంగు రంగుల ఊలుదారాలను తీసుకుని వాటిని అరచేతికి చుట్టుకుని చివరగా మధ్యలో ఓ దారాన్ని కట్టాలి. తరువాత చక్కగా కత్తిరిస్తే పామ్‌పామ్ బాల్స్ తయారవుతాయి. వీటిని నచ్చిన రంగుల్లో పూలదండలా కడితే గోడకూ, తలుపుల దగ్గరా వేలాడదీయొచ్చు. అలానే రంగు రంగుల కాగితాలతో కత్తిరించిన నక్షత్రాలూ, హృదాయాకృతుల్ని కూడా వేలాడదీయొచ్చు.



- వాడి పక్కన పెట్టేసిన టిన్‌లు ఉంటాయి కదా! వాటిని నచ్చిన డిజైన్‌తో రంధ్రాలు చేయండి. చివరిగా వాటికి వేర్వేరు రంగులతో పెయింట్ వేయాలి. ఆరనిచ్చాక రాత్రిపూట వాటిల్లో కొవ్వొత్తులు ఉంచి, ఇంటికి నలుమూలలా పెట్టినా, వేలాడదీసినా సరే! ఆ అందమే వేరు.








ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు!



ఏవైనా దూరప్రయాణాలు చేస్తున్నప్పుడూ, అనుకోకుండా ఏదైనా అవసరం వచ్చినప్పుడు అవాంఛిత రోమాలు తొలగించుకోవడం కాస్త ఇబ్బందే. దానికంటూ ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ ఈ 'పోర్టబుల్, ట్రావెల్ రేజర్' మన దగ్గరుంటే ఆ పని సులువైపోతుంది. దీంట్లో ఉండే మూడు అరల్లో నీళ్లను స్ప్రే చేసే సీసా, అవాంఛిత రోమాలను మృదువుగా చేసే సబ్బు, రెండు రేజర్లు ఉంటాయి. సబ్బూ, బ్లేడును అవసరమైనప్పుడల్లా మార్చుకోవచ్చు కూడా. దీన్ని బ్యాగూ, పర్సులో పెట్టుకుని తీసుకువెళ్లడం కూడా సులువే.

నజరానా: నీళ్లసీసాల్లో కొద్దిగా నిమ్మరసం, చెంచా వంటసోడా, ముప్పావువంతు నీళ్లు నింపి పక్కన పెట్టేయాలి. అరగంటయ్యాక కడిగేస్తే వాటిలో దుర్వాసన పోతుంది.



బంగారం వెండి

3 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,550	-------	31,400	31,350
ఆర్నమెంట్	29,400	-------	29,200	29,100
వెండి (కిలో)	39,800	-------	39,700	39,700
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	31,400	31,380	31,250	31,040
ఆర్నమెంట్	29,120	29,090	29,220	29,040
వెండి (కిలో)	39,800	39,700	39,000	38,900
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,380	31,160	-------	-------
ఆర్నమెంట్	29,190	28,980	2,922	2,904 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.60	41.40 గ్రా

నలభీమపాకం

నిమిషాల్లోనే వంట ఉద్యమం!

చికెన్ బిర్యానిని ఆరు నిమిషాల్లో... మటన్ బిర్యాని పన్నెండు నిమిషాల్లో చేయొచ్చంటారు రాంకీ! తక్కిన కూరలయితే ఆరు నిమిషాల్లోపేనట. అబ్బే ఇందులో మాయాలేదు... మర్మం లేదు... వండే విధానం తెలిస్తే అది సాధ్యమే అనే రాంకీ ఇందుకోసం ఓపీఓఎస్(వన్‌పాట్..వన్ షాట్) ఉద్యమాన్ని తీసుకొచ్చారు. ఈ ఓపీఓఎస్ ఉద్యమంలో రాంకీతోడుగా పదిహేనువేలమంది నలభీమ సైన్యం ఉన్నారు. విషయంలోకి వస్తే... చాలా మంది గృహిణులు వంటకోసం గంటలకొద్దీ సమయాన్ని వెచ్చిస్తూ సమయమంతా వంటకోసమే ఖర్చవుతోంది అంటారు. వంట సమయాన్ని తగ్గించడం కోసం తమిళనాడుకు చెందిన రాంకీ చాలా ప్రయోగాలు చేసిన తర్వాత ఈ ఓపీఓఎస్ ఉద్యమానికి





తెరలేపారు. ఈ ఓపీఓస్‌లో ప్రెజర్ కుక్కర్ ప్రధాన ఆయుధం. ఒత్తిడిని సరైన పద్ధతిలో ఉపయోగించుకుంటే నిమిషాల్లో వంట అయిపోతుందని అంటారు రాంకీ. దానికి కావాల్సిన చిట్కాలని కూడా సామాజిక మాధ్యమాల ద్వారా వివరిస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల ద్వారా ప్రెజర్‌కుక్కర్ ఉపయోగించి నిమిషాల్లో వంటని ఎలా పూర్తిచేయడమో నేర్పిస్తున్నారు. ఒక్క రాంకీ మాత్రమే కాదు... రాంకీ దారిలో నడుస్తున్న భోజనప్రియులు అందించే ఓపీఓఎస్ వంటకాలని మీరు కూడా సామాజిక మాధ్యమాల్లో చూసిచేసుకోవచ్చు.

అస్త్రం


రసాయనాలుంటే చెబుతుంది!

మనం తినే ఆహారం మంచిదా కాదా? చూడ్డానికి బాగానే ఉంది కానీ ఎక్కడ పండించారో.... ఇందులో రసాయనాలు ఉన్నాయేమో వంటి సందేహాలు రావడం సహజమే. అయితే అలా సందేహపడుతూ తినాల్సిన అవసరం లేదు. గ్రీన్‌టెస్ట్ పరికరం మీ చేతిలో ఉంటే! దీన్ని ఉపయోగించడం కూడా తేలికే. అరచేతిలో ఇమిడిపోయే ఈ పరికరంతో పండ్లు, కాయగూరలు, మాంసం వంటి వాటిల్లోని నైట్రేట్లు చుట్టూ ఉన్న పరిసరాల నుంచి వచ్చి చేరిన రసాయనాల శాతాన్ని పరీక్షించవచ్చు. ఈ పరికరంతో పరీక్షించాలనుకున్న కాయగూరని గుచ్చితే చాలు పరికరం తెర ఎరుపు, పసుపు, పచ్చ రంగుల్లోకి మారుతుంది. ఎరుపులో ఉంటే నైట్రేట్ల శాతం ఎక్కువగా ఉన్నట్టు లెక్క. పసుపులో ఉంటే ఆలోచించాల్సి ఉంటుంది. పచ్చ రంగులో ఉంటే తినడానికి అనుమతి ఉన్నట్టే!



మారాం చేసే పిల్లల కోసం...

కొంతమంది పిల్లలు గుడ్డంటే గుటుక్కుమనిపిస్తారు. కొందరు మాత్రం తిననంటే తిననని మారాం చేస్తారు. కొంతమందికి దాని రంగూ రుచీ, వాసన ఆకృతి కూడా నచ్చవు.



అలాంటి పిల్లలకు పోషకాలని నిండుగా అందించే గుడ్డుని ఇలా తినిపించొచ్చు.

ఒక పాన్‌లో కొద్దిగా నూనె పోసి అది వేడెక్కే లోపు... రంగురంగుల క్యాప్సికమ్‌ని అర అంగుళం వెడల్పుతో రింగుల మాదిరిగా కత్తిరించి వేయాలి. వీటి లోపల గుడ్డుని కొట్టి వేసేయాలి. దానిపై కొద్దిగా మిరియాల పొడీ, ఉప్పు చల్లుకుంటే పిల్లలు ఇష్టంగా తింటారు. లేదంటే... మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో స్టెయిన్‌లెస్ స్టీల్ మూసలు దొరుకుతున్నాయి. వాటిల్లో వేసిచ్చినా తినేస్తారు.



మినీఇడ్లీ..
బుల్లెట్ఇడ్లీ...
మైక్రోఇడ్లీ...
బటన్ఇడ్లీ..
బేబిఇడ్లీ

పేరేదైనా మన పెద్ద ఇడ్లీకి చిన్నచెల్లిలా ఉంటుంది. మామూలు ఇడ్లీని చూసి తినని మారాం చేసే పిల్లలు దీన్ని చూస్తే మాత్రం ముచ్చటపడతారు. మసాలాఇడ్లీ, కాక్‌టెయిల్ ఇడ్లీ, పొడిఇడ్లీలను కాదనకుండా తినేస్తారు. పిల్లలే కాదు... పెద్దలు కూడా ఇష్టంగా తినే ఈ ఇడ్లీ తయారిపై ఓ లుక్కేద్దాం.

చిన్ని చిన్ని చందమామలు

పిల్లల లంచ్ బాక్సు విషయంలో అమ్మలకెప్పుడూ సమస్యే. ఏం పెట్టినా తిననని మారాం చేస్తారు. ఇక ఇడ్లీ అనగానే ఇంట్లో పెద్ద యుద్ధమే అయిపోతుంది పిల్లలతో! కానీ.. ఇడ్లీని పోషకాలపరంగా ఎంత పొడిగినా తక్కువే. తేలిగ్గా జీర్ణమవుతుంది. కార్బోలను, ప్రొటీన్లని సమంగా అందించే గొప్ప వంటకం. ఆవిరిమీద ఉడుకుతుంది కాబట్టి... నూనెతో సమస్య ఉండదు. ఎదిగే పిల్లలకు, ఊబకాయంతో బాధపడేవారికి ఎంతో చక్కని ఉపాహారం ఇది. పల్లీచట్నీతోనో... సాంబార్‌తోనో కలిస్తే తిరుగులేని కాంబినేషన్ అవుతుంది. అయితే కాస్త ఓపిక చేసుకుంటే మామూలుగా సాదాసీదాగా కనిపించే ఇడ్లీని కాస్తా అద్భుతమైన రుచిగా మార్చేయొచ్చు. కొత్తగా ముస్తాబుచేసి పిల్లలకు వెరైటీగా వండి వార్చేయొచ్చు. ఇందుకు పెద్దగా ఏం అవసరం లేదు. ఇంట్లో ఉండే... టమాటా కెచప్, కరివేపాకు పొడి వంటివి ఉన్నా చాలు. లంచ్ బాక్సులో రంగురంగుల బటన్ ఇడ్లీలు సిద్ధం.

బటన్ ఇడ్లీ కోసం

మినపప్పు- కప్పు, ఇడ్లీరవ్వ- రెండు కప్పులు, ఉప్పు- తగినంత

తయారీ: మినపప్పు, ఇడ్లీరవ్వని రాత్రి విడివిడిగా నానబెట్టుకోవాలి. తెల్లారి పప్పు రుబ్బుకుని రవ్వలో నీళ్లు లేకుండా వార్చుకుని పిండిలో కలుపుకోవాలి. ఉప్పు కలిపి రెండుగంటలు పక్కన పెట్టుకుని అప్పుడు ఇడ్లీలు వేసుకుంటే గుల్లగా, మృదువుగా వస్తాయి.

మసాలా ఇడ్లీ



కావల్సినవి: బటన్ ఇడ్లీలు- కప్పు, నూనె- రెండు చెంచాలు, కరివేపాకు, ఇంగువ- పావుచెంచా, ఆవాలు- పావుచెంచా, ఉల్లిపాయ ముక్కలు- పావుకప్పు, పచ్చిమిర్చి- మూడు(నిలువుగా చీల్చినవి), పసుపు- కొద్దిగా, టమాటా కెచప్- రెండు చెంచాలు, కారం- చెంచా, నిమ్మకాయ- సగం చెక్క, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- చెంచా

తయారీ: కడాయిలో నూనె వేసి ఇంగువ, కరివేపాకు, ఆవాలు, పచ్చిమిర్చి, పసుపు వేసుకుని వేయించాలి. అవి వేగాక ఉల్లిపాయలు వేసి రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఇడ్లీలు, టమాటాకెచప్, ఉప్పు, కారం వేసి వేయించి చివరిగా నిమ్మరసం, కొత్తిమీర వేసి దించేయాలి.

పొడి ఇడ్లీ



కావల్సినవి: బటన్ ఇడ్లీలు- ఒక కప్పు, ఇడ్లీపొడి కోసం- పల్లీలు- చెంచా, నువ్వులు- రెండు చెంచాలు, సెనగపప్పు- చెంచా, మినపప్పు- అరచెంచా, ఎండుమిర్చి- మూడు, కొబ్బరి- ఒకటిన్నర చెంచా, జీలకర్ర- అరచెంచా, తాలింపుకోసం- నెయ్యి లేదా నువ్వుల నూనె, చిటికెడు బెల్లం, చింతపండు గుజ్జు (ఈ రెండూ ఇష్టమైతే వాడుకోవచ్చు), ఉప్పు- తగినంత

తయారీ: పాత్రలో ఇడ్లీలు పెట్టి అవి ఉడుకుతున్న సమయంలోనే.. ఒక కడాయిలో ఎండుమిర్చి, సెనగపప్పు, మినపప్పు, నువ్వులు, పల్లీలు, జీలకర్ర విడిగా వేయించుకుని పొడికొట్టుకోవాలి. తర్వాత ఒక కడాయిలో నువ్వుల నూనెతో తాలింపు వేసుకుని అందులో అందులో ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసిన తర్వాత బటన్ ఇడ్లీలు కూడా వేసి వేయించుకుని కొబ్బరికోరు, ఇందాక మనం చేసుకున్న పల్లీపొడి కూడా వేసుకుని బాగా కలుపుకోవాలి. పైన నెయ్యి వేసి వడ్డిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.

కాక్‌టెయిల్ ఇడ్లీ




కావల్సినవి: బటన్ సాదా ఇడ్లీలు- పాతిక, పసుపు లేదా ఫుడ్ కలర్ వేసి చేసిన పసుపురంగు ఇడ్లీలు- పది, ఇడ్లీ పొడి(తయారి విధానం పక్కన ఉంది)- చెంచా, కరివేపాకుపొడి- అరచెంచా, నిమ్మరసం- అరచెంచా, నెయ్యి- చెంచాన్నర, నువ్వులనూనె- చెంచా, ఉప్పు, ఇంగువ, పసుపు- తగినంత

తయారీ: ఒక కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి చెంచా ఇడ్లీపొడి వేసి అందులో బటన్ ఇడ్లీలు కొన్నింటిని తీసుకుని వేయించండి. వాటిని పక్కనపెట్టి ఇప్పుడు మళ్లీ చెంచా నెయ్యి వేసి కరివేపాకు పొడి వేసి అందులో మిగిలిన ఇడ్లీలు కూడా వేసి వేయించుకోవాలి. ఇప్పుడు ఒక పాత్రలో ఇడ్లీపొడి వేసినవి, కరివేపాకుపొడి వేసినవి, పసుపు వేసినవి కలపండి. అంతే రంగురంగుల కాక్‌టెయిల్ ఇడ్లీరెడీ. పిల్లలు వీటిని ఇష్టంగా తింటారు.

కరివేపాకు పొడి: కరివేపాకు- అరకప్పు, మినపప్పు- చెంచా, ఎండుమిర్చి- ఆరు, ఉప్పు- తగినంత, కొబ్బరికోరు- చెంచాన్నర

తయారి: అన్నింటిని పొడిగా నూనె లేకుండా వేయించుకుని పొడికొట్టుకోవాలి.

రవ్వబటన్ ఇడ్లీ



కావల్సినవి: బొంబాయి రవ్వ- కప్పు, పెరుగు- కప్పు, జీడిపప్పు- పది, వంటసోడా- చిటికెడు, జీలకర్ర, ఆవాలు, మినపప్పు, సెనగపప్పు, నూనె, కరివేపాకు, ఇంగువ, అల్లం తురుము- తాలింపుకోసం, ఉప్పు- తగినంత.

తయారీ: ఒక కడాయిలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, మినపప్పు, సెనగపప్పు, కరివేపాకు, ఇంగువతో తాలింపు పెట్టుకోవాలి. దీనికి అల్లంతురుము, పచ్చిమిర్చి కూడా వేయించి పచ్చివాసన పోయిన తర్వాత బొంబాయి రవ్వకూడా వేసి వేయించుకోవాలి. రవ్వ చల్లారిన తర్వాత... పెరుగు వేసి కలుపుకోవాలి. కావల్సినంత నీళ్లు కొద్దిగా వంటసోడా వేసుకుని ఇడ్లీపిండిలా జారుగా కలపాలి. ఎక్కువ సమయం తీసుకోకుండా బటన్ ఇడ్లీ పాత్రకి నూనె రాసుకుని పిండి అందులో వేసుకోవాలి. పదినిమిషాల్లో ఇడ్లీలు ఉడికిపోతాయి. మరీ వేడిగా ఉండగానే తీసేయకుండా కాస్త చల్లారిన తర్వాత తీస్తే ఇడ్లీలు చక్కగా వస్తాయి.

కసూరిమేతి వేసి నెయ్యి తాలింపు పెడితే...!

ప్రజ



కొందరు వండితే పప్పు ఘుమఘుమలాడుతుంది. పక్కన నంజుకోవడానికి ఏం లేకపోయినా తినేయొచ్చు. నేను పప్పులో అన్నీ వేస్తున్నా సరే చప్పగా ఉంటోంది. ఆ వాసన కాని.. రుచి కానీ ఉండటం లేదు. ఏం చేస్తే పప్పు రుచి పెరుగుతుంది?

నిజమే పప్పు రుచి అందరికీ ఒకేలా ఉండదు. కొందరు వండితే చాలా రుచిగా ఉంటుంది. కొందరు వండితే రుచిపచీ లేకుండా ఉంటుంది. రుచిగా ఉండటానికి... పప్పు ఎంపికలోనే జాగ్రత్త వహించాలి. నాసిరకం పప్పు ఎంత ఉడికించినా ఉడకదు. అదే నాణ్యమైన పప్పుని ఎంచుకుంటే చక్కగా ఉడికి రెట్టింపు అవుతుంది. రంగూ బాగుంటుంది. చాలామంది తక్కువ ధరకి వస్తుంది కదాని నాసిరకం పప్పుని ఎంచుకుంటారు. అది ఎంత వేస్తే అంతే ఉంటుంది పరిమాణంలో. రంగు, రుచి ఉండవు. అలాగే పప్పుని వండటానికి ముందే.. అరగంటపాటు నానబెట్టుకోవాలి. ఇలా చేస్తే త్వరగా.. పూర్తిగా ఉడుకుతుంది. అలాగే నీళ్లు తగినన్ని వేయాలి. చాలామంది అయితే ఎక్కువ...లేకపోతే తక్కువ వేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. కప్పుకి రెండు కప్పుల నీళ్లు వేయాలి. పప్పు మరీ పేస్ట్‌లా ఉడికిపోతే కూడా దానికి రుచి ఉండదు. పప్పు ఆకారం తెలిసేలా ఉండాలి. కాయగూరలు వేస్తే ఇంకాస్త ఎక్కువ నీళ్లుపోయాలి. పప్పులో ఇంగువ వేస్తున్నారా?



శ్రీదేవి
హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

అలా వేస్తుంటే.. పొడిరూపంలో ఉండే ఇంగువని తాలింపులో మాత్రమే వేయాలి. గట్టిగా రాయిలా ఉండేదాన్ని పప్పులో వేసి కూడా ఉడికించుకోవచ్చు. ఎందుకంటే పొడి రూపంలో ఉండే ఇంగువకి ఘాటు ఎక్కువగా ఉండదు. పుల్లని రుచి ఉండే చుక్కకూర వంటి ఆకుకూరలతో కలిపి వండుతుంటే పప్పులో అరచెంచా మెంతులు వేస్తే మంచి రుచి వస్తుంది. అలాగే తాలింపుని కూడా నెయ్యితో పెడితే ఆ రుచి ప్రత్యేకంగా ఉంటుంది. తాలింపులో ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లిపాయ, కరివేపాకు, మినపప్పు, ఎండుమిరపతో పాటు నచ్చితే అప్పుడే తురిమిన కొత్తిమీర కూడా వేయొచ్చు. ఇందులో కసూరిమేతిని నలిపి వేస్తే వాసన, రుచి బాగుంటాయి. నేతితో తాలింపు వేసిన తర్వాత మూతపెట్టేస్తే ఆ వాసన పప్పుకి అంటుకుని బాగుంటుంది. ఎండుకారం కన్నా... పచ్చిమిర్చి కారమే బాగుంటుంది.

పక్కాలోకల్



బార్కాస్‌లో... షవర్మా!

తింటే హైదరాబాద్ బార్కాస్ షవర్మానే తినాలనుకునే భోజనప్రియులు కూడా ఉన్నారు. షవర్మా రుచి కన్నా.. దాన్ని చేసే విధానం ప్రత్యేకంగా, ఆసక్తిగా ఉంటుంది. అవ్వడానికి అరబ్బీ వంటకమే అయినా మన నగరాల్లో ప్రాచుర్యంలోకి వస్తున్న వంటకం ఇది..

పొడవాటి స్టీల్‌రాడ్‌కి నిలువెత్తు.. పొరలుపొరలుగా పేర్చిన మటన్‌ని అన్నివైపుల నుంచి కాలుస్తూ... ఉంటే అదేదో పుస్తకాల దొంతర పేర్చినట్టుగా ఉంటుంది. అలా పేర్చిన మటన్‌ని పొడవాటి చాకుతో సన్నగా కత్తిరించి ఆ ముక్కలని కొత్తిమీర, కీరదోస ముక్కలు, టమాటా ముక్కలు, రంగురంగుల క్యాప్సికం ముక్కలు, మయోనైజ్‌ని కలిపి.. మెత్తని ఖుబూస్ రొట్టెలో ఉంచి ఇస్తారు. వేడివేడిగా షవర్మాని తింటూ ఉంటే ఆ రుచిని మాటల్లో వర్ణించడం కష్టమే. బార్కాస్, పాతబస్తీ ప్రాంతాల్లో ఈ షవర్మా దుకాణాలు కనిపిస్తాయి. షవర్మా తయారికోసం ప్రత్యేకంగా యంత్రాలు ఉంటాయి. ఎదురుగా లోహపు మెష్ ఉండి... స్టెయిన్‌లెస్‌స్టీల్ రాడ్ ఒకటి ఉంటుంది. ఈ రాడ్‌కి మారినేట్ చేసి, వంటనూనె పట్టించిన మటన్‌ని సన్నగా స్లైసుల్లా తరిగి ఒకదానిపై ఒకటి గుచ్చుతూ వెళ్తారు. ఒక్కోరాడ్‌కి సుమారు యాభైకేజీల మటన్‌ని గుచ్చుతారు. ఈ రాడ్ బర్నర్‌కి అభిముఖంగా ఉంటుంది. బర్నర్ నుంచి వచ్చే వేడి మటన్‌కి అన్నివైపులా తగలాలి కాబట్టి స్టీల్‌రాడ్ గుండ్రంగా తిరుగుతూ ఉంటుంది. దాంతో మొత్తం మటన్ అన్ని వైపులా సన్నసెగపై దోరగా వేగిపోతుంది. అలా బాగా కాలిన మటన్‌ని చాకుతో కోస్తూ... వేడివేడిగా కొత్తిమీర, సిమ్లామిర్చి కలిపి మయొనైజ్‌ని కలుపుతారు. మయొనైజ్‌ని గుడ్డు, ఆలివ్‌నూనెలతో కలిపిచేస్తారు. ఈ మిశ్రమాన్ని మెత్తని అరేబియా ఖుబుస్ రొట్టెల్లో ఉంచి రోల్స్ మాదిరిగా చుడతారు. ఇప్పుడు నగరంలో చికెన్ షవర్మా కూడా అందుబాటులో ఉంది. దీన్ని చిరుతిండిగా తింటారు. ఒక్కో షవర్మా ఖరీదు డెభ్బైనుంచి ఎనభై రూపాయల వరకూ ఉంటుంది.



పాతికవేల కోట్లు హాంఫట్



గతవారం అమెరికా స్టాక్‌మార్కెట్లు నష్టపోతున్న క్రమంలో, బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ వారెన్ బఫెట్ ఎంత సంపద కోల్పోయారో తెలుసా.. 3 రోజుల్లోనే సుమారు రూ.25,000 కోట్లు (3.74 బిలియన్ డాలర్లు). ఇదే సమయంలో ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌కు వచ్చిన నష్టం 3.71 బి.డాలర్లు. ఆల్ఫాబెట్ కంపెనీ అధినేతలైన లారీ పేజ్, సెర్గి బ్రిన్ చెరి 3 బిలియన్ డాలర్లు కోల్పోయారు. స్పెయిన్‌కు చెందిన అమాన్సియో ఆర్టెగాకు 2.5 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడిందని బ్లూంబర్గ్ బిలియనీర్ సూచీ వెల్లడించింది.

* ప్రపంచంలోని 500 మంది కుబేరులు కలిపి 128 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.32 లక్షల కోట్లు) నష్టపోయారని తెలిపింది. నెట్‌ఫ్లిక్స్ లేదా మెక్‌డొనాల్డ్స్ కార్పొరేషన్ మార్కెట్ విలువ కంటే ఈ మొత్తం అధికం. ఇందులోనూ అమెరికా కుబేరుల వాటాయే ఎక్కువ. వీరే 55 బి.డాలర్లు కోల్పోయారు. చైనా అపర సంపన్నులు 14 బి.డాలర్ల మేర నష్టపోయారు.

మనుషులను చంపేస్తున్నాయ్

క్రిప్టోకరెన్సీపై బిల్‌గేట్స్



'బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలు మనుషులను చంపేస్తున్నాయ్. ఎలా అంటారా.. చట్టవిరుద్ధంగా లభించే ఫెంటానిల్ వంటి డ్రగ్స్ కొనుగోలుకు క్రిప్టోకరెన్సీలు వాడుతున్నారు. ఈ డ్రగ్స్ వాడిన వారు చనిపోతున్నారు. అంటే నేరుగా చావు కొనితెచ్చుకునేందుకు క్రిప్టోకరెన్సీ సాంకేతికత ఉపయోగపడుతోంది. లావాదేవీ వివరాలు నిగూఢంగా ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఇది మంచిది కాదు. క్రిప్టోకరెన్సీల ప్రధాన లక్షణం అజ్ఞాతవాసం. ఇది సరికాదు. అక్రమంగా నగదు బదిలీ వ్యవహారాలు జరిగే మనీలాండరింగ్, పన్ను ఎగవేతలు, తీవ్రవాదులకు నిధులు అందడం వంటివి కనుగొనే సామర్థ్యం ప్రభుత్వాలకు ఉండటమే మంచిది. క్రిప్టోకరెన్సీల విలువ భారీగా పెరుగుతుందనే అంచనాలతో, పెట్టుబడులు పెట్టడం కూడా అత్యధిక నష్టభయంతో కూడినదే'.

- బిల్ అండ్ మెలిండా గేట్స్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

ఈనాడు బిజినెస్ వారాంతం

వాలెట్ వినియోగంపై కేవైసీ కత్తెర

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియకు ఈ నెలాఖరు వరకు గడువుంది. పేటీఎం వంటి మొబైల్ వాలెట్లకూ అదే గడువు అని భావించి, నిర్లక్ష్యం వహించారా.. అయితే మీకు కొంత ఇబ్బంది తప్పదు. ఇప్పటికే వాలెట్‌లో ఉన్న నిధులు వాడుకోవడం మినహా, 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ)' ప్రక్రియ పూర్తి చేసేవరకు కొత్తగా నిధులు జమ చేసేందుకు, నిధులను వేరే ఖాతాలకు బదిలీ చేసేందుకు వీలు కాదు. వాలెట్ల కేవైసీ పూర్తికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇచ్చిన గడువు ఫిబ్రవరి 28తో ముగియడమే ఇందుకు కారణం. కేవైసీ పూర్తి చేసుకున్నాకే, మళ్లీ పాత ఖాతాను యథావిధిగా వినియోగించుకోవచ్చు.

- ధ్రువీకరణ నమోదు చేస్తేనే కొత్తగా నిధుల జమ
- ఎస్ఎంఎస్‌తో పూర్తి చేయొచ్చు
- నెల గరిష్ఠ పరిమితుల తగ్గింపు

పెద్దనోట్ల రద్దు అనంతరమే కాదు.. ఇప్పటికీ ఏటీఎంలలో నగదు లభ్యత ఇప్పటికీ అరకొరగా ఉంటున్నందున పేటీఎం, మొబిక్విక్, ఫ్రీఛార్జ్, ఫోన్‌పే వంటి మొబైల్ వాలెట్ల వినియోగం అధికంగా ఉంటోంది. ఎయిర్‌టెల్, జియోమనీ, అమెజాన్‌పే, ఓలామనీ వంటి వాలెట్ల వినియోగం కూడా పెరుగుతోంది. ప్రారంభంలో మొబైల్ బిల్లులు చెల్లించేందుకు వినియోగించినా, ఇప్పుడు విద్యుత్తు, నీరు, గ్యాస్, మెట్రో, ఇంటర్నెట్-డీటీహెచ్ బిల్లులతో పాటు బస్, రైలు, విమానటికెట్ల కొనుగోళ్లు, హోటల్ గదుల బుకింగ్, వాహనాల బుకింగ్, సినిమా-ఇతర వినోద ప్రదర్శనల టికెట్ బుకింగ్, విద్యాసంస్థలు - దుకాణాల్లో చెల్లింపులకూ, టోల్, ఇతర చలానాలకూ ఈ వాలెట్లను వినియోగించే వీలు కల్పిస్తున్నందున, వీటి ప్రాధాన్యత పెరుగుతోంది. ఇతరులకు నగదు బదిలీ చేసేందుకూ ఇవి ఎక్కువగా ఉపయోగ పడుతున్నాయి. ప్రస్తుతం దేశంలో వాలెట్ విపణి రూ.12,000 కోట్ల స్థాయికి చేరిందని అంచనా.



మొబైల్ బ్యాంకింగ్ ఉన్నా..

మొబైల్ బ్యాంకింగ్ వినియోగించే వారు కూడా, వాలెట్లను ఎందుకు వాడుతున్నారనే సందేహం వస్తుంది. బ్యాంక్ ఖాతాలో అధికమొత్తం నిధులు ఉండొచ్చు. అందువల్ల చిన్నపాటి బిల్లులు చెల్లించేందుకు ఈ ఖాతాను వినియోగిస్తే, ఎక్కడైనా 'రహస్య సమాచారం' వెల్లడవుతుందనే సందేహాలూ ఉన్నాయి. అదే వాలెట్లలో అయితే రూ.5,000-10,000 జమ చేసుకుని, సులభంగా బిల్లులు చెల్లిస్తే సరిపోతుందని భావిస్తున్నారు. తమ వాలెట్‌ను వినియోగించుకుని, బిల్లులు చెల్లిస్తే, ఎంతో కొంత మొత్తాన్ని నగదు వెనక్కి (క్యాష్‌బ్యాక్) ఇస్తామని వాలెట్లు ప్రకటించడమూ ఇందుకు కారణం. బ్యాంక్ ఖాతాలేని కుటుంబసభ్యులు ముఖ్యంగా విద్యార్థులు కూడా మొబైల్ ద్వారా చిన్నపాటి కొనుగోళ్లు జరిపేందుకు ఇది ఉపకరిస్తుండటంతో, కుటుంబపెద్దలు వీటిని వినియోగించుకునేందుకు ముందుకొస్తున్నారు.

కేవైసీ ఎందుకంటే..

మొబైల్ ఆధారంగా, వాలెట్లలో పేరు, మొబైల్‌నెంబరు, పాస్‌వర్డ్ నమోదు చేసుకుని, ఖాతాను ప్రారంభించే సౌలభ్యం ప్రారంభంలో కల్పించారు. బ్యాంక్ ఖాతా నుంచి వాలెట్‌కు, వాలెట్ నుంచి బ్యాంక్ ఖాతాకు నిధులు బదిలీ చేసుకునే వీలుంది. వాలెట్ ఖాతాల మధ్య నిధులు బదిలీ చేసుకోవచ్చు. నగదుతో ముడిపడిన వ్యవహారం కావడంతో వాలెట్ల దుర్వినియోగమూ మొదలైంది. మోసపూరితంగా ఇతరుల ఖాతాల నుంచి నగదును అపహరిస్తున్నవారు, వెంటనే వాలెట్లలోకి బదిలీ చేసుకోవడం ద్వారా, ఇష్టం వచ్చినట్లు వాడుతున్నారు. చట్టానికీ వీరు దొరకడం లేదు. అందుకే బ్యాంక్ ఖాతా తరహాలో కేవైసీ పూర్తి చేయమని ఆర్‌బీఐ కోరుతోంది.

ఈ ధ్రువీకరణల్లో ఏదైనా ఒకటి చాలు

✦ ఆధార్ ✦ పాస్‌పోర్ట్ ✦ డ్రైవింగ్‌లైసెన్స్ ✦ నారెగా ఉపాధి కల్పనకార్డులలో ఏదైనా ఒకటి ఉన్నా, వాలెట్ కేవైసీ నిబంధనలు పూర్తి చేయొచ్చు. సంబంధిత వాలెట్ల వినియోగం కోసం మాత్రమే అయితే, వీటిల్లో ఏ ధ్రువీకరణ పత్రం ప్రకారం సంఖ్య, ఇతర వివరాలు యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. ఇందువల్ల ఈ వాలెట్లను దుర్వినియోగం చేయకుండా చూడొచ్చు.

రూ.10,000 వరకు కనీస కేవైసీ

రూ.10,000 వరకు నిర్వహించుకునే వాలెట్ ఖాతాకు కేవైసీని కనీస స్థాయి అమలవుతోంది. వీరు ఇతరుల వాలెట్, బ్యాంక్ ఖాతాకు నగదు పంపలేరు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులు, ఇతర బుకింగ్‌లు చేసుకోవచ్చు. దేశీయ వాలెట్ విపణిలో ఇవే 90 శాతం ఉంటాయి. అమెజాన్‌పే వంటి వాలెట్లలో నెలకు రూ.20,000 వరకు నగదు జమ చేసుకుని, వినియోగించుకునే వీలుండేది. ఇప్పుడు రూ.10,000కు పరిమితం చేశారు. పేటీఎం పరిమితిని కూడా తగ్గించినట్లు సమాచారం. మొత్తం వాలెట్ల లావాదేవీల్లో, దేశీయంగా వ్యక్తుల మధ్య నగదు బదిలీ 50 శాతం వరకు ఉంటుందని, కేవైసీ నిబంధన వల్ల ఇవి అధికంగా స్తంభించాయని ప్రీపెయిడ్ చెల్లింపుల సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) లేఖ రాసింది. పేర్కొంది. దేశీయంగా దూరప్రాంతాలకు కూలిపనులకు వెళ్లిన వారు కూడా, మొబైల్ సాయంతో, ఎవరి మధ్యవర్తిత్వం లేకుండా తమ ఆదాయాన్ని కుటుంబసభ్యుల వాలెట్లకు పంపగలుగుతున్నారు. గతంలో తెలిసిన వారికి, అనధికారికంగా నగదు బదిలీ చేసేవారికి ఇచ్చేవారు. మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని కోరింది.

మినహాయింపులు కుదరవు: ఆర్‌బీఐ

బ్యాంకింగ్ వ్యవస్థకు కొనసాగింపుగానే వాలెట్లు పనిచేస్తున్నందున, కేవైసీ ప్రమాణాల నుంచి మినహాయింపు కుదరదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అయితే ఫిబ్రవరి 28లోపు కేవైసీ పూర్తిచేయని వాలెట్ ఖాతాదారుల నగదు ఎక్కడికీ పోదని, కొనుగోళ్లు-బిల్లుల చెల్లింపునకు ఆ మొత్తాన్ని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్తగా నగదు జమచేయాలన్నా, ఇతరులకు బదిలీ చేయాలన్నా కేవైసీ పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేసింది.

ఖాతాదారుల నిరసన

కేవైసీ పూర్తిచేయండి అని వాలెట్ల నుంచి ఎస్ఎంఎస్‌లు వస్తున్నా, చదువు లేని వారు గమనించలేకపోయారు. ఈనెల 1 నుంచి వాలెట్లలో నిధులు జమచేయడం వీలు కాకపోవడంతో, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సంస్థల ప్రతినిధుల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ప్రస్తుత వాలెట్ వినియోగదార్లు ప్రతి 10 మందిలో 8 మంది కేవైసీ పూర్తి చేయలేదన్నది సంస్థల అంచనా. కేవైసీ పూర్తిచేస్తే నగదు ప్రోత్సాహకాలను సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఆ ప్రతిపాదన భస్మాసుర హస్తమే

- అమెరికా, వాణిజ్య భాగస్వాములకూ నష్టం
- ఉక్కు, అల్యూమినియం టారిఫ్‌ల పెంపుపై ఐఎంఎఫ్



వాషింగ్టన్: అమెరికాలోకి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై భారీగా దిగుమతి సుంకం విధించాలన్న అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం వల్ల, అమెరికా దాని వాణిజ్య భాగస్వామ్య దేశాల ఆర్థిక వ్యవస్థలకూ నష్టం వాటిల్లుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. వాణిజ్య విభేదాలపై అన్ని దేశాలు కలిసి నిర్మాణాత్మక పరిష్కారాలను అన్వేషించాలని సూచించింది. దేశంలోని తయారీ సంస్థలను ఆదుకునేందుకు, దిగుమతి అయ్యే ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ వెల్లడించిన సంగతి విదితమే. ఈ నిర్ణయం వల్ల అమెరికాకు ఆయా లోహాలను ఎగుమతి చేసే దేశాలతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకూ నష్టం వాటిల్లుతుందని ఐఎంఎఫ్ పేర్కొంది. ఉక్కు, అల్యూమినియం అధికంగా వినియోగించే అమెరికాలోని తయారీ, నిర్మాణరంగాలకూ కష్టాలు తప్పవని ఐఎంఎఫ్ ప్రతినిధి జెర్రీ రైస్ వివరించారు. అమెరికా ప్రతిపాదనలు చూస్తే, జాతీయభద్రతా నిబంధనలకు అనుగుణంగా దిగుమతులపై పరిమితులు విధిస్తున్నారనేలా ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా, దాని వాణిజ్య భాగస్వాములంతా నిర్మాణాత్మకంగా కలిసికట్టుగా పనిచేసి, విభేదాలు తగ్గించుకోవాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి అత్యవసర చర్యలకు దిగవద్దనేది తమ సూచనగా తెలిపారు.

కీలక మిత్ర దేశాల ఆగ్రహం: ట్రంప్ ప్రతిపాదనపై అమెరికా కీలక భాగస్వాములైన కెనడా, ఐరోపా సమాఖ్య, ఆస్ట్రేలియా, మెక్సికో కూడా ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమ ప్రయోజనాలు పరిరక్షించుకునేందుకు, కఠిన చర్యలతో ప్రతిస్పందిస్తామని ఐరోపా కమిషన్ చీఫ్ జీన్ క్లాడ్ జంకర్ పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయాలు ఆమోదయోగ్యం కావని కెనడా, జర్మనీ తెలిపాయి.

ఇంతకన్నా మార్గం లేదు: ట్రంప్

ట్రంప్ మాత్రం 'వాణిజ్య యుద్ధాలు మంచివే' అని తన నిర్ణయాన్ని సమర్థించుకున్న సంగతి విదితమే. వాణిజ్యం రూపేణ అమెరికా వందల కోట్ల డాలర్లను నష్టపోతోందని, అందువల్ల వాణిజ్య యుద్ధంలో గెలవడం సులభమేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాను, కార్మికులను కాపాడుకోవడమే తన కర్తవ్యమని, వాణిజ్యలోటును తగ్గించేందుకే ఉక్కు, అల్యూమినయంపై సుంకాలు విధిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

మిత్ర దేశాలకూ మినహాయింపు లేదు: ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మిత్ర దేశాలకూ దీన్నుంచి మినహాయింపు ఇవ్వరని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఏ దేశ ఉత్పత్తులకైనా సుంకం ఒకే విధంగా విధిస్తారని, ఇదే విషయాన్ని అధ్యక్షుడు స్పష్టం చేశారని తెలిపారు. మినహాయింపులు ఇవ్వడం ప్రారంభిస్తే, అంతు ఉండదనేది ట్రంప్ అభిప్రాయమన్నారు. కొన్ని దేశాల ఉత్పత్తులకు మినహాయింపు ఇస్తే, ఇతర దేశాల దిగుమతులపై మరింత అధిక సుంకం విధించాల్సి వస్తుందన్నారు.

సందర్భాన్ని బట్టి ఉండొచ్చు: అయితే సందర్భానుసారం మినహాయింపులు ఉండవచ్చని, పేరు బహిర్గతం చేయడానికి ఇష్టపడని మరో అధికారి తెలిపారు. దిగుమతి సుంకం వల్ల కార్ల వంటి ఉత్పత్తుల ధరలు పెరుగుతాయన్న నివేదికలను తిరస్కరించారు. అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించడం వల్ల, 6 సీసాల బీర్ ప్యాక్ ధర పెన్నీ మేర పెరుగుతుందని, ఇది గుర్తించదగ్గదే కాదని తెలిపారు. 'ఇతర దేశాలు అనుసరిస్తున్న విధానాలకు అనుగుణంగానే ట్రంప్ చర్యలున్నాయి. అమెరికా దేశ, ఆర్థిక భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందువల్ల దేశీయ పరిశ్రమ వృద్ధి చెంది, అధిక నైపుణ్యం గల కొత్త ఉద్యోగాలు వస్తాయి.. వారికి అధిక వేతనాలూ లభిస్తాయి' అని వివరించారు. ప్రపంచంలోనే అమెరికా అత్యంత తక్కువ సుంకాలు విధిస్తున్నా, అందుకు తగ్గట్లు ఇతర దేశాలు వ్యవహరించడం లేదని, ఫలితంగా 50,000 కోట్ల డాలర్ల (రూ.32.50 లక్షల కోట్ల) డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడుతోందని విశ్లేషించారు.

సంప్రదింపులు జరుపుదాం: చైనా

బీజింగ్: ఆర్థికాంశాల్లో విభేదాలపై అత్యున్నత స్థాయిలో సంప్రదింపులు ప్రారంభిద్దామని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ వాణిజ్య సలహాదారుల్లో ప్రథముడైన లీహు, అమెరికా వాణిజ్యవేత్తలతో చెప్పారు. అమెరికా ఆర్థిక శాఖ మాజీ మంత్రి హాంక్ పాల్సన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారని ఈ సమావేశ వివరాలు తెలిసిన వ్యక్తి వెల్లడించారు. వాణిజ్య ఒత్తిళ్లు తగ్గేందుకు తాము ముందడుగు వేస్తామని, అమెరికా డిమాండ్లు ఏమిటో తెలుసుకుని, ఈ నెలలోనే చర్యలు ప్రారంభిస్తామని చైనా ఆర్థిక సలహాదారు చెప్పారన్నారు. చైనా నుంచి అధికంగా ఎగుమతులు అమెరికాకు జరుగుతున్న నేపథ్యంలో, వాణిజ్య విభేదాలు తీవ్రమవకుండా చూసేందుకు వాషింగ్టన్‌కు లీ వచ్చారని సమాచారం.

అధైర్యపడకండి

- దిద్దుబాటు మార్కెట్ మంచికే
- షేర్ల ధరలు అధికంగా పెరగడం వల్లే
- ఇప్పట్లో సూచీలు రికార్డు స్థాయిలను చేరుకోకపోవచ్చు
- రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా

స్టాక్ మార్కెట్ అనూహ్య కదలికలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. పుంజుకుంటోందని అనుకునే లోపే మళ్లీ నష్టాల్లోకి.. మరింత నష్టం రావొచ్చని భావించగానే తిరిగి లాభాల్లోకి వెళ్తూ ఓ ఆట ఆడుకుంటోంది. గత వారంలో మార్కెట్ కదలాడిన తీరే ఇందుకు నిదర్శనం. అంతేనా నెల క్రితం యమజోరు మీదున్న సూచీలు.. కొన్ని రోజులుగా డీలాపడ్డాయి. రికార్డు స్థాయిలకు కూడా దూరమై పోయాయి. ఇలాంటి పరిస్థితిలో ఎలా వ్యవహరించాలనే విషయంపై ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మదుపర్లకు పలు సలహాలు, సూచనలు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



మార్కెట్ మళ్లీ మరింత పైకి వెళ్లడానికి ముందు దిద్దుబాటు కావాల్సిన అవసరం ఉంది. అందువల్ల ప్రస్తుత దిద్దుబాటు అవుతుండటాన్ని చూసి మదుపర్లు అధైర్యపడొద్దు. అయితే ఇటీవలి గరిష్ఠ స్థాయిలను మళ్లీ అంత త్వరగా చేరకపోవచ్చు. అధిక వ్యాల్యూయేషన్లు ఇందుకు కారణం. ముఖ్యంగా మధ్య తరహా కంపెనీల షేర్ల పీఈ నిష్పత్తి మోతాదుకు మించి ఉంది. ఇది అంత శుభసూచకం కాదు.

✦ సొంత నిర్ణయాలు శ్రేయస్కరం కాదు..

పెట్టుబడులు పెట్టడమంటే ఆషామాషీ పని కాదు. వృత్తినిపుణుల సహాయం, పర్యవేక్షణ ఎంతో అవసరం. ముఖ్యంగా కొత్త మదుపర్లు మదుపు చేసే విషయంలో సొంత నిర్ణయాలు అసలే తీసుకోకూడదు. అనుభవజ్ఞులు, నైపుణ్యవంతులైన మదుపర్ల సలహాలు, సూచనలు పాటించి పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరం. క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (సిప్) ద్వారా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం తెలివైన పనే. మార్కెట్ కదలికలు ఎలా ఉన్నప్పటికీ.. ఓ సగటు మదుపరి ప్రతి నెలా కొంత మొత్తాన్ని మదుపు చేయాలి. సిప్‌ల్లో మదుపరు చేసే మదుపర్లు మార్కెట్ దిద్దుబాటు అయినప్పుడు ఆందోళనకు లోనుకావడం లేదంటే మార్కెట్ జోరు మీదుంటే ఆనందపడటం చేయకూడదు. మన స్టాక్ మార్కెట్ల పరుగు కూడా కొనసాగే అవకాశం ఉంది. అయితే ఎన్ని దశాబ్దాల పాటు ఇది కొనసాగుతుందో నేను చెప్పలేను. అయితే సమీపకాలంలో స్వల్ప శ్రేణిలోనే చలించవచ్చని కొందరు దిగ్గజ మదుపర్లు భావిస్తున్నారు.

✦ ఏ ధరకు కొంటున్నామో ముఖ్యం

ఒక షేరును కొనే ముందు కొన్ని ముఖ్య అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏ షేరును కొనుగోలు చేస్తున్నామనే దాని కంటే ఏ ధరకు, ఏ సమయంలో కొనుగోలు చేస్తున్నామనే ముఖ్యం. అలాగే కంపెనీకి ఉన్న వృద్ధి అవకాశాల ఆధారంగా కూడా షేర్లను ఎంపిక చేసుకోవాలి. చిన్న తరహా కంపెనీల షేర్లపై చిన్న చూపు చూడకూడదు. వీటిల్లో కొన్నింటికి దిగ్గజ కంపెనీగా మారే సామర్థ్యం కూడా ఉంటుంది. అలాంటి వాటిని ముందుగానే గుర్తించి పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు పొందే వీలుంటుంది. వీటన్నింటితో పాటు మనం ఒక షేరుపై పెట్టుబడి పెట్టినప్పుడు ఎంతో ఓపికతో ఎదురుచూడటం ఎంతో అవసరం. కొన్నైతే పెరగకుండా అక్కడక్కడే కదులుతూ విసుగు తెప్పిస్తాయి కూడా. అయితే మనం సహనం కోల్పోకూడదు. ఆ కంపెనీకి సంబంధించి ఒక్క మంచి పరిణామం చోటుచేసుకుంటే.. షేరు పరుగుతీయడం ప్రారంభిస్తుంది.

✦ ఎల్‌టీసీజీకి సరైన సమయం కాదు.

దీర్ఘకాల మూలధన లాభంపై 10 శాతం పన్ను విధించడం సహేతుకమే. అయితే దానిని ప్రవేశపెట్టిన సమయం ఇది కాదని నేను అనుకుంటున్నాను. కంపెనీల ఆదాయాల్లో వృద్ధి కొనసాగుతుందని నమ్ముతున్నాను. మున్ముందు దేశీయ సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు తగ్గుముఖం పట్టొచ్చు. ఎన్నికల ఏడాది కారణంగా మార్కెట్‌కు తీవ్ర ఒడుదొడుకులు ఎదురయ్యే అవకాశం ఉంది. పీఎస్‌బీ కుంభకుణం మార్కెట్‌ను ఆందోళనలోకి నెట్టివేసింది.

రంగాలపై ఎలా..

- 2018-19లో ఐటీ రంగం మెరుగైన పనితీరును కనబరుస్తుందని ఆశిస్తున్నాను.
- అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ)కు సంబంధించి ఆంక్షలు తొలిగితే ఔషధ షేర్లు తిరిగి రాణించడం ప్రారంభం అవుతుంది.
- విమానయాన రంగంపై సానుకూల ధోరణితో ఉన్నాను. ఇదో ఓ మంచి వ్యాపారం. ఈ రంగ వృద్ధి కొనసాగుతుంది.
- మోదీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రక్షణ సామగ్రి తయారీ రంగం షేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.
- లోహ రంగాల షేర్లు మంచి పనితీరును కనబరుస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రాణిస్తుండటం ఇందుకు కారణం. అయితే ఎంత కాలం పాటు ఇది కొనసాగుతుందో చెప్పలేం.



కోడిగుడ్లు

3నఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	రూ.345	వరంగల్	రూ.347
చిల్లరగా ఒక గుడ్డు	రూ.4.05	నమక్కల్	రూ.370
4వ తేదీకి		వైజాగ్	రూ.350
విజయవాడ, గోదావరి	రూ.340	చిత్తూరు	రూ.378

సిరి రేపటి సంచికలో



కాంగ్రెస్ పతనం పరిపూర్ణం

● ఈ విజయం.. ప్రభుత్వంపై అబద్ధాల ప్రచారానికి ప్రజలిచ్చిన జవాబు ● ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడి



శనివారం దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీని సన్మానిస్తున్న భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా

దిల్లీ

కాంగ్రెస్ పార్టీ మునుపెన్నడూ ఈ స్థాయిలో క్షీణించలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం.. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాప్తి చేసిన భయాలు, అబద్ధాలు, గందరగోళానికి ప్రజలు ఓటుతో ఇచ్చిన సమాధానమని స్పష్టం చేశారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో శనివారం భాజపా ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని పరోక్షంగా విమర్శిస్తూ.. కొంతమంది హోదా ప్రకారం ఎదిగినా స్థాయిపరంగా కుచించుకుపోతారనీ, అందుకు విరుద్ధంగా భాజపా అధ్యక్షుడు అమిత్‌షా పార్టీని పలు రాష్ట్రాల్లో గెలుపు బాటలో నడిపిస్తూ ఎదుగుతున్నారని వ్యాఖ్యానించారు. పార్టీ విజయాల వెనక రూపశిల్పి ఆయనేనని ప్రశంసించారు. జూన్ తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు నమూనాలా మీరొక్కరే మిగిలిపోతారంటూ తాను ఇటీవల పుదుచ్చేరి సీఎం వి.నారాయణస్వామితో పేర్కొన్నానన్నారు. కాంగ్రెస్‌లో మీరే అత్యంత అదృష్టవంతులని చెప్పానన్నారు. ఏప్రిల్-మే ఎన్నికలతో కర్ణాటకలోనూ అధికారం కోల్పోయి ఆ పార్టీ పుదుచ్చేరిలో మాత్రమే అధికారంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ పాలిత పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్‌ను ప్రస్తావిస్తూ ఆయన 'స్వతంత్ర సైనికుడని' వ్యాఖ్యానించారు. ఆయనగానీ, వారి పార్టీగానీ ఒకరినొకరు తమదిగా భావించడం లేదన్నారు. ఈశాన్య ప్రాంత ప్రజలు పరాయీకరణ భావనతో ఉండేవారనీ, తమ ప్రభుత్వం కృషితో ఆ భావనను తొలగించామన్నారు. గత నాలుగేళ్లలో కేంద్ర మంత్రులు ఆయా రాష్ట్రాల్లో ఎక్కువ సమయం గడుపుతూ అంతకుముందు సంవత్సరాల్లో జరగని స్థాయిలో వారి సమస్యల పరిష్కారానికి కృషిచేశారన్నారు. కొంతమంది విపక్ష నేతలు, వారి సంతానంపై అవినీతి తదితర కేసుల్లో క్రిమినల్ చర్యలు తీసుకున్నప్పుడు ప్రతీకార చర్యగా ప్రచారం చేస్తున్నారనీ, కానీ.. అది అవినీతిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ప్రజల తీర్పని పేర్కొన్నారు. విపక్షాలు ఓటమిని క్రీడాస్ఫూర్తితో తీసుకోవడం లేదన్నారు. భాజపా కార్యకర్తలు పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటకల్లో రాజకీయ హింసకు బలయ్యారనీ, ఇప్పుడు ఒడిశాలో కూడా అదే జరుగుతోందన్నారు. త్రిపుర గెలుపును ప్రాణాలు విడిచిన భాజపా కార్యకర్తలకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. సూర్యాస్తమయం ఎరుపు రంగుతో నిండి పోతుందనీ, అదే సూర్యోదయం కాషాయ వర్ణంతో మెరుస్తుందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం దిల్లీని ఈశాన్య ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్లిందన్నారు. ప్రధాని ప్రసంగిస్తున్నప్పుడు సమీపంలోని మసీదుల నుంచి ప్రార్థనలు వినిపించినపుడు స్వల్పవిరామం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాని మోదీని అమిత్‌షా నేతృత్వంలో సీనియర్ నేతలు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు సత్కరించారు.



అగర్తలాలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో నృత్యాలు చేస్తున్న భాజపా మహిళా కార్యకర్తలు

శూన్యం నుంచి శిఖరానికి..

అభివృద్ధి అజెండా, పార్టీ సంస్థాగత బలం కారణంగానే త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా శూన్యం నుంచి శిఖరానికి చేరిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలపై మోదీ వరస ట్వీట్లు చేశారు. త్రిపుర విజయంపై వ్యాఖ్యానిస్తూ..'ఇది పశుబలం, బెదిరింపులపై ప్రజాస్వామ్య విజయం. ఈరోజు భయంపై శాంతి, అహింస గెలిచాయి. త్రిపురకు మంచి ప్రభుత్వాన్ని అందిస్తాం' అని పేర్కొన్నారు. భాజపా, మిత్రపక్షాల్ని ఆదరించినందుకు నాగాలాండ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మేఘాలయ సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశమన్నారు.

ఇతర రాష్ట్రాల్లో విజయానికి ఇదే నాంది కావాలి: అమిత్ షా

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం పట్ల ఈశాన్య రాష్ట్రాల ప్రజలకున్న అపార విశ్వాసం....ఆయన విధానాలను నిస్సందేహంగా ఆమోదించారనడానికి త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికల ఫలితాలే ప్రతీక అని భాజపా సారథి అమిత్ షా శనివారం నాడిక్కడ పేర్కొన్నారు. అంతేకాదు..., నేటి ఈ ఫలితాలు రానున్న లోక్‌సభ ....కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో భాజపా ఘన విజయానికి నాందీ అవుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఆదివారం విజయోత్సవాలను నిర్వహించనున్నట్లు అమిత్ షా వెల్లడించారు. ఎన్నికల ఫలితాలను చరిత్రాత్మక విజయంగా అభివర్ణించారు.

'ఒకప్పుడు భాజపాను ఏదో హిందీ ప్రాంతాల పార్టీ అనుకుని ఆమోదించేవారు కాదు. ఆ పరిస్థితి మారింది. కేవలం హిందీప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఈశాన్యంలోనూ అధికారం దక్కింది. ఇప్పుడు దేశవ్యాప్త పార్టీ అయింది.' అని అమిత్ షా చెప్పారు. ఇక, పశ్చిమబెంగాల్, ఒడిశా, కర్ణాటకలను కూడా ప్రత్యర్థి పార్టీల నుంచి తప్పించగలిగితే...భాజపా స్వర్ణయుగం ప్రారంభమైనట్లేనని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అమిత్ షాలో విజయానందం ప్రస్ఫుటంగా గోచరించింది. ఈశాన్యంలో భాజపా రాష్ట్ర విభాగాలు కష్టించి చేసిన పనికి దక్కిన గౌరవమిది అన్నారు. హిమాచల్ ప్రదేశ్ , గుజరాత్‌ల తర్వాత ఇప్పుడు త్రిపురలో దాదాపు యాభయిశాతానికి పైగా ఓట్లను పొందగలిగామన్నారు. 2013లో త్రిపురలో భాజపా కేవలం 1.3శాతం ఓట్లను మాత్రమే దక్కించుకున్న విషయాన్ని అమిత్ షా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈశాన్యంలో ప్రజాతీర్పు అనేది దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు మోదీ సర్కారుకు ఎంత మద్దతిస్తున్నారన్న విషయానికి 'థర్మామీటరు' లాంటిదని అమిత్‌షా వ్యాఖ్యానించారు.

'ధనబలం ప్రసక్తే లేదు': త్రిపుర ఎన్నికల్లో ధన బలం కీలక పాత్ర పోషించిందన్న వామపక్షాల విమర్శను అమిత్ షా తిప్పికొట్టారు. భాజపా ఇప్పుడిక ప్రజాప్రతినిధులతో బేరసారాలకు దిగుతుందన్న కాంగ్రెస్ ఆరోపణలనూ ఖండించారు.

సీఎం పదవి చేపట్టేందుకు సిద్ధం

త్రిపుర భాజపా అధ్యక్షుడు విప్లవ్ దేవ్ వెల్లడి

అగర్తల: ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు తాను సిద్ధమని త్రిపుర భాజపా అధ్యక్షుడు విప్లవ్ కుమార్ దేవ్ తెలిపారు. అయితే, ఈ విషయంపై పార్టీ పార్లమెంటరీ బోర్డుదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. అగ్ర నాయకత్వం నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి మద్దతుగా నిలిచి విజయం కట్టబెట్టినందుకుగాను ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షాలవల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.

ప్రధాని కృషి, ప్రజాభీష్టం పర్యవసానమే ఈ విజయం!

త్రిపుర ఎన్నికల ఫలితాలపై భాజపా

అగర్తల: త్రిపురలో మంచి మెజారిటీ సాధించడానికి ప్రధాని నరేంద్రమోదీతో పాటూ...ఓ చక్కని మార్పుకోరుకున్న ఆ రాష్ట్ర ప్రజల మనోభీష్టం కూడా కారణమని ఆ పార్టీ పేర్కొంది. ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ త్రిపురలో నాలుగు బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఎప్పటికప్పుడు ఇక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచార సరళిని పరిశీలించారు. ఈ ఎన్నికల కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు...అందుకే ఇక్కడ మెజారిటీ సాధించామంటే ఆ గొప్పదనం ఆయనకే(మోదీ)దక్కుతుందని భాజపా ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ స్పష్టం చేశారు. శనివారం నాడిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'ఛలో పల్టాయ్'(మనం మారుదాం) అన్న భాజపా నినాదం ప్రజల్లోను బాగా ఆకట్టుకుందని చెప్పారు. సీపీఎం ఎంతో గొప్పగా పోరాడిందని ప్రశంసించారు....అయితే, ప్రజలు మాత్రం సరికొత్త సర్కారునే కోరుకున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

ఓటమిని ఆపలేకపోయిన యోధుడు


● మాణిక్ సర్కార్‌పై మహా గెలుపు

త్రిపురలో అద్భుత విజయం నిజంగా కమలదళానికి పట్టరాని సంతోషదాయకం.. దేశాన్నే పాలిస్తున్న ఒక పెద్ద పార్టీకి ఓ చిన్నరాష్ట్రంలో గెలిస్తే ఎందుకింత సంబరం? విజయం ఎవర్నికైనా సంతోషాన్నిస్తుంది.. అయితే భాజపా ఇక్కడ సాధించింది మాత్రం గెలుపు కంటే ఎక్కువే. మచ్చలేని ప్రతిష్ఠతో.. రెండు దశాబ్దాలుగా అప్రతిహత పాలన సాగిస్తున్న మాణిక్ సర్కార్ లాంటి వ్యక్తిని ఢీకొట్టి ఆ పార్టీ అద్భుతం సాధించింది మరి.. ఇదే భాజపాకు అదనపు బలాన్ని.. రెట్టించిన ఉత్సాహాన్ని కలిగిస్తోంది. మాణిక్ సర్కార్‌కు మచ్చల్లేవు. . మరకల్లేవు.. వ్యక్తిగతంగా విమర్శించడానికీ ఏమీలేవు. . ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలోకి దిగిన కమల 'నాథులు'.. ప్రత్యేకించి ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలు వేసిన 'అభివృద్ధి-మార్పు' మంత్రం త్రిపుర ప్రజలను ముగ్ధుల్ని చేసింది. తిరుగులేని ఫలితాన్ని అందించింది. ఆర్భాటాలు, ఆస్తులకు దూరంగా బతికిన ప్రజానేతగా.. అతిపేద ముఖ్యమంత్రిగా ప్రాభవం కలిగిన మాణిక్ సర్కార్‌ను ఎదుర్కొనే వ్యూహాల్లో మోదీ చతురత నిజంగానే ఓ అద్భుతం.

8 జిల్లాలు.. 37 లక్షల జనాభా ఉన్న చిన్న రాష్ట్రమైన త్రిపురలో - ఎన్నికల ప్రచారానికి గాను దాదాపు 15 రోజుల పాటు మాణిక్ సర్కార్ 35 సార్లు పర్యటించారంటే ఆయన ఏ స్థాయిలో శ్రమించారో స్పష్టమవుతుంది. సీపీఎం కూడా ఆయనపైన.. ఆయన ప్రతిష్ఠపైనే ఆశలు పెట్టుకుంది. ఈ నేపథ్యంలో భాజపా ప్రధాన లక్ష్యం మాణిక్ సర్కారే అయింది. మరోవైపు తమకు ఉద్యోగాలు రావడం లేదని.. ఆధునికతకు దూరమవుతున్నామని.. ప్రభుత్వంపై రాష్ట్ర యువత నిరాశానిస్పృహల్లో ఉంది. దీనికితోడు జీతాలు పెరగడం లేదన్న ఉద్యోగుల ఆవేదన, ఉద్యోగాల కుంభకోణం ఆరోపణలు, పార్టీకి-ప్రభుత్వానికి మధ్య అస్పష్టత వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకున్న భాజపా అగ్రనేతలు అభివృద్ధి 'బాట'లు పరుస్తామని ప్రజలను మెప్పించగలిగారు. వ్యక్తిగా మాణిక్ సర్కార్ నిజాయతీపరుడే అయినా.. ఆయన ప్రభుత్వం కళంకితమైందంటూ కొంత ఒప్పించగలిగారు. 'మార్పు తీసుకొద్దాం రండి..' అంటూ తమవైపు తిప్పుకోగలిగారు. దీంతో ప్రజలు మార్పును కోరుకున్నారు. ఆ మార్పు మోదీ, భాజపాలతోనే సాధ్యమని విశ్వసించారు.

మాణిక్ ఓ చరిత్ర..

దేశ వామపక్షాల చరిత్రలో మాణిక్ సర్కార్‌ది చెరిగిపోని ముద్ర. సాధారణ ప్రజల శాంతిభద్రతలు, జాతీయ భద్రత, అందరికీ తగిన గుర్తింపు.. ఇవన్నీ ముఖ్యమని నమ్మిన నేత. ఆర్థిక అంశాలతో పాటు సంస్కృతి కూడా ప్రధానమేనని విశ్వసించిన మనిషి. 1998లో ఆయన బాధ్యతలు చేపట్టేనాటికి బెంగాళీలు, గిరిజన తెగల మధ్య కల్లోలం నెలకొంది. బంగ్లాదేశ్ నుంచి తిరుగుబాటుదారులు రాష్ట్రంలో తరచూ హింసను ప్రేరేపిస్తున్న తరుణమది.. అలాంటి విద్రోహ చర్యలను ఆయన సమర్థంగా అణగదొక్కగలిగారు. గిరిజన ప్రాంతాల్లోనూ సీపీఎంను విస్తరించగలిగారు. సమాజ ప్రమాణాలను పెంచగలిగారు. తన బెంగాలీ గుర్తింపు కూడా పనిచేసింది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతూ వచ్చింది. మాణిక్ సర్కార్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పగలిగినప్పటికీ ప్రజల కాంక్షలు అంతకు మించి ఉన్నాయి. ఆయనకున్న ప్రతిష్ఠ, ఆర్థిక నిరాడంబరతలకు మించి రాష్ట్రంలో మార్పునకు ఇది సమయమని వారంతా విశ్వసించారు. మొత్తంగా కీలక తరుణంలో ఆ నేత పాలనకు త్రిపుర వీడ్కోలు పలికింది.



మాణిక్ సర్కార్

"త్రిపురలో భాజపా మీకు సవాల్‌గా మారుతుందా? సీపీఎం పాలనను మారుస్తుందా?"

"భాజపా సవాలా? సీపీఎం పాలన మార్పా? వెళ్లి ప్రజలనే అడగండి. మీకు జవాబు చెబుతారు."

- ఎన్నికల ప్రకటనకు ముందు జనవరి నెల ప్రారంభంలో ఓ ముఖాముఖిలో అడిగిన ప్రశ్నకు మాణిక్ సర్కార్ ఒక్కసారిగా నవ్వుతూ ఇచ్చిన జవాబు ఇది.

"భాజపా - సీపీఎం మధ్యే ప్రధాన పోటీ.." - ఫిబ్రవరిలో ఎన్నికల ప్రచారం ముగిసే నాటికి ఆయన అన్న మాటలివి. మొత్తంగా త్రిపుర ప్రజలు ఆయన అంచనాలను తల్లకిందులు చేశారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

అపర చాణక్యుడు

త్రిపురలో భాజపా విజయం వెనుక దేవధర్



ఐదేళ్ల క్రితం నాటి సంగతి..

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో(2013) భాజపా ఘోర పరాజయం చవిచూసింది. ఎంత దారుణంగా అంటే.. ఆ పార్టీ మొత్తం 50 మంది అభ్యర్థులను బరిలో దించగా వారిలో ఒక్కరు మినహా ఇంకెవ్వరూ కనీసం ధరావతు దక్కించుకోలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పోలైన ఓట్లలో కమలనాథులకు దక్కిన ఓట్లు 1.54 శాతం మాత్రమే.

కాలగమనంలో ఐదేళ్లు గడిచాయి. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వామపక్ష కంచుకోటగా పేరున్న త్రిపురలో భాజపా అద్భుత విజయం సాధించింది. అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలుండగా.. మిత్రపక్షంతో కలిసి 43 సీట్లను దక్కించుకుంది. అందులోనూ కమలనాథులదే సింహభాగం.

కేవలం ఐదేళ్లలో త్రిపురలో భాజపా ఇంత బలంగా తయారవ్వడం ఆశ్చర్యకరమే. పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టికృషితోనే ఈ విజయం సాధ్యమైంది. అయితే, వారందరిలో ఓ వ్యక్తి మాత్రం ప్రత్యేకం. రాష్ట్రంలో భాజపా విజయం నిస్సందేహంగా ఆయన వ్యూహచతురత, కఠోర శ్రమల ఫలితమేనన్నది విశ్లేషకుల మాట.

ఆయనే.. సునీల్ దేవధర్

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు విజయం సాధించి పెట్టాలన్న ఏకైక లక్ష్యంతో ఆయన మూడేళ్లుగా అహర్నిశలు శ్రమించారు. అద్భుత ప్రణాళికలు రచించారు. వాటన్నింటినీ సక్రమంగా అమలుపరిచారు. ఆయన అలుపెరుగని కృషి ఫలితమే.. 25 ఏళ్లుగా త్రిపురలో కొనసాగుతున్న వామపక్ష పాలనకు తెర!

■ వారణాసిలో మోదీ తరఫున..

మహారాష్ట్రకు చెందిన దేవధర్ 1965లో జన్మించారు. 1985లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)లో చేరారు. 2011లో నితిన్ గడ్కరీ భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాల భాజపా విభాగానికి జాతీయ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాని మోదీ 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో వారణాసి నుంచి లోక్‌సభకు పోటీ చేసినప్పుడు నియోజకవర్గంలో తన ప్రచార బాధ్యతలను దేవధర్ భుజాలపైనే ఉంచారు. అంతకుముందు 2013లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాహోద్ జిల్లాలో భాజపా ప్రచార బాధ్యతలను మోదీ ఆయనకు అప్పగించారు. కాంగ్రెస్‌కు గట్టిపట్టున్న ఆ జిల్లాలో భాజపాకు దేవధర్ చెప్పుకోదగిన విజయాన్ని సాధించిపెట్టారు.

■ అమిత్ షా ఆదేశంతో..

2014 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో దేవధర్ రాష్ట్రంలోని 32 స్థానాల్లో భాజపా ప్రచార బాధ్యతలను మోసేందుకు సిద్ధమయ్యారు. అయితే, పార్టీ జాతీయాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అమిత్ షా.. అందుకు భిన్నంగా ఆలోచించారు. మహారాష్ట్రలో సీపీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక నియోజకవర్గం పాల్ఘర్‌కు దేవధర్‌ను పంపించారు. అక్కడ తన బాధ్యతను విజయవంతంగా పూర్తిచేసిన దేవధర్.. భాజపాకు విజయాన్ని కట్టబెట్టారు. ఫలితంగా మహారాష్ట్రలో సీపీఎంకు ప్రాతినిధ్యమే లేకుండాపోయింది.

■ మూడేళ్లుగా త్రిపురలోనే మకాం

పాల్ఘర్‌లో సీపీఎంను చిత్తుచేస్తూ పార్టీకి సాధించిపెట్టిన విజయాన్ని చూసేనేమో.. సీపీఎంపై పోరాటంలో భాగంగా త్రిపురలో పార్టీ వ్యవహారాలను భాజపా 2014 నవంబరులో దేవధర్ చేతుల్లో పెట్టింది. ఆయన బాధ్యతలు చేపట్టేనాటికి రాష్ట్రంలో భాజపా పరిస్థితి దారుణంగా ఉంది. పార్టీ కార్యకర్తలంతా వరుస పరాజయాలతో కుదేలై ఉన్నారు. సీపీఎం అత్యంత బలంగా ఉంది. అప్పటికి కాంగ్రెస్ కాస్త బలహీనపడుతూ కనిపించింది. మూడేళ్ల వ్యవధిలో అక్కడ భాజపాను బలోపేతం చేయడం దాదాపు అసాధ్యంలా కనిపించింది. దేవధర్ ఆ పరిస్థితులను సవాల్‌గా తీసుకున్నారు. 2014 నవంబరు నుంచి ప్రతినెలలో కనీసం 15 రోజులు త్రిపురలోనే గడిపారు. 2015 రెండో అర్ధభాగం నుంచి త్రిపురనే తన మకాంగా మార్చుకున్నారు. కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ ముందుకు కదిలారు. పునాదుల నుంచి పార్టీని పునర్నిర్మించారు.

■ భాష నేర్చుకొని..

స్థానికులతో మమేకమవ్వాలంటే వారి భాషలోనే మాట్లాడటం ఆవశ్యకమని దేవధర్ భావించారు. భాషలను నేర్చుకోవడంలో తనకున్న ఆసక్తితో త్రిపురలో గిరిజనుల(రాష్ట్ర జనాభాలో వీరు 31 శాతం మంది ఉన్నారు) మాతృభాష కోక్‌బొరాక్‌ను త్వరగానే నేర్చుకున్నారు. ఆయనకు ముందు నుంచే బెంగాలీపై పట్టు ఉంది. దీంతో స్థానికులతో నేరుగా మంతనాలు జరిపారు. క్రమంగా పార్టీ పుంజుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులు ఎక్కువగా భాజపావైపు మొగ్గారు. మౌలిక అవసరాలైన నీరు, రహదారులు, విద్యుత్తు, విద్య, వైద్యం అందుబాటులో లేకపోవడంపై పార్టీ కార్యకర్తలతో కలిసి దేవధర్ పోరాటం ప్రారంభించారు. ఆందోళనలు నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు పొరుగున ఉన్న అసోం వంటి రాష్ట్రాల్లో భాజపాకు దక్కిన విజయాలు కూడా కలిసొచ్చాయి. తమ సమస్యలపై పోరాడటంతోపాటు సీపీఎంకు ఎదురునిలిచే సత్తా భాజపాకు ఉందని ప్రజలు విశ్వసించారు. పార్టీవైపు ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ నుంచి వచ్చినవారికి, సీపీఎం నిర్లక్ష్యం చేసిన గిరిజనులకు దేవధర్ ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. పార్టీలో యువత, గిరిజన, మహిళ, ఓబీసీ తదితర శాఖలను ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో భాజపా కీలక కార్యకర్త ఒకరు హత్యకు గురికాగా.. దేవధర్ ప్రణాళికతో రాష్ట్రవ్యాప్తంగా భాజపా శ్రేణులు ఆందోళనలు నిర్వహించాయి. ఈ ప్రదర్శనలకు మంచి మద్దతు లభించింది.

■ ఫేస్‌బుక్.. వాట్సాప్..

'మోదీ దూత్ యోజన' పేరుతో దేవధర్ ప్రత్యేక ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాజపా కార్యకర్తలు మోదీ ముఖచిత్రమున్న టీషర్టులు ధరించి.. కేంద్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించేవారు. ప్రయాణికుల చరవాణి నంబర్లను సేకరించేవారు. అనంతరం ఆ నంబర్లకు దేవధర్ బృందం కార్టూన్లు, వీడియో క్లిప్పింగులు, సంక్షిప్త సందేశాలను పంపించేది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ ఇలా అన్ని మార్గాల్లో దేవధర్ బహుముఖ ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ఏమూల నుంచి ఫిర్యాదు వచ్చినా.. పార్టీ మండలాధ్యక్షులు అక్కడికి వెళ్లేవారు. తాము అధికారంలోకి వచ్చాక సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చేవారు. ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా దేవధర్ ప్రారంభించారు. 2009లో త్రిపురలో భాజపా సభ్యుల సంఖ్య కేవలం 10 వేలుకాగా.. దేవధర్ కృషితో ఆ సంఖ్య 2015 నాటికి 1.75 లక్షలకు, ఏడాది క్రితం 4 లక్షలకు పెరిగింది. చివరకు తన లక్ష్యాన్ని దేవధర్ సాధించారు. సీపీఎంను గద్దెదించి భాజపాకు అధికారాన్ని కట్టబెట్టారు.

ఎర్రదండుకు ఎన్నడూ ఎరుగని ఓటమి

1998- 2013 మధ్య త్రిపుర శాసనసభ ఎన్నికల ఫలితాల తీరు. మొత్తం స్థానాలు 60

పార్టీ	1998 గెలిచిన స్థానాలు	1998 ఓట్ల శాతం	2003 గెలిచిన స్థానాలు	2003 ఓట్ల శాతం	2008 గెలిచిన స్థానాలు	2008 ఓట్లశాతం	2013 గెలిచిన స్థానాలు	2013 ఓట్లశాతం
కాంగ్రెస్	13	33.96	13	32.84	10	36.38	10	36.53
భాజపా	0	5.87	0	1.32	0	1.49	0	1.54
సీపీఐ	1	1.38	1	1.54	1	1.48	1	1.57
సీపీఎం	38	45.49	38	46.82	46	48.01	49	48.11
ఇతరులు	8	13.3	8	17.48	3	12.64	0	12.25

● త్రిపురలో 1988 తర్వాత వామపక్షాలకు తొలి ఎదురుదెబ్బ

అగర్తలా: త్రిపురలో 25 ఏళ్లపాటు అప్రతిహతంగా అధికారాన్ని చెలాయించిన వామపక్ష కూటమి తొలిసారిగా ఘోర ఓటమిని చవిచూసింది. అదీ అయిదేళ్ల వరకూ రాష్ట్రంలో అంతగా ఉనికిలో లేని, సైద్ధాంతికంగా బద్ధశత్రువైన భాజపా చేతిలో! 1978లో సీపీఎం నేతృత్వంలోని వామపక్ష కూటమి మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఒక్క అయిదేళ్లు (1988-93) మినహా రాష్ట్రాన్ని వామపక్ష ప్రభుత్వాలే పాలించాయి. 1978 ఎన్నికల్లో మొత్తం 60 స్థానాలకు గాను వామపక్ష కూటమి 56 స్థానాలను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ ఎన్నికల్లో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. త్రిపుర ఉపజాతిజుబా సమితి(టీయూజేఎస్) మాత్రం నాలుగు స్థానాలను దక్కించుకుంది. ఆ తర్వాత 1983 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష కూటమి బలం 39 స్థానాలకే పరిమితమైనా అధికారాన్ని నిలబెట్టుకుంది. సీపీఎం ఒక్కటే 37 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్-టీయూజెఎస్ కూటమి 20స్థానాల్లో సత్తా చాటింది. మిగిలిన ఒక్క స్థానం అమ్రా బెంగాలి అనే ప్రాంతీయ పార్టీ ఖాతాలో చేరింది. 1988 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-టీయూజెఎస్ కూటమి పైచేయి సాధించింది. 31 స్థానాలను గెలుచుకుని స్వల్ప ఆధిక్యంతో అధికారంలోకి వచ్చింది. వామపక్ష కూటమి బలం 29కే పరిమితమైంది. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని వామపక్షకూటమి 41 స్థానాల్లో గెలుపొంది తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంది. కాంగ్రెస్-టీయూజెఎస్ కూటమి బలం 19 స్థానాలకే పరిమితం అయ్యింది. మాణిక్ సర్కార్ నేతృత్వంలో సీపీఎం ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఆ తర్వాత 1998, 2003, 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా భారీ విజయాలతోనే సీపీఎం అధికారంలోకి వచ్చింది. 2013 ఎన్నికల్లో వామపక్షాలు 50 స్థానాలను గెలుచుకోగా కాంగ్రెస్‌కు 10 స్థానాలు మాత్రమే దక్కాయి. దాదాపు 30 ఏళ్ల తర్వాత వామపక్ష కూటమి ఓటమిని చవిచూసింది.



త్రిపుర ఎన్నికల్లో విజయం అనంతరం సంబరాలు చేసుకుంటున్న భాజపా మహిళా కార్యకర్తలు




అగర్తలాలో విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్, త్రిపుర అధ్యక్షుడు బిప్లబ్ కుమార్ ★ దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తల సంబరాలు

భిన్న రాష్ట్రాలకు భిన్న వ్యూహాలు

చిన్నపార్టీలతో చిరుభాగస్వామ్యం ◆ ఈశాన్యంలో విస్తరణకు భాజపా ఎత్తుగడ

ఈనాడు - దిల్లీ

రాష్ట్రాలకు తగ్గట్టుగా వ్యూహాలను మార్చుకుంటూ భాజపా రోజురోజుకీ బలం పెంచుకుంటోంది. మిగతా రాష్ట్రాల్లో బలప్రదర్శన కోసం చిరకాల మిత్రులను సైతం వదులుకునేందుకు వెనకాడదని కమలం పార్టీకి పేరుంది. అయితే ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం భాజపా.. ప్రాంతీయ పార్టీలకు చిరు భాగస్వామిగా ఉండేందుకూ సిద్ధపడుతోంది. పరిస్థితులకు తగ్గట్టుగా నాగాలాండ్, మేఘాలయాల్లో జాతీయవాదం.. త్రిపురలో హిందూత్వంపై రాజకీయాలు నడిపింది.

ప్రాంతీయ పార్టీలతో సఖ్యత

2016లో అసోంలో సొంతంగా ఘనవిజయం సాధించిన తర్వాత.. మిగతా ఈశాన్య రాష్ట్రాల్లోనూ బలపడటంపై భాజపా దృష్టిపెట్టింది. అయితే ఇక్కడి కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలతో మాత్రం సఖ్యతతో వ్యవహరించింది. 2014లో సిక్కింలో ఒక్క సీటూ గెలవలేకపోయినప్పటికీ.. విజయం సాధించిన ఎస్‌డీఎఫ్‌తో ఎన్నికల అనంతరం వెంటనే పొత్తు పెట్టుకుంది. రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లోనూ ఔదార్యం ప్రదర్శించింది.

ఎన్ఈడీఏతో మరింత చేరువగా..

ఎన్డీయేలో భాగంగా ప్రత్యేకంగా ఈశాన్య అభివృద్ధి కూటమి (ఎన్ఈడీఏ)ని ఏర్పాటు చేసి.. ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు డిమాండ్లను వినిపించే ఓ వేదికను భాజపా ఏర్పాటు చేసింది. అంతకుముందు యూపీఏలో గుంపులో గోవిందలా ఉండే ఈ పార్టీలకు.. అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. ఇటు హిందూత్వ ఎజెండాను పక్కనపెట్టి.. ఎన్ఈడీఏ ద్వారా భాజపా ప్రాంతీయ పార్టీలకు బాగా చేరువైంది. నాగాలాండ్, మేఘాలయాల్లో వాటికి.. చిరుభాగస్వామి పాత్ర పోషించేందుకూ అంగీకరించింది. క్రైస్తవులు అధికంగా ఉండే ఈ రాష్ట్రాల్లో.. గోమాంస వినియోగం ఎక్కువే. దీంతో గోమాంస నిషేధం అంశాన్ని.. ఇక్కడ భాజపా లేవనెత్తలేదు. స్థానిక ఆచారాలు, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని ప్రదర్శించింది. ప్రాంతీయ పార్టీలతో సఖ్యత వల్ల.. స్థానికేతర పార్టీగా తమకున్న ప్రతికూలతను భాజపా తొలగించుకోగలిగింది. అసోంలోనూ ఇదే జరిగింది. ఏజీపీ, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్‌లతో పొత్తు భాజపాకు లాభించింది. నాగాలాండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా గట్టిగానే ప్రయత్నాలు చేస్తోందని అంతర్గత వర్గాలు వెల్లడించాయి. ఇటు మేఘాలయాలోనూ కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు కమలం పార్టీ ప్రయత్నించనుంది. ఇక్కడి ప్రతిపక్ష పార్టీలు యూడీఎఫ్, ఎన్‌పీపీ.. ఎన్ఈడీఏలో సభ్యులుగా ఉన్నాయి.

త్రిపురలో హిందూత్వమే

మిగతా ఈశాన్య రాష్ట్రాలతో పోలిస్తే త్రిపురలో పరిస్థితులు విభిన్నం. హిందూత్వానికి అనుగుణంగా ఇక్కడి శ్రేణులను ఆర్‌ఎస్‌ఎస్ బాగా తీర్చిదిద్దింది. రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు హిందువులే అవడం.. భాజపా స్థానికత్వ ముద్రను వేయించునేందుకు ఉపకరించింది. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న అక్రమ (ముస్లిం) వలసదారులకు వ్యతిరేకంగా.. భాజపా బలంగా వాణిని వినిపించింది. దీంతో చొరబాట్ల పట్ల ఆందోళనతో ఉన్న స్థానిక జాతులు, తెగలు ఆ పార్టీ వైపు మొగ్గుచూపాయి. క్షేత్రస్థాయిలో భాజపా విశ్వసనీయతను పెంచడంలో.. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వనవాసి కల్యాణ్ కేంద్రం కీలకపాత్ర పోషించింది.



అగర్తలాలో భాజపా కార్యకర్తల విజయోత్సాహం

లోటు భర్తీ!

మొత్తంగా ఈశాన్య రాష్ట్రాల్లో బలం పుంజుకోవడం.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కలిసొచ్చే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఆ పార్టీ కొన్ని సీట్లు కోల్పోవచ్చని భావిస్తున్న నేపథ్యంలో.. ఆ లోటును ఈశాన్య రాష్ట్రాలు కొంత పూడ్చే ఆస్కారముంది.



శనివారం గుహవటిలో నృత్యాలు చేస్తున్న భాజపా

ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాం

- నాగాలాండ్‌పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

దిల్లీ: ఇతర పార్టీల సహకారంతో నాగాలాండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి, భాజపా నాగాలాండ్ వ్యవహారాల బాధ్యుడు కిరణ్ రిజిజు స్పష్టంచేశారు. గతంలో మిత్రపక్షమైన నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)తో జట్టుకట్టనున్నట్లు పరోక్ష సంకేతం ఇచ్చారు. నాగాలాండ్ అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీ దార్శనికతను అక్కడి ప్రజలు పూర్తిగా నమ్మారని పేర్కొన్నారు. భాజపా విజయం చరిత్రాత్మకమన్నారు. భాజపా నేతృత్వంలోని రాజకీయ నాయకత్వం ఒక్క ఈశాన్యానికేకాకుండా యావత్ దేశానికి శుభపరిణామమని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు భాజపా ఎన్‌పీఎఫ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన ఎన్‌డీపీపీతో జట్టుకట్టింది.

3 రాష్ట్రాలకు భాజపా పరిశీలకులు

దిల్లీ: ఎన్నికల ఫలితాలు వెలువడిన 3 ఈశాన్య రాష్ట్రాలకు భాజపా శనివారం పరిశీలకులను నియమించింది. భాజపా పార్లమెంటరీ బోర్డు సమావేశం అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డా వివరాలను వెల్లడించారు. త్రిపురకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జుయల్ ఓరమ్.. నాగాలాండ్‌కు జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్.. మేఘాలయకు మంత్రులు కిరణ్ రిజిజు, కేజే ఆల్ఫోన్స్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు.



త్రిపుర విజయం 'తృణ'ప్రాయం కాదు..

- ఓటర్లలో అత్యధికులు బెంగాలీలే
- పశ్చిమబెంగాల్‌పైనా ప్రభావం తప్పదు..!
- సార్వత్రిక సమరంలో అక్కడ పాగాపై కమలనాథుల్లో సరికొత్త ఆశలు

వామపక్షాలకు కంచుకోటగా ఉన్న త్రిపురలో కాషాయజెండా రెపరెపలాడడం ఆ ఒక్క రాష్ట్రంపైనే కాకుండా పశ్చిమబెంగాల్‌పైనా కనిపించే అవకాశం ఉందా? బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్న కామ్రేడ్లను ఇంటికి పంపించిన తృణమూల్ కాంగ్రెస్ సయితం మున్ముందు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయా? అక్కడా ఇక్కడా అనే తారతమ్యం లేకుండా 'కాంగ్రెస్ రహిత' (కాంగ్రెస్ ముక్త్) భారత్ దిశగా బలమైన అడుగులు వేస్తున్న కమలనాథుల నోటిని తీపి చేసేందుకు బెంగాలీ రసగుల్లా కూడా సంసిద్ధమవుతోందా?... అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. 2011 జనాభా లెక్కల సమాచారం ప్రకారం త్రిపుర ప్రజల్లో దాదాపు 70% మంది బెంగాలీలే. తాజా విజయాన్ని లోతుగా చూస్తే అది సగటు బెంగాలీయుల అంతరంగాన్నీ చాటుతోందనే విశ్లేషణలు ఇప్పటికే వెలువడుతున్నాయి.

ప్రతిపక్షమంటే కాంగ్రెసే కాదు...

అటు త్రిపుర, ఇటు బెంగాల్ సంప్రదాయకంగా వామపక్షాలకు అండగా నిలుస్తూ వచ్చినవే. ఆ రెండు చోట్లా ఇంతవరకు వామపక్షాలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను మాత్రమే భావించేవారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పతనమవుతూ వస్తున్న తీరు సహజంగానే తూర్పు ప్రాంత ఓటర్లపైనా ప్రభావం చూపించింది. త్రిపురలోని బెంగాలీలు భాజపాకు అండగా నిలిచిన రీతిలోనే మాతృభూమిలోని బెంగాలీలూ చేస్తే మమతకు గడ్డుకాలమే. 2016 మే నెలలో బెంగాల్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత మూడు సార్లు జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా మంచి పనితీరు కనబరిచింది. ఏడు స్థానాలకుగాను కొన్నిచోట్ల ద్వితీయ స్థానంలో నిలిచింది. మళ్లీ 2021లో ఆ ఎన్నికలు జరగనున్నాయి. వాటికంటే ముందు లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. దేశం నలుచెరగులా విస్తరిస్తున్న కమలనాథులు ఈ రెండు ఎన్నికల్లోనూ బెంగాల్‌లో తృణమూల్‌కు గట్టి సవాల్ విసరడం ఖాయమనే వాతావరణం ఇప్పటికే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 'ఛలో పల్టాయ్' (రండి.. మార్పు సాధిద్దాం) అనే నినాదంతో త్రిపుర కోటపైనా జెండాను ఎగరేసిన భాజపా... అదే దూకుడుతో ముందుకు వెళ్లాలని చేస్తున్న ప్రయత్నాలు తృణమూల్‌ను కలవరపరుస్తున్నాయి. ప్రత్యామ్నాయమంటే కాంగ్రెస్ మాత్రమేననే భావనను ఓటర్ల మది నుంచి చెరిపేసేందుకు భాజపా... రెట్టించిన ఉత్సాహంతో ప్రయత్నాలు చేయనుంది. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 26 లోక్‌సభ సీట్లలో సింహభాగం కాంగ్రెస్‌దే కాగా 2019 ఎన్నికల్లో ఆ పరిస్థితిని తిరగరాయాలని భాజపా ఉవ్విళ్లూరుతోంది.

ఐపీఎఫ్‌టీతో పొత్తు కలిసొచ్చిన వేళ..

అగర్తల: త్రిపురలో గిరిజనుల పార్టీ 'ఇండీజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)'తో పొత్తు భాజపాకు బాగా కలిసొచ్చినట్లు కనిపిస్తోంది. గిరిజన ప్రాబల్యమున్న ప్రాంతాల్లో 'ఇండీజీనస్ నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ త్విప్ర(ఐఎన్‌పీటీ)'తో పోలిస్తే ఐపీఎఫ్‌టీ తాజా ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించింది. పలు నియోజకవర్గాల్లో భాజపాకు గిరిజనుల మద్దతు పెరిగిందని.. సీపీఎంకు వారు మొండిచేయి చూపారని ధలాయ్ జిల్లాకు చెందిన విద్యావేత్త కృష్ణ రాయ్ విశ్లేషించారు. ఉద్యోగాల కల్పనలో, అభివృద్ధి సాధనలో సీపీఎం ప్రభుత్వం విఫలమవ్వడమే ఇందుకు కారణమని అభిప్రాయపడ్డారు. గిరిజనుల్లో ఎక్కువమంది క్రైస్తవులేనని తెలిపారు. భాజపాకు క్రైస్తవులు కూడా మద్దతిచ్చారని తాజా ఫలితాలతో స్పష్టమవుతోందని పేర్కొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ..

ఐపీఎఫ్‌టీ 1996లో ప్రారంభమైంది. 'త్రిపుర గిరిజన ప్రాంతాల స్వయం పాలక జిల్లా మండలి(టీటీఏఏడీసీ)'కి 2000లో జరిగిన ఎన్నికల్లో ఓ సీటును గెల్చుకోవడం ద్వారా రాజకీయరంగ ప్రవేశాన్ని బాగానే చాటుకుంది. 2001లో 'త్రిపుర ఉప్‌జాతి జుబా సమితి అండ్ ట్రైబల్ నేషనల్ వలంటీర్స్'లో ఐపీఎఫ్‌టీ విలీనమైంది. ఉమ్మడి వేదికకు 'ఇండీజీనస్ నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ త్విప్రా(ఐఎన్‌పీటీ)'గా నామకరణం చేశారు. రాష్ట్రంలో 2003, 2008 అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌పీటీ ఘోర పరాభవం పాలైంది. దీంతో 2009లో ఆ ఉమ్మడి వేదిక చీలిపోయింది. గిరిజనుల కోసం 'త్విపరలాండ్' పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ 2016లో ఐపీఎఫ్‌టీ తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించింది. గిరిజనుల్లో ఐపీఎఫ్‌టీకి ఆదరణ పెరుగుతున్న సంగతిని గుర్తించిన భాజపా.. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకుంది.

మేఘాలయకు కాంగ్రెస్ అగ్రనేతలు

ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు

దిల్లీ: మేఘాలయలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాల్ని అన్వేషించేందుకు కాంగ్రెస్ తన అగ్రనేతల్ని ఆ రాష్ట్రానికి పంపింది. మేఘాలయలో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో కాంగ్రెస్ 21 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. స్వతంత్రుల్ని కలుపుకొని పోవడం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా కృషి చేసేందుకు పార్టీ సీనియర్ నేతలు అహ్మద్‌పటేల్, కమల్‌నాథ్ షిల్లాంగ్ పయనమయ్యారు. పార్టీ నేత ముకుల్‌వాస్నిక్ షిల్లాంగ్‌లోనే ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు స్థానిక నాయకత్వంతోపాటు, ఇతర పార్టీలు, స్వతంత్రులతో చర్చలు సాగించినట్లు తెలుస్తోంది. మేఘాలయలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనీ, ఆ దిశగా కసరత్తు చేస్తున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఏ పార్టీకీ ఆధిక్యం రాలేదనీ, భావస్వారూప్య సిద్ధాంతం కలిగిన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని వాస్నిక్ పేర్కొన్నారు.

'ఈశాన్యం'తో తప్పని మార్పులు

- భాజపాలో త్రిపుర ఊపు
- కాంగ్రెస్‌తో సీపీఎం దోస్తీ అనివార్యం!

ఈనాడు - దిల్లీ

ఈశాన్య భారతంలోని మూడు రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికలు దేశ రాజకీయాలపైనా విభిన్న కోణాల్లో ప్రభావాన్ని చూపించడం అనివార్యంగా కనిపిస్తోంది. శనివారం వెలువడిన మేఘాలయా, త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు సహజంగానే కమలనాథుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపితే విపక్షాలు మాత్రం కకావికలమయ్యాయి. భాజపా, కాంగ్రెస్‌లకు సమదూరం అంటూ ఇంతకాలం ప్రవచిస్తున్న సీపీఎం ఇప్పుడు తన వైఖరిని మార్చుకోవాల్సిన పరిస్థితి తప్పేలా లేదు. ఉమ్మడి శత్రువైన భాజపాతో పోరాడడానికి కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవడం తప్పదని సీపీఎంపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికి సీపీఎం బెంగాల్ శాఖ సుముఖంగానే ఉన్నా, కేరళ మాత్రం ససేమిరా అంటోంది.

విపక్షాలు డీలా

ఈశాన్యాన చవిచూసిన ఓటమి ప్రభావంతో విపక్షాలు నైతికంగా కొంత డీలాపడ్డాయనే చెప్పాలి. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండో విడత భేటీపైనా ఈ నైరాశ్యం ప్రభావం చూపనుంది. మిత్రపక్షమే అయినా భాజపాపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు శివసేన తరచూ ప్రయత్నించేది. తాజా పరిణామాలతో ఆ పార్టీ డిమాండ్లకు భాజపా తల ఊపే పరిస్థితి ఉండకపోవచ్చు. త్రిపురలో ఎర్రకోటను ముక్కలు చేసిన కమలం... అటు కేరళలోనూ వేడి పుట్టించనుంది.




అంపథీలో విజయ సంకేతం చూపుతున్న మేఘాలయ సీఎం, కాంగ్రెస్ అభ్యర్థి ముకుల్ సంగ్మా, ఆయన సతీమణి దిక్కంచి ది శర్మ ★ మేఘాలయాలోని తురాలో విజయోత్సవంతో ఎన్పీపీ అభ్యర్థి అగాథా సంగ్మా

గోవా, మణిపూర్‌ల తోవలోనే మేఘాలయా!

మేఘాలయాలో ఓటర్ల తీర్పు అధికార కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా వెలువడిందనీ, అందువల్ల ఆ పార్టీకి వ్యతిరేక శక్తులన్నీ ఒక్కతాటిపైకి వచ్చి కాంగ్రెస్సేతర సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని ఆ రాష్ట్ర భాజపా వ్యవహారాల బాధ్యుడు నళిన్ కోహ్లీ చెబుతున్నారు. ఈ ప్రకారం మేఘాలయాలోనూ భాజపా పాగా వేస్తే గోవా, మణిపూర్‌ల మాదిరిగానే కాంగ్రెస్ ఉత్సాహంపై నీళ్లు జల్లిన మూడో రాష్ట్రం అవుతుంది. దానిని ఊహించే కాంగ్రెస్ తక్షణం అప్రమత్తమయింది. సీనియర్ నేతలు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్, ముకుల్ వాస్నిక్‌లను హుటాహుటిన షిల్లాంగ్‌కు పంపింది. వీరి ప్రయత్నాలకు గండి కొట్టడానికి భాజపా కూడా అసోం ఆర్థిక మంత్రి హిమంతా విశ్వశర్మను షిల్లాంగ్‌కు పంపించింది. ప్రాంతీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులతో పాటు స్వతంత్రులపై రెండు పార్టీలూ దృష్టి నిలిపాయి. మరో రెండ్రోజుల్లో స్పష్టత రానుంది.

సైద్ధాంతిక విజయమంటున్న సంఘ్

త్రిపురలో వ్యక్తమైన తీర్పు.... సంఘ్ పరివార్‌కూ అతిపెద్ద విజయం. సంఖ్యాపరంగానే కాకుండా సిద్ధాంతపరంగానూ నెగ్గినట్లు సంఘ్ భావిస్తోంది. వామపక్షాలతో మితవాదులు పోరాడి గెలిచిన తొలి, పెద్ద విజయంగా దీనిని పరిగణిస్తున్నారు. గత రెండేళ్లుగా ఆరెస్సెస్ నేతలు త్రిపుర ప్రజల మనసుల్ని గెలుచుకునేందుకు ఒక ప్రణాళిక ప్రకారం పనిచేశారు. భాజపా అంటే హిందువులకు, హిందీ మాట్లాడే ప్రజలకే పరిమితమనే వాదనను తాజా ఫలితాలు పూర్తిగా చెరిపేశాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈశాన్య ప్రాంతంలో త్రిపుర ఉండడం, నాగాలాండ్ జనాభాలో ఎక్కువమంది క్రైస్తవులే కావడాన్ని ప్రస్తావిస్తూ వారు ఈ విశ్లేషణలు చేస్తున్నారు. నాగాలాండ్‌లో ఇటీవలి కాలం వరకు కనీసం ఒక కౌన్సిలర్ కూడా భాజపా తరపున నెగ్గలేదు. అలాంటిది ఒకేసారి మూడింట రెండొంతుల ఆధిక్యం సాధించడం పార్టీకి గట్టి ఊపునిచ్చింది. త్రిపురలో మాజీ వ్యాయామ శిక్షకుడైన 48 ఏళ్ల విప్లవ్ కుమార్ దేవ్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం లభిస్తుందని తెలుస్తోంది. సొంతంగానే పూర్తి ఆధిక్యాన్ని భాజపా సాధించినా... ప్రత్యేక గిరిజన రాష్ట్రం కోసం త్రిపురను విభజించాలంటూ వస్తున్న డిమాండ్లను పరిష్కరించడం పెద్ద సవాలే.

కమలనాథులకు అసలు పరీక్ష అక్కడే!

కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశాల్లోనూ భాజపా సత్తా చాటేనా ■ మూడు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఇటీవల ఎదురుగాలి

ఈనాడు ప్రత్యేక విభాగం

ఈశాన్య రాష్ట్రాల్లోని విజయాలతో దేశవ్యాప్త పార్టీగా భాజపా అవతరించింది. ఆ పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఇప్పటివరకూ అంతగా బలంలేని కేరళ, పశ్చిమబెంగాల్‌లోనూ కాషాయ జెండాను ఎగురవేయటం తథ్యమని చెబుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 350 లోక్‌సభా స్థానాలను సొంతంగా గెలుచుకోవాలన్న ఆ పార్టీ అధినేతల లక్ష్యం సాకారం కావాలంటే ముందుగా త్వరలో ఎన్నికలు జరుగనున్న నాలుగు పెద్ద రాష్ట్రాలు....కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశాల్లో ఎదురయ్యే పరీక్షను అధిగమించాల్సి ఉంటుంది.

ఈ నాలుగు రాష్ట్రాల్లోని మొత్తం 103 లోక్‌సభ స్థానాలకు గాను 2014లో భాజపా 70 స్థానాలను కైవసం చేసుకుంది. రాజస్థాన్‌లో అయితే మొత్తం 25 లోక్‌సభ స్థానాలను, మధ్యప్రదేశ్‌లో 29కి 27 స్థానాలను కమలనాథులు సొంతం చేసుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ అప్పుడు భాజపా ప్రభుత్వాలే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ ఆ ఎన్నికల్లో 28లోక్‌సభ స్థానాలకు గాను భాజపా అత్యధికంగా 17ని గెలుచుకుంది. కాంగ్రెస్ 9 స్థానాలకే పరిమితమైంది. కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో హస్తంపార్టీ కమలనాథుల దరిదాపుల్లోకి కూడా రాలేదు.

ఉప ఎన్నికల ఫలితాలు దేనికి సంకేతాలు?

కర్ణాటక మినహా మిగిలిన మూడు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు...భాజపాను కాస్త నిరాశ పరిచాయి. ముఖ్యంగా తాము అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ బలం పుంజుకోవటం, ఒడిశాలో బిజద విజయం సాధించటం భిన్న సంకేతాలను పంపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో మూడు దఫాలుగా, రాజస్థాన్‌లో నాలుగున్నరేళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీ... ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్న అభిప్రాయాలకు బలం చేకూర్చుతోంది. 2014లో మాదిరిగా నరేంద్ర మోదీ ప్రభంజనం ఆ రాష్ట్రాల్లో మళ్లీ సత్తాచాటుతుందా లేదా అన్న సందేహం కలగజేస్తోంది. ఒడిశాలో గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్య విజయాలు సాధించిన భాజపా ఇటీవలి బిజేపుర్ శాసనసభా స్థాన ఉప ఎన్నికలో వెనుకబడిపోయింది. అధికార బిజద అభ్యర్థిని 40వేల ఓట్లకు పైగా గెలవటం...ఒడిశాలో కమలనాథుల విజయం అంత సులభం కాదేమోనన్న అభిప్రాయాన్ని కలుగజేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ మూడు స్థానానికే పరిమితమైంది.



వ్యతిరేకతను అధిగమించటం సాధ్యమేనా?

త్రిపురలో 20ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న సీపీఎం నేత మాణిక్యసర్కార్ పాలన నుంచి ప్రజలు మార్పుకోరుకున్నారు. భాజపాని తిరుగులేని ఆధిక్యంతో గెలిపించారు. మధ్యప్రదేశ్‌లో దాదాపు 15ఏళ్లుగా అధికారంలో ఉన్న భాజపా నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తివ్యక్తమవుతోందని, ఇటీవల ఉప ఎన్నికలు జరిగిన రెండు శాసనసభ స్థానాల(కోలారస్, మూంగావలీ) ఫలితాలు దానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ రెండు స్థానాలు కాంగ్రెస్‌కు చెందినవే అయినప్పటికీ మళ్లీ వాటిని నిలుపుకోగలగటం విశేషం. కాంగ్రెస్‌లోని వివిధ గ్రూపుల నేత(కమలనాథ్, జ్యోతిరాదిత్య సింధియా)లను ఈ ఉప ఎన్నికలు ఏకతాటిపైకి తీసుకొచ్చాయని అంటున్నారు. రాజస్థాన్‌లో ఉప ఎన్నిక జరిగిన రెండు లోక్‌సభ స్థానాలను(అజ్మేర్, అల్వార్) ముఖ్యమంత్రి వసుంధరా రాజె ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో ఈ రెండు స్థానాలు భాజపా గెలుచుకున్నవే. కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ పిలుపునిస్తున్న భాజపా...తాను అధికారంలో ఉన్న పెద్ద రాష్ట్రాల్లోనే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటుందా అనే సందేహాలకు ఈ ఫలితాలు తావిస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడ ప్రధాన పోటీ కాంగ్రెస్‌తోనే నెలకొని ఉండటం ముఖ్యమైన విషయం. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది రెండో అర్ధ భాగంలో జరుగనున్నాయి. అప్పటికి 2019 లోక్‌సభ ఎన్నికలకు నాలుగైదు నెలల మాత్రమే సమయం ఉండటం గమనార్హం.

గత ఏడాది కాంగ్రెస్ నుంచి మణిపుర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలను భాజపా గెలుచుకుంది. అయితే, మిత్రపక్షం శిరోమణి అకాలీదళ్‌తో కలసి అధికారంలో ఉన్న పంజాబ్‌ను మాత్రం కోల్పోయింది. ఇటీవల ఎన్నికలు జరిగిన గుజరాత్‌లో భాజపా విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మెరుగైన పనితీరును కనబరిచింది. రెండు మూడు నెలల్లో ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ఇక్కడి గెలుపుతో దక్షిణాది విజయాలకు అంకురార్పణ చేయాలని భావిస్తున్న కమలనాథులకు ఈశాన్య రాష్ట్రాల ఫలితాలు ఉత్సాహాన్నిచ్చాయి. భాజపా వరుస విజయాలకు త్రిపురలోనైనా గండిపడుతుందని ఆశించిన కర్ణాటక కాంగ్రెస్‌ను తాజా ఫలితాలు తీవ్ర నిరాశపరిచాయి. భాజపా సంచలన విజయాలు కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ నేతలను కలవరపరుస్తున్నాయి.

2014 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు గెలుచుకున్న సీట్లు

రాష్ట్రం	స్థానాలు	భాజపా	కాంగ్రెస్	జేడీ(ఎస్)	బిజద
కర్ణాటక	28	17	9	2	-
రాజస్థాన్	25	25	0	-	-
మధ్యప్రదేశ్	29	27	2	-	-
ఒడిశా	21	01	0	-	20

ప్రత్యామ్నాయ కూటమికి సై

- దేశరాజకీయాల్లో మార్పు అనివార్యం
- మార్పునకు నాయకత్వం వహించేందుకూ సిద్ధమే
- తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమయిందని, గడిచిన 70 ఏళ్ల ప్రజాస్వామ్య పాలనలో దేశానికి ఒరిగిందేమీ లేదని తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. రాజకీయాల్లో ప్రబలమైన, గుణాత్మకమైన మార్పు రావాలని, ఇందుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, భాజపాలు దొందూదొందేనని, పథకాల పేర్లు మారడం తప్ప ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పరిస్థితుల్లో మార్పు రాదన్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా బలమైన కూటమి కోసం తాను పనిచేస్తానన్నారు. ఎవరితో మాట్లాడాలో వారితో మాట్లాడుతున్నానని, దేశానికి నా అవసరం ఉందనుకుంటే ఖచ్చితంగా సేవలందించేందుకు

"ప్రధాని మోదీ నాకు మంచి మిత్రుడు. ఆయనపై ఎలాంటి వ్యతిరేకత లేదు. అపార గౌరవం ఉంది. పెద్దనోట్ల రద్దు విషయంలో ప్రధానిని నేనే మొట్టమొదట అభినందించా. రాష్ట్రపతిగా దళితుడిని చేయాలని అడిగాను. ఆయన చేశారు. దేశానికి మంచి జరుగుతుందనే జీఎస్టీ తదితర అంశాల్లో మద్దతు ఇచ్చా. నాకు భాజపాకి వ్యతిరేకంగా కూడా ఏమీ లేదు. దేశ ప్రగతి గురించే నా పోరాటం."

వెనుకాడబోనని స్పష్టంచేశారు. ప్రగతిభవన్ వేదికగా శనివారం జరిగిన తెరాస పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ విలేకరులతో మాట్లాడుతూ..సంచలన వ్యాఖ్యలు చేశారు. ''స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని పార్టీలు మినహా 64 ఏళ్ల పాటు కాంగ్రెస్, భాజపాలే పాలించాయి. మన దగ్గర మార్పేమీ రాలేదు. చైనాను తీసుకోండి. రెండుసార్లు ఆ దేశంలో కరవొచ్చింది. మావో ఉన్న సమయంలో..ఆ దేశంలో 15 లక్షల మంది చనిపోయారు. చైనా సాగు విస్తీర్ణం మన కంటే తక్కువ. జనాభా మనకంటే ఎక్కువ. ఆ దేశం ఎలా మారిపోయిందో చూడండి. అమెరికా తర్వాత ఆర్థికంగా చైనా బలంగా ఉంది. ఉత్తర చైనా నుంచి దక్షిణ చైనాకు 2,400 కిలోమీటర్ల దూరం.. 16 వేల టీఎంసీల నీళ్లు ఇస్తున్నారు. మనకు అలా ఎందుకు ఇవ్వరు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశంలో ఇప్పటికీ చాలా మందికి తాగు, సాగునీరు లేదు. కరెంటు ఉండదు. దీనికి ఆ రెండు పార్టీలు ఏం సమాధానం చెబుతాయి. దేశంలో ఇవన్నీ మారాలి. దేశంలో మార్పును స్వాగతించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వారు నిరీక్షిస్తున్నారు. దానికి తగిన పనిముట్లను తయారు చేస్తున్నాం. మీరు త్వరలోనే చూస్తారు.

రైతాంగం అసహనం: దేశంలోని రైతులు అసహనానికి గురవుతున్నారు. వారికి న్యాయం జరగడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. వరి ధాన్యానికి రూ.500 మద్దతు ధర పెంచాలంటున్నాం. దాన్ని చేయడం లేదు.

"పరిస్థితులు వచ్చినప్పుడు నాయకుడు పుడతాడు. మార్పునకు నాయకత్వం వహించడానికి నేను సిద్ధమే. కొత్తగా వచ్చేది మూడో కూటమి కాదు. అదే ప్రధాన కూటమి కావచ్చు"

మూడు సందర్భాల్లో మార్పులు: దేశం కోసం పనిచేసే హక్కు మాకుంది. నా రాజకీయ జీవితంలో 3 సందర్భాల్లో మార్పులు చూశా. ఒకటి జనతా పార్టీ ఆవిర్భావం. పార్టీ పెట్టిన 60 రోజుల్లోనే అధికారంలోకి వచ్చింది. రెండోది ఎన్టీఆర్ ఆధ్వర్యంలో తెదేపా ఏర్పాటు. 9 నెలల్లోనే అధికారం చేపట్టింది. మూడోది తెరాస ఏర్పాటు. 60 రోజులోనే స్థానికసంస్థల ఎన్నికల్లో విజయం సాధించింది.

మాకు అదనంగా నయాపైనా ఇవ్వలేదు: కేంద్రం రాష్ట్రానికి అదనంగా నయా పైసా ఇవ్వలేదు. గత నాలుగేళ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల వాటా కింద వచ్చింది కేవలం రూ. 81,062 కోట్లు మాత్రమే. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కింద రూ. 24 వేల కోట్ల సాయం అందించాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫార్సు చేసింది. కేంద్రం కనీసం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు.

జాతీయ రాజకీయాల దిశగా: ఇప్పుడు నా వయస్సు 64 సంవత్సరాలు. దేశానికి అవసరం అనుకుంటే శాయశక్తులా పనిచేస్తా. రాష్ట్రాలు తిరిగి ప్రచారం చేయడానికి సిద్ధమే. నాకు ఆంగ్లం, హిందీ మాట్లాడడం వచ్చు.

వామపక్షాలను కలుపుకొని వెళ్తాం: జాతీయ స్థాయిలో ఏర్పాటయ్యే కూటమి కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగా ఉంటుంది. వామపక్షాలను కలుపుకొని వెళతాం. సీతారాంఏచూరి నాకు మంచి మిత్రుడు. నా ఆలోచనలను పంచుకుంటున్నాం.

కాంగ్రెస్ పుంజుకుంటోంది: దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను చూస్తే కాంగ్రెస్ కొంత పుంజుకుంటోంది. భాజపా ప్రభ తగ్గుతోంది. కర్ణాటకలో కాంగ్రెసే గెలిచే అవకాశం ఉంది.

గెలుపు శాశ్వతం కాదు: ఎక్కడో ఒక చోట ఎన్నికల్లో గెలవడం పెద్ద విషయం కాదు. ఈ నిమిషానికి ఫలితాలుంటాయి. రేపటికి మారతాయి.

అవిశ్వాసం వృథా: కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం వల్ల ఉపయోగం లేదు. భాజపా, కాంగ్రెస్ నేతలు అసహనంతో ఉన్నారు. ప్రజలు అసహనంతో ఉన్నట్లు భ్రమపడుతున్నరు.

పారిశ్రామిక రాయితీలేవీ

విభజన చట్టంలో రెండు రాష్ట్రాలకు పారిశ్రామిక రాయితీలు ఇస్తామన్నారు. బిల్లులోనూ పెట్టారు. ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదు. నిజానికి హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఇస్తున్న రాయితీలు ఇచ్చినట్లయితే కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు కాబట్టి బాగా పెట్టుబడులు వచ్చే ఆస్కారం ఉంటుంది. ఉభయ రాష్ట్రాలు అభివృద్ధి అయ్యేవి. ఈ ఉద్దేశంతో అందరం డిమాండ్ చేస్తే యూపీఏ ప్రభుత్వం పెట్టింది అని వీళ్లు తీసేశారు. దీనిని అమలు చేయాలని పార్లమెంటులో పోరాటం చేస్తాం.

ఈశాన్యం.. వైవిధ్యాలమయం

ఈశాన్యంలోని మూడు రాష్ట్రాల ఫలితాల్లో తేలిన ప్రధానాంశం భాజపా ఓట్ల శాతం గణనీయంగా పెరగడం. త్రిపురలో ఏకంగా మూడింట రెండొంతుల మెజార్టీని సాధించింది. నాగాలాండ్‌లో సంకీర్ణ ప్రభుత్వానికి రంగం సిద్ధమైంది. ఈశాన్యంలోని 8 రాష్ట్రాలు.. విస్తీర్ణంలో చాలా చిన్నగా ఉన్నప్పటికీ అక్కడి రాజకీయాలు చాలా సంక్లిష్టం. ఆ ప్రాంతం.. పెద్ద సంఖ్యలో స్థానిక జాతులు, తెగలు, వర్గాలతో కూడిన సమాహారం. నాగాలాండ్, మేఘాలయ, మిజోరంలో క్రైస్తవులదే మెజార్టీ. అక్కడ రాష్ట్రాలవారీ గుర్తింపు కన్నా.. తెగల, భాషలవారీ గుర్తింపునకే ప్రాధాన్యం. రాజకీయాలపై వాటి ప్రభావం అధికం. ఇంతటి సంక్లిష్టతల వల్ల ఈ ప్రాంతం. . వేర్పాటువాదానికి పుట్టినిల్లుగా మారింది. వీటి నడుమ రాజకీయ పార్టీలు ఇమడటం, ఎన్నికల్లో విజయం సాధించడం చాలా కష్టం. ముఖ్యంగా జాతీయవాద హిందుత్వ పార్టీ అయిన భాజపాకు ఇది కత్తిమీద సామే!

ఈశాన్య భారతంలో అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర ఉన్నాయి. వీటిని 'సెవెన్ సిస్టర్స్'గా పేర్కొంటారు. 1975లో సిక్కిం.. భారత్‌లో విలీనం కావడంతో వీటి సంఖ్య 8కి పెరిగింది. బ్రిటిష్ హయాంలో సిక్కిమ్.. భారత రక్షణలో ఉన్న రాజ్యంగా ఉండేది. మణిపూర్, త్రిపురలు సంస్థానాలుగా ఉండేవి. అవి 1949లో భారత్‌లో విలీనమయ్యాయి.


విభిన్న సమాహారం..

ఈ ప్రాంతంలో దాదాపు 220 జాతులు, 180 భాషలు ఉన్నాయి. వీటికి భారత్‌కు చెందిన ప్రధాన భూభాగంలో ఉన్న భాష, గిరిజన, మత, కుల, సాంస్కృతిక తీరుతెన్నులకు పోలికే ఉండదు. కొండలు, అడవులు వంటి విభిన్న భౌగోళిక ప్రదేశాల్లో ఈశాన్య భారత తెగలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రాంత భాషలు టిబెటో-బర్మన్ కుటుంబానికి చెందినవి. ఇక్కడ సమాజాల్లో వర్గీకరణ కులాలవారీగా కాకుండా జాతులు, తెగల ఆధారంగా ఉంటుంది. ఇక్కడి భిన్నత్వం స్థాయిని చూసిన విశ్లేషకులు ఈ ప్రాంతాన్ని మినీ ఉపఖండంగా, మినీ భారత దేశంగా అభివర్ణిస్తుంటారు.

ప్రత్యేక సంస్థలు, చట్టాలు


ఈశాన్యంలో ప్రత్యేకతల దృష్ట్యా.. ఆ ప్రాంతానికే పరిమితయ్యే ప్రత్యేక చట్టాలు, సంస్థలను భారత్ సిద్ధం చేసింది. ఇక్కడి సంస్కృతులు, భూములు, తెగల హక్కులకు భారత రాజ్యాంగంలోని 6 షెడ్యూల్, 371ఏ అధికరణ రక్షణ కల్పిస్తున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి 'ఈశాన్య మండలి చట్టం-1971'ని కేంద్రం తీసుకొచ్చింది. ఆర్థికాభివృద్ధికి నోడల్ సంస్థ, ప్రత్యేక సెక్రటేరియట్ ఏర్పాటయ్యాయి. 2001లో వాజ్‌పేయి హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి.. కేంద్రంలో ఒక మంత్రిత్వశాఖ ఏర్పాటైంది.

అసోం..



ఈ రాష్ట్రం బహుళ తెగలు, భాషలు, మతాల సంగమం. ఇక్కడ ఎక్కువగా ఇండో-ఆర్యన్, ఆస్ట్రో-ఏసియాటిక్, టిబెటో-బర్మన్ భాషలు మాట్లాడతారు. చారిత్రకంగా ఇక్కడ తాయ్-అహోమ్‌ల ఆధిపత్యం ఎక్కువ. వాస్తవానికి అస్సామీలు అంటే ఈ తెగవారే. నేడు అస్సామీ భాష మాట్లాడేవారిని అస్సామీలుగా పేర్కొంటున్నారు. బెంగాలీలు కూడా మరో పెద్ద తెగ. అయితే బెంగాలీలను మిగతా తెగలవారు అక్రమ వలసదారులుగా పరిగణిస్తారు. బోడోలాండ్ ప్రాంతంలో బోడోల ఆధిపత్యం ఎక్కువ.

నాగాలాండ్..




ఇక్కడ నాగా తెగలదే ఆధిపత్యం. మైదాన ప్రాంతాల్లో కుకీలు, కచారీలు, గారోలు, మిక్రిలు, బెంగాలీలు, అస్సామీలు ఉంటారు. నాగాల్లో దాదాపు 16 ఉపతెగలు ఉన్నాయి. వీరికి గ్రామాలవారీగా మాండలికాలు ఉన్నాయి. నాగా సంస్కృతిలో పండుగలకు చాలా ప్రాధాన్యం ఉంది. వీటిలో పాలుపంచుకోవడం తప్పనిసరి.

మణిపూర్..




మణిపూర్‌లో శతాబ్దాలుగా భిన్న తెగలు, సంస్కృతులు కలిసి జీవనం సాగించాయి. చివరికి పరస్పరం కలసిపోయాయి. ఇక్కడ జనాభాలో మెయిటెయ్ తెగలదే ఆధిపత్యం. వీరు మణిపురీ భాష మాట్లాడతారు. మెయిటెయ్‌ల్లో ఏడు ఉపతెగలు ఉంటాయి. వీటిని 'సలాయ్'గా పిలుస్తారు.

త్రిపుర



ఒకప్పుడు ఈశాన్య భారతదేశం, బంగ్లాదేశ్‌లో విస్తరించిన త్రిపుర సామ్రాజ్యంలో నివసించినవారిని త్రిపురిలుగా పేర్కొంటారు. 1949లో ఈ రాజ్యం భారత్‌లో విలీనమయ్యేవరకూ డెబ్బార్మాస్‌కు చెందిన రాచకుటుంబాలు త్రిపురిలను 2వేల ఏళ్లకుపైగా పాలించారు. ఈ త్రిపురిలు కొండ వాలు ప్రాంతాల్లో నివసిస్తుంటారు. ఐదు నుంచి 50 కుటుంబాలు కలసి ఒక సమూహంగా జీవనం సాగిస్తాయి. త్రిపురిల్లో వివిధ కొండ గిరిజన ఉపతెగలు ఉన్నాయి.

మిజోరం..




శతాబ్దాల కిందట తూర్పు, దక్షిణ భారత దేశానికి విస్తరించిన మంగోలియన్ తెగలో మిజోలను భాగంగా చరిత్రకారులు భావిస్తారు. మిజోల్లో ఐదు ప్రధాన తెగలు ఉన్నాయి. 11 మైనర్ తెగలూ ఉన్నాయి. వీటన్నింటినీ ఉమ్మడిగా 'అఫ్జియా'గా పేర్కొంటారు. వీరు టిబెటో-బర్మన్ మూలాలున్న మాండలికాన్ని మాట్లాడతారు. 19వ శతాబ్దంలో బ్రిటిష్ క్రైస్తవ మిషనరీల ప్రభావానికి మిజోలు ఎక్కువగా లోనయ్యారు. నేడు ఇక్కడ క్రైస్తవ జనాభాయే ఎక్కువ. అక్షరాస్యత విషయంలో ఈ రాష్ట్రం.. దేశంలోనే రెండోస్థానంలో ఉంది.

అరుణాచల్ ప్రదేశ్..




ఈ రాష్ట్రంలో 26 ప్రధాన తెగలు, అనేక ఉప తెగలు ఉన్నాయి. వీటిలో కొన్ని తెగల మూలాలు ఒక్కటే కావడం వల్ల వీటి మధ్య సారూప్యతలు ఉన్నాయి. భౌగోళికంగా పరస్పరం దూరంగా జరగడం వల్ల భాష, వేషధారణ, ఆచారాల్లో భిన్నత్వం వచ్చింది. మోన్పా, టిబెటన్లు, ఖంబా, అపటాని/ టాని, గాలో/అబోర్, నిషి/దఫియా, కర్బీ, సింగ్ఫో, కోన్యాక్ వంటి తెగలు ఉన్నాయి.

మేఘాలయ



ఖాసీ, గారో గిరిజనులను మేఘాలయకు సంబంధించిన అసలైన గిరిజనులుగా భావిస్తారు. ఖాసీ తెగ.. మోన్-ఖ్మేర్ భాషను మాట్లాడుతుంది. ఇంకా ఇక్కడ నార్-సింటెంగ్, నేపాలీ, హైజాంగ్, బెంగాలీ, అస్సామీ, హిందీ భాషలు మాట్లాడుతుంటారు. జైంతియా, కోచ్, జొవాయ్, బోరో, హజాంగ్, దిమాసా వంటి మైనార్టీ తెగలు కూడా ఇక్కడ ఉన్నాయి.

సిక్కిమ్



17వ శతాబ్దం నుంచి సిక్కిమ్‌లో జాతుల వైవిధ్యాన్ని 'లో-మోన్-సాంగ్'గా అభివర్ణిస్తుంటారు. ఈ మూడు తెగలు 17వ శతాబ్దం నుంచి ఇక్కడ ఉంటున్నాయి. ఆ శతాబ్దం నుంచి నేపాలీలు కూడా ఇక్కడి వలసరావడం మొదలుపెట్టారు. ప్రస్తుత జనాభాలో 61 శాతం మంది నేపాలీలు ఉన్నారు. ఇక్కడ నేపాలీ భాషను ప్రధానంగా మాట్లాడతారు. ఇంకా భూటియా, జోంగ్‌చా, గ్రోమా, గురుంగ్, లెప్చా, లింబు, మగర్ వంటి భాషలూ వాడుకలో ఉన్నాయి. జనాభాలో 57.75 శాతం మంది హిందు మతాన్ని, 28.1 శాతం మంది వజ్రాయన బౌద్ధాన్ని పాటిస్తారు.

కమల వ్యూహం..

హిందుత్వ జాతీయవాద పార్టీగా గుర్తింపు పొందిన భాజపాకు ఈశాన్య ప్రాంతంలో అనుకూలించే అంశాలు ఒక్కటీ లేవు. క్రైస్తవ మెజార్టీ ఉన్న రాష్ట్రాల్లో హిందుత్వంపై పార్టీ వైఖరి, గోమాంసం వంటివి భాజపా అవకాశాలకు గండికొట్టాలి. అయినా ఆ పార్టీ వీటన్నింటినీ విజయవంతంగా అధిగమించింది. స్థానిక ఆచారాలు, సంప్రదాయాల పట్ల తన గౌరవాన్ని పదేపదే చాటుకోవడం ద్వారా ఓటర్ల మనస్సులను గెల్చుకుంది. సంక్లిష్టమైన ఇక్కడి సామాజిక అంశాలను అధిగమించడానికి.. స్థానిక ముద్ర ఎక్కువగా ఉన్న పార్టీలతో జట్టుకట్టడం ద్వారా స్థానికేతర ముద్రను చెరిపేసుకుంది. ఆరెస్సెస్‌కు చెందిన 'వనవాసి కల్యాణ్ ఆశ్రమ్' వంటి సంస్థలు కూడా ఈశాన్య రాష్ట్రాల్లో గణనీయంగా విద్య సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజల మనస్సును గెల్చుకున్నాయి. 'యాక్ట్ ఈస్ట్' విధానం కింద ఈ ప్రాంత అభివృద్ధిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలకంగా మార్చారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసలు స్థానిక తెగలకు పెద్ద సమస్యగా ఉంది. దీనిపై భాజపా తీసుకున్న దృఢవైఖరి ఇక్కడి తెగల మనస్సు గెల్చుకుంది.

వేర్పాటువాదం

ఈశాన్య భారతానికి ప్రత్యేకతను తెచ్చిపెట్టిన భిన్న జాతులు, తెగలు, భాషలు.. చివరికి 'ప్రత్యేక' ఉద్యమాలకు, వేర్పాటువాదాలకు, తీవ్రవాదానికి కేంద్రబిందువుగా మారాయి. తెగలవారీగా జాతీయవాదం పెరగడంతో దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతోంది. ప్రత్యేక రాష్ట్రాలు, ప్రత్యేక దేశం కోసం, ఎస్టీలుగా గుర్తింపు కోసం జరుగుతున్న ఉద్యమాలు రక్తసిక్తమయ్యాయి. వెలుపలి నుంచి వచ్చిన వారితోపాటు కొన్ని సందర్భాల్లో ఈ ప్రాంతంలోనే ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర తెగల నుంచి సమస్యలు పెరిగాయి. మొత్తం మీద ఈ ప్రాంతంలో 40కిపైగా వేర్పాటువాద ఉద్యమాలు ఉన్నాయి. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ తీవ్రస్థాయిలో ఉన్న పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అవినీతి వంటివి వీటికి ఆజ్యం పోస్తున్నాయి.

-ఈనాడు ప్రత్యేక విభాగం

సామాజిక సేవలో రెండు దశాబ్దాలు

- ఘనంగా ఎన్టీఆర్ ట్రస్టు 20వ వార్షికోత్సవం
- కుటుంబ సమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమానికి మనవడు దేవాన్ష్‌తో కలిసి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో లోకేశ్, బ్రాహ్మణి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలు అందించాలనే తలంపుతో ఇరవై ఏళ్ల క్రితం మహానాయకుడు ఎన్టీఆర్ పేరుతో ట్రస్టును స్థాపించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. పార్టీ కోసం త్యాగాలు చేసిన, ప్రాణాలు విడిచిన కార్యకర్తల పిల్లలు రోడ్డు మీద పడకుండా చదువు అందించాలనే సదుద్దేశంతో పదమూడేళ్ల క్రితం ఎన్టీఆర్ మోడల్ పాఠశాల స్థాపనకు శ్రీకారం చుట్టామన్నారు. శనివారం హైదరాబాద్ శివారు మొయినాబాద్ మండలం గండిపేట ఎన్టీఆర్ కుటీరంలోని ఎన్టీఆర్ మోడల్ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలకు ఏపీ ఐటీ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి లోకేష్, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి, హెరిటేజ్ సంస్థ ఎండీ బ్రాహ్మణి, దేవాన్షులతో కలిసి చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఇదే ప్రాంగణంలో ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి 20 వసంతాలు పూర్తి చేసుకోవడంతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఒకప్పుడు తమకి రాజకీయ పాఠాలు నేర్పించిన చోటే పిల్లలకు జ్ఞానాన్ని పెంచే దిశగా పాఠశాల ఏర్పాటు చేయడం తనకెంతో సంతృప్తినిచ్చిందంటూ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. భావి తరాలకు అండగా ఉండాలన్న తలంపుతోనే ఎన్టీఆర్ ట్రస్టును కొనసాగిస్తున్నామన్నారు. వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. సేవకు మారుపేరుగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. 131 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎన్టీఆర్ మోడల్ పాఠశాల.. నేడు 1,452 మందికి విద్యాబుద్ధులు నేర్పించే స్థాయికి ఎదిగిందని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు.

సేవకు మారు పేరు బసవతారకం ఆసుపత్రి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: లాభ నష్టాలతో నిమిత్తం లేకుండా సేవే లక్ష్యంతో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి పనిచేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడంలో, ఆధునిక సాంకేతిక అందిపుచ్చుకోవడంలో ఆసుపత్రి ఎప్పుడూ ముందుంటుందని ప్రశంసించారు. శనివారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో టోమోథెరపీ రేడియేషన్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అత్యాధునిక సదుపాయాలతో విజయవాడలో ప్రారంభించబోతున్న సాటిలైట్ సెంటర్‌కు తుళ్లూరులో పదిహేను ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. సంవత్సర కాలంలో అమరావతి కేంద్రంగా అత్యుత్తమ క్యాన్సర్ ఆసుపత్రిని బసవతారకం ఆధ్వర్యంలో నిర్మించాలని కోరారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ. . ఆసుపత్రి నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న సందర్భంలో సీఎం చంద్రబాబు ఆదుకున్నారని తెలిపారు. 40 పడకలతో ప్రారంభమైన ఆసుపత్రి ప్రస్తుతం 515 పడకలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల సహాయ సహకారాలున్నాయని తెలిపారు. ఆగ్నేయాసియాలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక టోమోథెరపీ సేవలను ప్రారంభించామన్నారు. ఇందుకోసం రూ.20 కోట్ల రూపాయలను దీంతో పాటు రోబోటిక్స్ సర్జరీ పరికరాల కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

తెదేపా తరఫున మూడో అభ్యర్థి ఉంటారా?

- 'టచ్'లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ నేత

ఈనాడు, అమరావతి: రాజ్యసభ ఎన్నికల్లో తెదేపా తరఫున మూడో అభ్యర్థి ఉంటారా, ఉండరా అన్న దానిపై ఆ పార్టీ వర్గాల్లో తర్జనభర్జన కొనసాగుతోంది. మూడో అభ్యర్థిని నిలిపితే విజయావకాశాలు ఎలా ఉంటాయన్న దానిపై కొంతమంది నాయకులు కసరత్తు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత రావచ్చు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ నాయకుడు తెదేపా తరఫున పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్నట్లు సమాచారం. గతంలో వేరే పార్టీ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన అతనికి, తెదేపాలో కొంతమంది నేతలకు మధ్య రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా బరిలో నిలిచే విషయమై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలతో ఆ నాయకుడు 'టచ్'లో ఉన్నారని, మరికొందరి విషయం తేలితే పోటీ తథ్యమని అంటున్నారు. రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచే విషయంతో సంబంధం లేకుండా... అతను తెదేపాలో చేరటం ఖాయమని పార్టీ వర్గాల కథనం. ఈ దఫా మొత్తం మూడు స్థానాలకు ఎన్నిక జరగబోతోంది. సాధారణ పరిస్థితుల్లో రెండు తెదేపాకి, ఒకటి వైకాపాకి దక్కుతాయి. వైకాపా నుంచి ఏకంగా 22 మంది ఎమ్మెల్యేలు తెదేపాలో చేరటంతో మూడో అభ్యర్థినీ పోటీలో నిలపాలన్న వాదన అంతర్గతంగా వినిపిస్తోంది. మరికొందరి మద్దతు సమీకరించగలిగితే మూడో అభ్యర్థి పోటీకి మార్గం సుగమం అవుతుంది. అదే సమయంలో వైకాపా తరఫున నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్థికంగా బలవంతుడైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఆయన ఇప్పటికే జిల్లాల వారీగా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించారు. తెదేపాలో చేరిన కొందరు వైకాపా శాసనసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారమూ జరుగుతోంది. మూడో అభ్యర్థిని బరిలో నిలిపితే ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

చిన్నారులకు 'పలకరింపు'.. వైద్య సేవలపై 'ఆరోగ్య సూచీ'

- నేడు ప్రారంభించనున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చిన్నారుల ఆరోగ్య కోసం 'పలకరింపు' పథకాన్ని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై రాష్ట్ర, జిల్లా, గ్రామ పంచాయతీ స్థాయిలో నెలకోకసారి ఆరోగ్య సూచీ ప్రకటనల విడుదల చేసే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించబోతుంది. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారు. ఆరోగ్య సూచీ ప్రకటనలను ప్రతి నెలా 4వ తేదీన జారీచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రకటనల్లో గడిచిన నెలలో ప్రభుత్వాసుపత్రుల ద్వారా అందించిన వైద్య సేవలు, గర్భిణీలు, పిల్లల ఆరోగ్యం ఎలా ఉంది? వ్యాధులు, దివ్యాంగుల వివరాలు, ఇతర సమగ్ర సమాచారం ఉంటుందన్నారు. దీని ఆధారంగా అవసరమైన చర్యలను తీసుకునేందుకు వీలు ఏర్పడుతుందన్నారు.

కోటీ 21 లక్షల ఇళ్లను సందర్శించనున్న ప్రత్యేక బృందాలు: రాష్ట్రంలోని ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేసుకొనేలా, ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో 'పలకరింపు' పేరుతో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, పేదరిక నిర్మూలన శాఖ, పంచాయతీరాజ్ శాఖలు కలిసి ఏర్పాటుచేసిన 57,555 బృందాలు 21రోజుల్లో 1,20,86,624 ఇళ్లను సందర్శిస్తాయని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ బృందాలు టీకాల ప్రాధాన్యత తెలియజేయటంతో అనారోగ్యంగా ఉన్న పిల్లలకు వైద్య సేవలు అందేలా చేయనున్నాయి.

గిరిజనుల సమస్యలపై నేడు మన్యం బంద్

విజయవాడ, న్యూస్‌టుడే: గిరిజన విశ్వవిద్యాలయం వెంటనే ఏర్పాటు చేయాలని, నిర్వాసితులకు పునరావాసం పూర్తయ్యే వరకు పోలవరం పనులు నిలిపివేయాలని గిరిజన సంఘాల ఐకాస డిమాండ్ చేసింది. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4న ఏజెన్సీ ప్రాంతంలో చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు పాలపర్తి రవి పిలుపు ఇచ్చారు. శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఐకాస సమావేశం నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. బోయలను, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు. మార్చి 5 నుంచి జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.5వేల కోట్లు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. భవనాలు లేవనే సాకుతో గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభించలేదని, ఇతర విద్యాసంస్థల వలే దానిని కూడా అద్దె భవనాల్లో ప్రారంభించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేవలం 3.8 శాతం మంది నిర్వాసితులకు మాత్రమే పునరావాసం పూర్తి చేశారని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐకాసా నేతలు బాబూరావు, నాగేశ్వరరావు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పదిలో.. గెలుపే మదిలో

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యార్థులకు శిక్షణ అందించడంలో అధికారులు, నాయకులు నడుం కట్టారు. విజయవాడ నగర పాలక సంస్థలోని 18 పాఠశాలల్లో బాగా చదివే 10 వతరగతి విద్యార్థులను ఒకచోటకు చేర్చి (సీవీఆర్‌జీఎంసీ పాఠశాలలో) ప్రత్యేక శిక్షణ (పదికి పది జీపీఏ సాధనకు) అందిస్తున్నారు. అందులో భాగంగా పాఠశాలకు పైన విద్యుత్తు దీపాల వెలుతురులో శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. విద్యార్థులు ఇక్కడే ఉండి, కష్టపడి చదివేలా అన్ని వసతులూ కల్పించారు. 90 మంది విద్యార్థులకు ఒకేచోట వసతి ఏర్పాటుచేసి 10 మంది నిష్ణాతులైన గురువులతో బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులకు సైతం నగరంలో రెండుచోట్ల ఇలా వినూత్న తరహాలో శిక్షణ తరగతులను కొనసాగిస్తున్నారు. *– ఈనాడు, విజయవాడ*

నేడే మహా పెళ్లిసందడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆదివారం వేల వివాహాలు జరగబోతున్నాయి. మంచి ముహూర్తాల్లో ఇది ఒకటి కావడం... సెలవురోజు రావడంతో ఎక్కువ మంది వివాహ వేడుక నిర్వహించుకోవడానికి మొగ్గు చూపారు.

తూర్పుగోదావరి జిల్లాలో కె.సూర్యరమేష్ ఒక మండల వ్యవసాయాధికారి. ఆయన తన కుమార్తె వైష్ణవికి ఆదివారం వివాహం చేస్తున్నారు. ఎప్పుడో ఆరు నెలల కిందటే తాను కల్యాణ మండపం మాట్లాడుకున్నానని, హోటళ్లలో అవసరమైన గదులూ తీసుకున్నానని 'ఈనాడు'తో అన్నారు. ఒక మిత్రుడి సలహా మేరకు అంత ముందుగా స్పందించి ఉండకపోయి ఉంటే ఈ రోజు ఎంతో ఇబ్బంది పడి ఉండేవాడినని ఆయన చెప్పారు. ఆలస్యంగా వివాహాలు కుదర్చుకున్న వారికి మండపాలు అందుబాటులో లేకుండా పోయాయి.

తిరుమల తిరుపతిలోనూ వివాహాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి మఠాలతో పాటు, సామూహిక వివాహ వేదికలు కలిపి ఒక్క ఆదివారం నాడే తిరుమలలో 2000 వరకు వివాహాలు జరగనున్నాయి. అన్నవరం, ద్వారకాతిరుమల, తదితర చోట్ల కూడా ఇదే పరిస్థితి. రాష్ట్రంలో ఏ పట్టణంలోను కూడా హోటళ్లలో గదులు ఖాళీ లేవు. కొన్ని చోట్ల ఆరు నెలల ముందే గదులకు ముందస్తుగా చెల్లింపులు జరిపి తమ పేరున రాయించుకున్నారు. విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, విశాఖపట్టణం వంటి చోట సర్వీసు అపార్టుమెంట్లు సయితం అతిథులతో నిండిపోయాయి.

గులాబీ పువ్వు రూ.25!

ప్రస్తుతం ఒకే ముహూర్తానికి, లేదా ఒకే రోజున వేలాది పెళ్లిళ్లు ఉండటంతో అన్నింటికీ డిమాండ్ పెరిగిపోయి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇందులో పూలధరలు మరీ ఎక్కువగా ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఒక గులాబీ పువ్వు రూ. 2 రూపాయలకు విక్రయించేవారు. కొన్ని ముఖ్య పండగలు, వేడుకల సమయంలో అది రూ. 5 వరకు దొరికేది. అలాంటిది ప్రస్తుతం ఒక గులాబీ పువ్వు ధర రూ.25 పలికిందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు అని రాజమహేంద్రవరంనకు చెందిన ఒక పెళ్లి పెద్ద 'ఈనాడు'తో అన్నారు. అద్దెకు తీసుకునే వాహనాల ధరలూ సయితం బాగా పెంచేశారు. గతంలో రూ.1000 తీసుకునే చోట ప్రస్తుతం డిమాండ్‌తో రూ.1500 వసూలు చేస్తున్నారని ప్రయివేటు రవాణా సంస్థల ప్రతినిధులే చెబుతున్నారు. ఆర్టీసీ, రైల్వేల్లో రద్దీ కూడా బాగా పెరిగింది. ఒక్క విజయవాడ నుంచే అదనంగా 75 సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

ఒక్కొక్కరికి 3, 4 ఆహ్వానాలు..!

ప్రస్తుతం ఎవరి నోటా విన్నా ఒకే ప్రశ్న వినిపిస్తోంది. ఆదివారం మీకు ఎన్ని పెళ్ళిళ్లు ఉన్నాయి. ఒక్కొక్కరికి మూడు, నాలుగు ఆహ్వానాలు అందాయి. దీంతో ఏ పెళ్లికి ఎవరు వెళ్లాలో అని కుటుంబ సభ్యులు వేడుకలను పంచుకుంటున్నారు. మరోవైపు వివాహాలు చేసుకుంటున్న అనేక కుటుంబాలకు 'అతిథులు ఎందరొస్తారో, పిలిచిన వారంతా వస్తారో రారో..మన అంచనాలు తప్పుతాయేమో' అన్న దిగులు పట్టుకుంది. వడ్డించినవాటిలో వృథా ఎక్కువ ఉంటుందేమో అన్న చర్చ కూడా సాగుతోంది.

రాజు-రాణి ఒక్కటయ్యారు



చదరంగ ప్రేమ జంట ఒక్కటైంది. భారత చెస్ స్టార్ పెంటేల హరికృష్ణ.. సెర్బియాకు చెందిన తన ప్రేయసి నదెజ్డాను శనివారం పెళ్లాడాడు. హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో వీరి పెళ్లి వైభవంగా జరిగింది. విదేశీయురాలైనప్పటికీ నదెజ్డా తెలుగు సంప్రదాయానికి తగ్గట్లుగా చీరలో ముస్తాబైన వైనం అందరినీ ఆకట్టుకుంది. హిందూ సంప్రదాయ పద్ధతిలోనే వివాహం జరిగింది. చెస్ క్రీడాకారిణి, ఆర్బిటర్ కూడా అయిన నదెజ్డాతో హరికి చాలా కాలం క్రితమే పరిచయమైంది. టోర్నీల సందర్భంగా వీళ్లు కలుసుకునేవాళ్లు. గత కొన్నేళ్లలో వీరి స్నేహం ప్రేమగా మారి పెళ్లి వైపు అడుగులేశారు.

పోరాడి ఓడిన భారత్

అజ్లాన్‌షా హాకీ



ఇఫో (మలేసియా): అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత్‌కు శుభారంభం దక్కలేదు. శనివారం ఒలింపిక్ ఛాంపియన్ అర్జెంటీనాతో పోరులో సర్దార్ సేన 2-3 గోల్స్‌తో పోరాడి ఓడిపోయింది. గొంజాలో పీలాట్ హ్యాట్రిక్ కొట్టి అర్జెంటీనా విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి క్వార్టర్‌లో భారతే పైచేయి సాధించింది. పది నిమిషాల్లోపే సుమిత్ కుమార్ కొట్టిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ 13వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను పీలాట్ గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమమైంది. రెండు నిమిషాల తర్వాత భారత్ వరుసగా మూడు పెనాల్టీకార్నర్‌లు సాధించింది. కానీ ఈ మూడింట్లో ఒక్కదాన్నీ గోల్‌గా మలచలేకపోయింది. మరోవైపు ప్రత్యర్థి డిఫెన్స్‌లో లోపాలను సద్వినియోగం చేసుకుంటూ అర్జెంటీనా మరో గోల్ చేసి రెండో క్వార్టర్ ఆఖరికి 1-2తో నిలిచింది. మూడో క్వార్టర్‌లో అమిత్ గోల్ చేయడంతో 2-2తో స్కోరు సమం చేసింది. ఆ ఆనందం కాసేపే. పెనాల్టీ కార్నర్‌ను పీటాట్ గోల్‌గా మలచడంతో అర్జెంటీనా 3-2తో ఆధిక్యంలో నిలిచింది.

నేటి మ్యాచ్: భారత్ × ఇంగ్లాండ్ (స్టార్‌స్పోర్ట్స్-1లో మధ్యాహ్నం 1.30 నుంచి)

పట్టు బిగించిన ఆస్ట్రేలియా


తొలి టెస్టులో 400 దాటిన ఆధిక్యం



కేశవ్ (3/93)

డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుపై ఆస్ట్రేలియా పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు బ్యాట్స్‌మెన్ తడబడ్డప్పటికీ ఆధిక్యం 400 దాటింది. శనివారం వెలుతురు లేమి కారణంగా కాస్త ముందుగానే ఆట ఆగే సమయానికి ఆస్ట్రేలియా 9 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే దక్షిణాఫ్రికా బౌలర్లు బాగా బౌలింగ్ చేశారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టారు. కేశవ్ మహరాజ్ (3/93), మోర్నీ మోర్కెల్ (3/42), రబాడ (2/28) ఆసీస్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ (53; 83 బంతుల్లో 10×4) ఒక్కడే అర్ధసెంచరీ దాటాడు. కెప్టెన్ స్టీవెన్ స్మిత్ (38), షాన్ మార్ష్ (33) పర్వాలేదనిపించారు. ఆట ఆఖరుకు కమిన్స్ (17), హేజిల్‌వుడ్ (4) క్రీజులో ఉన్నారు. ఒక వికెట్ చేతిలో ఉన్న ఆసీస్.. 402 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 189 పరుగుల ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. నాలుగో ఇన్నింగ్స్‌లో 400కు పైగా లక్ష్యాన్ని ఛేదించడమంటే మాటలు కాదు. కాబట్టి ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓటమి తప్పించుకోవడం కష్టమే.

కేన్ కొట్టాడు కానీ..



విలియమ్సన్ (112 నాటౌట్)

- ఇంగ్లాండ్‌దే విజయం
- ఉత్కంఠ పోరులో కివీస్ ఓటమి

వెల్లింగ్టన్: ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (112 నాటౌట్; 143 బంతుల్లో 6×4, 2×6) గొప్పగా పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. కివీస్ విజయానికి కేవలం 4 పరుగుల దూరంలో నిలిచిపోయింది. శనివారం 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 230 పరుగులే చేసింది. చివరి ఓవర్లో కివీస్ 15 పరుగులు చేయాల్సి ఉండగా.. వోక్స్ తొలి బంతికి పరుగులేమీ ఇవ్వలేదు. రెండో బంతికి డబుల్ తీసిన విలియమ్సన్.. మూడో బంతికి డీప్ స్క్వేర్ లెగ్‌లో అద్భుతమైన సిక్సర్ బాదాడు. నాలుగో బంతికి రెండు పరుగులొచ్చాయి. 2 బంతుల్లో ఐదు పరుగులే చేయాల్సి ఉండటం, విలియమ్సనే స్ట్రైకింగ్‌లో ఉండటంతో కివీస్ గెలుస్తుందనే అనిపించింది. అయితే వోక్స్ చివరి రెండు బంతులకూ పరుగే ఇవ్వలేదు. ఐదో బంతిని నేరుగా కవర్స్‌లో ఫీల్డర్‌కు కొట్టిన విలియమ్సన్.. వికెట్‌కు ఎడంగా యార్కర్‌లా పడ్డ చివరి బంతిని అందుకోవడంలో విఫలమయ్యాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో కేన్ కాకుండా రెండంకెల స్కోర్లు చేసింది మన్రో (49), శాంట్నర్ (41) మాత్రమే. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మొయిన్ అలీ (3/36), అదిల్ రషీద్ (2/34), వోక్స్ (2/40) కివీస్‌ను కట్టడి చేశారు. అంతకుముందు ఇంగ్లాండ్ సరిగ్గా 50 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. మోర్గాన్ (48), స్టోక్స్ (39) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఇష్ సోధి (3/53), ట్రెంట్ బౌల్ట్ (2/47) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది.



పచ్చబొట్టేసినా..

విరాట్ కోహ్లికి పచ్చబొట్లంటే (టాటూలు) అంటే మహా సరదా. ఇప్పటికే అతని చేతుల మీదంతా పచ్చబొట్లే ఉన్నాయి. ఆ వరుసలో ఇంకోటి చేరిందిప్పుడు. ఈ విషయాన్ని విరాట్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. 'ఏలియన్స్ టాటూ' అనే వ్యాఖ్య కూడా ఆ ఫొటోకు జోడించాడు. ముంబయిలోని బాంద్రాలో ఈ పచ్చబొట్టు వేయించుకున్నాడు.

అరుణకు రూ.20 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఆస్ట్రేలియాలో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించిన హైదరాబాదీ అమ్మాయి బుడ్డా అరుణారెడ్డికి తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షల నజరానా అందించింది. శనివారం ఎల్బీ స్టేడియంలో ఆమెను ఘనంగా సన్మానించిన క్రీడల మంత్రి పద్మారావు.. అరుణకు రూ.20 లక్షల చెక్కు అందించారు. దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన అరుణ.. తెలంగాణకే గర్వకారణమని.. ఆమె అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని మంత్రి పద్మారావు అన్నారు. భవిష్యత్‌లో అరుణ ఏ టోర్నీలకు వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తుందని ఆయన చెప్పారు. కామన్వెల్త్ క్రీడల్లో అరుణ పతకం గెలవాలని మంత్రి ఆకాంక్షించారు.



అరుణకు చెక్కు అందిస్తున్న తెలంగాణ క్రీడల మంత్రి పద్మారావు

ఛాంపియన్స్



రిషబ్ పంత్

కొంత విరామం తర్వాత మళ్లీ క్రికెట్ సందడి మొదలు కాబోతోంది. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకుని వచ్చిన టీమ్‌ఇండియా.. శ్రీలంక వేదికగా ముక్కోణపు టీ20 సిరీస్‌లో బరిలోకి దిగబోతోంది. కోహ్లి, ధోని, భువనేశ్వర్, బుమ్రా లాంటి కీలక ఆటగాళ్ల గైర్హాజరీలో చాలామంది కుర్రాళ్లు అవకాశం దక్కించుకున్నారీ సిరీస్‌కు. వాళ్ల కెరీర్లకు ఈ టోర్నీ ఎంతో కీలకం. తమ సత్తా ఏంటో చాటేందుకు.. జట్టుపై తమదైన ముద్ర వేసేందుకు.. మున్ముందు మరిన్ని అవకాశాలు సంపాదించేందుకు.. వారికిది మంచి అవకాశం. మరి ఈ కుర్రాళ్లలో ఈ అవకాశాన్ని ఎంతమంది సద్వినియోగం చేసుకుంటారో?

పరీక్షకు నిలిచేదెవ్వరు?

వారసుడవుతాడా?

ముక్కోణపు సిరీస్‌లో ఎక్కువ ఆసక్తి రేకెత్తిస్తున్న ఆటగాడు రిషబ్ పంతే. దశాబ్దానికి పైగా భారత జట్టుకు రెగ్యులర్ వికెట్ కీపర్‌గా ఉన్న దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని కెరీర్ చరమాంకానికి చేరుకున్న నేపథ్యంలో పరిమిత ఓవర్ల క్రికెట్ వరకు అతడి స్థానాన్ని భర్తీ చేయగల సమర్థుల్లో రిషబ్ పంత్ ఒకడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్‌తో పాటు దేశవాళీల్లో మెరుపులు మెరిపించి సత్తా చాటుకున్నాడు రిషబ్. ముఖ్యంగా టీ20లకు పంత్ చాలా బాగా సరిపోతాడన్న అభిప్రాయాలున్నాయి. ఈ ఫార్మాట్ వరకైనా ధోని స్థానంలోకి పంత్‌ను తీసుకురావాలన్న అభిప్రాయాలు ఇప్పటికే వ్యక్తమయ్యాయి. ముక్కోణపు సిరీస్‌లో పంత్ సత్తా చాటితే ఆ డిమాండ్లు మరింత పెరగొచ్చు. 2019 వన్డే ప్రపంచ కప్ వరకు ధోని కొనసాగినా.. రిషబ్ రిజర్వ్ వికెట్ కీపర్‌గా అవకాశం దక్కించుకోవచ్చు.

ముక్కోణపు టీ20 సిరీస్ షెడ్యూల్

మార్చి	6	భారత్ × శ్రీలంక
	8	భారత్ × బంగ్లాదేశ్
	10	శ్రీలంక × బంగ్లాదేశ్
	12	భారత్ × శ్రీలంక
	14	భారత్ × బంగ్లాదేశ్
	16	శ్రీలంక × బంగ్లాదేశ్
	18	ఫైనల్

తొలి అడుగు తడబడ్డా..




చాలా ఏళ్ల తర్వాత హైదరాబాద్ నుంచి భారత జట్టులో చోటు సంపాదించిన ఆటగాడు మహ్మద్ సిరాజ్. ముఖ్యంగా ఇక్కడి నుంచి ఒక ఫాస్ట్‌బౌలర్ టీమ్‌ఇండియా స్థాయికి చేరడం ఆశ్చర్యం కలిగించే విషయమే. దేశవాళీల్లో, ఐపీఎల్‌లో సత్తా చాటి చాలా వేగంగానే టీమ్‌ఇండియా తలుపు తట్టాడు సిరాజ్. గత ఏడాదే న్యూజిలాండ్, శ్రీలంకలతో టీ20ల్లో అతడికి అవకాశం దక్కింది. కానీ అతడి తొలి అడుగులు తడబడ్డాయి. ఆ రెండు మ్యాచ్‌ల్లోనూ ఒత్తిడికి గురైన సిరాజ్ వైఫల్యం చెందాడు. ఐతే వెంటనే అతడిపై అంచనాకు వచ్చేయకుండా సెలక్టర్లు మళ్లీ అవకాశమిచ్చారు. భువనేశ్వర్, బుమ్రా లేని నేపథ్యంలో సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు మెండుగానే ఉన్నాయి. మంచి వేగం, లయ ఉన్న సిరాజ్.. ఈసారైనా అంచనాల్ని అందుకుంటాడేమో చూడాలి.

అక్కడ మెరిశాడు.. మరి ఇక్కడ?



కొంత కాలంగా తరచుగా టీమ్‌ఇండియా తలుపు తడుతున్నాడు ముంబయి యువ పేసర్ శార్దూల్ ఠాకూర్. అయితే తుది జట్టులో ఆడే అవకాశాలు తక్కువగానే దొరికాయి. 3 వన్డేలు, 2 టీ20ల్లో ఆడాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేదు కానీ.. దక్షిణాఫ్రికాతో చివరి వన్డేలో అదరగొట్టాడు. నాలుగు వికెట్లు పడగొట్టాడు. తర్వాత టీ20ల్లోనూ పర్వాలేదనిపించాడు. పేసర్లకు అనుకూలించిన దక్షిణాఫ్రికాలో రాణించిన శార్దూల్ ఠాకూర్.. ఇక ఉపఖండంలోనూ రాణించగలనని రుజువు చేసుకోవాలి. లంకలో పేసర్లకు పెద్దగా సహకరించని పరిస్థితుల్లో అతను ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. శార్దూల్‌కు తుది జట్టులో చోటు దాదాపుగా ఖాయం. మరి ప్రధాన పేసర్లలో ఒకడిగా శార్దూల్ ఏమేరకు జట్టుకు ఉపయోగపడతాడో?

అంత వీజీ కాదు..



ఒకవైపు యుజ్వేంద్ర చాహల్, మరోవైపు కుల్‌దీప్ యాదవ్.. కొన్ని నెలలుగా భారత స్పిన్ దాడిని సమర్థంగా కొనసాగిస్తున్నారీ యువ స్పిన్నర్లు. అశ్విన్, జడేజా లాంటి సీనియర్లే వీరి ధాటికి టీమ్‌ఇండియా ఛాయలకు రాలేకపోతున్నారు. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ సైతం తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్నాడు. ఈ స్థితిలో కుల్‌దీప్‌కు విశ్రాంతినిచ్చి తమిళనాడు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు అవకాశమిచ్చారు సెలక్టర్లు. ఈ సిరీస్‌లో చాహల్, అక్షర్ కొనసాగబోతుండగా.. వారితో పోటీ పడి సుందర్ అవకాశాలు దక్కించుకుంటాడా? అవకాశాలు వచ్చినా.. చాహల్, కుల్‌దీప్‌కు దీటైన ప్రదర్శనతో తుది జట్టుకు గట్టి పోటీదారు అవుతాడా అన్నది చూడాలి.

పాండ్యకు పోటీ ఇచ్చేదెవరో?




విజయ్ శంకర్

రెండేళ్లుగా ఆల్‌రౌండర్ కోటాలో హార్దిక్ పాండ్య టీమ్‌ఇండియాలో కొనసాగుతున్నాడు. అతడికి పోటీ ఇచ్చేవాళ్లు కనిపించడం లేదు. దక్షిణాఫ్రికా పర్యటనలో పాండ్య తేలిపోయాడు. ఇలాంటి సమయంలోనే పాండ్యకు విశ్రాంతి ఇచ్చి ముక్కోణపు సిరీస్ కోసం దీపక్ హుడా, విజయ్ శంకర్ లాంటి ఆల్‌రౌండర్లకు చోటు కల్పించారు సెలక్టర్లు. బరోడాకు చెందిన హుడా స్పిన్నర్ కాగా, తమిళనాడు ఆటగాడైన శంకర్ మీడియం పేసర్. వీళ్లిద్దరికీ ఇంతకు ముందే భారత జట్టులో చోటు దక్కింది కానీ.. తుది జట్టుకు మాత్రం ఎంపిక కాలేదు. ముక్కోణపు సిరీస్‌లో వీరిలో ఒకరికి తుది జట్టులో చోటు దక్కొచ్చు. ఇద్దరినీ మార్చి మార్చి ఆడించినా ఆడించొచ్చు. మరి ఈ సిరీస్‌లో రాణించి పాండ్యకు పోటీ ఇచ్చేదెవరో?

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లోకి విప్లవాత్మక సాంకేతికత

వచ్చేస్తోంది వీడియో సమీక్ష!





జూరిచ్: ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో విప్లవాత్మక మార్పు చూడబోతున్నాం. వచ్చే ఏడాది రష్యా వేదికగా జరగబోయే ఈ మెగా టోర్నీలో వీడియో సమీక్ష సాంకేతికత (వీఏఆర్)ను అందుబాటులోకి తేనున్నారు. ఫిఫా అధినాయకత్వం ఇప్పటికే మద్దతిచ్చిన ఈ సాంకేతికతకు జూరిచ్‌లో శనివారం జరిగిన సమావేశంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల బోర్డు (ఐఎఫ్ఏబీ) కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. "ఫుట్‌బాల్‌కు వీఏఆర్ మంచిదన్న నిర్ణయానికి వచ్చాం" అని ఐఎఫ్ఏబీ ప్రకటించింది. దీంతో ప్రపంచకప్‌లో వీఏఆర్ సాంకేతికతను అందుబాటులోకి తేవడం లాంఛనమే. ఆటలో దీన్ని విప్లవాత్మక మార్పుగా భావిస్తున్నారు. ఇప్పటికే పలు టోర్నీల్లో ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ప్రపంచకప్‌లో వీఏఆర్‌ను ఉపయోగించడంపై కొంత కాలంగా పెద్ద చర్చే నడుస్తోంది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మైదానంలో రిఫరీల కంట పడకుండా ఆటగాళ్లు చాలా తప్పిదాలు చేస్తున్నారని.. స్పష్టత లేని రిఫరీలు తప్పుడు నిర్ణయాలు ప్రకటిస్తున్నారని.. ఈ నేపథ్యంలో సాంకేతికతను ఉపయోగించుకుని అవసరమైనపుడు వీడియో రీప్లేలు చూస్తే తప్పేంటని ఓ వర్గం వాదిస్తుంటే.. వీడియో సమీక్ష కోసం ఆటను ఆపితే లయ దెబ్బ తింటుందని, ఆట అందం చెడుతుందని మరో వర్గం అంటోంది. అందుకే వీఏఆర్‌ను అమల్లోకి తేవాలన్న నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఐతే ఫిఫా, ఐఎఫ్ఏబీ ఎట్టకేలకు సాంకేతికతను వాడుకోవడానికే మొగ్గు చూపాయి.

రన్నరప్‌గా పేస్ జోడీ

దుబాయ్: దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో లియాండర్ పేస్ రన్నరప్‌గా నిలిచాడు. శనివారం పురుషుల డబుల్స్ ఫైనల్లో పేస్-సెరెటాని (అమెరికా) 2-6, 6-7 (2-7)తో రోజర్ (నెదర్లాండ్స్)-హొరియా టెకు (హంగేరి) చేతిలో వరుస సెట్లలో ఓడిపోయారు.

భజరంగ్, వినోద్‌లకు కాంస్యాలు

బిష్కెక్ (కిర్గిస్థాన్): సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భజరంగ్ పునియా, వినోద్ కుమార్ ఓం ప్రకాశ్ కాంస్య పతకాలు గెలిచారు. శనివారం జరిగిన పోటీల్లో పురుషుల 65 కేజీల విభాగంలో భజరంగ్.. రెపిచేజ్‌లో గెలిచి కాంస్యం సొంతం చేసుకున్నాడు. వినోద్‌కుమార్ (70 కేజీలు) కూడా క్వార్టర్స్‌లో 3-6తో నవ్‌రుజోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడాడు. కానీ భజరంగ్ మాదిరే రెపిచేజ్ ఆడే అవకాశాన్ని దక్కించుకున్న వినోద్.. వరుసగా రెండు బౌట్లు గెలిచి కాంస్యం దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా ఒక స్వర్ణం, ఒక రజతం, ఆరు కాంస్యాలతో తొమ్మిదో స్థానంలో ఉంది.

మహా సమరం ముంగిట..



నేటి నుంచే ప్రపంచకప్ అర్హత టోర్నీ ● అందరి దృష్టి విండీస్‌పైనే

హరారే: వన్డే ప్రపంచకప్ మహా సమరం ముంగిట మరో మినీ సమరం.. ప్రపంచకప్‌లో మిగిలున్న రెండు బెర్తులు దక్కించుకోవడం కోసం అసోసియేట్ దేశాలతో పాటు వెస్టిండీస్, జింబాబ్వే, అఫ్గానిస్థాన్ లాంటి జట్లు ఈసారి బరిలో ఉన్నాయి. ముఖ్యంగా రెండుసార్లు ఛాంపియన్ (1975, 1979) తొలిసారి క్వాలిఫయర్స్ టోర్నీ ఆడే పరిస్థితిని తెచ్చుకుంది. క్రిస్ గేల్ లాంటి విధ్వంసక ఆటగాడు ఉన్న విండీస్.. మరి ఈ సవాల్‌ను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

10 జట్లు.. రెండు గ్రూపులు: క్వాలిఫయర్స్ టోర్నీలో పాల్గొనే 10 జట్లను గ్రూప్‌కు ఐదు జట్ల చొప్పున ఏ, బి గ్రూపులుగా విభజించారు. ప్రతి జట్టూ తమ గ్రూపులోని అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూపులో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్‌సిక్స్ చేరతాయి. సూపర్ సిక్స్‌లో టాప్ రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి.

గ్రూప్-ఏ: వెస్టిండీస్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, పపువా న్యూగినియా, యూఏఈ

గ్రూప్-బి: అఫ్గానిస్థాన్, హాంకాంగ్, నేపాల్, స్కాట్లాండ్, జింబాబ్వే

ఆద్యంతం గందరగోళం

- ఎన్‌కౌంటర్ మృతుల్లో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే
- వీరిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు
- నేరుగా మృతుల వివరాలు ప్రకటించని పోలీసులు
- మధ్యాహ్నం సామాజిక మాధ్యమాల్లో విడుదల

ఈనాడు- ఖమ్మం, న్యూస్‌టుడే- భద్రాచలం: దండకారణ్యంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో హతమైన 10 మంది మావోయిస్టుల మృతదేహాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించడంలో పోలీసులు అంతులేని గందరగోళం, గోప్యత పాటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన జరిగి రెండు రోజులవుతున్నా.. మృతులకు సంబంధించిన వివరాలను నేరుగా ప్రకటించలేదు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం పరిధిలోని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో పూజారీ కాంకేడ్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు, ఓ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి చెందిన విషయం విదితమే. ఇందులో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నట్లు పోలీసులు తొలుత ప్రకటించారు. అయితే మృతుల్లో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా శనివారం వెల్లడించారు. కానీ వారి వివరాలను నేరుగా తెలుపలేదు. శుక్రవారం మూడు మృతదేహాలను భద్రాచలం తీసుకురాగా, మిగతా ఎనిమిది మృతదేహాలను ఘటనాస్థలి నుంచి శనివారం ఉదయం 9 గంటల సమయంలో భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి రాత్రి వరకు పోస్టుమార్టం నిర్వహించారు.

మృతులు వీరే

1) **దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్**
స్వగ్రామం: రాంపూర్, వరంగల్ అర్బన్ జిల్లా ఖాజిపేట
హోదా: డీసీఎం, సీఆర్సీ ప్రెస్

2) **ఐతు**
స్వగ్రామం: తిప్పాపురం(దళసభ్యుడు)

3) **మల్లేశ్**
స్వగ్రామం: ఇంద్రావతి(ఛత్తీస్‌గఢ్)
హోదా: సీఆర్సీ, ఏ-సెక్షన్ కమాండర్

4) **రమే**
స్వగ్రామం: వీరాపురం, జిల్లా: సుకుమా(ఛత్తీస్‌గఢ్)
హోదా: సీఆర్సీ డాక్టర్స్ టీం, ఏసీఎం

5) **బుద్రి**
స్వగ్రామం: సింగం(ఛత్తీస్‌గఢ్)
హోదా: దళసభ్యురాలు

6) **కమల**
స్వగ్రామం: వెస్ట్‌బస్తర్(ఛత్తీస్‌గఢ్)
హోదా: దళసభ్యురాలు

7) **కోసి**
స్వగ్రామం: రంగాయిగూడెం(ఛత్తీస్‌గఢ్)
హోదా: సి.ఆర్.సి. దళసభ్యురాలు

8) **సుక్కి**
స్వగ్రామం: గంగలూరు(ఛత్తీస్‌గఢ్)
హోదా: దళసభ్యురాలు

9) **రత్న**
స్వగ్రామం: బీజాపూర్(ఛత్తీస్‌గఢ్)
హోదా: దళసభ్యురాలు

10) **సోంబి** (దళ సభ్యురాలు)

తెరాస నేతలే లక్ష్యంగా దాడులు చేస్తాం: జగన్

ఎన్‌కౌంటర్ వివరాల ప్రకటనలో పోలీసులు జాప్యం చేయడంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ అలియాస్ జగన్‌తో పాటు అతని భార్య జజ్జెరి సమ్మక్క అలియాస్ శారదక్క అలియాస్ గంగక్క ఎన్‌కౌంటర్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసుల కంటే తొలుత మావోయిస్టు పార్టీ స్పందించింది. మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరిట సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన విడుదలైంది. సారాంశమిదీ..

'ప్రజలతో మాట్లాడుతూ.. సేద తీరుతున్న సమయంలో పోలీసులు దాడి చేసి ఏకపక్షంగా కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి చనిపోలేదు. చనిపోయిన 10 మందిలో జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, రత్న ఉన్నారు. మిగతా వారంతా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందినవారు. కార్పొరేట్ శక్తులకు నీళ్లు, భూమిని ధారాదత్తం చేసేందుకు నియంత కేసీఆర్ బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారు. ఇకపై మేము తెరాస నేతలపై దాడులను ముమ్మరం చేస్తాం. హిందూత్వ నాయకులు రమణ్‌సింగ్, నియంత కేసీఆర్‌లు కలిసికట్టుగా ఆదివాసీలపై, ప్రశ్నించే వారిని నిర్మూలించేందుకు దుర్మార్గమైన దాడులకు పాల్పడుతున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చనిపోయింది ఎవరనేది తెలిసినప్పటికీ పోలీసులు ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి అసత్యాలు ప్రచారం చేశారు. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేస్తోంది. ప్రజల సహకారంతో వీటిని తిప్పికొడతాం.' అని మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ పేరిట విడుదలైన లేఖలో ఉంది.

బూటకపు ఎన్‌కౌంటర్

ఇది బూటకపు ఎన్‌కౌంటర్. మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపారు. మృతుల వివరాలు ఆలస్యంగా ప్రకటించడం వెనుక కుట్ర దాగి ఉంది. మృతదేహాలను కుళ్లబెట్టి గుర్తించడానికి వీల్లేకుండా చేస్తున్నారు. కోర్టు నిబంధనల ప్రకారం మృతుల శవపరీక్షలు వారి బంధువులు గుర్తించిన తర్వాత వారి సమక్షంలోనే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వీటిని పోలీసులు పాటించలేదు.

– బి.అంజమ్మ, అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్రాధ్యక్షురాలు

అంతిమంగా ప్రజలే గెలుస్తారు

మావోయిస్టులు తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకొనే క్రమంలో తుపాకీ గుండ్ల వర్షం కురిసింది. ఎదురు కాల్పులు అయితే ఒకేవైపు ఇంత నష్టం ఉండదు. పట్టుబడ్డాక చిత్రహింసలు పెట్టి హత్యచేశారు. మావోయిస్టుల ఏజెండానే మా అజెండా అన్న పాలకులు మావోయిస్టులను లేకుండా చేసేందుకు పెట్టుబడిదారులతో కలిసి కుట్ర చేస్తున్నారు. అంతిమ విజయం ప్రజలదే.

– శిరీష, ఆర్‌కే సహచరి



అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎన్.రామారావు, డాక్టర్ జె.బి.రాజు, టి.ప్రతాప్‌కుమార్ తదితరులు

కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తాం

గవర్నర్‌పేట(విజయవాడ), న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నామని మహారాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.రామారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం విజయవాడలోని ఒక హోటల్‌లో సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ జె.బి.రాజు అధ్యక్షతన రాజకీయ అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడుతూ పెరుగుతున్న అసమానతల దృష్ట్యా బడుగు, బలహీన వర్గాల కోసం కొత్త పార్టీ అవసరం ఏర్పడిందన్నారు. సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ జె.బి.రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలులో రాజకీయపార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల్లో ఐక్యత తీసుకువస్తామని తెలిపారు. తొలుత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాక్ చర్యలకు అదేస్థాయిలో ప్రతిచర్యలు

రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ చర్యలను అదే స్థాయిలో మన దళాలు ప్రతిఘటిస్తున్నాయని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. శనివారమిక్కడ వేర్వేరు అంశాలపై ఆమె మాట్లాడారు. సాయుధ బలగాల చట్టంపై ప్రస్తుతానికి పునరాలోచనేదీ లేదని చెప్పారు. సరిహద్దు నుంచి మన భూభాగంలోకి ప్రవేశించకుండా చొరబాటుదారులను ఎప్పటికప్పుడు భద్రతాదళాలు అడ్డుకుంటున్నాయని వెల్లడించారు.

తేజస్ శక్తిపై అనుమానాల్లేవ్: దేశీయంగా తేజస్ తేలకపాటి యుద్ధ విమానాల(ఎల్‌సీఏ) తయారీ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. వీటి తయారీలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) మరింత వేగం పెంచాలన్నారు. మార్క్2 శ్రేణి తేజస్ యుద్ధవిమానాల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. హెచ్ఏఎల్ అభివృద్ధి చేస్తున్న ఈ విమానాలపై ఎన్నో దేశాలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. ఐఏఎఫ్ సర్వసన్నద్ధతకు తేజస్ సరిపోదని.. విదేశీ విమానాలను సమకూర్చుకోవాలన్న వార్తల నేపథ్యంలో నిర్మలా సీతారామన్ ఈ మేరకు స్పందించారు.

'నమో సేవా కేంద్రం' ఏర్పాటు

దిల్లీ: కేంద్రమంత్రి విజయ్‌గొయెల్ నివాసంలో సోమవారం నుంచీ 'నమో సేవా కేంద్ర' ప్రారంభమౌతుంది. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన ప్రధానమైన పథకాల వివరాలను ప్రజలు ఎవరైనా సరే ఈ కేంద్రం నుంచి నేరుగా తెలుసుకోవచ్చు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా సోమవారం అశోకారోడ్డులో ఉన్న విజయ్ గొయెల్ నివాసంలో 'నమో సేవా కేంద్ర'కు ప్రారంభోత్సవం చేస్తారు. 'సబ్ కా సాథ్...సబ్ కా వికాస్' నినాదమే పరమావధిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విజయ్‌గొయెల్ శనివారం చెప్పారు. 'జన్‌ధన్ యోజన', 'ముద్ర', 'ఉజ్వలయోజన' తదితర పథకాలన్నిటి గురించి తెలుసుకోవచ్చు. ఈ కేంద్రంలో ప్రత్యేకంగా విధులు నిర్వర్తించే వలంటీర్లు అక్కడికి వచ్చే ప్రజలకు ఆయా పథకాల వివరాలతో పాటు.. ..ఎలా దరఖాస్తు చేసుకోవచ్చనే విషయాన్నీ వివరిస్తారు. సంబంధిత సమాచారాన్ని అందచేసేందుకు వివిధ బ్యాంకులు, కేంద్రసంస్థలు ఇదే కేంద్రంలో స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. చైతన్యసాధన కార్యక్రమాలనూ ఈ కేంద్రంలో నిర్వహిస్తారు.

'ఎయిమ్స్'లో లిఫ్ట్ ప్రమాదం

దిల్లీ: ఇక్కడి 'అఖిల భారత వైద్య విజ్ఞానాల సంస్థ'(ఎయిమ్స్)లో శనివారం ఓ లిఫ్ట్ ఒక్కసారిగా కూలిపోయిన ఘటనలో అయిదుగురు గాయపడ్డారు. రెండో అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు పడిపోయిన సమయంలో ఈ లిఫ్టులో 20 మంది ఉన్నారు. నిర్ణీత ఫ్లోర్‌లో ఆగేందుకు ఉపకరించే యాంత్రిక వ్యవస్థ సరిగా పనిచేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని 'ఎయిమ్స్' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై విచారణకు ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు.

పారదర్శక, సుసంపన్న 'ఇండో-పసిఫికే' లక్ష్యం

- ప్రధాని మోదీతో వియత్నాం అధ్యక్షుడి భేటీ
- మూడు ఒప్పందాలపై సంతకాలు

దిల్లీ: పారదర్శకంగా, సుసంపన్నంగా 'ఇండో-పసిఫిక్' ప్రాంతాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కలిసి పనిచేయాలని భారత్, వియత్నాంలు నిర్ణయించాయి. సమర్థ ప్రాంతీయ భద్రతా ప్రణాళికతో ముందుకెళ్లనున్నాయి. శనివారమిక్కడ ప్రధాని మోదీ, వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్ సుదీర్ఘ చర్చల అనంతరం పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ప్రధానంగా అణుశక్తి, వాణిజ్యం, వ్యవసాయం రంగాల్లో పరస్పర సహకారానికి మూడు ఒప్పందాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. చైనా ఈ ప్రాంతంలో తన సైనిక శక్తిని విస్తరిస్తున్న నేపథ్యంలో ఆ దేశానికి ఓ సంకేతం పంపేలా తాజా పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

"స్వతంత్ర, పారదర్శక, సుసంపన్న ఇండో-పసిఫిక్ లక్ష్యంగా సంయుక్తంగా పనిచేయాలని ఉభయులమూ నిర్ణయించాం. అంతర్జాతీయ చట్టాలను గౌరవించుకుంటూ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటాం" అని సంయుక్త విలేకర్ల సమావేశంలో ప్రధాని మోదీ వెల్లడించారు. సముద్ర ప్రాదేశిక జలాల అంశంలోనూ పరస్పరం సహకరించుకోనున్నామని తెలిపారు. రక్షణ ఉత్పత్తులు, పరిజ్ఞానాల బదిలీలో చేదోడువాదోడుగా ఉంటామని చెప్పారు. చమురు, వాయు అన్వేషణ, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర రంగాల్లో వాణిజ్యాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు.



రాష్ట్రపతి భవన్ వద్ద వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ దాయ్ క్వెంగ్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ

మరోవైపు ఏషియాన్‌తో భారత్ బహుళ దృక్పథ బంధాన్ని తాము సమర్థిస్తామని దక్షిణ చైనా వివాదం అంశాన్ని ఉటంకిస్తూ వియత్నాం అధ్యక్షుడు పేర్కొన్నారు. వివాదాన్ని శాంతియుత మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. వనరులు పుష్కలంగా ఉన్న దక్షిణ చైనా సముద్రానికి సంబంధించి తమతోపాటు పలు ఇతర ఏషియాన్ దేశాలకూ చైనాతో వివాదాలున్నాయని వెల్లడించారు. ఈ వివాద పరిష్కారంలో దౌత్య, న్యాయ ప్రక్రియలను గౌరవించాల్సిందేనని స్పష్టంచేశారు. ప్రాంతీయ భద్రతా సవాళ్లపై భారత్‌తో కలిసి పనిచేస్తామన్నారు. అంతకుముందు వియత్నాం అధ్యక్షుడితో విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రపతి భవన్‌లో క్వాంగ్ గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటుచేశారు. దక్షిణ చైనా సముద్రంలో వియత్నాం ప్రాదేశిక జలాల్లో భారత్‌కు చెందిన ఓఎన్‌జీసీ చమురు అన్వేషణ చేయడాన్ని చైనా వ్యతిరేకిస్తోంది.

హెచ్1బీ వీసాదారుల భాగస్వాముల పని గుర్తింపు రద్దు మరింత ఆలస్యం

వాషింగ్టన్: హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాముల పని గుర్తింపు రద్దుపై నిర్ణయం తీసుకునే విషయంలో ట్రంప్ ప్రభుత్వం ఆలస్యం చేస్తుండటంతో భారతీయ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఉపశమనం కలిగినట్లయింది. హెచ్1బీ వీసాదారుల భాగస్వాములైన హెచ్4 వీసా వినియోగదారులపై పని గుర్తింపును రద్దు చేసే విషయంలో తామింకా ఓ నిర్ణయానికి రాలేదని అంతర్గత భద్రత విభాగం(డీహెచ్ఎస్) ఓ కోర్టుకు తెలిపింది. సదరు నిర్ణయం వల్ల కలిగే ఆర్థిక ప్రభావంపై సమీక్షించేందుకు జూన్ దాకా సమయం కావాలని పేర్కొంది. ఒబామా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధన మేరకు.. హెచ్4 ఆధారిత వీసాలతో ఉన్న హెచ్1బీ వీసాదారుల భాగస్వాములు అమెరికాలో పనిచేసుకునేందుకు అర్హత కలిగించే గ్రీన్‌కార్డు కోసం 2015 నుంచి వేచి చూస్తున్నారు. దీనిపై డీహెచ్ఎస్ ఫిబ్రవరి 28 నాటికి నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) సదరు నిబంధనను పునఃసమీక్ష చేస్తోందనీ, ముసాయిదా ప్రతిపాదనకు సమీక్షలు అవసరమని డీహెచ్ఎస్ కోర్టుకు వివరించింది. నిర్ణయం తీసుకునేందుకు జూన్ వరకు సమయం పట్టొచ్చని తెలిపిన నేపథ్యంలో హెచ్1బీ వీసాదారుల భాగస్వాములకు తాత్కాలికంగానైనా ఉపశమనం లభించినట్లయింది.

నీరవ్ మోదీ, ఛోక్సీలపై బెయిలుకు వీల్లేని వారెంట్లు

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం కేసులో వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలపై శనివారమిక్కడి ప్రత్యేక న్యాయస్థానం బెయిలుకు వీల్లేని వారెంట్లు జారీచేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పిటిషన్ మేరకు పీఎంఎల్ఏ కోర్టు ఈ వారెంట్లు ఇచ్చింది. తమ ముందు హాజరుకావాలని మోదీ, ఛోక్సీలకు గతంలోనే ఈడీ సమన్లు జారీచేసింది. అయినా ఫలితం లేకపోవడంతో ఈడీ.. పీఎంఎల్ఏ కోర్టును ఆశ్రయించింది.

పోలీసు అధికారిణి దారుణ హత్య

ముక్కలుగా నరికిన తోటి పోలీసు అధికారి

ముంబయి: మహారాష్ట్రలో ఓ మహిళా పోలీసు అధికారిణిని తోటి అధికారే దారుణంగా హతమార్చాడు. ఆమె మృతదేహాన్ని ముక్కలుగా నరికి దగ్గర్లోని కాలువలో పడేశాడు. 2016 ఏప్రిల్‌లో అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ (ఏపీఐ) అశ్వినీ బిద్రేగోర్(37) గల్లంతయ్యారు. ఈ కేసుపై గత డిసెంబరులో ఇన్‌స్పెక్టర్ అభయ్ కురుంద్కార్‌ను అరెస్టుచేశారు. ప్రస్తుతం ఇతడే అశ్వినీని హతమార్చినట్లు విచారణలో తేలింది. అభయ్ చిన్ననాటి స్నేహితుడు మహేశ్ పలనికర్ ఈ విషయాన్ని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పెళ్లికి నిరాకరించడంతోనే ఆమెను హతమార్చి.. ముక్కలుముక్కలుగా నరికి కాలువలో పడేసినట్లు వివరించారు.

బాలికలను తరలిస్తున్న ముఠా అరెస్టు

దిల్లీ: బాలికలను అక్రమంగా తరలిస్తున్న ముఠాను దిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు బాలికలను వీరి చెర నుంచి విడిపించారు. దిల్లీలోని గీతా కాలనీకి చెందిన 14ఏళ్ల బాలిక శుక్రవారం అపహరణకు గురైంది. ఆమెను నీరజ్‌అనే వ్యక్తికి రూ.4 లక్షలకు కొందరు అమ్మేశారు. పోలీసులు మొదట నీరజ్‌ను పట్టుకున్నారు. అనంతరం అతడికి బాలికను విక్రయించిన అనూజ్, అతడి భార్య, మరో నిందితుడు బబ్లూలనూ అరెస్టుచేశారు. వీరి దగ్గర బందీలుగానున్న మిగతా బాలికలకూ విముక్తి కల్పించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00